భారతి

సాహిత్య మాసపత్రిక

జులై 1978



ఇంకా కాళిదాసు, శివారెడ్డి, కొలకలూరి, మనోహర్ రెడ్డి, రామకృష్ణ, నాగరాజు, రామారావు, శేషాచార్యులు, మందేశ్వరరావు, రామచంద్ర, నరసింహమూర్తి, శ్యామలా నందప్రసాద్, జ్వాలాముఖి ఇతరుల రచనలు.



వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు

పాఠశాలలు, కళాశాలలు, ఫ్యాక్టరీలు,

ఆసుపత్రులు, మునిసిపాలిటీలు, పంచాయితీలు

మీ ఆవరణాలను అందంగా తీర్చిదిద్దుకోండి

పూదోటలు, పండ్లు, ఇతర చెట్లను నాటడానికి ఇది అనువైన తరుణం.

ఇవన్నీ ఉచితంగా లభిస్తాయి

చెట్లు నాటే సమయం : జులై, ఆగష్టు

చెట్ల మొక్కలు, ఇతర సలహాలకు

సంప్రదించండి

జంటనగరాల్లో :

డివిజనల్ అటవీ శాఖాధికారి
విస్తరణ డివిజన్,
హైదరాబాదు – 500 004
ఫోన్ నెం : 30531, [ఎక్స్ – 45]

జిల్లాల్లో :

డివిజనల్ అటవీ శాఖాధికారి,
ఆయా జిల్లా హెడ్ క్వార్టర్స్.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.
10/78-79

KLVA104M139

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

జులై 1978

సంపుటము : 55 సంచిక : 7

విడిపత్రిక వెల రూపాయిన్నర

రు. 250 లను మీ పొదుపు డబ్బుపైన అదనంగా పొందండి.

మా పద్మావతి గ్రూపులో చేరి మీరు ఏ బహుమతి గెలుపొందనప్పటికిని!

మీ అదృష్టాన్ని బట్టి ఎన్నైనా బహుమతులు గెలుపొందవచ్చును.

రు. 34 లక్షల విలువకు మించిన సొమ్ముకు మొత్తం బహుమతుల సంఖ్య 95000 లకు పైబడి. మీ మొత్తం పొదుపు రు. 464 లు మాత్రమే! 23 నెలసరి వాయిదాలలో!!

మొత్తం సభ్యులలో 4000 నుండి 8000 మంది సభ్యులు రు. 250 లను స్పెషల్ బోనసుగా పొందగలరు. మిగిలిన వారికి రు. 1,00,000/–, రు 2,00,000/–, రు.50,000/– రు. 2,50,000/–, రు. 10,000/–, రు. 2000/–, రు. 1000/–, రు. 500 యింకా అనేక చిన్న బహుమతులు.

త్వరపడండి!

ఈ గ్రూపు జులై 1978న ఆలోపుగానే ముగుస్తుంది.

అధికవివరములకు, ఉచిత దరఖాస్తు ఫారమునకు దయచేసి సంప్రదించండి/వ్రాయండి. సమీప బ్రాంచి లేదా

"గుజరాత్ సేవింగ్స్"

5-1-751, బ్యాంకు స్ట్రీట్, కోఠి తాజ్‌మహల్ హోటల్ ఎదురుగా, హైదరాబాదు-500001, టెలిఫోను : 57406
గాంధీనగర్, ఓసెంట్ రోడ్డు, విజయవాడ-3 ఫో. 72159, 46-22-5 స్టేషన్ రోడ్డు.
దొండపర్తి, విశాఖపట్నం-
1-6-51, మార్కెట్టురోడ్డు, క్లాక్ టవర్ వద్ద, జగిత్యాల, కరీంనగర్ జిల్లా, సుబేదార్ క్లినిక్ మేడపైన, గాంధీచౌక్. నిజామాబాదు.
1-6-5, శాస్త్రి రోడ్డు, కరీంనగర్,
రామ్రష్టపతి రోడ్డు, నల్గొండ.
3-8-27, షా బజార్, మహబూబ్‌నగర్,
23/11-40 నేరెళ్ల భవనం, ఎల్లారు బజారు, గుంటూరు-3.
18/177, నెహ్రూ రోడ్డు, కర్నూలు.
8-24-151 కె. వి. పి. భవనము, మెయిన్ రోడ్డు, రాజమండ్రి.
71, చంద్రలోక్ భవనము 111 సరోజినిదేవి రోడ్డు. కోరమండల్ ఎదురుగా, సికింద్రాబాదు.
బస్సు స్టాండు దగ్గర, పి. ఓ. నిర్మల్.
21-186 షావుకార్‌ఫకీర్‌సాహెబ్‌స్ట్రీట్, కడప.
37-1-238, ట్రంకు రోడ్డు, ఒంగోలు.
రాజ భవనము, మునిసిపల్ బస్సుస్టాండు, శ్రీకాకుళం.
7-142 ప్రకాశ్ రోడ్డు, అనంతపురం.
15 జె. వి. మునిసిపల్ భవనము. ట్రంక్ రోడ్డు, నెల్లూరు.
8-3-51సుందర్‌టాకీసురోడ్డు, ఖమ్మం-1.
ఆత్రేయ విలాస్, మెయిన్ రోడ్డు, మచిలీపట్నం పి. ఓ.
గణేష్‌భవన్, హనుమకొండచౌరస్తా, వరంగల్.
బోసు రోడ్డు, రామకృష్ణ థియేటర్ ఎదురుగా, తెనాలి.
1-5-50 గంజ్ రోడ్డు, కామారెడ్డి.
వి. ఆర్. రావు భవనము, మెయిన్ రోడ్డు. కాకినాడ.
అర్బన్ బ్యాంకు రోడ్డు, బాటా దగ్గర, బరహంపూర్ - 1.
రాధికా స్టోర్ దగ్గర, వేమారెడ్డి భవనము, కాధిరి.
Road. No 3
దర్గా బజార్, ప్రొద్దటూరు.
మునిసిపల్ భవనము, మేడమీద ఆధోని.
పి. వి. యస్. వసన్షన్ శేష నీరన్ వీధి, చిత్తూరు.

హెడ్ ఆఫీసు ; 518, కల్‌బాదేవి రోడ్డు. బొంబే 400 002. టెలిఫోను : 310605_310533 టెలిగ్రాము : గుజరాత్ యూనిట్

అన్ని బ్రాంచీల టైమింగులు : సోమవారం నుంచి శనివారం వరకు ఉ. 9-30 ని నుంచి రాత్రి గం. 7-30 ని వరకు (45 నిమిషాల విరామంతో) ఆదివారం ఉ 11-30 నుంచి సా. గం. 5-00 ని వరకు.

3

విషయానుక్రమణిక

జూలై 1978

జలకేళి	శ్రీ వఝల కాళిదాసు	4
ఇదెక్కడి శక్తి?	"కొలకలూరి"	5
మరణముద్ర	శ్రీ మెతుకు మనోహర్ రెడ్డి	7
ఉదయం!	శ్రీ కె. శివారెడ్డి	8
ప్రార్థన	శ్రీ బండి నాగరాజు	8
సూర్యుడు	శ్రీ మల్లాప్రగడ రామారావు	9
సాహిత్యంలో ఆధునికత	శ్రీ వడలి మందేశ్వరరావు	10
జీవితం	డా. ముదిగొండ శివప్రసాద్	12
కమ్యూనిస్టు రష్యాలో సాహితీ ప్రతిఘటన	డా. మురళీధర్	13
బ్రతుకు	శ్రీ మిరియాల రామకృష్ణ	16
అమర శేషము	శ్రీ విక్రాల శేషాచార్యులు	17
ద్వీపాంతరవాసం	శ్రీ వనమాలి	19
గుంటుపల్లి గుహలు బ్రాహ్మీశాసనములు	శ్రీ ఇంగువ కార్తికేయశర్మ	20
ప్రాకృత వాఙ్మయంలో రామకథ–2	శ్రీ తిరుమల రామచంద్ర	27
భారతదేశములో దారిద్ర్య సమస్య	శ్రీ జంధ్యాల బాలగంగాధర తిలక్	32
కౌగిలి	శ్రీ ఎమ్. పార్థసారథి	40
నవత్వము — అపూర్వత	శ్రీ ఉ. అ. నరసింహమూర్తి	49
ప్రాముఖ్యత సంప్రదాయమా?	శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్	55
"సోషలిస్టు వాస్తవికత కూడా వర్గపోరాటమే"	శ్రీ జ్వాలాముఖి	59
కలగూరగంప		66
గ్రంథ విమర్శ		74

(*)

జలకేళి

శ్రీ వఝల కాళిదాసు

వెలిసిపోయిన వర్షం కడిగిన
  వినీలాకాశపు టద్దంలో
మిలమిలమని తళ తళమని
మెరుస్తూ కవితా మాణిక్య వీణా
ప్రతిబింబంలాగున్నదీ
పలు వన్నెల ఇంద్రచాపం !

నా మదిలో మెదిలే
విషాదస్మృతి ఛ్ఛాయలవలె
మళ్ళా ముసురు కొంటున్నవి
నల్లని మబ్బులు దిగంతాలలో;
టప టప మని చుక్కలుగా నీళ్ళు,
కరడుగట్టిన నీళ్ళు — వడగళ్ళు —
వృష్టి అమృతమయ సృష్టి
  ఇది శ్రావణ జలకేళి !

పీడిత ప్రజానీకము
తాడిత కార్మిక లోకము
విడిచే కన్నీటి గాథల్లా
విడవని దరిద్ర బాధల్లా
ఎడ తెరిపి లేని
ఎండ పొడలేని ముసురు !

స్రవిస్తున్న పెనుగాయంపై
వాలుతున్న ఈగల గుంపుల్లా
పగుళ్ళు వారిన వసుధా వృక్షముపై
రాలుతున్న నీటితుంపరలు !

  అగచాట్లతో అవాచ్యాలతో
  అబద్ధాలతో అశ్రువులతో
  ఆవరించబడి ఆక్రమించబడి
  ఆక్రోశిస్తూన్న ఆర్త కంఠాల
  బిగుస్తున్న ఉరిత్రాళ్లను
  తెగనరకాలని ప్రకృతి ఝళిపిస్తున్న
  కరుకు కత్తుల్లా మెరుపులు !

ఇది ప్రతివర్ష వినోద వాహ్యాళి
ప్రకృతి ఋతుచక్ర భ్రమణ కేళి
ప్రస్త బాష్పరింఛోళి
శ్రావణ జలకేళి !

యుగ యుగాలుగా తరతరాలుగా
నిర్విరామంగా నిష్ప్రయోజనంగా
జరుగుతున్న మహా సంగ్రామార్భటాలలా
ఉరుములు — పిడుగులు — గాలీ — వానా !

పొంగుతూన్న నదీ ప్రవాహాలు
క్రుంగుతూన్న దరిద్రప్రజా నివాసాలు
ముడుచుకొని పోతున్న మూగజీవాలు
తుడుచుకొని పోతున్న పంట పొలాలు
కుపిత కాలమేఘ గర్జారవాలు
క్షుభిత సాగరోర్మికా కల్లోలాలు
బాడబ మహాగ్ని కీలా జ్వాలలు

  కాబోలునిది ప్రళయ తాండవకేళి
  కాదు — ఇది ప్రతివర్ష వర్షాజలకేళి.

ఇదెక్కడి శక్తి?

"కొలకలూరి"

మట్టితో
  ఇటుకతో
రాళ్ళతో
గోడలు నిజమే!
నీటిగోడ
నిజమా?
అంతెత్తు, అంత పొడుగు
నీటిగోడ నిజమా?

మనుషులు సరే
కావాలంటే
పశువులు పక్షులు
నడుస్తాయి!
నీటిగోడ నడుస్తుందా?
భూమిని పూడుస్తుందా?

గాలి నీరూ
మనిషికి
ప్రాణం పోస్తాయి
తిండి పెడతాయి
మరివాళ ఏమయింది?
ప్రాణం తీశాయి
పంచుకు తిన్నాయి.

ఇంతకాలం
నేలకు పొలిమేరగా ఉన్న సముద్రం
ఈవేళ పోలేరమ్మగా
ఎందుకు మారటం?

శవాల్ని
మట్టిలో పూడుస్తారు
కట్టెల్లో కాలుస్తారు.
మనిషిని
నీళ్ళలో పూడుస్తారా?
కాలుస్తారా?

ఇదేం జల సమాధి?
ఎవరయినా
మెడబట్టి నెట్టొచ్చు
కొరడాలతో కొట్టొచ్చు
నీరు తోస్తుందా?
మనిషి గొంతు కోస్తుందా?

ఎప్పుడయినా ఉప్పెన
ఉప్పునీటి ఊపు
ఇప్పుడో
నిప్పు నీటి ఉరవడి.

కురుక్షేత్రంలో
లంకలో
ఎక్కడయినా
ఒక్కరోజు
పాతికవేల ప్రాణాలు పోయాయా?
ఈ నేలకు
ఇదేం పరాభవం?

అలకత్తితో
నేల తరిగిన
రాక్షస హస్తానికి
శిక్షేమిటి?
ఇళ్ళు కప్పులు
గాలి పటాలైతే
దారాల్లాగేది
ఏ అదృశ్య హస్తం

పల్లెంతా
పడవై పోతుంటే
చుక్కానీ లేదు
దిక్కూ లేదు.

పశువుల ప్రాణాలు
అలలకు ఆయువుపోస్తే

పడిపోయిన ఈ కట్టెలు
ఏ అగ్నికి సమిదలు?

మనిషి బ్రతికి పోవటానికి
పోయిన మనుష్యుల శవాలు
మెట్లు!
రోడ్లు!

ఎదిగిన బిడ్డలాగా
చేతికొచ్చిన పొలం
ఎడారి ఇసుకయితే
ఎవరి నోట దుమ్ము?

వేల ఏళ్ళ
మనిషి నాగరికతా ఆశాసౌధం
ఒక్క అల!
ఒక్క నిమిషం!
ఇంత శూన్యం!

నీరంటె వణికే మనిషి
ఇవాళ కదలని నీటి జంతువు
నీటిని వణికించే గజఈతగాడు
ఇవాళ అల వదిలేసిన నవ్వు.

బ్రతికి నంతకాలం
నిండని దరిద్రుడి కడుపు
ఇవాళ నీళ్ళలో నిండింది
  ఆకలిలా ఉబ్బింది.

వీధిలో తిరిగే కుక్క
కట్టుగొయ్యనుండే ఎద్దు
మేడలో సుఖించే మనిషి
ఇవాళ
ముళ్ళకంపలో
రొచ్చులో
నిర్జీవ స్నేహం!

ప్రాణం పోతే
మనిషెంత వికారం !
ఎంత దుర్గంధం !
ఎంత అనవసరం !

శవాన్ని
పూడ్చినా
కాల్చినా
మోసినా
పోనీ తాకినా
ఎంతపుణ్యం ?
మరి ఈ శవపుణ్యం
ఎవరికీ వద్దా.

కుక్క విశ్వాసంగల జంతువు
గుర్తు తెలియని యజమాని శవం
కంపు కొట్టకుండా
కాపాడుతూవుంది
ఈ రక్షణ సహించాల్సిందేనా ?
మనిషి ఈ శిక్ష భరించాల్సిందేనా ?

ఏ వూరికైనా
వల్లకాడు
కొన్ని ఎకరాలే !
సముద్ర స్మశానం
ఇన్నిమైళ్ళు !
నిన్నటిదాకా
భార్యా భర్త
అన్న తమ్ముడు
అక్కా చెల్లెలు
ఇంతలోనే
ఎవరికీ ఏమీ కానివాళ్ళు !
ఎవర్నూ లేనివాళ్ళు !

అలలలో మనిషి
రెక్కలాడని చేప
భూమ్మీద నూకల్లేని
దిక్కులేని పక్షి

ప్రకృతి ఆగడానికి
హద్దుల్లేవా ?
అదుపుల్లేవా ?

ఇంత నాగరికత
ఇంత సంస్కృతి
ఏం చేయను
ఏం కాను ?

ఒక అల తలెత్తితే
ఇన్ని తలలు నేలకూలటం
ఒక అల వలవేస్తే
ఇంత భూమి దొరికి పోవటం
ఇదెక్కడి ధర్మం?

ఒక ఊళ్ళో వాళ్ళు
ఇంటిలో వాళ్ళు
అన్నం తింటున్నవాళ్ళు
చేయి చేయి పట్టుకొన్నవాళ్ళు
నిముషంలో
ఎవరి కెవరు ఏమీకారు
ఇదేం న్యాయం.

పండించే నీళ్ళు
పంట పూడ్చటం
దప్పితీర్చే నీళ్ళు
ప్రాణం తీయటం
మేర మీరని నీళ్ళు
దారి తప్పటం
ఒడ్డెక్కని నీళ్ళు
ఇళ్ళెక్కటం
ఇదేంపని ?

నిన్న నేలను
మింగిన నీళ్ళు
ఇవాళ కళ్ళను
చీల్చిన నీళ్ళ

నిన్న ఏమీ ఎరగని సముద్రం
ఇవాళ ఏమీ తెలియనట్లేవుంది
కడుపులో ఎన్ని శ లో !
ఎముకల గూడులో !

ఏ శవం కోసం
ఏ తల్లి తిరుగుతూవుందో
ఏ శవం కోసం
ఏ చెల్లి అడుగుతూ వుందో
ఏ ఎముక కోసం
ఏ ఎముక రోదపెడుతూవుందో
దొర్లుతూవుందో
ఘోషిస్తూవుందో

సముద్రానికేం తెలుసు ?
సైతానుకే తెలుసు ?

ఈ తుఫాను
ఎవరి పాపం ?
ఈ వరద
ఎవరి శాపం ?

మనిషి సాధించిన అభ్యుదయం
మట్టిలో కలవరాదు
మళ్ళీ జలప్రళయం రారాదు.

మనిషి కోరే భవితవ్యం
నీళ్ళగారి పోరాదు
నీళ్లపాలు కారాదు.

ప్రకృతిని జయించే మనిషి
పరాభవం పొందరాదు.
భవిష్యత్తును శాసించే మనిషి
ప్రకృతికి ఓడిపోరాదు.

మనిషి చరిత్ర అంత
ప్రకృతితో పోరాటం
తుది విజయం
మనిషీ ! నీ యిష్టం.

మ ర ణ ము ద్ర

శ్రీ మెతుకు మనోహర్‌రెడ్డి

ఎప్పుడైనా నీవు మరణముద్రలోనున్న వయోవృద్ధ వృక్షాన్ని చూశావ ?
నిన్ననే నేను చూశాను, ఏకాంతంలో, ప్రశాంతపు సాయంత్రంలో
కాలిబాట వెంబడి నడచి వెళ్ళేటప్పుడు ఆలోచనావాహినిలోనున్న నేను
ఎవరో పిలిచిన పలుపుకు వెనుతిరిగి చూశాను, వృక్షం చేయెత్తి పిలిచింది నన్ను.
రాలిపోగా మిగిలిన నాలుగయిదు ఆకులతో, ఝడీఘాతమైన నిద్రాణంలో భారంగా వున్నది.
విచారాన్ని యీ భూమిమీద తనొక్కతే మోస్తున్నట్లున్నది.

అందరి చాటున, నిశ్శబ్దంగా మా అమ్మమ్మ నాకు "చిఱుతిండ్లు" పెట్టినట్లున్నది.
నేను ఆ వృక్షాన్ని ఏమైనా పోగొట్టుకున్నావా అని అడిగాను
జవాబు "మౌనము" ఇంతలోనే యింకో ఆకురాలిపోయింది.

ఎప్పుడైనా నీవు రోజంతా ఏ చెట్టు దగ్గరైనా గడిపావా ?
నేను గడిపాను, ప్రభాతోదయపు లేత బంగారుకిరణాల్లో
మిట్టమధ్యాహ్నపు వేడిలో, సాయంత్రపు నీరెండలో
మా నాయనమ్మలా వున్నదాన్ని ఏకాంతంగా విడవడానికి మనస్సొప్పలేదు
మరణముద్రలోనున్న వృక్షంతో, అనుభవశాలిని, వితరణ శీలిని యయిన వృక్షంతో,
సూర్యోదయంలో ముచ్చట్లతో గడిపాను.
మధ్యాహ్నం నిద్రలో, నిట్టూర్పులతో గడిపాను
సాయంత్రం విచారంలో, దాని చరమ దశ ఆలోచించాను.

ఎప్పుడైనా నీవు మరణాసన్నమైన, వయోవృద్ధమైన వృక్షాన్ని
హరితపత్రాలతో, నిమీలిత నేత్రాలతో చూశావా ?
నేను చూశాను, ఆశ్చర్యంతో హృదయం తేలికయేట్లు చూశాను.
ఏ లోకులయితే ఆ మోడును చీకాకులో చూశారో
ఆ లోకులే విస్మయంతో విచిత్రంగా దానివంక చూశారు.
మృత్యు సమాగపు ఘడియలలో యింత హరిత వృక్షాన్ని.
ఎప్పుడు చూడలేదన్నారు, అంతా విచిత్రమన్నారు.

ఉదయం!

శ్రీ కె. శివారెడ్డి

ఉదయం నాకొక గొప్ప నదిలా భాసిస్తుంది
ఉదయం నా కళ్ళకు ఆక్సిజన్‌లా పనిచేస్తుంది.

నా శరీర మైదానాల పత్రహరితమంతా
అనంత వ్యామోహంతో పరవళ్ళు తొక్కుతుంది
పరిపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లుతున్న కవిత్వంలా
ఉదయం నారక్తమై ప్రవహిస్తుంది.

సమస్త జనజీవితాల్ని సమాదరించి తరలివస్తున్న
ఈ ఉదయం ముందు మోకరిల్లుతున్నా —
ఎవడు ఏం పారేసుకున్నా లెఖ్ఖలోకిరాదు — కానీ
ఉదయాన్ని వదులుకుంటే జీవితం వైదొలగి పోయినట్లు —

సమస్త దీనజనుల పాదాలసవ్వడులు నిండిని
సమస్త కార్మికలోకపు వజ్రసంకల్పాల అగ్నిప్రవాహాలు నిండిని
ఆశల ఆనందోత్సాహాలు నిండిని
ఈ ఉదయంలో మునిగి పునీతుణ్ణౌతా —

ఎవడు దేనితోనూ రాజీపడక
జీవితాంతం పోరాటం సాగిస్తాడో
వాడికి ప్రతీక అయిన ఈ ఉదయన్నా
నాలోకి పిల్చేస్తున్నా —

నాలోని అమావాస చీకటుల అసంబద్ధతని
ఛేదించిన ఉదయమా !

నాలోని చావబోయే మొగ్గల్ని
వికసింపచేసిన ఉదయమా !

నాలోని క్రినీడల మరకల్ని
నిర్మూలించిన భాసురోదయమా !

నా తనువును విద్యుత్ చేతనతో
నింపిన రసోదయమా !

నాలోని ఒక్కొక్క అణువునుండి
నాదమై వీస్తున్న ఉదయమా !

నా కరాంగుళుల్లో నిన్ను కేంద్రీకృతం చేసుకుని
నా అక్షరాలద్వారా ప్రసరిస్తున్నా —
ఓ ఉదయమా ! నన్నొక వాహకం చేసుకుని
నా జనులకి తగినంత సత్త్వాన్నియ్యవే !

ప్రార్థన

శ్రీ బండి నాగరాజు

నేను విశ్వకవిని కాను
ఈ ప్రపంచానికి శాంతిభిక్ష పెట్టమనను
జాతీయ కవిని కూడా కాను
పూరి మేపగల నిన్ను,
పుట్టించ వద్దని కోరను
ప్రాంతీయ కవిని కానే కాను
ఆంధ్ర తెలంగాణాలను అతికించి పెట్టమని కోరను
జిల్లా రచయితని కాను, రాజకీయోపజీవుల బతుకు
బద్దలు కాకుండా చూడ గోరను

తాలూకా రచయితని కాను
సమితిరాజుల సాదరేక్షణాలు ప్రసరించ నియ్య మనను
అనాగరికుణ్ని, గ్రామవాసిని, మోటుగాణ్ని, నాటుకవిని —
ఓ భగవంతుడా !

— నన్నుద్ధరించ మనడం లేదు –
నీకు చేతైతే ఒక్కపని చెయ్యి : ఇది నా ప్రార్థన –
ఈ వూరిని ... ... ఏమో నా కనుపాపనే
నీళ్ళ లవుద్దని నే ననుకోను :

సైడుకాలవ నీళ్ళు పారిన బురదరోడ్లు –
టి మీద,
ఎంగిళ్ళు, పుల్లాకులు, అరిటి తొక్కలు, పిల్లకాయల
మల విసర్జనలు,
గేదెలు, గాడిదలు, అలాంటి సామ్యవాద పశువులు,
ఓవర్ లోడ్డు బస్సులు, ఊపిరాడక పోయినా
బీడీలు తాగందే బతకలేని పాసెంజెర్లు,
ప్రభుత్వ సారాయి దుకాణాలు దిగుమతి చేసిన
జీవచ్ఛవాల బస్టాండు నిద్రలు,
ముప్పూటలా సినిమా అడ్వర్ టైజమెంట్ల
మైకు అరుపుల ద్వంద్వ పోరాటాలు,

అనివార్యంగా, వేదాంతుల్ని చేసిన జనంతో కిక్కిరిసిన
ఇంటర్ నేషనల్ పబ్లిక్ లావెటరీ –
ఈ వూర్ని, కనీసం యీ కొక్కదాన్ని ...
ఏ అవతార మెత్తయినా ...
— ఏం చెయ్య గలవచ్చా ... ?

చిత్తగించ వలెను !

సూర్యుడు

శ్రీ మల్లాప్రగడ రామారావు

నక్షత్రాలు
తక్కుతూ
రాలుతూ
తళుకు లీనుతూ
అప్సరసల కురులలో విరుల్లాగ.

కాదు
భ్రమగాలిపై వాగ్దానాల్లాగ
పడివున్న శంకుస్థాపన రాళ్ళలాగ
ఇప్పటికీ వేచివున్న కళ్ళల్లో
కొడిగట్టనున్న ఆశల్లాగ.
నాకొద్దు

ఆకాశం
నీలం కక్కుతూ
నేలని కప్పుతూ
నిలచిన చాందినీలాగ
కాదు
అంకెలలో అగుపించే ప్రగతి లాగ
అశరీరవాణి వినిపించే అభ్యుదయంలాగ
నాకొద్దు.

చంద్రుడు
చల్లని వెన్నెలలు కురుస్తూ
శివుని సిగపై మణిలా మెరుస్తూ
ఆకాశపు కాసారంలో శ్వేతపద్మంలా విరుస్తూ
కాదు
ప్రణాళికల ఉత్త పాంపేలాగ
నా కొద్దు

సూర్యుడు
నిప్పులుమిసే
నెత్తురుడికించే
నడినెత్తిన నిలచి వెలిగే
మధ్యందిన మార్తాండుడు
కత్తి పదునులాంటి
నిష్ఠల దీక్షలాంటి
కర్తవ్య భానుడు
కావాలి నాకు.

శ్రీ పడలి మందేశ్వరరావు

సాహిత్యంలో ఆధునికత

ఆధునికత అన్నది సంకుచితార్థంలో నేటిది, ఈనాటిది అన్న అర్థంలో వాడవచ్చు. విస్తృతార్థంలో నూతనత్వం నేటివరకూ సుబాసించే ఆదిమానవుని కళాఖండానికి అన్వయింపవచ్చు. ఈ శతాబ్దం ఆరంభంలో ప్రపంచంలోని ఆనాటి కళాకారుల్లో అత్యంత ఆధునికులైన చిత్రకారులు పురాతన ఆఫ్రికన్ నీగ్రో చిత్రాలకు ముగ్ధులయారు. ఎట్లా మెచ్చుకోలు ఆనాటి అభిరుచులలో ఆధునికమైనవి!

ఆధునికత సమకాలీనతకాదు. సమకాలీను లందరూ ఆధునికు లవరు. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు సుమారు ఏదెనిమిది దశాబ్దాలు కవిత్వం వ్రాసారు. కాని వారి నెవ్వడూ, ఆనాటి వారెవ్వరూ ఆధునిక సాహిత్యవేత్తగా, ద్రష్టగా పరిగణించలేదు. వెన్నెపిళ్ల లంతకన్న నాగరికుడు, ఆధునికుడు. ఆయన "కథలు — గాథలు"లో ఆనాటి ఆధునికమైన సాహిత్య ప్రక్రియ కనబడుతుంది. ఆ వ్యాసాలలోని శైలి వ్యావహారిక భాషకు ప్రమాణాలను సృష్టించేది, సరసమై, తెలుగు నుడికారపు సొంపు సంతతినీ ప్రతిబింబింప చేసేది. వస్తువులో నూతనత్వం వైవిధ్యం ఉంది. (అందులోని వ్యాసాలను కాలేజీ హైస్కూలు విద్యార్థుల పఠనీయ గ్రంథాలలో చేరుస్తే బాగుంటుంది!)

నవలా ప్రక్రియలో వీరేశలింగం ఆద్యుడు కాకపోయినా, కొక్కొండవారి "మహాశ్వేత చరిత్ర" ముందుగానే వ్రాయబడినా, అది ఆధునికంకాదు, వీరేశలింగంగారి "రాజశేఖర చరిత్ర"మే ఆనాటికి నూత్నప్రక్రియ అని రమాపతిరావుగారు అంటారు. "మహాశ్వేత చరిత్ర" కేవలమూ పూర్వసంస్కృత కావ్యాన్నుంచి గ్రహించిన వస్తువు అవడమేకాదు; దీని రచనా విధానం అంతా పాతమార్గాన్నే అనుసరించింది. "రాజశేఖర చరిత్ర" అలాకాదు: అసలు దాని ఆకరం కూడా కొత్త రకమైనదే — అరువేలమైళ్ల అవతల ఆంగ్లంలో ఉంది. దీని ప్రణాళిక, నిర్వహణ, శైలి, అన్నీ నేటి నవలకు ప్రాతిపదికలయాయి. అంచేత అది ఆనాటి సాహిత్యంలో ఆధునికమైనదవడానికి సందేహంలేదు.

ఇలా వెనుకకు చూచుకుంటూపోగా, నన్నయ ఆనాటి ఆధునికుడే అవుతాడు. తెలుగుకు ఒక పెద్ద గౌరవంలేని రోజుల్లో, సాహిత్యాన్ని సృష్టించడానికి తెలుగు అనువైన భాష కాదన్నమాట లోకంలో ప్రచారంలో ఉండగా, పట్టి కావ్యాన్నే కాదు, మహా కావ్యాన్నే తెలుగులో వ్రాస్తానని పూనుకోవడం ఆనాటి వాళ్ళకు ఏదో తెంపరితనంగా కనబడి ఉండాలి. అది పట్టి మహాకావ్యమే కాకుండ, లాక్షణికులకు సర్వలక్ష్య సంగ్రహంగా, ధర్మ, నీతి శాస్త్రవిదులకు ఎయా శాస్త్రాలలో, ఇలా ఆనాటి సమగ్ర విజ్ఞాన సంస్కృతులకు భద్రపరచేదిగా, ఈ ఇతిహాసాన్ని చేపట్టడం ఒకాడు అత్యంత సాహసోపేతమైన ప్రయోగం అయే ఉంటుంది. అందుకే దాని రచనకు నారాయణభట్టువంటి వాని సాయం దొరికినా, అది తుది వరకూ నెగ్గలేదు.

వీరశైవం మన కవులకు పాతకాలపు ఛాందసంలా కనబడినా, నాటి శివకవులు ఆధునికతకోసం ఎంతో తహతహలాడారు. భాషలోనూ, ఛందస్సులోనూ, తిరుగుబాటును తీసికొని వచ్చారు. "మేం వాడేది ప్రజల భాష, మా భాష జాను తెనుగు!" అన్నారు. 'మా ఉద్యమం ప్రజలలోకి చొచ్చుకొనిపోవాలి. అంచేత మా ఛందస్సు ప్రజల పాటలకు సన్నిహితంగా ఉండాలి!" అంటూ ద్విపదను చేపట్టారు. ఈ మాటల్ని వింటూంటే నిన్న మొన్నటి గురజాడ జ్ఞాపకం రావడంలో ఆశ్చర్యంలేదు. పాల్కురికి సోమన ఇట్టి భాషలో, ఇట్టి ఆధునికమైన దృక్పథంతో కావ్యాన్ని కాదు, పురాణాన్నే వ్రాసాడు. బసవపురాణం నిజానికి ఏ మార్కండేయ పురాణం వంటిదో కాదు. ప్రధానకథ అలా ఉండగా, ఇందులోని ఒక్కొక్క చిన్న కథా ఒక అనర్ఘరత్నం. వెనుకటి కవులలో శివకవు లంతటి ఆధునికులు, ప్రజాకవులు లేరు.

నాచన సోమన తన ఆధునికత్వాన్ని చాటుకోవడానికి "నవీన గుణ సనాథుడ"నని చెప్పుకొన్నాడు. ఈయన నవీనగుణం శివకవుల్లో కనబడినట్టుగా, కొట్టవచ్చినట్టు కనబడదు. శబ్దాలలో ఈతడు ప్రయోగాలు చేసినమాటనిజం. నీసానికొక కొత్త అందాన్ని ఇయ్య సంకల్పించాడు. పద్యానికి నిండుతనంకోసం ప్రాకులాడాడు. వర్ణనలలో వైచిత్రి కావాలనుకున్నాడు. అన్నింటికన్న ఈయన శిల్పదృష్టి గొప్పది. సమకాలీనుల అభిరుచిని దిద్దేటట్టు కాదు కాని, తృప్తిపరచేటట్టు ఉండన కావ్యాన్ని నిర్వహించాడు. ఆనాటి ఆధునికు డీయన!

శ్రీనాథుడు కట్టులోనూ, బొట్టులోనూ ఆనాటి ఆధునికుడై ఉండాలి. గొప్ప మాటకారి అయి ఉండాలి. ఆయన లౌక్యం వల్ల సంపాదించి మిగిల్చిందేమీ లేకపోయినా, రాజులనుంచి పేదల వరకూ అందరినీ పలకరించి, అందరిచేతా 'బా'గనిపించుకొని, ఎందరో Admirersను సంపాదించుకున్న ఖ్యాతి శ్రీనాథునిది అనుకుంటాను. మల్లంపల్లి శరభయ్యగారు రీతిమార్గ ప్రవర్తకు డెవరైనా తెలుగులో ఉంటే, ఆయన శ్రీనాథుడే అంటారు. కవిత్వ ప్రయోజనం కేవలం ఉపదేశమే కాదు పొమ్మన్నాడు. కవిత్వం

Puritanలకు ఉడుకుం పెట్టనక్కర లేదన్నాడు. నిర్వ్యాజమైన నిధనమే కవిత్వమని ఋజువు చేసాడు. తెలుగులో ఆధునికత, నవికత. ఫేషన్ లా సరిగా ప్రవేశపెట్టిన కవి శ్రీనాథుడు

రాయలవంటి రసికుని ఆస్థానంలో పెద్దనగారి వరూథినీ పద్యాల ఆధునికమైన పాత్రగా అనిపిస్తుంది. మార్కండేయ పురాణంలో ఏ మూల ఒదిగి ఉందో, మనం సరిగ్గా కనబడనే కనబడదు వరూథిని. కాని పెద్దనకావ్యంలో ఆధునికంగా "ప్రాంచత్ భాషణ బాహా మూల రుచి" తో ప్రత్యక్షమవుతుంది. పెద్దన ఒక కొత్త మార్గాన్నే సృష్టించిన ఆనాటి ఆధునికుడు.

వెనకటి కవుల్లో, ఎంత చేతకాని విమర్శకుని చేతిలోనైనా నలిగిపోయే కవి రామరాజభూషణుడు. ఈతని వసుచరిత్ర అంటే నాల్గు తరాల వాళ్లపై అతని ప్రభావం అవ్యాహతంగా ప్రసరించింది. కాని అదే అతని గొప్పతనానికి ప్రమాణం ఎందుకు కాకూడదో కాస్త తీరికగా ఆలోచించే ఓపిక ఈ విమర్శకులకు లేదు. శ్రీశ్రీని మీకు నచ్చిన మహాకవి పేరును వ్రాయమంటే, రామరాజ భూషణుని పేరును వ్రాస్తారని నా నమ్మకం. నిజంగా అయినా రామరాజభూషణునిలోని అధివాస్తవికతను మనం చూడాలి. పద్యాన్ని కేవలం వినోదం కోసమే వ్రాసేవాళ్ళకు రామరాజభూషణు డొక నవాబ్! మీరు కోరిన శ్రావ్యతనే, మీరు కోరిన మెత్తదనాన్నే మీకు భిక్షగా వేస్తూ, మీ మేధకు పని చెప్పడానికి రామరాజ భూషణుడు ఈ పనికిమాలిన విమర్శకుల్ని క్షమించలేము. కవిత్వ మంటే కవుల చేతుల్లో కరిగిపోయే శృంగారమని అని ఈనాడు అంగీకరించరు. పద్యం ఒక శిల్పం. దాని సౌష్ఠవం గ్రాహ్యమవుతుంది, మేధ కూడా అవసరమవుతుంది. రామరాజ భూషణుడు చెప్పిందేమిటంటే గొప్ప కవి; ఆనాటి ఆధునికుల్లో ఆధునికుడు. కాని దురదృష్టవశాత్తు ఆయన అనుయాయులు తక్కువయి పోయారు. పిల్లి పిల్లలను కుడుతుంటే పెట్టి పొర్లాడే పిల్లల్లా పరిస్థితి పాలైంది. రామరాజభూషణుడు (వసుచరిత్ర గురించి ఇదంతా అర్థమైనా) ఎంతో ప్రమాదకారుడు.

ఈ శతాబ్దపు కవుల్లో ఆధునికు లెవరంటే నిస్సందేహంగా విశ్వనాథ కృష్ణశాస్త్రిగారే నిజమైన ఆధునికుడు. తెలుగు పద్యానికి పట్టం కట్టడం ఆయన వల్లనే జరిగింది. వ్యవహారిక భాష రాని వ్యవహారికుడే కాదు, అందులో కవిత్వం ఉట్టిపడేటట్లు వ్రాయగలిగిన ఆయనే. ఎదుకులో మెత్తదనం, పలుకుబడిలో కొత్తదనం, వినబడుతున్నట్టు చెప్పగలగడం, తెలుగువాళ్ళకు నేర్పింది ఆయనే. కొల్పిన కొద్దిసాని ఈయన ప్రచారం చేసింది కవిత్వమే కాదు. నిజమే, కాయినా రామరాజ భూషణునిలా పట్టి ప్రవాహమే! కాని కాలం గడిచినా మారలేకపోయింది ఆ ప్రభావం. ఆయన కొంత వరకు మాత్రమే పరిమితమైనా కొత్త ప్రపంచంలో ఎంతో తెలుగు వాకిళ్లను తెరచింది. (ఇందులోని 'ప్రభంజనం', 'వాకిళ్లు' కృష్ణశాస్త్రిగారివి.)

శ్రీశ్రీ ఈ శతాబ్దపు నాల్గవ దశాబ్దంలో నాగరికంగా కనబడే మనిషికాడు. కృష్ణశాస్త్రిగారిలా మంచి వక్తకాదు, సుకుమారంగా మాటాడ నేర్చినవాడూ కాదు. కాని సాహిత్య రంగంలోకి చిరుగాలిలా ప్రవేశించి, సుడిగాలిలా మారిపోయాడు. నాటికీ, నేటికీ, సాహిత్యంలో ఆధునికత అంటే శ్రీశ్రీకి ప్రాణం. పాశ్చాత్యకళలో వచ్చిన ఫ్యూచరిజం, క్యూబిజం, డాడాయిజం, సర్రియలిజమ్ లంటే ఆయనకు ఎంతో ఆసక్తి ఉండేది. ఇక్కడి ఇక్కడా ఎందుకు ఉండకూడదు ? సర్రియలిజమ్ ఆనాటికి ఇంకా ఆధునికమైంది కనుక, దానిని చేపట్టాడు. కాని అలా కాదు; దాన్ని దూసుకొని మరొకటి వస్తోంది. సైకో అనాలిసిస్ కన్న, మార్క్సిజమ్ సాహిత్యాన్ని ప్రభావితం చెయ్యడం ఎక్కువ ఆధునికత అంచేత శ్రీశ్రీ అధివాస్తవికతలో నుండి, అభ్యుదయ కవిగా మారాడు. మరికొంత కాలానికి దీనిలోనూ ఆధునికత చాలక పోగా, విప్లవ రచయితగా కాకపోయినా, విప్లవ రచయితలకు అగ్రగామిగా నిలబడ్డాడు.

అంటే శ్రీశ్రీ నిలకడలేని పిచ్చివాడనో, నిశ్చితాభిప్రాయాలు లేని కళాకారుడనో కాని, అర్థం కాదు. కవిత్వ శిల్పాన్ని గురించి శ్రీశ్రీకి నిశ్చితాభిప్రాయాలే ఉన్నాయి. కాని ఆ శిల్పాన్ని ఎందుకు, ఎలా ఉపయోగించాలన్న విషయాన్ని గురించి సార్వకాలికమైన, నిశ్చితమైన దృక్పథం లేకపోవచ్చు. లోకం ప్రగతిశీలమైనది. నిన్నటి అభ్యుదయవాది, నేడు తిరోగమనమే ప్రగతి పథం అనుకోవచ్చు. మీరాలు వేయించుకోవడం మంచిదన్న భావం ఒకనాడు గొప్ప అభ్యుదయ భావం. అది ఈనాడు ఆరోగ్య సంరక్షణకు జరిగే ఒకతంతు మాత్రమే. ఆనాడు మీరాలు వేయించుకోవడం మంచిదని చెప్పు నదిస్తే ఆనాడు అది అభ్యుదయవాది కావచ్చు కాని, నేడు ప్రగతి నిరోధకుడికి కాస్త నమ్మకం లేదంటూను చెప్పాల్సిందే. కాగా శ్రీశ్రీ దేశానికి ఇచ్చింది ఏమంటే ఏనాటి కానాడు, ఆనాటి సామాజిక సార్వజనీన వాతావరణంలో ప్రగతిశీలాన్ని ఆనాడు కుండ పెంచడం. ఆధునికత శ్రీశ్రీ ఆరిచి; ప్రగతి ఆయన సాధన. ఈ ప్రగతి పథంలో ప్రయాణం చేస్తూంటే, ఒక్కొక్కప్పుడు శిల్పాన్ని కూడా కొత్త మార్గంలో నడుపవలసి ఉంటుంది. కాని నిజానికి శిల్పంలో శ్రీశ్రీ ఇతర కవుల్లో కొత్తగా సాధించింది తక్కువే!

పై విశ్లేషణవల్ల ఆధునికత అంటే ఏమిటో ఆలోచిస్తే రెండు మూడు విషయాలు తేలుతాయి. ఆధునికత అన్నది వేరు, సమకాలీనత వేరు. నాటి వరకూ ఉన్న సాహిత్యపు పద్ధతులలో మార్పు ఎక్కడ సాధించబడితే అక్కడ ఆధునికత ఉన్నదనుకోవచ్చు. ఈ కొత్తదనం పద్ధతిలో కాని, వస్తువులలో కాని, అలంకారంలో కాని, ఛందస్సులో కాని, సందర్భపు దృష్టికోణంలో కాని, ఉండవచ్చు. ఒక పాదంలో నుంచి మరో పాదంలోకి పాకే సీస పద్యం పాదాన్ని దాటుతూ నడిచే సీసం కొత్తదయింది కొందరికి. అసలు పద్యంలో నుంచి పాటలోకి మారడమన్నది ఒకనాటి ఆధునికత. గేయంలో నుంచి వచన గేయంలోకి మారడమన్నది మరొక ఆధునికత. వచన గేయంలో నుంచి

వచనాన్నే కవితగా మలచడమన్నది ఇటీవలి గుంటూరు వారి అతి ఆధునికత !

మరో దృష్టి నుంచి చూడగా; పురాణాలను విడచి, పాత కథనే కమనీయమైన కావ్యంగా మలచడమన్నది ఒకప్పటి ఆధునికత. అట్టి వర్ణనాత్మకమైన కావ్యాన్ని వదలి ఖండికను వ్రాయడం, అందులో ఆత్మాశ్రయమైన కవితను జొప్పించడం, తర్వాత వచ్చిన ఆధునికత. ప్రేయసిని సృష్టించుకోవడం ఆనాటి ఆధునికతలో ఆధునికత. ఇది లోకాన్ని విడచి సాము చేయడమనీ, లోకంలోనుంచి పారిపోవడమనీ, దానిమీద వచ్చిన తిరుగుబాటు. లోకంలో నిలబడి అభ్యుదయ శక్తులకు అండగా నిలబడి వ్రాయడం ఆ మీద వచ్చిన ఆధునికత. దీన్ని మరికొంత దూరం ముందుకు తీసుకొనిపోయిన తీవ్రవాదులు విప్లవవాదులు. వీరికి ఆధునికుల మనిపించుకోవాలన్న ఆకాంక్ష లేదు. కాని వీరి శబ్ద చిత్రాల్లోనూ, భావ వ్యక్తీకరణ లోనూ కొత్తదనం కనబడుతుంది.

మరొక్కమాట: ప్రతీ మహాకవిలోనూ ఏదో కొంత ఆధునికత తప్పక కనపడుతుంది. కొత్తదనం, ఆధునికత ఉన్న కవిత Significant కవిత కావచ్చు "రాగాల డజన్"లా; కాని - యుగంలో అదే మహాకావ్యమై కూర్చోనక్కరలేదు. షేక్స్పియరు కాలంలో ఆయనకన్న Metaphysical poets ఆధునికులు. కానీ — వాక్యం పూర్తిచేయ నక్కరలేదనుకుంటా !

జీవితం

డాక్టర్ ముదిగొండ శివప్రసాద్

ఏదో ఎక్కడో ఉన్నదని
రాత్రి
భ్రమించి పరిభ్రమించి
చివరకు
ఎక్కడ ఏముందో తెలుసుకునేటప్పటికే
అన్వేషణలో తెల్లవారిపోతున్నది జీవితం ! !

సాయంత్రం ప్రయాణం మొదలుపెట్టి
అర్ధరాత్రి వరకూ పురోగమించి
చివరకు
సూర్యోదయం వేళకు
బయలుదేరిన చోటికే చేరడం
జీవితం ! !

అర్ధరాత్రి సూర్యుడు ఉదయిస్తే
విప్లవం ! !
ఉదయం సూర్యుడు అస్తమిస్తే
విధ్వంసం
సాయంత్రం పున్నమి వికసిస్తే
సంస్కృతి
కాలాని కవితల
సూర్యుడూ చంద్రుడూ
ఒకేసారి వికసిస్తే
స్వస్వరూప సాక్షాత్కారం ! !

నూరేళ్ల మానవ జీవితంకూడా
అనంత కాలావధిలో
ఒక లిప్త

కాని
ప్రవాహ గతిలో
అనాద్యనంత మానవత
పరమేశ్వరుని జీవితానికే
ఒక
శాశ్వత మహానుభూతి ! !

డా. మురళీధర్

కమ్యూనిస్టు రష్యాలో సాహితీ ప్రతిఘటన

మనం మనుకొంతవరకు, కమ్యూనిస్టు దేశాలలో కవులకు కళాకారులకు ప్రజాస్వామ్యంలో వున్నంత స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ఉండవు. కవులు, కళాకారులు ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని విధిగా సమర్థించి తీరాలి. ప్రభుత్వ సిద్ధాంతానికి వ్యతిరేక భావాలను వెల్లడించే కవులను ప్రజా ద్రోహులుగా పరిగణించడం సహజమే. కానీ కవులు స్వేచ్ఛాప్రియులు. ఎవరి ఆజ్ఞలకు, ఆదేశాలకు తలవొంచక నిర్భీతిగా తమకు నచ్చిన అభిప్రాయాలను వెల్లడించి తీరుతారు. ఇటువంటి నిర్భీతి సాంప్రదాయం కల పత్రికే రష్యాలో నోవ్‌మిర్. 1953 నుండి 6 నెలలకు ఈ పత్రిక, రచయితల సహకారంతో సంపాదకుల చాకచక్యంతో ఏ రీతిగా ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏవిధంగా కమ్యూనిస్టులు తమ సిద్ధాంత ఆధిక్యతను ఇతరులపై రుద్దే విధానాన్ని ఖండిస్తూ ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ప్రజాస్వామ్య సాంప్రదాయాలను నెలకొల్పేటందుకు తోడ్పడిందో తెలిపే ఉద్దేశ్యమే ఈ వ్యాసం.

1946లో కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి అయిన ఆండ్రే జిదనోవ్, రచయితలు, కవులు కొన్ని నిర్దిష్ట సూత్రాలను పాటించి తీరాలని ఒక ఆదేశాన్ని జారీచేసాడు. ఇవి 'జిదనోవ్ ప్రమాణాలు'గా పేర్కొనబడింది. వీటి ననుసరించి, నవలాకారులు, కవులు, కథకులు, తమ తమ రచనలలో ఏదైనా సందర్భం వచ్చినప్పుడు విధిగా తమ 'సిద్ధాంతాలను' ప్రభుత్వపు విధానాలపై, తమ 'అభిప్రాయాలను' స్పష్టీకరించాలి. రచయితలు తమ రచనలలో విధిగా కొన్ని పాత్రలను సృష్టించి వాటిద్వారా ప్రభుత్వ. పార్టీ విధానాలను, ప్రచారం కావించాలి. ఇటువంటి కృత్రిమ పాత్రా సృష్టిద్వారా రచన శోభించదన్న రచయితల మొఱ లెక్కపెట్టలేదు ఎన్నో మార్లు పత్రికా సంపాదకులే — రచయితలు ఈ సంఘటనలను వర్ణించనప్పుడు స్వతంత్రించి అధికార వర్గాలకు అనుకూలంగా కొన్ని సంభాషణలు చొప్పించేవారు. స్టాలిన్ శకం అంతరించే టప్పటి సాహితీ స్థితి ఇది.

అన్ని పత్రికలవలె నోవ్‌మిర్ కూడా స్టాలిన్ మరణానంతరం, కొన్ని నెలలవరకు, అధికార వర్గాలకు అనుకూలంగా వ్యవహరించసాగింది. దానికి కారణం స్టాలిన్‌నాటి పద్ధతులు వాటి భయంకర జ్ఞాపకాలు కాబట్టి సంపాదకులు, ప్రతి సంచికలోను కమ్యూనిస్టుపార్టీ గొప్పతనాన్ని వివరిస్తూ సంపాదకీయాలు వ్రాసేవారు. రష్యా సాధించిన ప్రతి విజయానికి — బోల్షివిక్కు విప్లవంనుండి గోధుమల ఉత్పత్తి పెంపుదలవరకు — కమ్యూనిస్టుపార్టీయే మూల కారణమని మానవాళికి ఏకైక ఆశాజ్యోతి ఈ పార్టీ అని వ్యాసాలు వ్రాసేవారు.

ఆనాటి జిదనోవ్ సూత్రంలో ముఖ్యమైనది రచనలలో విద్యాప్రబోధక అంశాలు, సందేశాత్మక సంఘటనలు వుండితీరాలి. ఈ రచనలు ముఖ్యంగా కమ్యూనిస్టు సిద్ధాంతపు ఔన్నత్యమును ప్రబోధిస్తూ మానవాళి సిద్ధాంతపువైపు మొగ్గడానికి తోడ్పడాలి. దాదాపుగా కథలన్నిటిలోను, శ్రామికుల విజయాలు, ధనికవర్గపు పతనం జులుమ్, పేదవారి నైతికస్థాయి మున్నగు అంశాలు ఎక్కువగా కనబడుతాయి. కథలలో వర్గ ఘర్షణ తుదకు లేనివారు కలవారిని కూలద్రోయటంవంటి సంఘటనలు హెచ్చు. బూర్జువా సంస్కృతి పట్ల నిరసన, పాశ్చాత్య విలువలపై ద్వేషం రష్యా సంస్కృతిపట్ల విపరీతమైన అభిమానం మనకు జిదనోవ్ ప్రమాణాల ననుసరించి రచింపబడిన రచనలలో కానవొస్తుంది. నిరాశావాదం, విషాదాంత కథలు పూర్తిగా విడనాడవలసినదని జిదనోవ్ మరో సూత్రం. "ఈ నిరాశావాదం మనవంటి పురోగమన సిద్ధాంతం కల సమాజానికి కాదు. మీ రచనలు వెల్లివిరిసే ఆనందాన్ని వెల్లివిరియించాలి. ఆశాజ్యోతులు వెలిగించాలి. క్షీణించిపోయే సమాజానికే ఈ నిరాశావాదం" [1] సాధారణంగా రచనలు ప్రస్తుత సంఘటనలపై కేంద్రీకరింపబడి వుండాలి. ఏనాటిదో అయిన పాతకాలపు సంఘటనలు జిదనోవ్ ప్రమాణాల ననుసరించి రచనకు పనికిరావు.

అయితే స్టాలిన్ మరణానంతరం కొన్నినెలలలోనే ఈ ప్రమాణాల పెత్తనాన్ని నిరసించి రచయితలు తమ స్వతంత్ర భావప్రకటన చేయబూనారు. వీరికి నోవ్‌మిర్ తోడ్పడింది. అయితే తమ భావప్రకటన మరీ ప్రభుత్వాన్ని దిక్కరించేటట్లుకాక ప్రభుత్వ ఆదేశాలననుసరిస్తున్నట్లు కనిపిస్తూనే ఒక స్వతంత్ర పంథా ననుసరించారు. వీరి రచనల ముఖ్యోద్దేశ్యం సాంఘిక చైతన్యవాదం, విమర్శనాత్మక వాస్తవికత. ఈ రెండు ఆదర్శాల ఆధారంగా, రచయితలు తమ భావ ప్రకటన చేయనారంభించారు.

(a) సాంఘిక చైతన్య వాదం :

ఈ ఆదర్శాననుసరించి రచయితలు తమ సమకాలీన సామాజిక వ్యవస్థను విమర్శనాత్మకంగా పరిశీలించారు. దానిలోని లోట్లను వాటికి కారణాలను అన్వేషించారు. తమ సమకాలీన సామాజిక వ్యవస్థను మరింత బాగుపడచాలని ప్రాకులాడారు.

(b) విమర్శనాత్మక వాస్తవికత :

మరికొంతమంది రచయితలు ఈ వ్యవస్థ వ్యక్తిపై ఎటువంటి ప్రభావం చూపుతుందో అన్న అంశాన్ని పరిశీలింపసాగారు. తమ పూర్వీకులైన 19 వ శతాబ్దపు కవులవలె వీరు సమాజిక శక్తులు వ్యక్తులను ఏ విధంగా ప్రభావంతం చేస్తాయో వర్ణింపసాగారు. కేవలం సమకాలీన సమాజిక వ్యవస్థను పొగిడే భట్రాజుల పనికి వీరు పూనుకోలేదు. తమ రచనలలో ఒక ఆదర్శ సమాజాన్ని ప్రతిబింబింపజేసి, ప్రస్తుత వ్యవస్థ దానికి చాలా దూరంలో వుందంటూ పరోక్షంగా కమ్యూనిష్టు వ్యవస్థపై దాడి జరిపేవారు.

పై పేర్కొన్న రెండింటి ఆదర్శాల కనుగుణ్యంగా రచయితలు తమ రచనలను కొనసాగించసాగారు. ఎన్నోసార్లు ప్రభుత్వ విధానపు లోటుపాట్లు, అధికార మదాంధులైన పాలన వర్గం వలన ఏ విధంగా సామాన్యులు, అమాయక ప్రజలు కష్టాలకు గురి అయ్యేది, ముఖ్యంగా వీరి రచనలలో ప్రతిబింబించేవి. రచయితులు త్వరలోనే ప్రభుత్వ ఆగ్రహానికి గురి అయినారు.

అలనాటి ప్రభుత్వ విధానాలలో, పార్టీలోని ప్రముఖ వ్యక్తులను, అన్ని రంగాలలోను — విద్య వైజ్ఞానిక, సాంకేతిక మొ—ముఖ్య అధికారులుగా నియమించటంపట్ల రచయితలు తమ తీవ్ర నిరసనను వెల్లడించారు. "ఏదైనా రంగంలో ఆ రంగానికి చెందిన మేధావులను ముఖ్యస్థానాలలో నియమించటం కాని, పార్టీ వ్యక్తులను ఈ రంగాలలో చొప్పించడం, అనవసర అధికార కేంద్రీకరణకు దారి తీస్తుంది ప్రతి చిన్న విషయానికి, పార్టీకీ విజ్ఞప్తి చెయ్యవలసి వస్తుంది. తగినసమయంలో నిర్ణయాలు తీసికోనందువల్ల ఉత్పత్తి స్థాయిలో, సరఫరా స్థాయిలో, ప్రణాళికాభివృద్ధి స్థాయిలో తీవ్రంగా దెబ్బ తినగలదు. ఏ స్థాయిలో కూడా పనిచేసేవారికి ఏ మాత్రము స్వాతంత్ర్యంలేదు. అమూల్యమైన కాలాన్ని, పై వర్గాలవారి ఆక్షేపణలకు బదులు వ్రాయడంలో వృధా అవుతుంది"[2] అని సమకాలీన ప్రభుత్వ యంత్రాంగపు తీరు తెన్నులను సూటుగా విమర్శించే ధోరణులను మనం కొన్ని రచనలలో కానవచ్చు.

ప్రజాస్వామ్యపు పద్ధతులవలె అగుపడి, వాస్తవాన్ని మరుగు పరచే కపట పద్ధతులను దుయ్యపట్టారు. అటువంటి కపట పద్ధతులలో ఒకటి "ప్రజా స్వామ్య రీతిలో" నిర్ణయాలు తీసికోవడం. ఇది కేవలం నామ మాత్రంగా వుండు. వాస్తవానికి నిర్ణయాలు పై అధికారులు తీసుకొంటారు. ఎవరైనా కార్మికులు ఉత్సుకతతో సలహాల నివ్వబోతే వారిని కసురుకోవడం సర్వసాధారణమని. నోవ్‌మీర్ పత్రికలో తరచూ తమ రచనలు పంపే ట్రోపోలోస్కి పేర్కొన్నారు. ఎన్నో పార్టీల మీటుంగులలో ఆదరింపబడే "స్వవిమర్శ" లేదా "ఆత్మవిమర్శ" ఒక ప్రహసనంగా మారిపోయిందని, అది ఏ మాత్రము ప్రయోజనాన్ని సిద్ధింపలేక పోయిందని, కేవలం ప్రచార సాధనంగా మారిందని, ఆయన విమర్శించారు. ఇటువంటి చర్యలు యువకులలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ పరుస్తుందని ఆయన వ్రాకుచ్చారు. ఆను రచించిన నవలలోని పాత్రలు ఏ విధంగా తాము ముందునుంచి ప్రగాఢంగా విశ్వసించిన సిద్ధాంతాలను, బహిరంగంగా — "స్వవిమర్శ" అన్న పార్టీ చర్య వలన—విడనాడి వలసి వచ్చిందో చాలా హృద్యమంగా వర్ణించారు. ఈ ఆత్మ విమర్శ వలన, తాము నమ్మిన సిద్ధాంతాలకు తిలోదకాలు యివ్వవలసి వస్తుందని వారికి తెలుసు. కానీ వారీ చర్యలకు పూనుకొన్నారు. దీనికి ప్రేరేపణ, ప్రభుత్వ నూతన సిద్ధాంతాలపై విశ్వాసం కాదు, తమ తమ ఉద్యోగాలు నిలుపుకోవాలన్న ఆరాటం !

జోలిగిన్, హావ్‌చెకిన్ రచనలలో ప్రభుత్వాధికారులలో సర్వసాధారణంగా వుండే విపరీతపు అనుమానపు ధోరణిని విమర్శించారు.

పై రెండు పేర్కొన్న ఆదర్శాల కనుగుణ్యంగా రచింపబడ్డ రచనలు, అధికార వర్గాలను చీకాకుపరచినా, ఈ పత్రికపై చర్య తీసుకోలేదు. దీనికికారణం రచయితుల రచనా చమత్కృతి. తాము రష్యన్ పద్ధతులను, వ్యవస్థను నిరాకరించడం లేదని, ఆ వ్యవస్థ మరింత శోభాయమానంగా దీపిల్లడమే తమ ముఖ్యోద్దేశ్యమని వారు అధికార వర్గాలను సంతృప్తి పరచగల్గారు. వారి విమర్శ మర్మగర్భితమైనది. మరీ అంత బాహాటమైనది కాదు. కాబట్టి అధికారులు వారిని సాక్ష్యాలతో పట్టుకోలేపోయారు.

బాహాట విమర్శ :

నోవ్‌మీర్‌లో తరువాత ఎంతోమంది సాహసిక రచయితలు జిదనోవ్ ప్రమాణాలను బాహాటంగా విమర్శిస్తూ రచనలను చేయ నారంభించారు. ముఖ్యంగా స్టాలిన్ మరణాంతరం, రచయితలకు ఒక స్వేచ్ఛావాతావరణం లభించినట్లు వారు భావింపసాగారు. ఇటువంటి వారిలో ముఖ్యులు అలెగ్జాండర్ ట్వాడరోస్కి, వాల్డిమియర్ పోమరెన్ మొదలగువారు. తమ ప్రతిఘటను వీరు 'సాంస్కృతిక స్వేచ్ఛగా' వీరు అభివర్ణించారు. వీరి ముఖ్య ఉద్దేశ్యం, పశ్చిమ దేశాల నుండి వెలువడే సాహిత్యం ఏలాంటి ఆటంకాలు లేకుండా రష్యా రచయితలకు అందాలని వీరి ఉద్దేశ్యం

ఏదైనా రచనను, దాని విలువను నిర్ణయించేటందుకు సూత్రాలు, అధికార వర్గ నిర్ణీత సిద్ధాంతాలు కావు ఆ రచయిత నిజాయితి, సాహిత్యం ప్రజలలో చేతనత్వంతేవాలి, అయితే రచయిత ఒకే మోస్తరులో రచనలు సాగించాలి, విధిగా ఈ సిద్ధాంతాలను సమర్థించాలి అన్న వాదం, రచయితను, 'సత్యాన్ని' బహిర్గతంచేసే మహోన్నతమైన కృషి నుండి తప్పిస్తుంది. అది మానవాళికి తీరని ద్రోహం. తమ సమకాలీన రచయితలు 'సత్యాన్ని' నిర్భయంగా

ప్రజల ముందుంచడం లేదని ట్వార్‌డోస్కి బాధపడ్డారు. ''మన సాహిత్యంలో పాత్రలు వాస్తవికజీవితంలో అగుపడరు. ఈ పాత్రలు మాట్లాడవు కేవలం ఉపన్యాసాలు చేస్తాయి. ఇటువంటి కృత్రిమ సాహిత్యం పాఠకుని కుతూహలాన్ని ఉత్సాహాన్ని రూపుమాపుతాయి పాఠకులని ఆకట్టించుకొనే రచనలు చేయాలంటే, నిజ జీవిత సంఘటనలు ప్రతిబింబింపచేయాలి.''[3] కార్మికులపై అభిమానం, గర్వం వుండి తీరాలన్న పార్టీ సిద్ధాంతాలను ఆయన తిరస్కరించారు. కథానిక గమనంలో కాని, నవల నడవడంలో కాని ఇవి అడ్డువస్తే, వాటిని త్రోసిరాజనడానికి రచయితకు హక్కు ఉంది. కావాలంటే, పార్టీ సిద్ధాంతాలు తప్పులని పాత్రలలో చెప్పించే ధైర్యం రచయితకు వుండాలి. పార్టీ కేవలం సమకాలీన విషయాలపై రచనలు సాగించాలన్న యిచ్చిన ఆదేశాన్ని ఈయన తీవ్రంగా ఖండించారు పార్టీ విధానాలను భయభక్తులతో అనుసరించే రచయితలను దుయ్యబట్టారు. ''వారి రచనలు 'విజ్ఞాన సర్వస్వం'వలె పరిశ్ర, సాంకేతికజ్ఞానం, ఉపన్యాసాలు, సిద్ధాంతాలు అన్నింటితో నిండివుంటాయి. కానీ ప్రజలు, వారి జీవిత సంఘటనలు అగుపించవు. మానవ సహజమైన భావాలు — ఆవేశం, దుఃఖం, సంతోషం—వంటివి మచ్చుకైనా కానరావు. కాబట్టి ఈ రచనలు చదివితే 'ఏదో అసంతృప్తి'' [4] అని పేర్కొన్నారు.

ఈ 'సాంస్కృతిక స్వేచ్ఛ' పై ప్రభుత్వం తీవ్రమైన ఆంక్షలు విధించసాగింది. తనను సమర్థించే రచయితులలో పత్రికలలో ఈ నూతన పంథాపై విమర్శలు కురిపించసాగింది. ప్రభుత్వం ఒక ఆదేశాన్ని జారీచేస్తూ జబ్‌నోవ్ సూత్రాలు, రచయితలు విధిగా పాటించి తీరాలని లేకుంటే శిక్షార్హులౌతారని హెచ్చరించింది. నోవ్‌మీర్ సంపాదకులకు రాజీదులు పంపారు మరుదకు ప్రధాన సంపాదకుణ్ణి తొలగించి, 1954లో అరెస్టు చేసారు.

ఈ దెబ్బతో రచయితులలో ధైర్యం శీలాపడింది ఎంతో మంది అధికార వర్గానికి ప్రాతినిధ్యం కానటువంటి రచనలుచేస్తే మరికొందరు పాతకాలపు రాజు రాణి-మంత్రగాడువంటి కథలతో సంతృప్తిపడ్డారు.

అయితే త్వరలో నోవ్‌మీర్ తన పాత చైతన్యాన్ని పుంజుకొంది. నూతన సంపాదకుడైన కాన్‌స్టాంటిన్ సిమోనోవ్ అధ్వర్యంలో రచయితలు ఈసారు 'నైతిక మానవత్వం' అన్న అంశం క్రింద తమ స్వేచ్ఛా ప్రియత్వాన్ని ప్రదర్శింపసాగారు వీరికి భౌతిక సౌఖ్యాల కన్నా, పారలౌకిక ఆనందం ముఖ్యం. మానవుని నైతిక విలువలు పెంచాలి. ఇతరుల కొఱకు తన సుఖాన్ని త్యాగం చేసేటటువంటి త్యాగశీలునిగా తీర్చిదిద్దాలి. అతని ఆత్మానంద భరితుణ్ణి చేయాలి. ఇవి వీరిలక్ష్యాలు. ఈ లక్ష్యాలకు విరుద్ధంగా సమాజంలోవున్న శక్తులపై విరుచుకపడ్డారు. ''ఎన్నోసార్లు పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వవిధానాలు, ప్రజలను నైతికమార్గంనుండి తప్పిస్తున్నాయని. వీరు విమర్శనా బాణాలు వదిలేవారు. వీరి రచనల్లో పారలౌకిక పదజాలం ఎక్కువగ ఉండటంచేత, వీరి రచనలు మర్మగర్భితములై వుండటంచేత, అధికార వర్గాలవారు వీరిని త్వరలో పట్టలేకపోయారు

గ్రనిన్ వ్రాసిన ఒక కథానికలో. ఒక నవయువకుడు ఒక కర్మాగారంలో కొన్ని సాంకేతిక లోట్లను అవి ఏలాముస్వారో లన్న అంశాన్ని వివరిస్తూ ఒక వ్యాసాన్ని వ్రాస్తాడు. కానీ ఆ కర్మాగార పత్రిక అటువంటి ''వివాదాస్పద'' రచనను ప్రకటించడానికి నిరాకరిస్తుంది. సంపాదకులు, యువకునికి, నీకు నీ అభిప్రాయాన్ని ''వుంచుకోగల'' హక్కుంది అని సముదాయిస్తారు. నాలభిప్రాయాన్ని ''వెల్లడించ''లేనప్పుడు ఆ హక్కు ప్రయోజనమేమని, యువకుడు వాపోతాడు. ఆ రచనవల్ల పై అధికారులు కోపిస్తారేమో అని సంపాదకుల భయం. ఇటువంటి భయమనస్తత్వం, కపటత్వాన్ని పెంపొందించి, మానవునిలో నైతికస్థాయి దిగజార్చుతుందని గ్రనిన్ అభిప్రాయం.[5]

సంపాదకులే రచించిన మరో కథానికలో ఒక దిగంబర సూపర్ టీచర్ ఒక క్రొత్త నమూనా. స్టీలు పైపు తయారు చేస్తాడు. దాని గుణగణాలను, అధికారదర్పంతో మడిపడే అధికారికి విన్నవించుకొంటాడు ఇటువంటి ''వెధవలతో'' 'టైం వేస్టు' చేయడానికి ఆయన ఎవరు? కాని బడిపంతులు తన నమూనావల్ల దేశానికి ఎంతో మేలు జరుగుతుందని ఆరాటపడ్తాడు. ఈ వ్యక్తిత్వ చిత్రణ మరువరానిది. భౌతిక సుఖాలపైన మోజు, అధికార దురహంకారం, స్వార్థపరత్వం, గర్వం, వంటి దుర్గుణాలు మానవజాతికి చేటు వాటింపచేస్తాయని, మానవత, దయ, ధర్మం వుండాలని, రచయిత బడిపంతులుద్వారా పేర్కొంటారు. ''ఈ బడిపంతులును ఒక మంచివారుతోనో ఇంటితోనో కొనలేం. ఈయనకు తన నమూనాను ప్రదర్శించే స్వేచ్ఛ కావాలి. ఇటువంటివారే మానవత విలువలకు రక్షక పాలకులని''[6] రచయిత ప్రశంస.

త్వరలో అధికారవర్గం వీరిపై విరుచుకపడింది. 1956లో హంగేరీ, పోలెండ్‌లో జరిగిన విప్లవాలకు ఈ రచయితలకు కొందరు లంకె కట్టారు. ప్రధాన సంపాదకుని, రచయితల అరెస్టు, పత్రిక మూయుచేయబడడం జరిగింది.

1959లో పత్రిక ముద్రణ మరలా కొనసాగించినా, కేవలం అధికారవర్గానికు అనుకూలంగా ప్రవర్తించింది. కాని 1964, 66లో తిరిగి పత్రిక తన పాత స్థాయిని పొందడానికి యత్నించి ట్వార్‌డోవ్‌స్కి సంపాదకత్వంక్రింద సఫలమైంది. ఇప్పుడు చారిత్రాత్మక పరిశీలన లన్న అంశంక్రింద, విప్లవపు పూర్వ రష్యా సామాజిక స్థితిని విశ్లేషిస్తూ రచనలు అగుపడ్డాయి. అలనాటి గుణగణాలను పొగడడం, సమకాలీనసమాజంలో వాటిగైరుహాజరును

విమర్శించడంవంటివి జరుగుతున్నాయి. ఇది ఎంతకాలం సాగుతుందో చెప్పలేం. అయినప్పటికి నోవ్‌మీర్ పాత్ర సువర్ణాక్షరాలతో లిఖించవలసింది.

అథో జ్ఞాపికలు

1. Paul Corks, Robert V. Daniel, D, Nancy WhitterHeer. Dynamics of Soviet Politics P. 32 England 1976.
2. Ibid P. 32.
3. Pomeronsted. of Isklennasti P. 237-38.
4. Pravda May 25. 1954.
5. Hugh Mcleow warter N. Wickery - Year of Protest 1956 New York 1961 P. 256.
6. Paul Corks, Robert V. Doniel D. Nanecy Whitter Heer. Op. Cit P. 38.

బ్రతుకు

శ్రీ మిరియాల రామకృష్ణ

నిజం చెప్పడానికి
నా కెందుకు సిగ్గు ?

మానవరా విభాతంలో వికసించిన పువ్వుని !
విభాతానందంలో విప్పారిన నవ్వుని !

ఉషస్సు నాకు పరిచారిక !
అహస్సు నాకు అభిసారిక !

ఎక్కడిది
నా కేకాంతం ?

మానసాకాశంలోని ధ్రువతారని !
మారుతప్సుతిలోని తొలినీవని !

మేఘాల రంగులన్నీ నాకు వర్ణాలు !
కెరటాల చప్పుట్లు నాకు శబ్దాలు !

నే నెరుగనే ఎరుగనిది
నిరాశ ఒక్కటే !

బ్రతుకుపాటలు పాడుకునే పక్షినికదా !
ఎగరడం ఎరిగిన బ్రతుకుని కదా !

గుండెలోనే నాకు ఏడురంగుల విల్లు !
ఘనమందే నాకు స్నేహం దేహం !



శ్రీ పిశ్కాల శేషాచార్యులు

అమరశేషము

సంస్కృత నిఘంటువులలో అమరసింహ విరచితమైన అమరకోశమని చెప్పబడుచున్న నామలింగానుశాసనమునకున్న ప్రచారము మఱి యే నిఘంటువునకును లేదు. ఇందుకు కారణము — అది నాతి సంక్షేప విస్తరమగుటయే (అనగా మిక్కిలి చిన్నది మిక్కిలి పెద్దది కాకుండుటయే). ఇది తనకు ముందున్న పెక్కు నిఘంటువులను చదివి సంగ్రహించి వ్రాయంబడినది. ఈ విషయమందు మొదటనే తెలుపబడినది.

"శ్లో॥ సమాహృత్యాన్యతంత్రాణి సంక్షిప్తైః ప్రతిసంస్కృతైః।
సంపూర్ణముచ్యతే వర్గైర్నామలింగానుశాసనమ్"॥ అని.

ఇతర నిఘంటువులను ప్రోగుచేసి (అనగా సంపాదించి చదివి) సంక్షేపము చేయబడి ప్రతి సంస్కృతములైన వర్గములతో నిండిన నామలింగానుశాసనమను గ్రంథము రచింపబడుచున్నది అని యర్థము. ప్రతి సంస్కృతము అనగా ఒక్క ఉదాహరణము — విష్ణువు పేళ్లలో ప్రఖ్యాతమైన హరి శబ్దమును చెప్పక ఆయనభార్యయైన లక్ష్మియొక్క పేళ్లలో "కమలా శ్రీర్హరిప్రియా" అని చెప్పినందున విష్ణువునకు హరి నామమున్నట్లు చెప్పినట్లైనది అని వ్యాఖ్యాతలు తెలిపియున్నారు. ఇట్లు ప్రతి సంస్కృతము చేయుటచేత చాల వ్యక్తవ్య విషయములు వదలివేయబడినవి. చెప్పిన పేళ్లలో అనేకములైన పేళ్లు చేరలేదు. ఆ చెప్పని వాటి వద్దను వాటికి చెందిన పలు అంశములు పరిత్యక్తములైనవి. ఉదా — స్వయముగనే దేవతలుగా బుట్టినవారు. కర్మ దేవతలైనవారు, గంధర్వులు సిద్ధులు సాధ్యులు విద్యాధరులు అప్సరసలు ఏడుగురి పడమటి గాలి మలయానిలము మున్నగాగల దేవరా జాతి విశేషములు, నక్షత్రములు రాసులు మంచినీళ్లు మంచి నీళ్లు ఉప్పునీళ్లు వేడినీళ్లు కాగి చల్లారిన నీళ్లు పెక్కు జలజంతువులు, ఇంటి అల్లు అలుమిలి గూడు పురావి దీగెలు చిలుకు దూలము, సుద్ద సున్నపుదా, పలకరాళ్ళు, కంకరరాళ్లు, కమలఫలపు చెట్టు జామచెట్టు పంపర పనస తులసి చేమంతి బంతి ద్రాక్ష పన్నీరు మనోరంజనము జమ్మి చేమగడ్డలు గెనుసుగడ్డలు మున్నగు లనేకరకాల గుల్మకట్టిన తృణ జాతులు తాటి, అరటియొక్క పీచునె మండ రెబ్బ పంగ వాటి వంటివె పనసతొన మున్నగు వృక్ష జాతులు వృక్షాంగ విశేషములు, గాజు పురుగు లద్దెపురుగు నల్లపురుగు గోమారి బుడ్డగొణుచు, ఉమ్మిమూలుగు ఓకరింత కేకరింత కణత కొనచెవి గూబ ముక్కు దూలము (ఎముక) కొండనాలుక గొంతు బొంగురు షడ్డకుడు (తోడియల్లుడు) వియ్యంకుడు వియ్యపురాలు వియ్యాలు మధుపర్కాలు (పెండ్లి కొడుకుకు పెండ్లి కూతురికి కట్టబెట్టెడు పసుపు నీటిలో దడిపి యెండవేసిన క్రొత్త బట్టలు) దుప్పటి శాలువ మంచపు పట్టెలు కోళ్లు ములక నవారు, అంబారి ఏనుగు దంతములకు తగిలించెడు వెండి బంగారముల పొన్నులు గుఱ్ఱపు వీపుపై వేసెడు జీను (మెత్త) దాని నెక్కుటకు దాని కిరుప్రక్కల సమర్చి వ్రేలుచుండు ఇనుపకడియములవంటిమెట్లు పెడె, సజ్జలు జొన్నలు వేరుసెనగ గాదె గోతము బొట్ట పాతర కూలు గూడ బిందె చెంబు రాగి కాము తట్ట మిళ్లి, బాణలి అట్లకాడ లప్పడాలు వడియాలు మణుగుపూలు పూరి కర్జకాయ (దీనినే ఖర్జకాయ లనెదరు) బెల్లము కలకండ బీడి (ముంత) మామిడిపప్పు ముద్ద (ముంత) కర్జూరము ఉప్పు సుత్తె బాడిసె చొక్కాన చేద్రవాడు మేక మెడ చన్నులు మున్నగు అనేకములైన అంగములు, మానవుల వరుసలు పలురకములైన ఇతరకరములు వంటకములు ఆదిగాగలవియు వదలివేయబడినవి. చెప్పవలసిన ఇన్నిటిని చెప్పక వదలుట అమరసింహుని యంతటి విజ్ఞాన ఖని తెలియకయుండె, ఎఱిగియుండి వానికాదు. అన్నిటిని చదివినచో గ్రంథము చాల పెరిగి విద్యార్థులకు వంటపట్టదు పాఠకులకు కలిగాక పోవునెడి యుద్దేశముతో చెప్పబడవయ్యె. అమరసింహానకు ముందటి నిఘంటుకర్తలు వెనుకటి నిఘంటుకర్తలు ఆలోచించి ఆలోచించి చాల వరకు సకల విషయములను వదలక నుడివిరి కనుక వారి గ్రంథములు చాల పెరిగి అమరకోశపు సాంఖ్యము చెంది అవి ప్రచారము కోల్పోయినవి. ఈ విషయము సంతయు అమరకోశము తృతీయ కాండములో ఉంగాదిసంగ్రహ వర్గ వద శ్లోకమునకు ముందు "శేషం తు జ్ఞేయం శిష్టప్రయోగత " అనెడి శ్లోక పాదముయొక్క టీకా సర్వస్వ వ్యాఖ్యానములో తెలుపబడినవి. వ్యాస విస్తర భీతిచేత నా పంక్తులను వ్రాయుమానితిని.

అమరకోశములో బొత్తిగ చెప్పక వదలబడిన కొన్ని, కొన్నిచ్చు, బాడిద మున్నగు కొన్నిటికి మాత్రము అధిక పాఠములలో పేళ్లు చెప్పియున్నారు. ఈ యధిక పాఠములు బహుమంది పండితులు ఆ గ్రంథము వ్రాసుకొనునప్పుడు ఆలోచించి వ్రాసి చేర్చినవి కాన, ఆ అధిక పాఠములు అన్ని గ్రంథములలో నుండక కొన్నిటిలో కొన్ని అధికముగా నుండును.

పలుతావుల పలు ముద్రాశాలలలో భిన్నభిన్న కాలములయందు వేరు వేరు పండితులచేత పరిశోధితములై ముద్రింపబడిన అనేక

అమరకోశములయందలి ఇ య్యధిక పాఠముల నన్నింటినిఁ గూడిన ౧౨౦కి ఎక్కువ శ్లోకములు దొరకుచున్నవి. వీటినన్నింటిని ఒక్క చోట చేర్చి తెలుఁగు టీకతోఁటి ముద్రింపించినచో సంస్కృత భాషాభ్యాసకులకు చాల ఉపయోగముగ నుండును. ఈ కార్యము త్వరలో నాచేతనే నెఱవేఱఁ గలదు. అప్పుడు నా రచితములైన మఱి కొన్ని యధిక పాఠములు అమరకోశమునకు అకారాది వర్ణ క్రమమున నా రచించిన విషయ సూచికయునందు చేర్పఁబడఁగలవు.

అమరకోశ మిట్లు సంస్కృత భాషాభ్యాసమునకు చాల ఉపయుక్తము. ఐనను అందు పలు విషయములు లేకుండుట లోపమని దానికి శేషము లేర్పడినవి. అవి అమర శేషములు త్రికాండశేషము. వీటిలో రెండవది త్రికాండశేషము పురుషోత్తమదేవుఁ డనెడు కవి రచించినది. దీని రచనోద్దేశముచేత నిందలి ప్రథమకాండము ప్రప్రథమున మంగళాచరణానంతరమునఁగల

శ్లో॥ అలౌకికత్వా దమరస్య కోశే న యాని నామాని సముల్లిఖేత
విలోక్యతై రన్యధునా ప్రచార మయం ప్రయత్నః పురు
షోత్తమస్య॥ ౨

అను శ్లోకము ననుసరించి అమరకోశ పరిత్యక్తములైన పదములను ప్రప్రవచించుటయే కనుక అమరశేష మనఁదగును.

ఇది అమరకోశమునకు శేషముగ రచితము కనుక దానిమాదిరి గానే మూఁడుకాండలు వాటిలో నా పేరటి వర్గలే కలిగియున్నవి.

“శ్లో॥ వర్గక్రమ స్తథా నామలింగయో స్తూపదేశతా
పరిభాషాదికం సర్వ మత్రా ఽప్యమరకోశవత్.”

ఇది చాల చక్కని నిఘంటువే కాని అమరకోశములో చెప్పిన వాటికేఅమరములోని పేళ్ళకొన్నియు,అమరకోశత్యక్తములైన మఱి కొన్ని పేళ్ళను, అమరకోశములో బొత్తిగ చెప్పఁ కొన్నిటికి మాత్రము పేళ్ళు చెప్పఁబడియున్నవి అమరకోశోక్తములైన వాటికి అమరకోశమునందలి పేళ్ళను కూడా కలిపి నుడువుట అవి దాని పేళ్ళు అని తెలియుటకు అని అనుకొనవలెను. సంస్కృతాంధ్ర గ్రంథ ప్రచురణములో లబ్ధప్రతిష్ఠులైన చెన్నపురిలో బ్ర. శ్రీ. వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారు శ్రీ శేషాద్రి రమణ కవులు విరచించిన ఆంధ్రటీకతోఁటి 1928 సం॥రములో ముద్రించిన త్రికాండశేషముయొక్క ప్రకటనములలో—“త్రికాండశేషము, సటీకము. ఈ గ్రంథమునకు “అమరశేషము” అనియు నామాంతరము గలదు. ఇత్యాధికముగఁ బ్రకటించి యున్నారు. దాని రచనారీతినిఁ బట్టియు, అందలి ౧వ కాండము స్వర్గ వర్గములోని “పూర్వోక్తమైన “అలౌకిత్వా దమర...” ఇత్యాది శ్లోకమునుఁబట్టియు నది అమరశేషమని చెప్పఁదగినదే కాని త్రికాండశేషము వేరే. అమరశేషము వేరే. రెండును వేరు వేరు గ్రంథములు. భిన్నకర్తృకములు. వ్యాఖ్యానములలో వీటిలోని శ్లోకముల నుదహరించిన తావుల “ఇతి త్రికాండశేషః, ఇ త్యమరశేషః” అని వేరు వేరుగ వ్రాయుటచేత. ఇది త్రికాండశేష స్వరూపము ఇఁకను అమరశేష గ్రంథమునుఁ గూర్చి చర్చించెదను—

వ్యాఖ్యానములలో అమరశేషము—శ్రీమద్రామాయణము రఘువంశము మొదలైన కావ్యములకు పూర్వులు రచియించిన వ్యాఖ్యానములలోను అమరకోశముయొక్క ప్రసిద్ధవ్యాఖ్యానమైన శ్రీ లాక్షపాక తిరువేంకటాచార్య విరచిత గురుబాల ప్రబోధిక”యను తెనుఁగు వ్యాఖ్యయందునుఁ గొన్ని తావుల నిందునుంచి ప్రమాణ శ్లోకములు శ్లోకపాదములు నిచ్చి “ఇత్యమరశేషః” అని యుదాహృతమై యున్నది. మా తండ్రిగారు విద్యారణ్య పంచానన విద్యావాచస్పతి కీ. శే. శ్రీమాన్ విక్రాల రామచంద్రాచార్యులవారు వారి విద్యాభ్యాస కాలమునందు శ్రుతి శ్రౌత జ్యోతిష మీమాంసా న్యాయ, పురాణ ధర్మశాస్త్రాది గ్రంథములయొక్క పూర్వ వ్యాఖ్యానములలో నుదాహృతములైన శ్లోక—వాక్యములను వేరువేరుగ ప్రతిశాస్త్రములోను ప్రతి గ్రంథమునుండి యెత్తి వ్రాసుకొనిన పెద్ద వ్రాఁత పుస్తకములయందు నిఘంటువులకుఁ జెందిన పుస్తకములలో “అమరశేషః” అను శీర్షికక్రింద ౭౮ శ్లోకములవరకు వ్రాసియున్నారు. వాటిలోఁ గొన్నిటిని వ్రాసెదను.

ఆశీ రురగదంష్ట్రాయామ్—జన్యా మాతృవయస్యాం—మహాన్త విదగ్దే వాణిన్యా—ప్రాణో ఽపాన స్సమానశ్చ—ఉచత్వా వ్యవరజో జీవః — జవో వేగిని వేగే స్యాత్ — చక్రధారా ప్రధిర్నేమిః — తులా సామ్యేస్తంభపీఠే—అగ్రమాంసే ద్వయోర్వృక్కః—అస్రఅస్రశ్చ పుంల్లింగే రోదనే త్వస్ర మస్రుచ — వైఫల్యేఽపిచ విశ్లేషే విధురం విక్లబే త్రిషు — ఇత్యాదిగ.

(ఆ పూర్వ వ్యాఖ్యానములలో నుదాహృతములైన ఆ యా శ్లోకములు ఏ రచయిత రచియించిన ఏ గ్రంథముయొక్క ఎవరు విరచించిన వ్యాఖ్యానములో ఏ భాగములో నెన్నివ శ్లోకము (లేక సూత్రము) యొక్క వ్యాఖ్యానములో నిది యైనదియు అన్నియు నిశదముగ వ్రాసియున్నారు.)

వ్యాసములలో అమరశేషము — భారతి 1969 సం॥జనవరి నెల సంచికలో ప్రచురింపఁబడిన శ్రీ గొల్లాపిన్ని వాసుదేవశాస్త్రుల వారు వ్రాసిన “నిఘంటువులు” అను వ్యాసములో (8వ పుట ౨వ దొంతి (నిలువు చాలు) లో ౨౪ ౨౬ పంక్తులలో — “అమర నిఘంటు శేషము” అను నిఘంటువు అమరమును పోలియున్నది. కర్త అమర సింహుఁడే. — అమరము యొక్క పూర్వోక్తమైన గురుబాల ప్రబోధికా ఖ్యాంధ్ర వ్యాఖ్యానములో (3 కాండే సంకీర్ణ వర్గే “శ్లో॥ కర్మ క్రియా...౧, లింగాది సంగ్రహ వర్గే “స్త్రీ నపుంసకయో రితి ౪౧ శ్లోక వ్యాఖ్యానే ఇత్యా ద్యనేక స్థలములలో) శేషకార ఆహ, అత్ర శేషకారః” అని అమర శేషకారుఁడు నుడివెనని యున్నది. ఇట్లనుటచేత అమర శేషకారుఁ డమరకోశ కర్తయైన అమరసింహుఁడుకాఁడనియు నతఁడన్యుఁడనియు భావింపనై యున్నవి. అమరకోశము నానార్థ వర్గములోని కొన్ని శ్లోకముల గురు బాల ప్రబోధికయందు “ఇతి శేషః అని యుదాహరింపఁబడిన

గ్రంథము పూర్వోక్తమైన "శేషకార" పదములోని శేషము అమర శేష వాచకము అని పెద్దలు తెల్పెదరు. సందర్భమును జూచినను అట్లే యున్నది. ఇతను క్యాటలాగులలో అమరశేషము అమరశేష అని పేరు కల ఒక నిఘంటువు తెలుగు లిపిని చెన్నపట్టణము (మద్రాసు)లో అడయార్ లైబ్రరీ వారి 1910 సంవత్సరములో ఇచ్చిన సంస్కృత ప్రాకృత లిఖితగ్రంథముల పట్టికలో కనుపించు చున్నది. కాని ఆ క్యాటలాగులో దాని రచయిత పేరు లేదు. దీని రచనా ప్రకార మెట్టిదో ?

నామ లింగాను శాసనము అనగా అమరకోశము మాదిరి ఈ యమర శేషము కూడా తెలుగు టీక తోటి ముద్రితమైనదేమో చూచెదమని 1944వ సంవత్సరములో పండిత పామర మనోరంజక సారస్వతలోక వార్తా సమలంకృత భారతి శ్రీ మదాంధ్ర వర్ణ క్రమ ప్రచండ సంపాదకరా సంప్రాప్త విశదతను యశోధర విరోధిత దర విశాలదాయకమైన విఖ్యాత దేశోద్ధారక భాషోద్ధారక శ్రీ కాశీ నాథుని నాగేశ్వరరావు పంతులవారిచే ప్రకటింపబడిన ఆంధ్ర వాఙ్మయ సూచికలో చూచితిని కాని అందు నామలింగాను శాసనము నానార్థ రత్నమాల విశ్వనిఘంటువుల పేర్లు కలవు కాని దీని పేరు కానరాలేదు. చౌఖంబా సంస్కృత సీరిజ్ ఆఫీసు, వారణాసి-1 వారి 240 పేజీలు కల సంస్కృత గ్రంథముల సూచిక (క్యాటలాగు)లోను దీని పేరు లేదు. ఇందు రచితమైన గ్రంథములో చెప్పక వదలిన యంశములను చేర్చి చెప్పుచు ఆ గ్రంథకర్తయే కాని మరియే యన్యుడు కాని శేషమును రచియింపవచ్చును.

అయినను అమర శేషమును గురించి యింతటి ప్రసంగమేల నన్నచో ? అమరశేషము నెరింగినవారు తద్రచయిత పేర్లను, దానిలోని కాండ వర్గాది విభాగముల పేర్లను శ్లోక సంఖ్య వగైరాలను, భారతీ మూలమున దేశమునకు తెలుపుడు రేఖా మూలమున నాపేరునకు ప్రత్యేకముగ తెలుపగోరుచున్నాను. ఇదివరలో అమర నిఘంటువు శేషమును భారతీ మూలమున తెలుపక పోయిన శ్రీ గొల్లాసిన్నినారు దానికి తెలుగు టీకా టిప్పణము రచియించి ముద్రింపించి సంస్కృతభాషకు మహోపకారము చేయుచు నాకు పై విషయములను తెలుపుడు సురరాజును వ్రాయించెదరని యెదురుచున్నాను.

[రచయిత చిరునామా: కె. వీరయ్య, వయా సింగరాయకొండ, ప్రకాశం జిల్లా]

ద్వీపాంతర వాసం

శ్రీ పసపూలి

వొయ్యారంగా మారిపోతున్నప్పుడు
నా భావాలు అనుభవించే బాధ నీ కర్థమౌతుందా
అందుకే వచ్చేశా ఈ పాడుబడ్డ బడిలోకి
నాతో ఉన్నవాణ్ణి బహుశా నువ్వు ఆశ్చర్యంగా చూస్తావేమో..

వాడు కాదని చెప్పవచ్చు వ్యభిచారి...తాగుబోతు
యెవడైనా కావచ్చు కానీ
నాలాగే తల్లీ తండ్రీ ఉన్న అనాథ
వాడు మాట్లాడితే గాలి ప్రవహించినంతయినా
శబ్దం కాదని అనుకోకు
పెడకాలం సహాయంలో మనిషి

మనిషిని ప్రవేశించలేడని తెలుసుకో.
ఆ యేకాంతంలో చుక్కల నక్షత్రాలని మింగుతున్నప్పుడు

నేను ప్రశ్నల తెరవాసెన్నో
నేనా సముద్రయానమైతే చెయ్యను కానీ
నా దేహం...నా దేహం యిలా పడున్నప్పటికీ
పద్మాసనంలోనే ఉన్నట్లు గోచరిస్తుంది.
అప్పుడది భావాల్ని కాదు
సదాంకు అతీతమైన
పరిమళాల్లాంటి
అనుభూతుల్ని మాత్రమే ప్రసవిస్తుంది.

శ్రీ ఇంగువ కార్తికేయశర్మ

గుంటుపల్లి గుహలు బ్రాహ్మీ శాసనములు

గుంటుపల్లి కొండలు జీలకర్రగూడెము గ్రామ పరిధిలో నున్నవి. ఈ పల్లె కామవరపుకోట తాలూకా, పశ్చిమ గోదావరి జిల్లా, యేలూరు పట్టణమునకు 45 కిలోమీటర్లు పడమరగా మంచి రోడ్డు మార్గమున నున్నది.

గుంటుపల్లి గుహలు ప్రాచీన 'గుహాశైలి' వాస్తువునకు చాల ప్రసిద్ధి గాంచినవి. ఇవి బీహారు ప్రాంతంలోని మౌర్యరాజుల కృతులైన 'బారబారు' లో మాశబుషి మున్నగు పెద్దగుహలతో పోల్చదగినట్టివి. ముఖ్యముగా నిప్పటి పూర్ణాకారపు చైత్యము (మొదటిగుహ) యపురూపమైన ప్రాచీన వాస్తుశైలీకృతము ఇదియును గాక రాతిలో తొలచిన విహారములు, భిక్షుల నివాసమునకై వారి వస్తుసామగ్రి నుంచుకొనుట కనువుగా చిన్న గూడులు. ప్రక్కనే శయనించుటకు వీలుగా తలవైపు దిండుతోసహా యెత్తుగా నున్న అరుగులను రాతితోనే మలచిరి. తూర్పు ముఖద్వారములుగల్గి చైత్యతోరణములతో నొప్పారుచున్నను లోన యెట్టి శిల్పములు కానరావు. ఒకేపంక్తిని కొండయంచునే ఉత్తర—దక్షిణముగా నైదు విహార సముదాయములు గలవు. (చిత్రము—1) ఉత్తరముగా రాతి యంచునే మరి కొన్ని గుహలు యడవి మధ్యలో దృశ్యమైయున్నవి.



చిత్రము—1 : బౌద్ధ విహారములు

శిల్పన్నియు హీనయాన బౌద్ధ సాంప్రదాయమునకు చెందినవిగా భావింపనగును. రెండిటికి యిచ్చట రాతి యిటుకలతో నిర్మితములైన ఉద్దేశిక స్తూపములు, విహార సముదాయములు మెండుగా కాన వచ్చినవి. ఇటీవల కాలములో (1974-76), నిర్వహించిన పరి శోధన ఫలితముగా యిచ్చటి పురావస్తు క్షేత్రము సరిక్రొంతగా ప్రకాశించుచు వెలుగుచున్నది.

మొట్టమొదట 1886లో ఈ గుహాలయములను శ్రీ రాబర్ట్ సివెల్ దర్శించెను. ఆయనదే యొక గుహపైని క్రీ. శ. 1వ శతాబ్ది శాసనమున్నట్లు గూడ ప్రకటించినాడు. ప్రస్తుతమీ శాసన మెచ్చటను కానరాదు. తదనంతరము 1889లో అలెగ్జాండర్ రీ కొన్ని యిటుక స్తూపములను, శిలామండపమును వెలికితీసెను. 1916లో లాంగ్‌హర్స్ట్ మరొక సోపాన శిలపై బ్రాహ్మీశాసనము నొక దానిని కనుగొనెను. 1968లో 'కీర్తిశేషులు డాక్టరు నేలటూరు వేంకటరమణయ్యగారు, శ్రీ రావిప్రోలు సుబ్రహ్మణ్యం గారితో కలసి ఈ ప్రదేశమును పునఃపరిశీలించిరి. వీరు కనుగొన్న మండప స్తంభశాసనము యాంధ్రదేశ చరిత్రకెంతో ముఖ్యమైనది.



చిత్రము 2 : శాసనము 1 కళింగరాజు శాసనములు

స్తూపావశేషములన్నింటిని త్రవ్వివేసి, పునాదులు గట్టిపరచు ఉద్దేశ్యముతో కొంతమేరకు యిటీవల మరల త్రవ్వకములు కొనసాగించితిమి. ఇట్టి కార్యక్రమములో నుండగ కొన్ని పురావస్తు శాసన శిలలు, స్తంభములు, కళాఖండములు, పేటికలు బయటకు వచ్చినవి. (చిత్రము 4). ఈ వ్యాసమున వీటినన్నింటిని పరిశీలింప నుపక్రమింతును. ఆంధ్రపథమున యింతటి ప్రకృతి సౌందర్యము కల్గిన విశాలమైన గుహా-విహార చైత్యములు, రాతి-యిటుక నిర్మితములైన స్తూపములు, మండపములు క్రీ. పూ. 3వ శతాబ్ది నుండి క్రీ. శ. 10-11వ శతాబ్దివరకు నిత్యప్రసిద్ధములుగా నుండినవి మరెక్కడను కానరావు. ఈ కొండరాయి శిథిలమైపోవు చున్నది. చైత్యద్వార భాగ చాలవరకు ఛిద్రమైనది. వీనిని కాపాడుటయేగాక, వీటిని గూర్చి పూర్తిగా తెలుసుకొనుట యెంతేని యవసరము. ఈ క్రింద పేర్కొన్న శాసనములు పెక్కు నూతనాంశముల తెలుపుటయేగాక, ఆంధ్రదేశ చరిత్రకు క్రొత్త వెలుగును ప్రసాదించుచున్నవి.

I బ్రాహ్మీశాసనములు :
క్రీ.పూ. 2-1వ శతాబ్ది

1 కళింగరాజు సగిన మండప స్తంభశాసనములు:

ఒకే శాసన పాఠము నాలుగు పలకలుగల మండప స్తంభము లపై యుండుట విశేషము. శాసనము క్రింద ఇంద్రదార పద్మ మున్నది. శాసనలిపి క్రీ. పూ. 1వ శతాబ్దినాటి బ్రాహ్మీ భాష [illegible] ప్రాకృతము. [illegible] కాలమును [illegible] ప్రశస్తి శాసనమును [illegible] యుండుట [illegible]. లబ్బె క్రీ. పూ. 2వ శతాబ్ది [illegible] నానాఘాట్ శాసనమునకు దగ్గరగా యున్నవి [illegible]. [illegible] ల, వ, వ్రాతతీరు [illegible]



చిత్రము-3 : శా స న ము - 2

నున్నది. ఈ శైలి గుంటుపల్లి ప్రత్యేకతగా చాల కాలము వరకు కలో నుండినటుల మరికొన్ని శాసనములవల్ల కూడ తెలియుచున్నది. ఈ భాషయందు ఘ, గ, ఖ, త, ద,లకు భేదములేదు. ఉదా॥ మేఘవాహన–మేఖవాహన; సాత, సాద; పరిస–పరిస మొదలగునవి

శాసన పాఠములు

(చిత్రము-2)

1

1. మహా రాజస కలిగ మహి
2. సకాధిపతిస మహామె
3. ఖవాహనస సిరిసద
4. సలేఖ కస చూలగో
5. మసమడపో దానం

2

1. మహారాజస కలిగా
2. మహిస కధి పతిస మ
3. హామెఖ వాహనస
4. సిరిసదసా లేఖ
5. కస చూలగో మస మఢ
6. పో దానం

3

1. మహారాజస కలిగ మహిస క
2. ధిపతిస మహామేఖ వాహ
3. నస సిరిసదస లేఖ
4. కస చూలగో మస మం
5. డపో దానం.

4

1. మహారాజస కలిగమహి
2. . సకాధిపతిస మహా
3. మేఖవాహనస సిరిస
4. దస లేఖాకస చూలగో
5. మస మడపో దానం.

అర్థము

ఈ మండపమును (స్తంభమును) దానము చేసినవారు మహారాజు కళింగ–మహిషికాధిపతి మహా మేఘవాహన కులమునకు శ్రీ సాద. దీని లేఖకుడు (అనగా వ్రాసినవాడు) చూలగోమ.

శ్రీ సుబ్రహ్మణ్యం గారిపాఠమున పంక్తులు 4-5లో గల సిరిసదసలేఖకస యను పదమును సిరిసదస లేఖకస యనిచదివి



చిత్రము-4: శాసనములు లభించు ప్రదేశములు

ప్రభువుయొక్క సందేశముల వ్రాయువానిగా పేర్కొనిరి. ఇట్లే శాసనము కళింగ చక్రవర్తి ఖారవేలు దానగినట్టిదిగాను, యీతని లేఖకుడు క్షుద్రగోష, మండపదానము గావించినట్లు చెప్పిరి. ఇది సరిగాదు ఈ మండప దానమును గావించినది కళింగ–మహిష రాధిపతి, మహా మేఘవాహన కులజుడైన సిరిసాద. (సాత). శాసన లేఖకుడు క్షుద్రగోష. కళింగ నృపుడైన ఖారవేలు ఇచ్చట పేర్కొనబడలేదు. పైగా ఖారవేల చక్రవర్తి కళింగాధిపతిగా మాత్రమే ఖ్యాతి బొందియుండెను. శ్రీసాత రెండుదేశముల (కళింగ మరియు మాహిషకు) కధిపతి. ఈతడు ఖారవేలుని తరువాతివాడై యుండవచ్చును. యేలనన ఒరిస్సాలోని ఉదయగిరి గుహలలో నొక టైన యేనుగు గుహాప్రశస్తి శాసనమున ఖారవేలుని దండయాత్ర ప్రశంస కలదు. ఈతడు రెండవరాజ్య సంవత్సరమున సాతకర్ణిని నిర్లక్ష్యం చేస్తూ (అవితయితా సాతకర్ణిం) పడమటగా తన సైన్యములను పంపినట్లున్న, అవి కణ్ణ–బెణ్ణ నది చేరి మూషిక నగరమును ముట్టడి చేసినట్లు తెలుపుచున్నది. ఈ పడమట దండ యాత్ర కోస్తా ఆంధ్రము నుద్దేశించినదనియు, క్రీ.పూ. మొదటి శాతకర్ణి సామ్రాజ్యము శ్రీకాకుళమునుండి – ధనకటక ప్రాంతము వరకు విస్తరించియుండెనని శ్రీ సుబ్రహ్మణ్యంగారు, మరికొందరు చరిత్రకారుల వాదన. కాని నానాఘాట్ శాసనపు శాతకర్ణి పూర్వీకులెవ్వరు కోస్తా ఆంధ్రమును పాలించినట్లు ఆధారములులేవు. అంతియని సాతవాహనులు ఆంధ్రులు కాదని, ఆంధ్రదేశమును మొదటినుంచి పరిపాలింపలేదని కాదు. తెలంగాణములోని కరీంనగరు, ఖంభము, వరంగల్లు, మెదక్, హైదరాబాదు, నల్గొండ ప్రాంతములు మొట్టమొదటినుంచి సాతవాహన సామ్రాజ్యములోని భాగములుగా నుండినటుల శాసనములు, నాణెములవలన నిర్ధారణముగా తెలియు చున్నది. ఇటీవల శ్రీ పరబ్రహ్మ శాస్త్రిగారు సాతవాహన రాజ్య వంశ స్థాపకుడైన శ్రీముఖుని (సిముఖ) నాణెములు, శాసనముల కొన్నింటిని కరీంనగరు జిల్లాలోని 'కోటిలింగాల' గ్రామము వద్ద కనుగొనిరి. కోస్తా ఆంధ్రమును ఈ కాలమున సాతవాహనులు పాలించినటుల యాధారములు కలవు. భట్టిప్రోలు శాసనములందు రాజు కుబీరక యట్టివాడు. ఖారవేల వంశజుడైన యీ శాసనకర్త శ్రీసాత మహిమెకడుగా తోచును. శ్రీసాత యను నామ మున్నంత మాత్రమున సాతవాహన రాజుల కితడు బంధువుగా భావింపనక్కర లేదు. ఇట్టి వ్యక్తి నామములు – 'నామ' నామమువలె రేక వంశ నామములైన 'వాహన' శబ్దముల బోలునట్టివి యీకాలమున చాల వాడుకలో నున్నట్లు యితరత్ర శాసనముల వలన తెలియుచున్నది. ఈ చిన్నరాజుల పాలనలోనున్న ఆంధ్ర ప్రాంతముపై మహారాజ ఖారవేలుడు కన్నువేసి గట్టిగా ప్రయత్నించినటుల మనకు ప్రబల సాక్ష్య మున్నది. తన 12–వ రాజ్య సంవత్సరమున వ్యాపార కేంద్రమైన పిథుండ్రను పట్టుకొని నాశనము గావించెనని చెప్పి నాడు. ఈ పిథుండ్ర మైసోలియా (మచిలీపట్టణము) దగ్గరగా నున్న రేవు పట్టణముగా టాలెమీ తెలిపినాడు. మరల 13వ రాజ్య సంవత్సరమున ఖారవేలుడు జైన లింగముల క్రోడీకరణ చేయుటయేగాక, అర్హతుల నివాసమునకై మండప విహారాదుల గావించుటకు పూనుకొన్నట్లు చెప్పినాడు. ఆ తర్వాత నీ చేదివంశ నృపునిగూర్చి మనకేమియు తెలియదు. తన పూర్వీకుడైన ఖార వేలుని యిదిమతముల రెండింటిని (అనగా ఆంధ్రమును జయించుట, జైనమును వ్యాపింపచేయుట) శ్రీసాత నెరవేర్చినట్లు కళింగ-మహిషాధిపతిగా చాటుకొన్నాడు.

ఈ మహిషిక దేశమెక్కడో తెలుసుకొనవలసియున్నది. మహిష మండలము మైసూరు, దక్షిణ– హైదరాబాదు ప్రాంతముల నున్నటుల పలువురు చెప్పియున్నారు. ఇకమాన మహిష రాజులు నేలించుటవలన కాబోలు యీ ప్రదేశమునకీ నామాంతరము కల్గ నట్లున్నను, ఇటీవల నాణెములు మెదక్ – ఖమ్మం – మహబూబాబు నగరు, కరీంనగరులందు లభ్యమగుటచే నిదియే వారిదేశముగా ఖ్యాతి గాంచినటుల శ్రీ మిరాషిగారు తెలియజేసిరి. కానిమన శాసనము



చిత్రము–5 : శాసనము – 3

బట్టి మహిషకదేశము కళింగమునకు వేరువగనే యుండవలెను. పాలించిన రాజవంశమునుబట్టి నామము వచ్చినటుల తోచదు. టాలెమీ పేర్కొన్న "మైసోలియా" రాజ్యము మహిషకదేశముగా గుర్తింపసగును దీనికి రాజధాని పితుండ్ర. మహిషకాధిపతి శ్రీ సాతబహుళ నీ పితుండ్రను దునిమి జైనమును కొంతవరకు వ్యాప్తి జేసెను. ఈ పితుండ్రను— పృధు అండగానన్వయించి గుమ్మడపల్లి— గుంటుపల్లిగా శ్రీ సుబ్రహ్మణ్యంగారు తేల్చిరి. ఇదియెంతమాత్రము సమంజసముగా తోచదు. గుంటుపల్లి ప్రాచీననామము మహానాగ పర్వతముగా శాసనములవలన నిరూపితమైనది. మరియు నీ కాలమున జైనము ఆంధ్ర ప్రాంతమును, భౌద్ధమువలె యాకర్షించినటులకానరాదు.

2. సోపాన శాసనము:

(చిత్రము – 3)

ఈ శాసనము తూర్పుభాగమునునున్న ఇటుకవృత్త చైత్యమునకుపోవు మెట్లపైనున్నది. దీనిని 1916లో లాంగ్ హర్స్టు కనుగొనెను.

పాఠము :

ధేరస భయతనదస అంతేవాసిక
సానాదసదానం సోపానమ్

ఈ సోపాన (శిల)ము పూజ్యుడైన (భయత) ఆచార్య (ధెర). నందుని శిష్యుడు (అంతెవాసిక) సానాధుని దానము.

లాంగ్‌హర్స్టు యీ ఆచార్యుని పేరు సుయజ్ఞనాధుడని చదివినందున, యితడు జైనాచార్యుడనియు, క్రీ. పూ. రెండవ శతాబ్ది యిచ్చట జైనము బహుళ ప్రచారములో నుండెననియు వాదము లేచినది. ఈ శాసనలిపి, శైలి క్రీ పూ. ఒకటవ శతాబ్ది ఉత్తరభాగమునకు చెందినది. ఈయాచార్యుడు స్థవిరవాది.చైత్యము నిశ్శంశయముగా బౌద్ధస్తూపమున్నది. కాన జైనముండుట కావశ్యకము లేదు.

II ఇటీవల దొరకిన శాసనములు: లభ్యమైన స్థలములు

చిత్రము-4 లో చూపించినటుల శిలాస్తంభ శాసనములు (1) తూర్పుభాగమున యిటుకగోడల క్రిందుగా లభ్యమయినవి. ఈ స్తంభములన్నియు నేలపై బడియున్నందున కట్టడమెట్టిదో నిర్ధారణగా చెప్పజాలము శాసనము—2 చిత్రమున కానరాదు. తూర్పు చివరన కొండనానుకొనియున్నదీ స్తూపచైత్యకట్టడము. క్రొత్తగానొకగుహ తూర్పుముఖముగా కొండ చెరియన వెలికి వచ్చినది. ఈ గుహ చతురస్రాకారముగ నాల్గుమీటర్ల ఉత్తర – దక్షిణము, మూడున్నరమీటర్లు తూర్పు–పడమర, కొలతలుగల్గి యున్నది. ప్రక్కగోడలకుఅర్ధవృత్తాకారపుపెద్దగూడులున్నవి.మధ్య



చిత్రము-6 : శాసనము – 4అ



చిత్రము--7 : శాసనము -- 5

నొక పెద్దగది, యిరువైపుల చిన్నగదులతో ముంగిట స్తంభములు గల్గిన ప్రాంగణముయున్న గుహలోన దాలెరయ్యలు కలవు. విదుపుల విహారముగానుపయోగపడినట్లు కనుపించుచున్నది. తరువాత కాలమున నీ గుహనేలపై రాతిపరుపు వేసిరి. ఈ నేలరాళ్ళను ఇదువరకు వచ్చినవారు కట్టడములలో వినియోగించినటుల తెలియుచున్నది. వీటిలో కొన్నింటిపై శాసనములున్నవి. ఇచ్చట చూపిన 3, 9, 11 అటువంటివి. ఈ గుహ క్రీ. శ. 10–వ శతాబ్దవరకును చెప్పు కూర్పుంతో వాడుకలో యున్నట్లు తెలియుచున్నది. ఈ స్తరము లలో లభ్యమయిన యొక కంచు విగ్రహము, శాసనము కల్గిన వాల ముఖ్యమైనది. శాసనములు 4అ, 5 మరియు 6లు రాతి స్తూపము చుట్టునున్న ప్రదక్షిణాపథము లభించినదని చెప్పె మెట్ల రాతిఫలకమైని శాసనము (13) కూడ నిచ్చటనే లభించినది. ఇక తెల్లరాయి మండపస్తంభములపై శాసనములు 7, 8, 10, 12లు లభించినవి. ప్రాచీనకాలమునుండిన నల్లరాయి మండపమిది పెచ్చులు సున్నపుకంభములతో విరాలు వేయబడెను. ఈ శాసనముల నన్నింటిని కాలక్రమముగా వివరించెదము.

శాసనము 3 :

(చిత్రము– 5)

ఈ శాసనము పొడుగుగాటి నేలపరుపురాయిపైనా చెక్కబడి యున్నది. అసంపూర్ణము. లిపి బ్రాహ్మీ. భాష ప్రాకృతము క్రీ. శ 1వ శతాబ్దికి చెందినది.

"మహానాగపవత నివాసిస మహానావి కస"— — (ఈ దానము) మహానాగపర్వత నివాసియైన మహానావికుడు — — పేరు— దానపేరములు తెలుపుభాగము ఛిద్రమైనది.

శాసనము - 4 అ :

చిన్నచెక్కినాలుగు అక్షరములున్నవి— సొటిస — — యిన యున్నవి. క్రీ. శ. 1వ శతాబ్దికి చెందినది.

శాసనము - 4 ఆ :

(చిత్రము– 6)

విహారములున్న గుహ సముదాయమేగాక వాలుపై మొదటనున్న, రూప్యకొండ చెరియ మొదట్లో నొకయసంపూర్ణమైన గుహ యున్నది. ఈ గుహద్వారము అర్ధచంద్రాకారముగా చెక్కబడి, వెన్ను మధ్యలోనున్నను పందూరమువరకు కనుపించుచున్నది. ద్వారము పేరువనగ కుడిప్రక్కగోడపై కొన్ని బ్రాహ్మీయక్షరములున్నవి. పేరువనగనే దీపముంచుటకమనము చిన్నగూడు కలదు.

శాసనము : కషరేణ – బుధి.

ఆరగా బుధి నామెంపిన కషరేణ. లేణ యన గుహ. ఇది క్రీ. శ. ఒక టవ శతాబ్ది నాటిది. కాని ఈ గుహ, దీని చుట్టుపట్లనున్న రాతి కట్టడములు, ఔద్దేశిక స్తూపములు, లంచునే దక్షిణ మునుము గల్గిన పెద్ద విహార గుహలు ఈ కాలమునాటివే. ఇవి మధ్యలో శిథిలములై కానవచ్చుచున్నవి. ఈ విహార గుహలు యెట్టి యలంకారములు లేక, వర్షవాసములుగ భిక్షువుల కుపయోగించుచుండెను.

శాసనము - 5

(చిత్రము – 7)

ఈ దాన శాసనము కూడ నేలపరుపు రాతిపై కలదు. అంచులు విరిగిపోయినవి.

పాఠము : బుధినో లంతేవాసినో ఒపవిన దాన (ం).

తప్పుచనే వసించు భిక్షువు బుధి చేసిన దానము.

శాసనము - 6

(చిత్రము – 8)

ఈ శాసనము స్తూపాకారపు వేదిక చుట్టును మధ్య భాగమున గలదు. శాసనము క్రీ. శ. 1వ శతాబ్దికి చెందినది. ప్రక్క



చిత్రము 8 : శాసనము – 6

కములో నిట్టిరాతిపేటికలు చాల లభించినవి. కొన్నింటిలో, మట్టి, రాగి, వెండి, బంగారు, భరిణలు ఒకటిలో నొకటి పొదిగి ధాతు నిక్షిప్తములై కానవచ్చినవి

శాసనమునుబట్టి ఈ నికాయమున ధాతువు లేదు. బహుశ నేదో బౌద్ధ ధర్మ గ్రంథము నిక్షిప్తము చేయబడినట్లు తోచు చున్నది. శిధిలమైపోయెను కాబోలు అట్టిదేమియు లభ్యముకాలేదు.

శాసనపాఠము: సిధ కోటిగహపతి కేతిలనాభ నికాయ స్వకరం.

దీనిని బుద్ధ సంఘమునకు (నికాయ) గా చేయించినవాడు (కరం=కారితం లేక కృత్వా) కోటికి చెందిన గృహపతి కేతిలనాభ. కోట లేక కోటి యనునది ప్రదేశము పేరు. బహుశ నిది చేరువగా నున్న కామవరపుకోటగా గ్రహింపనగును. ఈ ప్రాంతమున నేటికిని పెద్ద కోట గోడల శిథిలము లున్నవి.

మండప స్తంభముల పైని శాసనములు :



చిత్రము—9: శా స న ము – 7

ఈ క్రింద వివరింపబడిన శాసనములు 7 నుండి 10 మరియు 12 మండప స్తంభము పై నున్నవి. అమరావతి – నాగార్జున కొండలలో వాడిన దాచేపల్లి తెల్లరాయి, నునుపుగా చెక్కబడిన చతురస్ర కంబములు. ఎత్తు 4 1/2 మీటర్లు, వెడల్పు 40మీటర్లు. మధ్యభాగమున అర్ధచంద్రాకారపు పద్మదళశోభితమై, పైని అడ్డ దూలము నుంచుటకు వీలుగా గుంటకలదు. మూడు వరుసలలో పడియున్న వగుటచే నొకే మండపమునకు చెందినవిగా గ్రహింపవచ్చును. దీని చేరువగనే ఉత్తరమున నల్లరాతి ఖంభము లున్న మండపమున్నది.

బహుశః నీ నున్నపు రాతివి క్రీ. శ. 1–2వ శతాబ్దిని జాస చేసి, విశాలము గావించిన ఈ పెద్ద మండపమునకు చెందినవిగా తీసుకోనగును.

శా స న ము - 7
(చి త్ర ము – 9)

ఈ శాసనమున యెనిమిది పంక్తులున్నవి. లిపి శైలిలో కొన్ని ముఖ్యాంశముల పేర్కొందును. తలకట్లు లేవు. అక్షరము మొదలున లావుచేసి యుండుట గమనింపవలసియున్నది. దీర్ఘ – హ్రస్వాక్షర సంకేతములు సక్రమముగా పాటింపబడలేదు. అక్షరము య విచిత్రముగా వ్రాయబడినది. ఘ–య లకు రూపము వ్యత్యాస మంతగా కానరాదు. అక్షరము లన్నియు పొట్టివిగాను, లావుగా కుదించు కొన్నవి. వ్రాత తీరునుబట్టి క్రీ. శ. 1–వ శతాబ్ది యారంభమునాటిదిగా నిర్ణయింపనగును.

శా స న పా ఠ ము

1. వేఠ గిరియసే గహపతినో బు
2. ధినో పుతస ఇని సురకస
3. గహపతినో అంహకస ల
4. యిర యస సపుతకస సజ
5. హాతుకసచ దేయ ధమ మహా
6. నాగవతె మఢవే ధభో చక
7. రజ లనుమగఢ తారిజ పటం
8. సఘదాన :

వేఢగిరి యన వేటగిరి. ఈపదము తప్పుగా వ్రాయబడినది. ఈ శాసనమున మహానాగ పర్వతము పైని బుద్ధసంఘమున కిచ్చిన రెండు దానముల వరింపబడినది. మొదటిది మండప స్తంభము (మఢవే ధభో) శాసన స్తంభమున్నమాట. రెండవది ధర్మచక్రము గల్గిన గుండ్రని పటము (చకరజ అనుమగడ తారిజ పటం) లేక కప్పడు పటముగా భావింపనగును. వీని నొసగినవారు – వేటగిరి గహపతి బుధి యొక్క కొమారుడు ఇణి మరియు 'సురక' కు చెందిన గృహస్తు లలహక భార్యతన పుత్రులు (సపుతకస) ల్లుం డ్రతో (సజహాతుకస), కలసి ఈ పవిత్ర దానము చేసెను.

[స శే ష ము]

శ్రీ తిరుమల రామచంద్ర

ప్రాకృత వాఙ్మయంలో రామకథ-2

(గత సంచిక తరువాయి)

బౌద్ధులలాగ జైనులు కూడ రామకథను తమ మతానుసారంగా మత ప్రచారంకోసం వినియోగించుకున్నారు. రామకథ జైన సాహిత్యంలో అతివిస్తారంగా లభిస్తున్నది. బౌద్ధులు రాముణ్ని బుద్ధుని పూర్వావతారంగా భావించారు. జైనులు రామకథలోని పాత్రలకు మతంలో అత్యంత ప్రాముఖ్యంగల స్థానమిచ్చారు. జైనుల ప్రకారం రామలక్ష్మణ రావణులు జైనధర్మానుయాయులే కాక త్రిషష్టి శలాకా పురుషులు కూడ. త్రిషష్టి శలాకా పురుషులంటే 63 మంది యుగపురుషులన్నమాట. వీరిలో 24 మంది తీర్థంకరులు (జైనధర్మోపదేశకులు), 12 మంది చక్రవర్తులు (భారతదేశపు ఆరుఖండాల సార్వభౌములు) తొమ్మండుగురు బలదేవులు, తొమ్మండుగురు వాసుదేవులు, తొమ్మండుగురు ప్రతివాసుదేవులు వున్నారు. ఈ శలాకా పురుషుల జీవితాలు జైన పురాణాలయ్యాయి, రామాయణ భారతాల లాగ.

జైనరామకథలు

ప్రతికల్పంలోను ఈ త్రిషష్టి శలాకా పురుషులలో తొమ్మండుగురు బలదేవులు, తొమ్మండుగురు వాసుదేవులు, తొమ్మండుగురు ప్రతివాసుదేవులూ అవతరిస్తుంటారు. రామలక్ష్మణ రావణులు క్రమంగా ఎనిమిదవ బలదేవ, వాసుదేవ, ప్రతివాసుదేవులు. బలదేవుణ్ని బలభద్రుడని, వాసుదేవుణ్ని నారాయణుడని కూడ అంటారు. బలదేవ వాసుదేవ ప్రతివాసుదేవులు ఎప్పుడూ సమకాలికులుగానే వుంటారు బలదేవ వాసుదేవులు ఏరాజుకో ఏకోదరులు కాని భ్రాతలుగా పుడుతారు. వాసుదేవుడు బలదేవుని తోడ్పాటుతో ప్రతివాసుదేవునితో యుద్ధం చేసి, అతనిని వధించి, దిగ్విజయంచేసి భారతదేశంలోని ఆరు ఖండాలలో మూడు ఖండాలపై అధికారంపొంది, అర్ధచక్రవర్తి అవుతాడు. ప్రతివాసుదేవుణ్ని వధించడం కారణంగా మరణానంతరం నరకానికి వెళ్లవలసి వుంటుంది. తొమ్మండుగురు వాసుదేవులలో ఎనిమిదవ వారయిన లక్ష్మణుడు, కృష్ణుడు ప్రత్యేకంగా చెప్పవలసినవారు. బలదేవుడు తన భ్రాత మరణానికి శోకాకులుడై జైన దీక్ష గ్రహించి మోక్షం పొందుతాడు. (రామ బలరాములలాగ.) ప్రతివాసుదేవులు సదా సర్వకాలం వాసుదేవులతో విరోధం పెట్టుకొని, వాసుదేవుని చక్రానికి బలి అవుతారు (రావణ జరాసంధుల లాగ.)

జైన రామకథలో మరొక విశేషం వానరులు, రాక్షసులు విద్యాధర వంశ్యులు. జైన ధర్మ సంస్థాపకుడైన ఋషభుడు తన నూరుగురు పుత్రులలో భరతునికి రాజ్యం అప్పగించి, తపోదీక్ష స్వీకరిస్తాడు. తరువాత నమి, వినమి అనే పుత్రులు వచ్చి తండ్రిని తమకు రాజ్యమిమ్మంటారు. వీరిద్దరూ సకల విద్యలూ సంపాదించి వైతాఢ్య (వింధ్య) పర్వత ప్రాంతంలో రాజ్యం స్థాపించుకొన్నారు. వీరు విద్యాధరుల జాతికి మూలపురుషులు (పవురు 3వ పర్వం). జైనుల ప్రకారం విద్యాధరులు కామరూప ఆకాశ గమనాది అనేక విద్యలు సిద్ధించుకొన్న మానవులే. ఈ విద్యలు ధరించడంవల్ల విద్యాధరులనే పేరు వచ్చింది. తమ భవనాలమీద వానర చిహ్నాలు వుంచుకోవడంవల్ల వారికి వానరులని పేరువచ్చింది.

> రక్ఖంతి రక్ఖసాఖయ
> దీవా పుణ్ణేణ రక్ఖయాజేణ,
> తేణం చియ ఖయరాణం
> రక్ఖసనామం కయంలోవి. (ప 5-257)

రాక్షసులు పుణ్యంతో ద్వీపాలను రక్షిస్తారు గనుక ఖేచరులైన ఆ విద్యాధర జాతికి రాక్షసులనే పేరు వచ్చింది.

> వాణరచింధేణ ఇమే
> ఛత్తాయనిరేసియాక ఈ జేణ,
> విజ్జారాజణేణం
> వుచ్చంతిహూవాణరాతేణం. (ప-6-89)

జైన రామాయణములో మూడు పరంపరలున్నాయి. 1) విమలసూరి పరంపర, 2) సంఘదాసుని పరంపర, 3) గుణభద్రుని పరంపర. వీటిలో విమలసూరి పరంపరే ఎక్కువ వ్యాప్తిలోకి వచ్చింది. లోకప్రియమైన రామకథను జైనధర్మపుమూసలో పోయడానికి తొలిసారిగా ప్రయత్నించినవాడు విమలసూరి. ఇతనిని తర్వాతి ప్రాకృత సంస్కృతకవులు అనుసరించారు. మనం ఇప్పుడు ప్రాకృతరామాయణాలే గనుక వాటిని గురించి మాత్రమే చెబుతాను. (1) శీలాచార్యుడు రచించిన చఉపన్న మహాపురిస చరియలో అంతర్భాగమయిన రామలక్ష్మణ చరియం. దీనికాలం క్రీస్తుశకం 868. (2) భద్రేశ్వరుడు రచించిన కహావళిలోని రామాయణం దీనికాలం 11వ శతాబ్ది. (3) భువనతుంగసూరి రచించిన సీయాచరియ, రామలక్ష్మణచరియ. (4) హరిభద్రుడు రచించిన ధూర్తాఖ్యానం. దీనికాలం 750. స్వయంభువు రచించిన పఉమచరిఉ. 8వ శతాబ్ది (6 వ).

సంఘదాసు రచించిన వాసుదేవ హిండి. ఇది తొమ్మిం ... గురు వాసుదేవుల చరిత్ర. దీనిలో రామాయణం ప్రసక్తమవుతుంది. ఇతడు విమలసూరిని అనుసరించినా, హెచ్చుగా వాల్మీకినే అనుసరించాడనవచ్చు.

మూడవసంప్రదాయ ప్రవర్తకుడయిన గుణభద్రుడు రచించిన ఉత్తరపురాణంలో రామకథ ఉన్నది. దీనిలో విశేషం సీత రావణ మండోదరుల కుమార్తె కావడం. వాసుదేవ హిండిలోను ఈ సూచన వుంది.

రవిషేణుడు పఉమచరితాన్ని పద్మ పు రా ణ మ నే పేర సంస్కృతీకరించాడు.

ప్రాకృత రామకథా కావ్యాలలో విమలసూరి పఉమచరియం మొట్టమొదటిది గనుక దీనిని గురించి కొంత తెలుసుకొందాము. ఇతనికాలం క్రీస్తుశకం 72 కాని భాషనుబట్టి 3వ శతాబ్దమని పండితులు నిర్ణయించారు. విమలసూరి దీనిని జైనమత ప్రచారం కోసమే రచించాడు. హరివంశమనే మరొక మహాకావ్యాన్ని కూడ ఈయన రచించాడు. కాని అది యిప్పుడు లభించులేదు. కొందరు అసంబద్ధమయిన వ్రాతలతో రావణాదులను గురించి లేని పోని కట్టుకథలు ప్రచారం చేశారుగనుక, వాటినితొలగించి విమల ధర్మం ప్రచారం చేయడానికి తాను ఈ చరిత్ర వ్రాస్తున్నానని విమలసూరి చెప్పుకున్నాడు.

అవియంవి సవ్వమేయం
ఉపపత్తి విరుద్ధ పచ్చయు గుణేహిం,
నయ సద్ధహంతి పురిసా
హవంతి తేజే పండియాలో వి.2–117.

రాముడికే మరొక పేరు పద్ముడు పఉముడు అని. రాముడు వికసించిన పద్మంవంటి ముఖం కలవాడు, పద్మసదృశ కాంతివాడు కావడంవల్ల అతనికి తండ్రి దశరథుడు పఉమపద్మ అని పేరు పెట్టాడట కనుక దీనిని పద్మచరితం అన్నారు.

అవరా ఇయా కయా ఈ
గురుభా రాసో హవే తిథి ముహుత్తే,
పుత్తం చేవ పసూయా
విర అనియ వరప ఉమ సరిసముహం
జమ్మూసవో మహంతో '
తస్సకట దసర హేణ తుట్ఠేణం,
నామంవ విర ఇయంతే
పఉమోవ పఉముప్పల దళచ్ఛో. 25–7,8.

పఉమచరియం 158పర్వాలగ్రంథం. మొదట్లో పర్వాలను ఉద్దేశాలని సముద్దేశాలని కూడా కని అన్నారు. ఇది పురాణమయినప్పటికీ మహాకావ్య లక్షణాలు చాల కలదనే చెప్పాలి. నగరార్ణవ శైలార్క కుమారాదయాది వర్ణనలు చాల ఉన్నవి. దాదాపు నవరసాల పోషించాడు. కాని కవితాదృష్టి, మత ప్రచారదృష్టిలో మరుగయిపోయిందనే చెప్పాలి. రచన సాధారణంగా గాథ, ఆర్య లోనే సాగుతుంది. పర్వాంతాలకు వివిధవృత్తాలు వాడాడు. భాష సరళమైంది. అర్థాంతరన్యాసాలు, రూపకాది అలంకారాలు ప్రయోగించాడు. పూర్వగ్రంథాల్లో ఉన్నది, ఆచార్యపరంపరగా వచ్చిన పద్మచరితాన్ని ఆనుపూర్విగా చెబుతాను సంగ్రహంగా –అని విమలసూరి అభిధేయమనే అవతారికలో చెప్పాడు.

నామావలి యనిబద్ధం
ఆ యరియ పరంపరాగయం సవ్వం.
వోచ్ఛామి పఉమచరియం
అహాను పువ్వం సమాసేణ. 1–.

సర్వజ్ఞభాసితమైన విషయాన్ని కవులు తమతమ శాస్త్రాభ్యాసాది గుణాలతో విపులంగా చెబుతారు. వజ్రసూచితో రంధ్రం చేసిన రత్నంలో దారం దూరదా ? అని ప్రశ్నిస్తాడు విమలసూరి–

సవ్వన్ను భాసియత్థం
భణంతి కఇణో జహాగమ గుణేణం,
కిం వజ్జ సూఇ భిన్నే
నరియ ఇతంతు మహారయణే ! 2–13

ఈ ఆర్య కాళిదాసు చెప్పిన

అథవా కృతవాగ్ద్వారే వంశేఽస్మిన్ పూర్వ సూరిభిః
మణౌ వజ్ర సముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మేగతిః

అనే మాటను జ్ఞప్తికి తెస్తుంది. జైనులు, బౌద్ధులు వాల్మీకీయమయిన రామకథను, ఇష్టంవచ్చినట్టు తమ తమ మతాలకు అనుగుణంగామలచుకోవడంచూచిఖిన్నులయినకాళిదాసప్రవరసేనులురఘువంశసేతుబంధకావ్యాలురచించారని నేననుకుంటాను. పఉమచరియం కథను సంగ్రహంగా చెబుతాను. ఆ కథ మనకు పరిచితమైన వాల్మీకి రామాయణానికి ఎంత దూరంగాఉందో స్పష్టమవుతుంది. విమలసూరి రామాయణాన్ని ఆరుభాగాలుగా మనం విభజించుకోవచ్చు : (1) రావణచరితం, (2)సీతారాముల జనన వివాహాదులు (3) వన భ్రమణం, (4) సీతాపహరణం, సీతాన్వేషణం, (5) యుద్ధం, (6) ఉత్తర చరిత్ర.

మగధ రాజయిన సేణియుడు (శ్రేణికుడు) మహావీరుని ప్రధాన శిష్యుడైన గోయముణ్ని (గౌతముణ్ని) రామకథ యథార్థ స్వరూపం తెలుపవలసిందని కోరుతాడు. ఆ కోరికపై గౌతముడు పఉమచరియం వినిపిస్తాడు. ప్రారంభంలో విద్యాధరలోక, రాక్షస వంశ, వానర వంశాలను వివరిస్తాడు. ఈ రావణుని చరిత్రకు, వాల్మీకి రామాయణం ఉత్తరకాండ చరిత్రకు చాల సంబంధం వుంది.

రాక్షస రాజయిన రత్నశ్రవణికి, రాణి కేకసికి పుట్టిన సంతానం దశముఖుడు (రావణుడు), భానుకర్ణుడు (కుంభకర్ణుడు), చంద్రనఖ (శూర్పణఖ), విభీషణుడు. దశముఖుడంటే

పదిముఖాయి కలవాడనికాదు. రావణుడు పుట్టినప్పుడు పురిటింట్లో తల్లి రాక్షసపతి పూర్వం మేఘవాహనునికి ఇచ్చిన గొప్ప నవరత్న హారాన్ని తన శిశువుకు వేసింది. అప్పుడు రత్నశ్రవుడు శిశువును చూడడానికి వచ్చాడు. రత్నహారం వేళ్ళతో గట్టిగా పట్టుకొని వెలిగిపోతున్న శిశువును చూచాడు. ఆ రత్నాలలో శిశువు ముఖాలు ప్రతిబింబించాయి, స్పష్టంగా. అందువల్ల లతనికి దశముఖాలు ఉన్నట్టనిపించగా దశముఖుడు లని పేరుపెట్టారు.

రయణ కిరణేసు ఏత్తో
ముహాఇ నవ 'నియయనయణ సరిసా ఇం
హారే దిట్టాఇ ఘడం
తేణకయం దసముహో ణామ. 7–96

రావణుడు తన మాతృష్వసేయుడయిన వైశ్రవణుని ఐశ్వర్యం చూచి, తన సోదరులతోపాటు తపస్సుచేసి వివిధ విద్యలు సంపాదిస్తాడు. తర్వాత మండోదరిని, మరి 6000 మంది విద్యాధర కన్యలను పాణిగ్రహణం చేసుకొంటాడు. పిదప రావణుడు వైశ్రవణుని, యముని జయించి పుష్పక విమానం లాక్కొని లంకానగరంలో ప్రవేశిస్తాడు.

రావణునికి వాలికి కలిగిన స్పర్ధలకు కారణం రావణుడు ఒక దూతను వాలివద్దకు పంపి, లతడు తనవద్దకువచ్చి ప్రణమిల్లి తన చెల్లెలు శ్రీప్రభను ఇచ్చి వివాహం చేయవలసిందని ఉత్తర్వులు చేయడం. వాలి జినవరేంద్రునికి తప్ప మరొకరికి తలవంచనని చెబుతాడు. తన సోదరుడైన సుగ్రీవునికి రాజ్యం అప్పగించి, జైన దీక్ష స్వీకరిస్తాడు. సుగ్రీవుడు రావణునికి లొంగిపోతాడు. శ్రీప్రభతో రావణునికి వివాహం జరగుతుంది.

కాని, వాలి రావణుని గర్వాన్ని అణచడం ఇక్కడ మరొక విధంగా చిత్రించబడింది. వాల్మీకి రామాయణంలో రావణుడు కైలాసపర్వతాన్ని ఎత్తడానికి ప్రయత్నించడం, శివుడు తన పాదాంగుష్ఠంతో నొక్కగా రావణుని చేతులు ఇరుక్కోడం ఉండగా, ఇక్కడ వాలి తపస్సు చేస్తున్నప్పుడు రావణుడు పర్వతాన్ని గర్వంతో ఎత్తడం, వాలి బొటనవ్రేలితో నొక్కడం వుంది.

రావణుడు తర్వాత సహస్రకిరణ, నలకూబర వరుణేంద్రాదులను గెలుస్తాడు. వీరందరూ దేవతలు కారు. రాజులు. ఖరదూషణుడు ఒక విద్యాధర రాజకుమారుడు. రావణుని చెల్లెలు చంద్రనఖను పెళ్ళాడతాడు.

దీనిలో రావణుని పాత్రచిత్రణం, వాల్మీకి రామాయణానికి పూర్తిగా భిన్నం. రావణుడు ధర్మభీరువయిన జైనుడు. జిన మందిరాలను పునరుద్ధరిస్తాడు. పశువిశసనం జరిగే యజ్ఞాలకు అడ్డుతగులుతాడు. నలకూబరునిభార్య ఉపరంగ వలచివస్తే నిరాకరిస్తాడు. జైనాచార్యుడు అనంతవీర్యుని ధర్మోపదేశంతో తనను కోరని పరనారీ విముఖవ్రతం స్వీకరిస్తాడు.

నచరక్కోత్తి భణ్ణఇ
దసాణణో ణేయ ఆమిసాహారో,
అలియం వి సవ్వమేయం
భణంతి జం కుకఇణో మూఢా (13–15)

దశాననుడు రాక్షసుడు కాడు. మాంసభక్షికాడు. మూఢులైన కుకవులు వట్టి అబద్ధాలు చెప్పారు.

దీనిలో హనుమచ్చరితం విస్తారంగా వర్ణితం. ఇతడు పవనజయ, అంజనాదేవుల పుత్రుడు. రావణుడు వరుణునితో పోరాడినప్పుడు సహాయం చేస్తాడు. రావణుని చెల్లెలు చంద్రప్రభ కుమార్తె అనంగకుసుమను వివాహ మాడుతాడు. ఇదికాక మరొక వంద మంది భార్యలుంటారు.

తర్వాత రామాయణం ఆధికారిక కథ 21వ పర్వంనుంచి ప్రారంభమవుతుంది. జనకుని, దశరథుని వంశావళితో. దశరథుడు అపరాజితను సుమిత్రను పెళ్లాడుతాడు. ఒకనాడు నారదుడు దశరథునివద్దకు వచ్చి "నీ కుమారుడు జనకుని కుమార్తె కారణంగా సముద్రమార్గాన లంకానగరానికి వచ్చి రావణునితో యుద్ధం చేస్తాడని జ్యోతిష్కులు చెప్పారు. అందువల్ల విభీషణుడు నిన్ను, జనక మహారాజును చంపదలచుకొన్నాడు" అని హెచ్చరిస్తాడు. జనకునికి కూడ నారదుడు ఈ హెచ్చరికే చేస్తాడు. ఆ హెచ్చరికతో వారిద్దరూ తమ రాజ్యం వదలి భూభ్రమణానికి పూనుకుంటారు. వారి మంత్రులు తమ రాజుల ప్రతిరూపాలు చేయించి, నగళ్లలో పెడుతారు. విభీషణుడు నారదుడు చెప్పినట్లే వచ్చి, దశరథుని ప్రతిరూపం శిరస్సును ఖండిస్తాడు.

భూభ్రమణం చేస్తున్న జనక దశరథులు కైకేయి స్వయంవరానికి వెళ్లుతారు. కైకేయి దశరథుని మెడలో స్వయంవరమాల వేస్తుంది. దీనివల్ల దశరథుడు తక్కిన రాజులతో యుద్ధం చేయవలసి వస్తుంది. ఆ యుద్ధంలో కైకేయి చాల నైపుణ్యంతో దశరథుని రథాన్ని తోలుతుంది. వివాహానంతరం జనక దశరథులు తమ తమ రాజధానులకు తిరిగి వస్తారు. దశరథుడు కైకేయికి ఒక వరమిస్తాడు. "అవసరం వచ్చినప్పుడు అడుగుతాను. ఇప్పుడు వద్దు" అని కైకేయి వరం స్వీకరించదు.

దీనిలో రాముడు—పద్ముడు — అపరాజితాదేవి కుమారుడు. సుమిత్ర కుమారుడు లక్ష్మణుడు. కైకేయి కుమారులు భరత శత్రుఘ్నులు.

జనకునికి విదేహ అనే రాణికి సీత, భామండలుడనే ఇద్దరు పుడుతారు. రాముడు జనకునికి మ్లేచ్ఛులతో జరిగిన యుద్ధంలో సహాయం చేస్తాడు. దానివల్ల జనకుడు రామునికిచ్చి వివాహం చేయడానికి నిశ్చితార్థం జరుగుతుంది. తర్వాత సీతాస్వయంవరంలో రాముడు విల్లు ఎక్కుపెట్టి సీతను పెళ్లాడుతాడు. ఈ ధనుస్సు శివధనుస్సుకాదు. వజ్రావర్తమనే ధనుస్సు. విద్యాధరరాజు చంద్రగతి ఇచ్చినది.

కొంత కాలానికి దశరథునికి వైరాగ్యం కలిగింది. ప్రవ్రజ్య స్వీకరిస్తాడు. అప్పుడు కైకేయి పూర్వవరం జ్ఞాపకపరచి, భరతునికి పట్టాభిషేకం చేయమంటుంది. ఇది విని రామలక్ష్మణులు సీతతోపాటు దక్షిణాపథంవైపు బయలుదేరుతారు. కైకేయి పశ్చాత్తప్తురాలవుతుంది. ఆమె అనురోధంపై భరతుడు అడవికి వెళ్లి అయోధ్యకు తిరిగి రమ్మని రాముణ్ని బ్రతిమాలుతాడు; రాముడు నిరాకరించడంవల్ల గత్యంతరంలేక తిరిగివచ్చి రాజ్యభారం వహిస్తాడు. రాముడు తిరిగి వచ్చిన పిదప జైనదీక్ష వహిస్తానని ప్రతిజ్ఞచేస్తాడు.

రామలక్ష్మణులు వనవాసం విచిత్రంగానే వుంటుంది. వారు మొదట చిత్రకూట పర్వతానికి వెళ్తారు. వివిధ రాజ్యాలలో ప్రవేశించిన మీదట లక్ష్మణుడు వజ్రకర్ణ విరోధి అయిన సింహోదరుని, మ్లేచ్ఛరాజును, భరతుని శత్రువయిన అతివీర్యుణ్ని జయిస్తాడు. పలువురు రాజులు రామలక్ష్మణులకు తమ కన్యలను సమర్పిస్తారు. ఈవిధంగా రామునికి 6000 మంది, లక్ష్మణునికి 16000 మంది భార్యలు. (రావణునికి 8000 మంది.) తర్వాత వారు దండకారణ్యం ప్రవేశిస్తారు.

రావణుడు సీతను హరించడానికి విమలసూరి చెప్పిన కారణాలు వేరు. చంద్రనఖి కుమారుడైన శంబూకుడు సూర్యహాసమనే గొప్పకత్తిని పొందడానికి 12 సంవత్సరాలు సాధనచేస్తాడు. సాధన సఫలమై సూర్యహాసం ప్రత్యక్షమయింది. ఆ సమయంలో లక్ష్మణుడు ఆ ప్రాంతానికి వెళ్లడం తటస్థిస్తుంది. ఆ ఖడ్గాన్ని అందుకొని పక్కనవున్న వెదురు గుబురును నరుకుతాడు. దానితోపాటు, అక్కడ తపస్సు చేస్తున్న శంబూకుని తలకూడ తెగిపోతుంది. కుమారుడు మరణించినందుకు చంద్రనఖి దుఃఖిస్తూ అరణ్యమంతా తిరుగుతూ, రామలక్ష్మణుల వద్దకువచ్చి, తనను పెళ్లాడమంటుంది. వారు నిరాకరించడంతో తనభర్త ఖరదూషణుని వద్దకు వెళ్లి పుత్రమరణవార్తను తెలిపి, రావణునికికూడ ఈ సంగతి సూచిస్తుంది. ఇంతలో ఖరదూషణుడు సైన్యంతో వస్తాడు. లక్ష్మణుడు ఒంటిగా ఆ సైన్యాన్ని ఆపుతాడు. ఇంతలో రావణుడు అక్కడికిచేరి, సీతనుచూచి మోహం చెందుతాడు. లక్ష్మణుడు ఎక్కడికయినా వెళ్లితే రాముణ్ని పిలవడానికి సింహనాదం చేయడం సంకేతంగా పెట్టుకొన్నట్టు అవలోకనీ విద్యతో రావణుడు తెలుసుకొని సింహనాదం చేస్తాడు. సింహనాదం విని రాముడు లక్ష్మణునికి ఏదో ఆపద వచ్చిందని భావించివెళ్తాడు. జటాయువు ఆమెకు రక్షగావుంటాడు. రాముడు వెళ్ళిపోగానే రావణుడు ఆకాశంనుంచి కిందికిదిగి మదించిన ఏనుగు కమలినిని ఎత్తుకున్నట్టు అనాయాసంగా ఆమెను ఎత్తుకొని పుష్పక విమానంలో కూర్చోబెట్టుకొని వెళ్తాడు. అడ్డుతగిలిన జటాయువును ముక్కలు ముక్కలుగా నరుకుతాడు. సీత విలపిస్తుంది "అప్రసన్నురాలయిన పరస్త్రీని పొందనని పూర్వం అభిగ్రహం (వ్రతం) స్వీకరించాను. సంసార సాగరాన్ని తరింపజేసే ఆ వ్రతాన్ని పాలిస్తాను. కొంతకాలంతర్వాత ఈమె నన్ను ఒప్పుకోవచ్చు" అనుకుంటాడు.

ఎత్థంతరమ్మి సహసా
అవయరి ఊణం నహాఊ దహవయణో,
హక్ఖుణవ ఇ జణయతణయా
భుయాసు ణవిశివ్వ మత్తగఓ. (44–39)

— — — —

హోతీ ప్రసన్నహియ యా
ఇమావి మహ దీహకావేణం. (44-46)

సీతాపహరణానంతరం రామసుగ్రీవుల వర్ణనం వుంది. సుగ్రీవునికి కలిగిన ఆపద వాల్మీకి రామాయణంలోని దానికన్నా భిన్నం. సాహసగతి అనే విద్యాధరుడు సుగ్రీవునిరూపం ధరించి సుగ్రీవుని పత్నిని, రాజ్యాన్ని హరిస్తాడు. రాముడు సాహసమతిని వధించి, సుగ్రీవునికి భార్యను, రాజ్యాన్ని ఇప్పిస్తాడు. సుగ్రీవుడు రాముని వినోదార్థం తన 13 కన్యలను సమర్పిస్తాడు. కాని, సీతావియోగ దుఃఖితుడయిన రామునికి వారి సంగతి సుఖం కలుగలేదు

పిదప సుగ్రీవుని ఆజ్ఞతో విద్యాధరులు సీతాన్వేషణకు బయలుదేరారు. రత్నజటీనుంచి రావణుడు సీతను అపహరించినట్టు సుగ్రీవునికి తెలిసింది. అప్పుడు రావణునికి భయపడి యుద్ధం చేయడానికి నిరాకరిస్తారు. కోటిశిలను ఎత్తేవాడు రావణుని చంపగలడని పూర్వం అనంతవీర్యుడనే విద్యాధరుడు చెప్పినదానినిస్మరించి, సుగ్రీవుడు విమానంలో కోటిశిలవద్దకు వెళ్తాడు. అక్కడ లక్ష్మణుడు కోటిశిలను అవలీలగా ఎత్తుతాడు. అయినా విద్యాధరులు భయపడి, మొదట హనుమంతుని విభీషణుని వద్దకు రాయబారం పంపి, రావణునికి నచ్చజెప్పవలసిందని సుగ్రీవుని కోరుతారు. హనుమంతుడు ఆ విధంగానే, తన మాతామహుడైన మహేంద్రుని జయిస్తాడు. దీనికి కారణం మహేంద్రుడు తన తల్లి అయిన అంజనను ఏదో అపవాదంతో ఇంటినుంచి వెళ్లగొడుతాడు. దాని కసి తీర్చుకుంటాడు హనుమంతుడు.

లంక చేరిన తర్వాత హనుమంతుడు విభీషణుడు నిర్మించిన ప్రాకారం దాటి మొదట వజ్రముఖుని వధించి, తర్వాత అతని కుమార్తె లంకా సుందరిని ఓడించి రాత్రి ఆమెతో క్రీడిస్తాడు. పిదప లంకలో ప్రవేశించి, విభీషణుని కలుసుకొని, సీతను దర్శిస్తాడు. తర్వాత లంకలోని ఉద్యానాలను, ప్రాసాదాలను ధ్వంసం చేస్తాడు. ఇంద్రజిత్తు అతనిని బంధించి రావణుని ఎదుట నిలబెడుతాడు. రావణుని బెదిరించి, తన బంధనాలు త్రెంచుకొని రావణుని అంతఃపురాన్ని ధ్వంసం చేస్తాడు. సీతా సందేశంతో రాముని వద్దకు బయలుదేరుతాడు. రాముని అంగుళీయం సీతకిచ్చి, సీత చూడామణిని గ్రహిస్తాడు; రామునికి అందజేస్తాడు తర్వాత. "కర్ణరవాతీరంలో మధ్యాహ్న సమయాన మేమిద్దరం సాధువులకు దానమిచ్చాము. అహోదానం! — అని దేవతలు ఘోషించారు. సకాంచన రత్నవృష్టి కురిసింది. అప్పుడే తేజస్సుతో ప్రజ్వలిస్తున్న ఈ చూడామణి లభించింది. ఓ కపిధ్వజి, ఈ అభిజ్ఞానాన్ని నా ప్రియునికి చేర్చు" అని అందజేస్తుంది.

తే ఏణ పజ్జలంతీ
త ఇయా చూడామణీ ఇమాలద్ధా,
ఏ యం నేహి క ఇద్ధయ
సాహిన్నాణం మహ పియస్స. (53–72)

యుద్ధకాండ కథకూడా వాల్మీకీయం కన్నా భిన్నంగా వుంటుంది. దానిలోని ప్రధాన భేదాలను క్రోడీకరిస్తాను :

దీనిలో సేతుబంధం ప్రసక్తి లేదు. సముద్రుడనే రాజు వానర సేనను అడ్డగిస్తాడు నలునితో పరాజయం పొంది, లక్ష్మణునికి తన నలుగురు కుమార్తెలను సమర్పిస్తాడు.

విభీషణుడు సీతను అప్పగించివేయమని రావణునికి సలహా ఇస్తాడు. రావణుడు కోపగించి, రావణుడు అతనిని నగరంనుంచి వెళ్లగొట్టండని ఆజ్ఞాపిస్తాడు. విభీషణుడు తన సేనతో రాముడు సపరివారంగా విడిసిన హంసద్వీపానికి వెళ్లి రాముని శరణు వేడు తాడు. అప్పుడు సీతాదేవి సోదరుడు భామండలుడు కూడ రామ పక్షంలో యుద్ధం చేయడానికి వస్తాడు.

ఇంద్రజిత్తు నాగపాశంతో రామలక్ష్మణులను కట్టివేయ డానికి మూరు సుగ్రీవ భామండులను కట్టివేస్తాడు. గరుడకేతు వయిన లక్ష్మణద్వారా నాగపాశ ముక్తులవుతారు.

రావణలక్ష్మణులు తలపడుతారు. రావణుని శక్త్యాయుధంతో లక్ష్మణుడు మూర్ఛితుడవుతాడు. ద్రోణమేఘుని కుమార్తె విశల్య లక్ష్మణునికి చికిత్స చేసింది. లక్ష్మణుడు మూర్ఛ తేరుతాడు. తర్వాత లక్ష్మణుడు విశల్యను పెండ్లాడుతాడు. వారి పూర్వ జన్మ గాథ కూడ వర్ణితమయింది. పూర్వజన్మలో లక్ష్మణుడు పునర్వసువు, విశల్య అనంగశర.

రావణుడు సామంతుడనే దూతను పంపి రామునితో సంధి చేసుకొనడానికి ప్రస్తావించాడు. రాజ్యంలో ఒక భాగం, 3000 కన్యలను ఇచ్చే షరతుపై సంధి కోరుతాడు. కాని, సీతను వదులు కోవాలి, బందీలుగా పట్టుకున్న కుంభకర్ణ, మేఘనాద, ఇంద్ర జిత్తులను వదలిపెట్టాలి.

సంధి కుదరలేదు. రావణుడు బహురూప అనే విద్య సిద్ధి కోసం శాంతినాథుని మందిరంలో సాధన చేస్తాడు. ఈ సంగతి తెలిసి వానరులు సాధనకు భంగం చేయడానికి ప్రయత్నించి విఫలు లవుతారు. రావణుడు సిద్ధి పొందుతాడు.

బహురూప విద్య సిద్ధించిన పిదప రావణుడు మరల సీత వద్దకు వెళ్లి, 'ఇప్పుడు రాముని సంహరించి నిన్ను పెళ్లి చేసు కుంటాను' అని బెదరిస్తాడు. ''నా జీవితం రాముని జీవితంపై ఆధారపడి వుంది'' అంటూ సీత మూర్ఛలో భూమిపై పడిపో తుంది. రాముని ఎడల సీతకు గల అచంచల ప్రేమను చూచి రావణుడు పశ్చాత్తప్తుడవుతాడు. కాని, యుద్ధంలో రామ లక్ష్మణులను జయించి, సీతను వారికి అప్పగించాలని నిశ్చయించు కొంటాడు.

మరల రావణ లక్ష్మణ యుద్ధం జరుగుతుంది. నారాయణు డైన లక్ష్మణుడు ప్రతినారాయణుడైన రావణుని వధిస్తాడు.

రావణుని వధానంతరం బందీలయిన కుంభకర్ణ, ఇంద్ర జిత్తు, మేఘవాహనులు విడుదలయ్యారు. వారంతా విరక్తులై తపస్సు చేయ డానికి వెళ్లిపోతారు. మండోదరి, చంద్రనఖ మొదలైన 7000 మంది యువతులు కూడ అంతఃపురం వదలి సాధకు రాండ్రవుతారు.

రాముడు లంకలో ప్రవేశించిన వెంటనే సీతను చూడవానికి వెళ్లుతాడు. వారిద్దరి సమాగమ సమయంలో దేవతలు పుష్పవృష్టి కురిపించి, సీతాదేవి నిర్మల చరిత్రకు సాక్ష్యమిస్తారు. రామునికి సీత చరిత్ర విషయంలో ఎంతమాత్రమూ సందేహం కలుగదు; సీత అగ్నిప్రవేశం గురించిన ఊసయినా లేదు.

రామలక్ష్మణులు రావణుని నగరులో కొంతకాలం వుంటారు. తమతో నిశ్చితార్థమయిన కన్యలను పిలిపిస్తారు. లంకలోనే వారందరితోనూ వివాహం జరుగుతుంది. లంకలో రామలక్ష్మణులు ఆరేళ్లుంటారు.

నారదుడు లంకకు వచ్చి తల్లి అపరాజిత పుత్రవియోగంతో దుఃఖిస్తున్నదని తెలుపగా సాకేతానికి తిరిగి వెళ్లడానికి రామ లక్ష్మణులు నిశ్చయిస్తారు. వారు తిరిగి రాగానే భరతునికి వైరాగ్యం కలిగింది దానితో జినదీక్ష స్వీకరించి నిర్వాణం పొందుతాడు.

సీతా త్యాగ కథ వాల్మీకి రామాయణానికి చాల దగ్గరగావుంది. సీత కుమారుల పేరు లవణుడు లేక అనంగుడు, అంకుశుడు లేక మదనాంకుశుడు. నారదుడు రెచ్చగొట్టడం వల్ల వీరిద్దరూ అయోధ్యపై దండెత్తి లక్ష్మణునితో యుద్ధం చేస్తారు సీతా పరిత్యాగం కథ ఇది. — గర్భవతి అయిన సీతకు రాముడు విభిన్న జైనచైత్యాలయాలను చూపుతుండగా పావమోహిత్యమఈ పర దోషగ్గహణరఉ,గుహావక్రశీసంసీలో ప్రజలు—నాగరికులు సీతపై నిందలు వేస్తున్నారని జనపదాల పెద్దలు చెబుతారు. ఈ మాటలువిని రాముడు లక్ష్మణునితో సీతాత్యాగం విషయం చెప్పగా లక్ష్మణుడు ఒప్పుకోడు. అప్పుడు రాముడు సేనాపతి కృతాంతవదనుని పిలిచి సీతను గంగకు ఆవల నిమానుషఅరణ్యంలో వదలిపెట్టమంటాడు. కాకతాళీయంగా పుండరీకపురరాజు వజ్ర జంఘుడనే రాజు ఆ వనంలో సీతావిలాపంవిని తన నగరుకు పిలుచు కొని వస్తాడు. అక్కడ ఆమె ఇద్దరు పుత్రులను కంటుంది లవ ణాంకుశులు పగ తీర్చుకొనడానికి రామలక్ష్మణులతో యుద్ధం చేస్తారు. ఈ యుద్ధానంతరం అందరి అనురోధంతో రాముడు సీతను అయోధ్యకు పిలిపిస్తాడు. అగ్నిపరీక్షలో తన సతీత్వం నిరూ పించుకుంటుంది. రాముడు ఆమెను అయోధ్యలోనే వుండమని

(మిగతా 38వ పేజీలో)

శ్రీ జంధ్యాల బాలగంగాధర తిలక్

భారతదేశములో దారిద్ర్య సమస్య

మూడవ ప్రపంచము (Third World)నకు చెందిన పెక్కు దేశములలో దారిద్ర్యము ప్రళయ తాండవము గావించుచున్నది. లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశములలో 30.5 శాతము ప్రజలు దారిద్ర్యముతో బాధపడుచున్నారు. వారి సాలుసరి ఆదాయము 50 అమెరికను డాలర్లకు తక్కువగా నున్నది. వివిధ లాటిన్ అమెరికను దేశములలో 2.5 నుండి 37 శాతము (సగటున 10.8 శాతము) ప్రజలు,టాంజానియా తప్ప మిగిలిన విభిన్న ఆఫ్రికా దేశములలో 6.3 నుండి 43.1 శాతము (సగటున 30.5 శాతము) ప్రజలు, ఆసియా దేశములలో 1నుండి 53.6 శాతము (సగటున 36.1 శాతము) ప్రజలు పైన పేర్కొన్న దారిద్ర్య పరిమితి (Poverty Line) ప్రకారము దారిద్ర్యము అనుభవించుచున్నారు. తులనాత్మక దృక్పథముతో పరిశీలించి చూడగా ఆసియా దేశములలో పేదరికము ప్రబలముగా నున్నదని తెలియుచున్నది. ఆసియా దేశములలో దారిద్ర్యమున బర్మాకు ప్రథమ స్థానము, భారతదేశమునకు ద్వితీయ స్థానము లభించుచున్నవి. ఈ మూడు ఖండములకు చెందిన 44 దేశములలో భారతదేశము తృతీయ స్థానములో ఉన్నది. భారత దేశములో 44.5 శాతము ప్రజలు పేదరికముతో అవస్థలు పడుచుండగా, టాంజానియాలో 57.9 శాతము ప్రజలు బర్మాలో 53.6శాతము ప్రజలు,ఇదే పరిస్థితిలో నున్నారని తెలియుచున్నది. భారతదేశములో ఆదాయములలో కూడ అసమానతలు అధికముగా నున్నవని తెలియుచున్నది. అమెరికాసంయుక్తరాష్ట్రములు, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, హాలండు మున్నగు అభివృద్ధిచెందిన దేశములలో క్రింది 40 శాతము ప్రజలు 19.7 నుండి 27.6 శాతము జాతీయ ఆదాయము ననుభవించుచుండగ భారతదేశములో కేవలము 16 శాతము జాతీయ ఆదాయము క్రింది 40 శాతము ప్రజలు లనుభవించుచున్నారు. పై 20 శాతము ప్రజలు జాతీయ ఆదాయములో 52 శాతము అందుకొనుచున్నారు. పొరుగు దేశములయిన శ్రీలంక, పాకిస్థాన్, ఇంకను అభివృద్ధి చెందుచున్న కొరియా, తైవాన్, ఉగాండా మున్నగు దేశములలో పరిస్థితి కొంచెము మెరుగగనే ఉన్నది. ఈ విధముగా మన దేశములో దారిద్ర్యమే కాక ఆదాయ అసమానతలుకూడా ప్రబలముగా ఉన్నట్లు తెలియుచున్నది.[1]

దారిద్ర్యమునకు కారణములు, దారిద్ర్య నివారణోపాయములు గురించి ఆలోచించుటకు ముందుగా ఈ సమస్యపై భారతదేశమునకు చెందిన వివిధ పరిశీలనములను సూక్ష్మావలోకనము గావించుట అవసరము.

ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త శ్రీ అహ్లూవాలియా (M. S. Ahluwalia) 1969లో భారతదేశములో 23.9 కోట్ల మంది ప్రజలు సాలుసరి ఆదాయము కనీసము 50 డాలర్లు కూడ లేక పేదరికము అనుభవించుచున్నారనియు, కనీస సాలుసరి ఆదాయము 75 డాలర్లుగా గ్రహించిన 35.9 కోట్లమంది ప్రజలు (అనగా 66.9 శాతము) దారిద్ర్యము అనుభవించుచున్నారని అంచనా వేసెను.[2]

శ్రీ ఇ. పి. డబ్ల్యు. కోస్తా (E. P. W. Da Costa) మహాశయుడు దారిద్ర్యమును మూడు రకములుగా నిర్వచించెను. గ్రామ ప్రాంతములలో కనీసము రు. 15లు, పట్టణ ప్రాంతములలో రు. 24లు నెలకు సగటు తలసరి వ్యయము చేయలేని వారిని దారిద్ర్యము (Poverty) అనుభవించుచున్న వారిగను, తలసరి నెల వ్యయము గ్రామ ప్రాంతములలో కనీసము రు. 13లు, పట్టణ ప్రాంతములలో కనీసము రు. 18లు చేయలేని వారిని అతి దారిద్ర్యము (Destitution) అనుభవించుచున్న వారిగను, కనీసము రు. 11లు గ్రామ ప్రాంతములలోను, రు 15లు పట్టణ ప్రాంతములలోను వ్యయము చేయలేని వారిని దుర్భర దారిద్ర్యము (Severe Destitution) అనుభవించుచున్న వారిగను కోస్తా మహాశయుడు పరిగణించెను. ఆ ప్రకారముగా 1964లో మన దేశములో 16.2కోట్లమంది(34.5శాతము)దరిద్రులు, 10.4కోట్ల మంది (23.4 శాతము) అతి దరిద్రులు, 6.2 కోట్లమంది (13.2 శాతము) దుర్భర దరిద్రులు కలరని నిర్ధారించెను.[3]

శ్రీ ఓఝా (P. D. Ojha) మహాశయుడు రోజుకు మనిషికి 2250 కాలరీల ఆహారము అత్యవసర మనియు, అత్యవసర ఆహారమునకు 1960–61 స్థిర ధరల ప్రకారము గ్రామ ప్రాంతములలో నెలకు రు. 15 లు నుండి రు. 18ల వరకు ఖర్చగుననియు, పట్టణ ప్రాంతములలో నెలకు రు. 8–11లు ఖర్చగు ననియు అంచనా వేసెను. ఆ ప్రకారముగా 1961లో గ్రామ ప్రజలలో 51. 82 శాతము (18. 4 కోట్ల మంది), పట్టణ వాసులలో 7. 6 శాతము (60 లక్షల మంది), మొత్తముమీద 44శాతము (19 కోట్ల మంది) కనీస ఆహారములేక దారిద్ర్యము ననుభవించుచున్నారని తేల్చి చెప్పెను. 1967–68 లో కనీస ఆహారమునకు నెలకు తలసరి రు.40లు వ్యయమగునని భావించి 1967–68లో మన దేశములో 28. 9 కోట్ల గ్రామ వాసులు (అనగా గ్రామ వాసులలో 70 శాతము) దారిద్ర్యము అనుభవించు చున్నారని ఓఝా మహాశయుడు లెక్క గట్టెను. ఈ ప్రకారముగా 1960

-61 నుండి 1967–68 లోపుగా గ్రామవాసులలో 18శాతము అధికముగా దారిద్ర్య పరిధి (Ring of Poverty) లోనికి చేరిరని శ్రీ ఓఝూ నిర్ధారించెను. [4]

ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్తలు శ్రీ దండేకర్ (V. M. Dandekar), శ్రీ నీలకంఠరత్ (Nilakanth Rath) శ్రీ ఓఝూ వలెనే 2250 కాలరీల ఆహారము కనీస అవసరముగా భావించిరి. కానీ ఈ కనీస ఆహారమునకు 1960–61 స్థిర ధరల ప్రకారము తలసరి సం. నకు రు 180 లు గ్రామ ప్రాంతములలో ఖర్చగుననియు, పట్టణప్రాంతములలో రు. 270లు ఖర్చగుననియు అంచనా వేసిరి. 1968–69 సం. లో ధరల పెరుగుదల వలన ఈ అంచనాలు క్రమముగా రు. 324లు రు. 486లుగా మారునని నిర్ధారించి ఆ ప్రకారముగా దేశములోని గ్రామ ప్రజలలో 40 శాతము, పట్టణ ప్రజలలో 50 శాతము ప్రజలు దరిద్ర దేవత నిలయ తాండవమునకు గురియగుచున్నారని అంచనా వేసిరి. [5]

భారతీయ వాణిజ్య మండలి వ్యవస్థ (Federation of Indian Chamber of Commerce) వారు 21.8 కోట్లమంది (41. 2 శాతము) ప్రజలు కనీస తలసరి ఆదాయము నెలకు రు.37లు కూడా లేక దారిద్ర్యము అనుభవించుచున్నారని అంచనా వేసిరి. [6]

భారతీయ సాంఖ్యక సంస్థ (Indian Statistical Institute) కు చెందిన శ్రీ బి. యస్. మిన్హాస్ (B. S. Minhas) కనీస తలసరి అవసర వ్యయము Minimum Percapiter Cansumptiar Expenditure) సం. నకు రు. 240 లుగా పరిగణించి దేశములో 1956–57 లో గ్రామ వాసులలో 65 శాతము (21.3 కోట్ల మంది) ప్రజలు దరిద్రులుగా ఉన్నారనియు, 1967–68 నాటికి దరిద్రుల శాతము 50.6 నకు (21.0 కోట్లు) తగ్గినదనియు అంచనా వేసెను. [7]

శ్రీ మిన్హాస్ అంచనాల ప్రకారము దరిద్రుల శాతము తగ్గుచుండగా, శ్రీ ప్రణాబ్ బర్ధన్ (P. K. Bardhan) 1960–61 ధరల ప్రకారము రు. 181 లు కనీస తలసరి సంవత్సరి వ్యయముగా గ్రహించి 1960–61 నుండి 1968–69 లో మన దేశ గ్రామస్థులలో దరిద్రుల శాతము 38 నుండి 53 కు అధికమయినదని తీర్మానించెను. [8]

శ్రీ భట్టీ (I. Z. Bhatty) కనీస తలసరి సంవత్సర అవసర వ్యయము రు. 240 లుగా పరిగణించి దేశములోని వ్యవసాయ కార్మికులలో 56·2 శాతము, వ్యవసాయేతర గ్రామీణ కార్మికులలో 39. 6 శాతము దారిద్ర్యము అనుభవించుచున్నారని అంచనా వేసెను. [9]

ఈ విధముగా మన దేశములో దారిద్ర్యసమస్య తీవ్రరూపము దాల్చియున్నదని అందరు ఏదో ఒక రీతిలో అంగీకరించిరి. కొందరి ముఖ్య పరిశోధనా ఫలితములను పట్టిక సంఖ్య–1 లో పొందు పరచితిమి.

పట్టిక సంఖ్య : 1

దారిద్ర్య సమస్య : విభిన్న అంచనాలు

(సంఖ్యలు మిలియనులలో)

	1956–57	57–58	60–61	61–62	63–64	64–65	67–68	69–70
శ్రీ మిన్హాస్								
[గ్రామ]	215 (65. 0)	212 (63. 2)	211 (59. 4)	206 (56. 4)	221 (57. 8)	202 (51. 6)	210 (50. 6)	
శ్రీ బర్ధన్								
[గ్రామ]			131. 1 (38. 0)			174. 4 (44. 5)	220. 5 (53. 0)	
శ్రీ దండేకర్–శ్రీరత్								
గ్రామ			135. 0 (40. 0)				166. 4 (40 0)	
పట్టణ			42. 0 (50. 0)				49. 0 (50. 0)	
మొత్తము			177. 0 (41. 0)				215. 5 (41. 0)	

	1956–57	57–58	60–61	61–62	63–64	64–65	67–68	69–70
శ్రీ కోస్తా								
దరిద్రులు					161.6 (34.5)			
అతి దరిద్రులు					104.4 (23.4)			
దుర్భర దరిద్రులు					61.7 (13 2)			
శ్రీ ఓఝా								
గ్రామ			184.2 (51.8)				289.0 (70.0)	
పట్టణ			6.0 (7 6)					
మొత్తము			190.2 (44.0)					
వాణిజ్య మండలి								218.3 (41.2)

గమనిక : కుండలీకరణములలో ఉన్న సంఖ్యలు శాతములు.

వివిధ పరిశోధనలను పరిశీలించి చూడగా భారతదేశములో దారిద్ర్య సమస్య నానాటికి అధికమగుచున్నదని తెలియుచున్నది. దారిద్ర్యములో తగ్గుదల ఉన్నదని తీర్మానించుటకు సరియగు ఆధారము కన్పించుటలేదు [10]

భారతదేశములో దారిద్ర్యమే కాక ఆదాయములో కూడా తీవ్రముగా అసమానతలు ఉన్నట్లు కనిపించుచున్నవి. కొన్ని ముఖ్య పరిశోధనా ఫలితములు పట్టిక సంఖ్య 2లో పొందుపరుపబడినవి.

ఇక మన దేశములోని వివిధ రాష్ట్రములలో దారిద్ర్య సమస్యయొక్క రూపము లెట్లున్నవో అవలోకింతము. శ్రీ భట్టీ కనీస తలసరి అవసర వ్యయము సం. నకు రు. 240లుగా పరిగణించి చేసిన అంచనాల ప్రకారము గుజరాతు, తమిళనాడు, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రములలో దారిద్ర్య సమస్య తీవ్రరూపము దాల్చినదనియు, బీహారు, ఆంధ్రప్రదేశ్, అస్సాము, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా రాష్ట్రములలో దారిద్ర్యము తక్కువస్థాయిలో ఉన్నదనియు తీర్మానించెను. పట్టిక సంఖ్య 3లో వివిధ రాష్ట్రములలో దారిద్ర్య సమస్య గూర్చి వివిధ పరిశోధన ఫలితములను పొందుపరచితిమి.

విభిన్న అధ్యయనములనుండి సేకరించిన ఈ పట్టికలోని వివరములను పరిశీలించి చూడగా కొన్ని ప్రాంతములలో దారిద్ర్య సమస్య తీవ్రముగా నున్నదనియు, మరికొన్ని ప్రాంతములలో అంత

పట్టిక సంఖ్య : 2

ఆదాయ అసమానతలు : విభిన్న అంచనాలు

		జాతీయ ఆదాయములో పై 10 శాతము ప్రజల భాగము	క్రింది 20 శాతం ప్రజల భాగము	లోరంజ్ గుణకము (Lorenz Ratio)[15]
శ్రీ ఓఝా–శ్రీభట్[11]	1961–62–1963–64–సగటు	35	7	0.377
శ్రీరణధివే[12]	1961–62	45.47	7.80	0.351
శ్రీ అహ్మద్–శ్రీ భట్టాచార్య[13]	1963–64	31.5	7.6	0.372
వ్యవహారికఅర్థశాస్త్ర జాతీయ పరిశోధనా సంస్థ[14]	1964–65	33.35	7.50	0.39

పట్టిక సంఖ్య : 3
విభిన్న రాష్ట్రములలో దారిద్ర్య స్థాయి[16]

	తీవ్ర దారిద్ర్యము	ఒక మాదిరి దారిద్ర్యము	తక్కువ స్థాయి దారిద్ర్యము
శ్రీ భట్టీ	గుజరాతు	ఉత్తరప్రదేశ్	బీహారు
(1968–	తమిళనాడు	కేరళ	ఆంధ్రప్రదేశ్
69) [గ్రామ]	మధ్యప్రదేశ్	ఒరిస్సా	అస్సాము
	రాజస్థాన్	మహారాష్ట్ర	పశ్చిమ బెంగాలు
		కర్నాటక	పంజాబు & హర్యానా
శ్రీ కొస్తా	కేరళ	మధ్యప్రదేశ్	గుజరాతు
(1963–	కర్నాటక	మహారాష్ట్ర	పశ్చిమ బెంగాలు
64)	ఆంధ్రప్రదేశ్	బీహారు	పంజాబు & హర్యానా
	ఒరిస్సా	తమిళనాడు	జమ్ము–కాశ్మీర్
	ఉత్తరప్రదేశ్	రాజస్థాన్	అస్సాము
భారతీయ	ఒరిస్సా	ఉత్తరప్రదేశ్	కేరళ
వాణిజ్య	బీహారు	జమ్ము–కాశ్మీర్	పశ్చిమ బెంగాలు
మండలి	రాజస్థాన్	ఆంధ్రప్రదేశ్	మహారాష్ట్ర
వ్యవస్థ	మధ్యప్రదేశ్	కర్నాటక	గుజరాతు
1969		అస్సాము	పంజాబు–హర్యానా
		తమిళనాడు	
శ్రీ బర్ధన్	పశ్చిమ బెంగాల్	తమిళనాడు	ఆంధ్రప్రదేశ్
(1967 –	కేరళ	ఉత్తరప్రదేశ్	అస్సాము
68)	బీహారు	కర్నాటక	రాజస్థాన్
[గ్రామ]	ఒరిస్సా	మహారాష్ట్ర	పంజాబు – హర్యానా
	మధ్యప్రదేశ్	గుజరాతు	జమ్ము–కాశ్మీర్

ప్రబలముగా లేదనియు ఖచ్చితముగా నిర్ధారింపలేకున్నాము. విభిన్న శాస్త్రవేత్తలమధ్య ఖచ్చితముగా ఏకాభిప్రాయము లేకుండుటకు కారణము యూహించుట పెద్ద కష్టతరమయిన పనికాదు. ఉదాహరణకు విభిన్న పరిశోధకులు వేరు వేరు సంవత్సరములలో ఈ సమస్యను పరిశీలించిరి. శ్రీ భట్టీ, భారతీయ వాణిజ్య మండలి వ్యవస్థ వారల పరిశోధనా కాలముల మధ్యగల తేడా స్వల్పము. కావుననే వారి పరిశోధనా ఫలితముల మధ్యగల తేడా కూడా స్వల్పము. వారిరువురి పరిశోధనలు రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో దారిద్ర్య శాతము అధికముగా నున్నదని, ఉత్తర ప్రదేశ్, కర్నాటక రాష్ట్రములలో ఒక మాదిరిగా నున్నదనియు, పశ్చిమ బెంగాలు, పంజాబు, హర్యానా ప్రాంతములలో సమస్య తీవ్రత స్వల్పముగా ఉన్నదని ఏకాభిప్రాయము చాటుచున్నవి. ఇదేవిధముగా శ్రీ బర్ధన్, శ్రీ భట్టీల పరిశోధనా కాలముల మధ్యగల తేడా కేవలము ఒక సంవత్సరము. కావుననే వారి పరిశోధనా ఫలితములలో సామ్యత కనిపించుచున్నది. ఇంతేకాక ఇరువురును గ్రామప్రాంతములనే పరిగణించుట వారి అభిప్రాయ సామ్యతకు మరొక కారణము.

విభిన్నశాస్త్రవేత్తలు దారిద్ర్య పరిమితిని విభిన్న రీతులలో నిర్వచించిరి తలసరి ఆదాయము, తలసరి వ్యయము, తలసరి అత్యవసర వ్యయము మున్నగు పదములకు వేరువేరు పరిమాణములిచ్చి నిర్వచించిరి. కావుననే వివిధ పరిశోధనా ఫలితముల మధ్య సామరస్యము బాగుగా కన్పించకున్నది. మొత్తముమీద మధ్యప్రదేశ్‌లో దారిద్ర్యసమస్య తీవ్రరూపము దాల్చినదని,అధికశాతము మంది అంగీకరించుచున్నారు. ఉత్తరప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతములలో ఈ సమస్య ఒకమాదిరిగానున్నది. అస్సాము, పశ్చిమబెంగాలు, పంజాబు, హర్యానా, ఆంధ్రప్రదేశ్‌లలో సమస్య తీవ్రత తక్కువ స్థాయిలో ఉన్నట్లు తెల్పవచ్చును.

మనదేశములోని కొన్ని ప్రాంతములలో దారిద్ర్య తీవ్రతకు కారణములను క్లుప్తముగా పరిశీలించెదము.

రాష్ట్రతలసరిఆదాయము (State Per Capita Income) ఆర్థికాభివృద్ధికి ప్రధానసంకేతము (Indicator)గా గ్రహింపవచ్చును కదా! దారిద్ర్యసమస్య తీవ్రముగాఉన్న మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రములలో తలసరి ఆదాయము కేవలము జాతీయస్థాయి కంటేనే కాక మిగిలిన రాష్ట్రముల ఆదాయము కంటెను బహు తక్కువ. 1960–61 స్థిర ధరలలో 1969-7 సం. లో జాతీయ తలసరి ఆదాయము రు. 589లు; మధ్యప్రదేశ్ లో రు. 498లు; ఉత్తరప్రదేశ్‌లో రు 495లు; రాజస్థాన్ లో రు. 479లు. ఇదే విధముగా పశ్చిమబెంగాలు, పంజాబు, హర్యానా రాష్ట్రములలో తలసరి ఆదాయము క్రమముగా రు. 705 లు; రు. 1002లు, రు. 903లు.[17] ఈ రాష్ట్రములలో దరిద్రుల శాతము తక్కువగా ఉన్నదని ముందు చూచియున్నాము. కావున ఆర్థికాభివృద్ధి తక్కువగా ఉండుట దారిద్ర్యమునకు ఒక ముఖ్య కారణమని పేర్కొనవచ్చును.

వ్యవసాయిక భూముల సగటు పరిమాణము (Average size of the Land Holdings) అధికముగాఉన్న ప్రాంతములలో దారిద్ర్యతీవ్రత అధికముగా ఉండదని ఊహింపవచ్చును. కాని తలసరి వ్యవసాయిక భూమి సగటు పరిమాణము రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రములలో గరిష్ఠము. రాజస్థాన్‌లో సగటు పరిమాణము 0.54 హెక్టేరు; మధ్యప్రదేశ్‌లో 0.48 హెక్టేరు. దారిద్ర్యశాతము తక్కువగానున్న పశ్చిమబెంగాలులో సగటు పరిమాణము 0.10 హెక్టేరు; అస్సాములో 0.18 హెక్టేరు. కావున వ్యవసాయిక సగటు భూపరిమాణము అధికముయిన గ్రామప్రాంతములలో ఆదాయముపెరిగి దారిద్ర్యము తగ్గుననుమాట సత్యము కాదని శ్రీ భట్టీ తీర్మానించెను.[18] వ్యవసాయిక సగటు భూపరిమాణము పెరిగిన ఆదాయ అసమానతలు పెరిగి దారిద్ర్య సమస్య తీవ్రత అధికమగునని ఊహింపవచ్చును.

విద్యారంగములో అభివృద్ధి చెందిన ప్రాంతములలో దారిద్ర్యశాతము తక్కువగా ఉండునని తెలియుచున్నది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రాంతములు విద్యారంగములో బాగుగా వెనుకబడియున్నవి. దారిద్ర్యశాతము తక్కువగాఉన్న పంజాబు,హర్యానా మున్నగురాష్ట్రములు విద్యారంగములో ముందంజవేసినవి. కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతములలో విద్యాభివృద్ధి ఒకమాదిరిగా ఉన్నది. అంతేకాక మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో అక్షరాస్యత కూడా బహుతక్కువ జాతీయస్థాయి అక్షరాస్యత 29.5శాతము అయిన, మధ్యప్రదేశ్‌లో 22.1 శాతము, రాజస్థాన్‌లో 19.1 శాతము, పంజాబులో 33.7 శాతము, పశ్చిమబెంగాలులో 33.2 శాతము ప్రజలు అక్షరాస్యులు. అక్షరాస్యత అధికముగాఉన్న ప్రాంతములలో దారిద్ర్యశాతము చాలా తక్కువగా లేకపోయినప్పటికి, విద్యాస్థాయి, అక్షరాస్యత,బాగుగా తక్కువగాఉన్న ప్రాంతములలో దారిద్ర్యశాతము అధికముగా ఉన్నది. కావున విద్యాహీనత, నిరక్షరాస్యత అధిక దారిద్ర్యమునకు ఒక ప్రధాన కారణముగా పేర్కొనవచ్చును.[19]

దారిద్ర్యమునకు, జనాభివృద్ధికి సమసంబంధమున్నట్లు కనిపించును. పంజాబు, ఆంధ్రప్రదేశ్‌లలో 1961నుండి1971 లోపు సగటున సం.నకు వరుసగా 2.17, 2.09 శాతము మాత్రము జనాభా అభివృద్ధి చెందినది. ఈరాష్ట్రములలోదారిద్ర్య సమస్య అంత తీవ్రముగా ఉన్నట్లు కన్పింపదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఇదేకాలములో జనాభా సంవత్సరమునకు 2.87శాతము, 2.78 శాతము క్రమముగా వృద్ధిచెందినది. ఈ రాష్ట్రములలో దారిద్ర్యము తీవ్రముగా ఉన్నదని నిర్ధారణ చేసియున్నారుకదా!కాని ఉత్తరప్రదేశ్‌లో జనాభావృద్ధి శాతము బహుతక్కువ. (1.98 శాతము)[20]. అయినప్పటికి ఈ రాష్ట్రములో దారిద్ర్యసమస్య అధికముగనే ఉన్నది. కావున కొన్ని అపవాదములు మినహాయించి జనాభావృద్ధికి, దారిద్ర్యమునకు సమసంబంధమున్నట్లు చెప్పవచ్చును

ఈ విధముగా ఆర్థికాభివృద్ధి, వ్యవసాయిక భూ సగటు పరిమాణము, విద్య, అక్షరాస్యత, జనాభాభివృద్ధి మొదలయినవి దారిద్ర్య సమస్యను వివరించుటకు తోడ్పడును. మన కేంద్ర ప్రభుత్వ ప్రణాళికా విభాగము (Planning Commission)వారు నెలకు రు. 20 లు కనీస తలసరి వ్యయముగా గ్రహించి దేశములో మొత్తము 22 కోట్ల ప్రజలు దారిద్ర్యము అనుభవించుచున్నారని అంచనా వేసిరి. తదనుగుణముగా ఈ 22 కోట్ల దరిద్రుల స్థితిగతులను మెరుగుపరచుటకు 5వ పంచవర్ష ప్రణాళికలో జాతీయ కనీస సముపాయ కార్యక్రమము (National Programme of minimum Needs) పేరిట రు. 2803.79 కోట్లు కేటాయించినారు. ఈ కార్యక్రమము ప్రకారము ఉచిత ప్రాథమిక విద్య, కనీస వైద్య సదుపాయము, త్రాగుటకు నీరు, కనీసము 1500 జనాభా కలిగిన ప్రతి గ్రామమునకు ఎల్లకాలములందు ఉపయోగపడు రోడ్డు, భూములు లేని వ్యవసాయిక కూలీలకు ఇండ్ల సదుపాయములు, మురికివాడల పారిశుధ్యము, 30–40 శాతము గ్రామ ప్రాంతములకు విద్యుచ్ఛక్తి సరఫరా మున్నగు పనులు చేయవలెనని తలపెట్టిరి.[21] 5వ ప్రణాళికా విజయములు ఇంకను తెలియవలసి యున్నది. 5వ పంచవర్ష ప్రణాళిక చతుర్వర్ష ప్రణాళికగా మారినది. 6వ ప్రణాళిక ప్రారంభము అయినది దారిద్ర్య సమస్యను ఎంతవరకు పరిష్కరించగలమో వేచి చూడవలెను.

అసలు దారిద్ర్యము, ఆదాయ అసమానతలు, నిరుద్యోగము ఈ మూడు సమస్యలు ఒకదానితో నొకటి పెనవేసికొని యున్నవి. కావున దారిద్ర్య నిర్మూలనము గావింపవలెనన్న ఈ మూడు సమస్యలను సమన్వయ దృక్పథముతో పరిశీలించి సమస్యా పరిష్కార మార్గమునకై అన్వేషింపవలెను. అంతేకాని ఏ ఒక్క సమస్యను వేరుగా పరిష్కరింపబూనుట అవివేకము, అసాధ్యము.

మన దేశములో ఆర్థికాభివృద్ధి ఫలితములు అందరకును సమముగా అందుటలేదు. అసలు ఆర్థికాభివృద్ధి రేటు (Rate of Economic Growth) చాలా తక్కువ. అద్దాని ఫలితములు కేవలము ధనిక వర్గమునకే పోవుచున్నవి. పేదవర్గము నారి పరిస్థితులలో చెప్పుకోదగినంత మెరుగు కల్పించుటలేదు. ఈవిధముగా నానాటికి ధనిక, పేద వర్గముల మధ్య అంతరములు మూడుపూవు లారుకాయయిగా అభివృద్ధి చెందుచున్నవి. కావున ధనికవర్గమునకు చెందిన పై 5 శాతము ప్రజల వ్యయములో 15 శాతము, ధనిక వర్గమునకు చెందిన ఆ పిదప 5 శాతము ప్రజల వ్యయములో 7.5 శాతము తగ్గించి ఆ వ్యయము పేదవర్గము ప్రజలకు లాభము చేకూరునట్లు ఖర్చు పెట్టవలెనని శ్రీ దండేకర్, శ్రీరత్ మహాశయులు అభిప్రాయపడిరి.[22]

మన గ్రామ ప్రాంతములలో కేవలము నిరుద్యోగ సమస్యయే కాక అల్ప ఉద్యోగము (Under employment), ప్రచ్ఛన్న నిరుద్యోగము (Disguised unemployment) కూడ ప్రబలముగాఉన్నవి. కావున దారిద్ర్యనిర్మూలననుకు ఉద్యోగావకాశములు మెరుగు పరచుట ఎంతయినా అవసరము. ముఖ్యముగా గ్రామ ప్రాంతములలో కుటీర పరిశ్రమలు విరివిగా స్థాపించి, ఉద్యోగావకాశములు విస్తరింపవలసి యున్నది. సాధ్యమయినంతవరకు అధిక

శ్రమికఉత్పాదన పద్ధతులు (Labour-Intensive Techniques of Production) అనుసరించవలసిన అవశ్యకత బాగుగా కల్పించుచున్నది

వ్యవసాయిక కనీస వేతనచట్టము (Agricultural Minimum Wages Act) ప్రకారము వ్యవసాయ కార్మికులందరకు సరియైన కూలి లందుట్లు చూడవలెను

మన దేశములో దాదాపు 169 మిలియను ఎకరముల భూమి ఉపయోగ రహితముగా నున్నదని అంచనా. ఇందు 4.3 మిలియను ఎకరములు భూదాన కార్యక్రమము ద్వారా లభించినది; 2 మిలియను ఎకరములు గరిష్ఠ భూపరిమితి చట్టముద్వారా లభించినది; 42.5 మిలియను ఎకరములు నిరుపయోగముగా నున్నవి; మిగిలిన భూమి బంజరు భూములు. ఈ 169 మిలియను ఎకరములను సాగుదల లోనికి తీసికొని వచ్చుటకు ప్రయత్నించిన గ్రామ ప్రాంతములలో నిరుద్యోగ సమస్య చాలావరకు తగ్గునని శ్రీ వి. వి గిరి అభిప్రాయపడిరి. 23

ఈ విధముగా సమానత, ఉద్యోగావకాశములు పెంపొందించిన దారిద్ర్య సమస్య త్వరితగతిని పరిష్కారమగుట తథ్యము.

అధోజ్ఞాపికలు

1. M. S. Ahluwalia, "Income Inequality : Some Dimensions of the Problem" in H. B. Chenery etaL (Eds.)Redistribution with Growth(London, Oxford University Press, 1974) P. 3-37.
2. పైన పేర్కొన్న వ్యాసమునే చూడుడు.
3. E. P. W. Da Costa, "A Prortrait of Indian Poverty" in .J.Fonseca (Ed.) Challenge of Poverty in India (Delhi, Vikas, 1971) PP. 48-59.
4. P. D. Ojha, "A Configuration of Indian Poverty. inequality and Levels of Living" Reserve Bank of India Bulletine (Jan., 1970) PP. 16-27.
5. V.M. Dandekar & N.K. Rath "Poverty in India: Dinensions and Trends" Economic and Political Weekly (Jan., 1971) PP. 25-48; 106-146
6. Federation of Indian Chamber of Commerce, Planning for Results (Delhi, 1972).
7. B. S. Minhas, "Rural Poverty, Land Redistribution and Development : Facts and Policy" Indian Economic Review (April,1970)PP. 97.128
8. P. K. Bardhan, "On the Incidence of Poverty in Rural India" Economic and Political Weekly, Annual (Feb., 1973) PP. 245-54.
9. I. Z. Bhatty, "Ineqality and Poverty in Rural India" Sankhya (1974) PP. 291-336.
10. P. Chandhuri, The Indian Economy : Poverty and Development (Delhi, Vikas, 1978). See Part 2 (PP. 177-212)
11. P. D. Ojha & V. V. Bhatt, "Some Aspects of Income Distribution in India", Bulletine of the Oxford Institute of Economics and Statistics (Aug., 1964) PP. 229-38.
12. K. Ramadive, "The 'Equality' of Incomes in India", Bulletine of the Oxford Institute of Economics and Statistics(May, 1965) PP. 119-34.
13. M. Ahmed&N. Bhattacharya, "Size Distribution of Percapita Personal Income in India" Economic and Political Weekly (Aug, 1972)PP.1581-88
14. National Council of Applied Economic Research, All India Consumer Expenditure Survey 1964-65 (New Delhi, 1966)
15. లారంజ్ గుణకము ఆదాయ అసమానత గుణకము.



X – లక్ష్యము పై వరుసగా కలిపిన జనాభా శాతము (Cumulative Percentage of Population) Y – లక్ష్యము పై వరుసగా కలిపిన ఆదాయ శాతము (Cumulative Percentage of Income) గ్రహింపబడినవి.

1. సంపూర్ణ సమానత రేఖ
2 లారంజ్ రేఖ ,(Lorenj Curve)
3 సంపూర్ణ అసమానత రేఖ.

సంపూర్ణ సమానత రేఖ లారంజ్ రేఖల మధ్యగల స్థల వైశాల్యము (A~ సంపూర్ణ సమానత రేఖ సంపూర్ణ అస

మానత రేఖ మధ్యగల స్థల వైశాల్యము (B) ల విస్తృతి (అనగా A / B) లోరంజ్ గుణకము (Lorenz Ratio).

16. ఈ పట్టికలోని విభజన ప్రస్తుత రచయితచే చేయబడినది.

17. Delhi Statistical Hand Book, 1975.

18. అధోజ్ఞాపిక 9 చూడుడు.

19. Jandhyala B. G. Tilak, "Inequality in Human Capital Formation in India" in a Volume being Prepared by Andhra University, Waltair in honour of Prof. B. Sarveswara Rao (Forth coming); "Literacy, Education and World Development", Eastern Economist (Aug. 1977) PP. 355-59; "Poverty, Inequality, and Education" (unpublished manuscript); "Regional Inequality in Literacy in India" (Unpublished manuscript); "అక్షరాస్యత : అభివృద్ధి" భారతి (June., 1977) PP. 25-28; మరియు T. I. Ribich, Education and Poverty (Washington, Brooking Institution, 1968) చూడుడు.

20. Statistical Abstract of India 1976 (New Delhi)

21. Draft Fifth Five Year Plan 1974-79 (New Delhi)

22. అధోజ్ఞాపిక 5 చూడుడు.

23. V. V. Giri, Jobs for our Millions, (Madras, Uyas Publications, 1970).

ప్రాకృతవాఙ్మయంలో రామకథ-2

(31 వ పేజీ తరువాయి)

ప్రతిమాలుతాడు. కాని, సీత నిరాకరించి, తనవెంట్రుకలు పీక్కొని జైనదీక్ష స్వీకరించడానికి నిర్ణయిస్తుంది. రాముడు మూర్ఛపోతాడు. సీత సర్వగుప్తుడనే మునిని ఆశ్రయించి, జైనదీక్ష స్వీకరిస్తుంది. రాముడు స్మృతివచ్చిన తర్వాత సీతాన్వేషణకు బయలుదేరుతారు. కాని, సకలభువనముని అతనిని ఊరడిస్తాడు.

పఉమ చరియంలో రామకథా నిర్వహణం ఈ విధంగా ఉన్నది.

రత్నమాల, మణిమాలులనే ఇద్దరు దేవతలు రామలక్ష్మణుల సౌభ్రాత్రపరీక్ష చేయదలచి రాముడు మరణించాడనే మిథ్యా వార్తను చెబుతారు. ఆమాట విన్నవెంటనే లక్ష్మణుడు శోకాకులుడై మరణిస్తాడు. నరకానికి వెళ్ళుతాడు. లక్ష్మణుని అత్యేష్టి తర్వాత రాముడుకూడ విరక్తుడవులాడు: లవణాంకుశులు కూడ విరక్తులవు లారు. రాముడు లవణుని పుత్రుడైన అంగరాహునికి పట్టంకట్టి 17 వేల సంవత్సరాలు వారి తపస్విగా దేశం తిరుగుతూ కోటిశిలచేరి, లక్కడ సీతామోహాన్నివదలి, కేవలజ్ఞానం పొందాడు. చివరకు నిర్వాణం పొందాడు. చివరకు లక్ష్మణుడు, రావణుడు, సీత పెక్కుసార్లు జన్మలెత్తి ముక్తి పొందుతారు.

మహావీరుడు చెప్పిన రామచరితాన్ని విమలుడు గాథానిబద్ధం చేశాడు అని ఒక శార్దూలంతో ముగిస్తాడు.

ఏయం వీర జిణేణ రామ చరియం
  సిద్ధం మహత్థం మారా
పచ్ఛా ఇంద భూఇణా ఊకహియా
  సీసాణధమ్మాసయం,
భూఓ సాహుపరంపరాఏ సయలం
  లోఏ ఠిడియం పాయడం
ఏత్తేహిం విమలేన సూత్త సహితం
  గాహానిబద్ధం కయం (118-102)

(ఇంకా వుంది)

చెల్లించండి రు. 24

ఆగస్టు 1978 నెలకు

మొదటి నెల వాయిదా సొమ్ము ఆ తదుపరి గెలుపొందండి :

1,00,000 [ఒక బహుమతి] **2,000** [ఒక బహుమతి]

1,000 [61 బహుమతులు] ఇంకను **1800** యితర బహుమతులు



7 ఆగస్టు 1978న లేక ప్రతి 2వ నెలలో రు. 1,00,000లు లేదా ఇతర బహుమతులు 95 000 ల వరకు మొదటి నెల నుండి 60 నెలల డ్రాలలో గెలుపొందవచ్చును.

త్వరపడండి!

నేడే మొదటి వాయిదా రు 24/- చెల్లించి తదుపరి 22 నెలలు. నెలకు రు. 20 వంతున మొత్తము రు. 464/– మాత్రమే పూర్తి పథకమునకు చెల్లించండి. మీరు మీ బహుమతి గెలుపొందకపోయినప్పటికి మీ పొదుపు సొమ్ముతో పాటు స్పెషల్ బోనసుగా రు. 250 లు అదనంగా మీరు వాపసు తీసుకోవచ్చును

7 జులై 1978 వరకు నిరీక్షించవద్దు. ఈ పద్మావతి గ్రూపు

7 జులై 1978 తేదీన లేక అంతకుముందే పూర్తి కావచ్చును.

ఇతర వివరములకు సమీపంలోని గుజరాత్ సేవింగ్స్ వారి బ్రాంచిలేదా ఏజంటును సంప్రదించండి.

"గుజరాత్ సేవింగ్స్"

5-1-751, బ్యాంకు స్ట్రీట్, కోఠి
తాజ్‌మహల్ హోటల్ ఎదురుగా, హైదరా
బాదు-500001, టెలిఫోను : 57406
గాంధీనగర్, బిసెంట్ రోడ్డు, విజయవాడ-3
ఫో. 72159, 46-22-5 స్టేషన్ రోడ్డు.
దొండపర్తి, విశాఖపట్నం-
1-6-51, మార్కెట్టురోడ్డు, క్లాక్ టవర్
వద్ద, జగిత్యాల, కరీంనగర్ జిల్లా, సుబేదార్
క్లినిక్ మేడపైన, గాంధీచౌక్. నిజామాబాదు.
1-6-5, వాస్త్రీ రోడ్డు, కరీంనగర్,
రాష్ట్రపతి రోడ్డు, నల్గొండ.
3-8-27, షా బజార్, మహబూబ్‌నగర్,
23/11-40 నేరెళ్ల భవనం, ఎన్నూరు
బజారు, గుంటూరు-3.
18/177, నెహ్రూ రోడ్డు, కర్నూలు.
8-24-151 కె. వి. పి. భవనము,

మెయిన్ రోడ్డు, రాజమండ్రి.
71, చంద్రలోక్ భవనము
111 సరోజినీదేవి రోడ్డు. కోరమండల్
ఎదురుగా, సికింద్రాబాదు.
బస్సు స్టాండు దగ్గర, పి. ఓ. నిర్మల్.
21-186 షావుకార్‌ఫకీర్‌సాహెబ్‌స్ట్రీట్, కడప.
37-1-238, ట్రంకు రోడ్డు, ఒంగోలు.
రాజ భవనము, మునిసిపల్ బస్సుస్టాండు,
శ్రీకాకుళం.
7-142 ప్రకాశ్ రోడ్డు, అనంతపురం.
15 ఎ. వి. మునిసిపల్ భవనం.
ట్రంక్ రోడ్డు, నెల్లూరు.
8-3-51సుందర్‌టాకీసురోడ్డు, ఖమ్మం-1.
ఆత్రేయ విలాస్, మెయిన్ రోడ్డు,
మచిలీపట్నం పి. ఓ.
గణేష్‌భవన్, హనుమకొండచౌరస్తా, వరంగల్.

బోసు రోడ్డు, రామకృష్ణ థియేటర్
ఎదురుగా, తెనాలి.
1-5-50 గంజ్ రోడ్డు, కామారెడ్డి.
ఎ. ఆర్. రావు భవనము, మెయిన్ రోడ్డు.
కాకినాడ.
ఆర్బస్ బ్యాంకు రోడ్డు, బాటా దగ్గర,
బరహంపూర్ - 1.
రఘురా హార్ దగ్గర, వేమారెడ్డి
భవనము, కాధిరి.
Road. No 3
వస్త్ర బజార్, ప్రొద్దుటూరు.
మునిసిపల్ భవనము, మేడమీద
ఒంగోలు.
పి. వి. యస్. వసిష్ఠన్ శెట్టి
సెరన్ వీధి, చిత్తూరు.

హెడ్ ఆఫీసు : 518, కల్బాదేవి రోడ్డు. బొంబాయి 400 002. టెలిఫోను : 310605_310533 టెలిగ్రాము ; గుజరాత్ యూనిట్

శ్రీ ఎమ్. పార్థసారధి

కౌగిలి

(గత సంచిక తరువాయి)

ఇది రాజీ కాదు

ట్రాన్స్‌ఫర్‌కోసం అర్జీ పెట్టుకున్న తర్వాత సుమారు వారం రోజులకు —

ఒక సాయంత్రం బాలూ మనోరమను యింటి దగ్గర డ్రాప్ చేసి టాంక్‌బండ్ మీద పచార్లుచేసి పదింటికి వచ్చాడు.

అప్పటికి వంటయింది. కుర్రాడు పడుకున్నాడు. మనోరమ ఏడుస్తున్నది. అతడు తలుపు తీసేసరికే ఏడుపుతో ఉబ్బిన ఆమె మొహం కనిపించింది. అతడికి కనిపించకుండా కన్నీళ్లాపుకో ప్రయత్నించింది కాని ఫలితం లేకపోయింది.

బాలూ యివన్నీ చూసీ చూడనట్టుగా వున్నాడు. అన్నం వడ్డించగానే భోంచేశాడు. "నువ్వు తిన్నావా?" అన్నాడు. ఆమె మాట్లాడలేదు. అతడు వచ్చి మంచం మీద కూర్చోగానే ఆమె సినిమా పద్ధతిలో నేలమీద అతని కాళ్లదగ్గ కూర్చుని బిగ్గరగా ఏడ్చింది.

"బాలూ, నువ్వు వెళ్లొద్దు. మన పిల్లాడిమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నువ్వు వెళ్లిపోవద్దు. నీకేం కావాలంటే అది చేస్తాను. నువ్వెలా వుండమంటే అలా వుంటాను. ఉద్యోగం మానెయ్యమన్నా మానేస్తాను. కాని నువ్వు నన్ను విడిచిపోవద్దు" అంది.

ఈ పశ్చాత్తాప ప్రకటనలూ, కలుసుకోవటాలూ, ఓదార్పు మాటలూ పాతబడి పోవటం వల్లనేమో బాలూ ఈసారి ఆమె ఏడుపు చూసి సంతోషపడలేదు. పైగా, 'ఇది మరేదైనా కొత్త "ప్లాన్" కాబోలు' నని కూడా అనుకున్నాడు.

"నువ్వేం చెప్పినా, ఎంత ఏడ్చినా నేను మూవ్ కాను. నీ పద్ధతి, నీ వైఖరి మారిందా లేదా అనే విషయం ఒక్కనాటి మాటల్తో తెలియదు. అది నీ దినచర్యలో, నడవడిలోనే తెలుస్తుంది. నిన్నేదో మోసం చేసి, అధికారం చెలాయించి, నా దగ్గిర బానిసను చేసుకోవాలని నాకు లేదు. నువ్వు అందంగా వుండొద్దనీ, అనాకారివి కావాలనీ నేననటం లేదు. కాని నీకూ కొన్ని బాధ్యతలున్నాయి అందాన్ని నలుగుర్నీ వెంటేసుకుని తిప్పుకోవటానికి వాడుకోవటం చాలా నీచం. ఇంక నువ్వు వాగ్దానాలు చెయ్యకు. నేను వినను. విన్నా నమ్మను. పైగా స్వభావాలు మారటం అంత సులభంకాదు. నీ ప్రవర్తనవల్ల నా యిమేజ్ ఎంత దిగజారిందో నీకు తెలుసు. ఎందరిముందు నేను చులకనయ్యానో తెలుసా? ఇప్పుడు ఏమి చేసి నేను వెనకటి యిమేజ్ సంపాదించుకోలేను. అందుకే వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాను. కుర్రాడిభారం నీమీద వేస్తానని దిగులుపడకు. నీకు యిక ఏ రకమైన బంధాలూ వుండవు. నీకిష్టమైతే వాణ్ణి నీ దగ్గిరుంచుకో. లేదా ఏ రెసిడెన్షియల్ స్కూల్‌లోనో వేస్తాను. పైగా ట్రాన్స్‌ఫర్ అడిగినా యిప్పుడే వచ్చిందా ఏం? కనీసం ఆర్నెల్లన్నా పడుతుంది. ఈలోగా యింకా ఏమేమి వింతలు చూడాలో! అందువల్ల వెళ్లు ఈ ప్రార్థనలు అనవసరం నేను నీ బాస్‌ను కాను మనం ఫ్రెండ్స్‌లాగా బ్రతకాలనుకున్నాను. ఒకరి కొకరం వుపయోగపడాలనుకున్నాను."

మనోరమ ఏడుపు ఆపి,

"అలాకాదు బాలూ, నీకేం కావాలో చెప్పు. అలా చెయ్యక పోతే అప్పుడు నువ్వు నాకు డైవోర్సిచ్చినా వొప్పుకుంటాను" అంది.

"కాని మనూ, నేనెక్కడికి వెడతాను? ఇన్నేళ్ల సర్వీస్‌లో ఈ వుద్యోగం వొదిలిపెట్టలేను ఇంకా ట్రాన్స్‌ఫర్‌మీద నేనేవూరికి పోయినా నువ్వూ నావెంటబడి వస్తే నేనొద్దనలేను. నీవల్ల నాకు కలిగిన అవమానాన్నించి తప్పించుకోవటానికి ఇదొక తాత్కాలికమైన పరిష్కారం మాత్రమే. పైగా నేను నీకొక షీల్డ్‌లాగా పని చేస్తున్నాను. నా అవసరాలకు పనికిరాని నువ్వు నా కనవసరం. నువ్వు నన్ను బెదిరించవచ్చు. కోర్టుకు పోవచ్చు. కాని నేనూ రెడీ అవుతున్నాను. నీ సరదా మనస్తత్వం, నీ సోషల్ లైఫ్ అన్నీ బాగానే వున్నాయి. కాని నేను ఆఫీసరుకు పోటీ యిస్తానన్నప్పుడు మాత్రం నువ్వు పతివ్రతవై పోయావు."

ఆ తర్వాతి రోజుల్లో బాలూ ఈ రాత్రి వున్నంత కోపంగా లేడు. అందుక్కారణం, మారినట్టుగా అతనిక్కనిపించిన మనోరమ ప్రవర్తన కావచ్చు. లేదా, ఎలాంటిదైనా సరే, రోజులు—రాత్రులు — ఎందుకు వృధా చెయ్యటం — తనకై తాను ప్రాధేయపడినప్పుడు ఆమెను ఎందుకు వదిలి పెట్టటం అనీ కావచ్చు. కలిసి రెండు మూడుసార్లు సినిమాలకు కూడా వెళ్లారు. ప్రేమోద్రేకంలో కొట్టుకు పోకపోయినప్పటికీ ఎప్పుడూ కీచులాడుకోలేదు— అందుకు మనోరమ అవకాశం యివ్వలేదు.

జననం ముదావహం

మరో రెండు నెలలు గడిచాయి. కుర్రాడి బర్త్‌డే జరిగింది. కొలీగ్స్ కొందరు వచ్చారు. ప్రెజెంట్స్ దండిగా వచ్చాయి. బాలూ మనోరమకు బనారస్ సిల్కుచీర కొన్నాడు. ఆ తర్వాతి నెలలో మనోరమ తన జీతంతెచ్చి బాలూ కివ్వబోయిందిగాని బాలూ తీసుకోలేదు. ఇంటి ఖర్చులో ఆమె కూడా చాలా మట్టుకు భరించింది మనోరమ చిల్లర ఖర్చులు తగ్గించినట్టుగానే తోచింది బాలూకు.

మనోరమకు మళ్ళీ నెల తప్పింది.

ఆ విషయం బాలూకు చెబితే అతడు, "నీయిష్టం. త్వరగా అబార్షన్ చేయించుకుంటే క్షేమమనుకుంటాను అసలు ఇలాంటిది జరక్కుండా నువ్వు ముందే జాగ్రత్తలు తీసుకోవాల్సింది" అన్నాడు.

"నీ కింకా అనుమానం పోలేదు కదూ!" అంది మనోరమ.

"ఆర్గ్యుమెంట్లు అనవసరం. నువ్వు పిల్లలు కావాలను కుంటే కంటావు. లేదంటే మానేస్తావు నాకు చెప్పకు" అన్నాడు బాలూ.

ఈసారి బలవంతాలన్నీ మనోరమవే, ఆమె అడిగితేనే బాలూ ఆమెను డాక్టర్ దగ్గరకు తీసికెళ్ళాడు. కావలసిన మందులు అతనే కొనుక్కొచ్చాడు. "ఈవిడేదో ప్లాను వేస్తున్నది" అనే అనుమానం అతనికి పోలేదు. కాకపోతే జరిగినన్నాళ్ళు, ఆవిడ సుముఖంగా వున్నన్నాళ్ళు తనూ వుండవచ్చునని నిశ్చయించుకున్నాడు.

"ఇదిగో గర్భవతిని సంతోషంగా వుండాలి. నువ్విలా సీరియస్‌గా మొహం పెడితే నాకెంత బాధగా వుంటుందో తెలుసా? నాకు భయమేస్తుంది" అంది మనోరమ.

"అది మనసులో వుంటుంది సినిమాలు చూస్తే హోటల్లో భోంచేస్తే రాదు" అన్నాడు బాలూ.

తండ్రికి అనారోగ్యంగా వుందని తెలిసి మనోరమ ఒకసారి మారేడ్‌పల్లికి వెళ్ళింది. అప్పుడామెకు ఎనిమిదో నెల. ఆఫీసునుంచి యింటికిపోయే బస్‌స్టాప్‌లో దిగి రిక్షా తీసుకుంది రిక్షా వంద గజాలన్నా పోకముందే ఎదురుగా లారీవచ్చింది. తప్పించుకోవటానికి రిక్షావాడు పక్కకు తిప్పాడు. యాక్సిడెంట్ జరిగింది మనోరమ కిందపడింది. పెద్ద గాయాలేమీ తగల్లేదు. ఎలాగో యింటికి చేరుకుంది. ఆ రాత్రి ఆమెకు నొప్పులు వచ్చాయి. మెటర్నిటీ హోం చేరగానే సిజేరియన్ ఆపరేషన్ చేశారు. ఇంకా నెలలు నిండని పిల్ల— ఆడపిల్ల — పుట్టింది. ఈ విషయం తెల్లారితేగాని బాలూకు తెలియలేదు.

పిల్లను ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో పెట్టారు. డాక్టర్లు ప్రమాదం లేదన్నారు. కాని కనీసం ఒక నెలరోజులైనా అక్కడ వుండాలి. మనోరమ చేతులకూ కాళ్ళకూ స్వల్పమైన గాయాలు తగిలాయి. తొడదగ్గర కీలు సడలింది. జ్వరం వచ్చింది గాయాలకు కట్లు. ఆపరేషన్ తర్వాతి నీరసం, జ్వరంతో మనోరమ ఆర్నెల్లనుంచి మంచం పట్టిన మనిషిలా వుంది.

"డోంట్ వర్రీ డార్లింగ్. ఎవిరీ థింగ్ విల్ బి ఆల్‌రైట్" అన్నాడు బాలూ. ఆమెకు రాత్రంతా నిద్రలేదు. అప్పుడే యింజెక్షన్ యిచ్చారు. తల్లి వుదయం వచ్చి వెళ్ళింది తండ్రికి జబ్బుగా వుంది. అప్పుడామె దగ్గర ఎవరూలేరు.

"ఔట్ ఆఫ్ డేంజర్ అన్నాం కదా! కాకపోతే పిల్లకు కొద్దిగా బ్రెయిన్ డామేజ్ జరిగినట్టుగావుంది. పరీక్షలు చేస్తేకాని ఆ విషయం స్పష్టంగా చెప్పలేం. ఒకవేళ నిజంగా డామేజ్ జరిగినప్పటికీ అది సెట్‌రైట్ కావటానికీ, డెవలప్ కావటానికీ కాస్త టైం తీసుకుంటుంది. బహుశా రెండు మూడేళ్ళు. ఆ సమయంలో మీరు కొంత ప్రత్యేకశ్రద్ధ చూపించారంటే కొద్ది సంవత్సరాల్లో అంతా నార్మల్ ఐపోతుంది" అన్నారు డాక్టర్లు.

బాలూ మాట్లాడాలనుకున్నాడు. కాని మనోరమ యింజెక్షన్ ప్రభావంతో నిద్రలో వుంది కాసేపు కూర్చుని 'మేం చూస్తాం లెండి, డోంట్ వర్రీ.' అని నర్సు చెప్పగానే బాలూ ఆఫీసుకెళ్ళిపోయాడు.

కౌంట్ డౌన్-10... ...

మొదట అనుకున్న దానికన్నా మరో పదిహేను రోజులు ఎక్కువేవుంది మనోరమ హాస్పిటల్లో. కుట్లు విప్పేసరికే యిరవై రోజులు గడిచాయి. పిల్లను ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌నుండి తెచ్చి తల్లపక్కన పడుకోబెట్టారు. మనోరమ హాస్పిటల్లో వున్నన్నాళ్ళూ రోజుకు రెండుసార్లు వెళ్ళి చూసొచ్చేవాడు బాలూ. ఆపరేషన్‌లో, నెత్తురు పోవటంతో అసలే సన్నగావున్న మనోరమ మరీ అస్థిపంజరంలాగా అయింది (సన్నగా వుండి అందంగా వున్నవాళ్ళు ఎంత వికారంగా తయారవుతారో చూస్తేగాని తెలియదు. మనోరమ విషయంలో సరిగ్గా అలాగే జరిగింది.)

"బాలూ, హాస్పిటల్ బిల్లు పే చెయ్యాలి"

"ఈ నెలలో యిచ్చేద్దాం. ఎంత?"

"పన్నెండు వందలు."

బాలూ అదిరిపోయాడు. .

"ఔను మరి. మామూలు డెలివరీకే వాళ్ళు వందరూపాయలు తీసుకుంటారు. అలాంటిది ఆపరేషన్, బేబీని నెలరోజులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచటం—రూం చార్జెస్ చూసినా రెండు వందలకు పైగా అయ్యాయిగదా!"

"ప్రయత్నిస్తాను. రెండు వాయిదాల్లో యిద్దాం. నీ జీతం వస్తుందిగదా? అదైతే యిచ్చేయి మొదట."

''ఏదిక్కడ నాకు? విన్నదాన్ని డక్టరు రోజు పిడిచి రోజు పరీక్ష చేస్తుంది. వెళ్ళిరావాలి. నాకు టానిక్కులంటారు, మందులంటారు, ఇంటి ఖర్చులు. పిల్లాడి గోల ఎక్కువగా వుంది. ఎంతసేపూ వాడి పని అమ్మ చూడటమే — ప్చ్! నాకూ యిక్కడ వుండడం బాగాలేదు. ఎంత కూతురైనా వాళ్లకూ విసుగొస్తుంది. అక్కడి కొద్దామంటేనేమో యింట్లో ఎవరూలేరు. నేనొక్కదాన్నే ఎలా చూసుకోను? అసలు అన్ని మెళ్లెక్కే ఓపికైనా లేదునాకు.''

''ఏం ఇన్నాళ్లూ వాళ్లకు డబ్బిచ్చావు, చీరలు పెట్టావు, మీ తమ్ముణ్ణి చదివించావు. ఇప్పుడు ఆ మాత్రం సాయం చెయ్యలేరా?''

''ఏం చెయ్యను? వాళ్లతో అవన్నీ అడగనా? వాళ్లకు స్వయంగా ఆ ఆప్యాయత వుండాలిగాని! నువ్వన్నా యిలా చుట్టపు చూపులా వారానికోసారి రాకుండా కాస్త వీలు చేసుకొని రోజూ వచ్చి పోకూడదూ! నాకేమిటో యిక్కడ ఒంటరిగా, బెంగగా వుంటోంది. వీదారికే నిన్ను గురుంటాడు. చూస్తూ చూస్తూనే సెలవులన్నీ ఐపోయేట్టున్నాయి. అప్పటికైనా నాకు ఒంట్లో సత్తువొస్తుందో రాదో! వచ్చినా ఈ చిన్నదాన్ని ఎక్కడ వదిలిపోవాలో తెలియటం లేదు. కాని చేరకపోతే జీతంరాదు. నీకు తెలుసుగా, నాకు సెలవులన్నీ ఐపోయాయి. ఈ ఖర్చులతో, పిల్లలతో, అనారోగ్యంతో ఏం చెయ్యమంటావు బాలూ?'' అంది.

ఆమె మామూలుగానే మాట్లాడుతోంది గాని వెల్లకిలా పడుకున్న ఆమె కళ్లనుండి నీరు కారుతోంది

''ఏదో ఆలోచిద్దాం. అలా ఏడవకు'' అన్నాడు బాలూ ఆమె కన్నీరు తుడుస్తూ.

''చేతి ఖర్చుక్కూడా నా దగ్గర డబ్బులేదు ఉంటే ఓ పాతిక రూపాయలిచ్చిపో'' అంది.

''అయ్యో, ఇప్పుడు లేవు. రేపు తెస్తాలే'' అన్నాడు.

ఆమె తలగడక్రిందినుండి ఓ చీటీ తీసి,

''ఇదిగో డాక్టరు రాసింది. ఇవన్నీ కావాలిట'' అంది.

'ఉండనీ. ఉండనీ, చూద్దాం తీసుకొద్దాంలే'' అన్నాడు బాలూ.

9

బాలూ తను పలుకుబడి గలవాణ్ణనీ, కొన్ని పనులు సాధించగలననీ రుజువు చేసుకున్నాడు. ఆఫీసర్లను పట్టుకుని, వారిద్వారా మరెవర్నో పట్టుకుని, డాక్టర్లను పట్టుకుని మొత్తంమీద మెటర్నిటీ బిల్లులో మూడువందలు తగ్గించాడు. మరికొంత డబ్బు రీ-ఇంబర్స్‌మెంట్ కింద క్లెయిమ్ చేశాడు. స్పెషలిస్టుల దగ్గరికి వెళ్లినప్పుడు వాళ్లకు ఆ పరిచయాలూ, ఈ పరిచయాలూ గుర్తుచేసి, బొంకి కన్సల్టేషన్ ఫీజు ఎగేసి వచ్చాడు గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో పనిచేసే డాక్టర్లను యిళ్ల దగ్గరా వాళ్ల క్లినిక్స్‌లోనూ కలిసి, హాస్పిటల్స్‌లో ఫ్రీగా టెస్ట్‌లన్నీ చేయించాడు. కాని మనోరమ యిప్పుడు స్కూటర్‌మీద కూర్చోలేదు. అందువల్ల సమీపంగావున్న చోట్లకు రిక్షాలోనూ, దూరంగావుంటే ఆటోల్లోనూ వెళ్లినా బోలెడు ఖర్చయింది. బాలు ఈ మాత్రమైనా పొదుపు చెయ్యకపోతే ఖర్చు రెట్టింపు అయ్యేదనటానికి ఏమీ సందేహంలేదు.

''విన్నావుగా, స్పెషలిస్టు అందరూ చెప్పేదేమిటంటే, మెదడు ఎదుగుదల తక్కువగా వున్నదట. కాని ఫలాని ట్రీట్‌మెంట్ అంటూ చెప్పటానికి ఇంకా ఆర్నెల్లయినా కావాలంటున్నారు. అప్పటిదాకా యిలా వుండాల్సిందే'' అన్నాడు బాలూ.

ఒకప్పుడు శోభనరాత్రి గడిపిన ఆ గదిలో పిల్ల కూర్చుని వుండగా, మనోరమ చెప్పింది నిజమనిపించేటట్టుగా, లేదా మనోరమా ఆమె తల్లీ కలిసి నాటక మాడుతున్నట్టుగా, మనోరమ తల్లి భర్తతో చెబుతోంది :

''రాత్రికి పాలుకావాలి. ఎలామరి, ఆదేమో డబ్బివ్వదు. ఇద్దరూ వుద్యోగాలు చేస్తున్నారు వాళ్లకే డబ్బుల్లేనప్పుడు మన దగ్గిర ఎక్కణ్ణుంచి వుంటాయి? బాగానేవుంది గొడవ, ఏదో మనిషి సాయమంటే వుంటాం గాని డబ్బులెక్కణ్ణుంచి తెస్తాం?'

''ఛీ. ఛీ, మనుషు లింత నీచంగా వుంటారనుకోలేదు'' అన్నాడు బాలూ గొంతు తగ్గించి.

''రేపు వచ్చేటప్పుడు మరో రెండు చీరలు తీసుకురా. అక్కడ కబర్డ్‌లో వూరికే వుంటే ఏం చేస్తాయి'' అంది మనోరమ.

బాలూ మాట్లాడలేదు.

''ఎక్కడ తింటున్నావు? వండుకుంటున్నావా?'' అంది మనోరమ మళ్లీ.

బాలూ కొంత విసుగ్గా, కోపంగా,

''నాకు హోటల్లో తినే సరదాలేదు. డబ్బు వృథా చెయ్యటంలో నాకు సంతోషం కనిపించదు. లేనప్పుడు నేనెవర్నీ అడుక్కోను, వున్నప్పుడు నాలుగురాళ్లు వెనకేసుకుంటాను తప్ప'' అన్నాడు.

పిల్ల ఏసగుసలాగా చప్పుడు చేసింది. ఆ పిల్లకు యింకా ఏడవటంరాదు. పాలు తాగటం కూడా యిప్పుడిప్పుడే నేర్చుకుంటోంది. మనోరమ యిబ్బందిగా లేచి కూర్చుని పిల్లకు రొమ్ము పట్టింది.

''దీన్ని చూస్తే నాకు భయంగా వుంది. మామూలుగా పెరుగుతుందో లేదో!'' అంది.

''ఏదైనా వైకల్యంవున్న పిల్లలు త్వరగా చచ్చిపోవటం మంచిది'' అన్నాడు బాలూ.

"ఛీ. ఛీ. ఏదేంమాట'' అంది మనోరమ అనాలోచితంగానే కూతుర్ని దగ్గరకు అదుముకుంటూ.

"కాదు. జీవితమంతా పరుల దయమీద ఆధారపడటంకంటే బ్రతకటంకన్నా త్వరగా చావటం మంచిది'' అన్నాడు బాలూ.

ఈలోగా చీమిడి కారుతున్న ముక్కుతో కొడుకు వచ్చాడు!

"ఇడుగో, ఇలా వుంది వీళ్ల ఆలనా, పాలనా ఎంత శ్రమో. ఏ ఛీ!'' అన్నాడు.

8

ఆ మరుసటి నెలలో బాలూ మనోరమను చూడటానికి రెండే రెండుసార్లు వచ్చాడు. అలా, రెండోసారి వచ్చినప్పుడు,

"నువ్వు...చిట్‌ఫండ్ కంపెనీలో చిట్ వేసుకున్నావు గదూ!'' అన్నాడు.

"ఏమైందని?'' అంది మనోరమ.

"గత నాలుగు నెలలుగా వాయిదాలు కట్టటంలేదట. బహుశా నీ కిక్కడికే రిమైండర్లు వచ్చివుంటాయి. ఈ నెల—అంటే మొన్న—రామారావు వున్నాడు చూశావా—అతడికి కంపెనీవాళ్లు లీగల్ నోటీస్ పంపించారు. అతనేవరూ—షూరిటీ కదూ?'' అన్నాడు బాలూ.

మనోరమ మాట్లాడలేదు.

"ఇదంతా నీకు చెప్పాలని నేను రాలేదు. ఆయన నా దగ్గరకు వచ్చి అడిగాడు. ఆ నోటీస్ చూపించాడు. నీకు చెప్పమన్నాడు.

"ఏదో కొలీగ్స్ గదాని సంతకం పెడితే, నా గొంతుమీదకు తెస్తారండీ'' అన్నాడు. ఏం చేస్తావో చెప్పు. పదిహేను రోజుల్లోగా కట్టకపోతే జీతానికి ఎటాచ్‌మెంట్ వస్తుంది. నాలుగు నెలల బకాయి ప్లస్ వడ్డీ.''

మనోరమ ఈసారి కూడా మాట్లాడలేదు.

"బహుశా యిలాంటి సహాయాలకే కాబోలు, నువ్వు వాళ్లతో అంత స్నేహంగా, అంత సన్నిహితంగా వుండేదానివి కాబోలు.''

"ఇప్పుడవన్నీ చెప్పి, ఇంకా నన్నెందుకు బాధిస్తావు?'' అంది మనోరమ విరక్తిగా.

బాలూ కోపం అణచుకోలేకపోయాడు.

లేదు. సాధించడం లేదు. నాకు అలాంటి సరదాలేం లేవు.

నువ్వెందుకు చిట్ తీసుకున్నావో నాకు తెలియదు. ఆ డబ్బులేం చేశావో నాకు తెలియదు. అసలు రామారావు చెప్పిందాకా నీకా చిట్ వుందనే విషయమే నాకు తెలియదు. ఇప్పుడవన్నీ మాట్లాడకూడదు. సరే, ఆ డబ్బు కట్టేయ్యమని కూడా నేనడగటం లేదు. అతడు చెప్పిన విషయం మాత్రమే నీతో చెప్పాను. హుం, ఇంత జరిగినా యింకా నీ అహంకారం మాత్రం చావలేదు. వాడూ, నువ్వూ కలిసి ఏ గంగలోనైనా సరే పడి చావండి. గాని నాకు ఆ డబ్బుల గొడవమాత్రం చెప్పకు. నువ్వు కేవలం డబ్బులు గుంజటం కోసమే నన్ను చేసుకున్నావనటానికి యింతకన్నా యింకేం రుజువక్కర్లేదు. బహుశా నువ్వు అతడితో కబుర్లుచెప్పటంలేదుగనుకా, ఇప్పుడు నీతో అతడి అవసరం లేదండి గనకా ఈ విషయాలు నాకు చెప్పాడు. నేనురాగానే వూరికే నన్ను డబ్బులడక్కు. నీ అరేంజిమెంట్స్ నువ్వే చేసుకో. ఆ మూలనుండి ఈ మూలకు రావాలంటే నాకు పెట్రోలు ఖర్చుకూడా దండిగా అవుతుంది. తీరా వస్తే నువ్వు మాట్లాడే పద్ధతి యిది. చెప్పే కబుర్లు యివి. సెలవు అయిపోగానే నువ్వు ఆఫీసులో జాయిన్ కావటం మంచిది. కనీసం నీ పోషణకన్నా డబ్బులు వస్తాయి. కాని ఆ విషయం కూడా నేను నొక్కిచెప్పటంలేదు. నీ యిష్టమైతేనే జాయిన్ అవ్వు నన్ను మాత్రం డబ్బులడగొద్దు. ప్రతిసారీ కుర్రాడున్నాడని చెప్పకు. నీ కంత భారంగావుంటే వాణ్ణి ఏ బోర్డింగ్ స్కూల్లోనో చేర్పించేస్తాను'' అన్నాడు రేసూ.

"కూర్చో కూర్చో. డబ్బుల సంగతి సరే. ఈ పిల్లలకు, ఈ డబ్బులకు, ఆపరేషనుకు, మందులకు అన్నింటికి బాధ్యత నీదే గదూ! అలాగే అను'' అంది మనోరమ.

"దుబారా ఖర్చులకూ, ఎకౌంటులకూ, సొమ్ముపోగొట్టుకోకపోవటానికే బాధ్యత నీదే. నీదే. అందుకు సందేహం లేదు'' అన్నాడు బాలూ.

మనోరమ కాసేపు ఏడ్చి, కోపంగా ఏదో అనాలనుకొని మానేసింది.

7

బాలూ మొదట బెట్టు చేశాడు గాని, తీరా మరో మనిషి పెళ్లి అని పెళ్లాంతో సహా వెళ్లిపోతుంటే తెలిసి తట్టుకోలేకపోయాడు. ఓ రోజు వెళ్లి మనోరమను చూడటానికి వెళ్లి, మెటర్నిటీ లీవు అయిపోగానే వెంటనే వచ్చి జాయినైపోయి, ఒక పైసా కూడా వృధా చెయ్యక, రాలా పొదుపుగా గడిపే ఒప్పందం మీద ఆమె నగలు తీసికెళ్లి ఎక్కడో కుదువు పెట్టి ఆ చిట్ డబ్బులు కట్టేశాడు.

మరో పదిహేను రోజులకు ఆమె జాయిన్ కావలసిన రోజు వచ్చింది. కాని లేచిబోతే కళ్లు తిరిగిపడిపోతోంది. ఒంట్లో ఏ మాత్రం ఓపిక లేదు బాలూ వచ్చి చూశాడు. తిట్టాలను కున్నాడు. కాని పరిస్థితి చూసి మాట్లాడలేకపోయాడు. మనోరమ ఒక నెల రోజులు లీవ్ విదౌట్ పే అప్లై చేసింది.

ఆ నెలలోనే పిల్లను తీసికెళ్ళి స్పెషలిస్టు డాక్టర్లకు చూపించారు – పిల్లలో ఏవిధా డెవలప్‌మెంట్ లేదు. ఈ వయసులో పిల్లలు నడుస్తారు. కాని ఈ పిల్ల కూర్చోవటం, నడవటం వదిలి మనుష్యుల్ని కూడా గుర్తుపట్టటం లేదు. సరిగా ఒళ్ళు ఎదగటంలేదు.

ఒక స్పెషలిస్టు ఆపరేషన్ చేస్తే బాగుంటుందన్నాడు. మరో స్పెషలిస్టు కొన్నాళ్ళు అబ్సర్వేషన్‌లో వుంచి, యించు మించు అదే అభిప్రాయం చెప్పాడు గాని, "ఇంత పిల్లకు ఆపరేష నేమిటి! ఈ ఇంజెక్షన్స్ ట్రై చెయ్యండి. ఇవి కాస్త స్లోగా పని చేస్తాయి కాని తప్పకుండా కొంత ఇంప్రూవ్‌మెంట్ వుంటుంది. మొగతా పిల్లల్లా పూర్తిగా ఎదక్కపోవచ్చు గాని – మీరైతే ఇవి వాడి చూడండి. తర్వాత మళ్ళ పరీక్ష చేద్దాం" అన్నాడు. ఇంజక్షన్లు చాలా ఖరీదైనవి. సంవత్సరాల తరబడి తీసుకోవాలి.

ఇవన్నీ విన్న మనోరమ పొరుగింటివాళ్ళు ఆమెకో సలహా చెప్పారు.

"ఇలాంటి జబ్బులు అలోపతిలో తగ్గవు. చిక్కడపల్లిలో ఒక ప్రసిద్ధ హోమియో వైద్యుడున్నాడు. అక్కడికెళ్ళండి. మావాళ్ళ పిల్లాడొకడు యిలాగే వుండేవాడు. ఆయనే నయం చేశాడు. ఇప్పుడు వాడు మామూలుగా అయ్యాడు" అన్నారు.

ఆ హోమియోపాత్ అమ్మాయిని రెండు రోజులు పరీక్షించి, "ఈ పిల్ల ఖచ్చితంగా మామూలు మనిషి అవుతుంది అందుకు నేను గ్యారంటీయిస్తాను. కాకపోతే టైంపడుతుంది. అంత దీర్ఘవైద్యం చేయించుకునే ఓపిక మీకుంటే చెబుతాను" అన్నాడు.

బాలూ దంపతులు చెప్పమన్నారు

"సుమారు పదేళ్ళు పడుతుంది. అది మాక్సిమమ్ పీ రియడ్. ఈలోగా కూడా బాగుపడవచ్చు ప్రతివారం నా దగ్గరికొచ్చి, పేషెంటును చూపించి మందు తీసికెళ్ళాలి."

బాలూకు హోమియోపతిలో నమ్మకం లేదు మనోరమ బలవంతంమీద వచ్చాడు.

మనోరమ "తప్పకుండా బాగుపుతుందా?' అంది.

"ఇదేం అమ్మే పనిలాలేదు" అన్నాడు బాలూ.

"అవును. నీకు ఇదంటేనే అసహ్యంగా వుంది. ఆరోగ్యంగా వున్న వాళ్లను చూస్తేనే ఎవరికైనా ప్రేమ. ఎప్పుడిది చస్తుందా అన్నట్టుగా వుంది నీకు. ఇలాంటివాళ్లమీద పెట్టే పెట్టుబడికి లాభం రాదుగా మరి – అందుకని" అంది మనోరమ.

6

ఒక సోమవారం వుదయం —

మెకెంజీ ఆఫీసుకు ఫర్లాంగు దూరంవున్న బస్‌స్టాప్‌లో దిగి, వెదురుబొంగుకు చీర కట్టినట్టుగావున్న ఒక స్త్రీ, అడుగులో అడుగు వేసుకుంటూ, ఎక్కడ తూలిపడిపోతానోనని భయ పడ్డట్టుగా, అతి నెమ్మదిగా, జాగ్రత్తగా నడుస్తూ మధ్యమధ్య స్తంభాలనూ, గోడలనూ పట్టుకుని మళ్ళీ నడక సాగించి ఆఫీసు చేరుకుంది. ఆమె కళ్ళు పీక్కుపోయి గమ్మత్తుగా, అసహ్యంగా వున్నాయి. జుత్తు నున్నకుంది కాని చాలా మట్టుకు వూడి పోవటంతో విగ్గుపెట్టుకున్నట్టుగా వుంది. సన్నగా పుల్లల్లాగైన చేతులూ -- ఇంతెందుకు – ఆమె అభిమానులు చాల మంది పక్కనే స్కూటర్ల మీద వెళ్లారు. ఆఫీసుకు టైమైపోయిందంటూ గబగబా నడుస్తూ వెళ్లారు. కాని ఆమెను గుర్తించనే లేదు. నడకలో, దూరం నించి చూస్తే ఇంకా కని పించకుండా వున్న ఆమె ఆనాటి తనం దగ్గరగా నిలబడి మాట్లాడితే స్పష్టమైంది. జాలిగా, అడుక్కుంటున్నట్టుగా చూసే ఆ కళ్ళూ, చెక్కిళ్ళు పీక్కుపోగా, ఎముకలకు అంటు కున్నట్టుగా వున్న మోహం, పెద్దగా తెరిచే ఆ నోరూ – ఒకప్పుడు వీనస్, ఆఫ్రోడైట్ కలిసి జన్మఎత్తినట్టుగా కనిపించిన మనోరమ ఆమె.

'నీకేం పిచ్చెక్కిందా? ఇలాంటి స్థితిలో ఆఫీసుకు రావట మేమిటి? వెళ్ళు. వెళ్ళు ఇంకా రెండు మూడు నెలల దాకా యిటు చాయలకు రాకు" అన్నారు స్నేహితురాళ్ళు.

"ఫరవాలేదు. ఇప్పుడు చాలా మెరుగు. రాగలనులే" అంది మనోరమ.

తెలియని వాళ్ళు ఆమె మొగుడి స్కూటర్ మీద కూర్చుని వచ్చిందనుకొన్నారు గాని ఆమె యింటి నుండి రెండు ఫర్లాంగులు నడిచి, బస్సుకోసం క్యూలో నిల్చుని, రద్దీగావున్న బస్సెక్కి సలభైఐదు నిమిషాలు నిలబడి ప్రయాణం చేసి వచ్చి దని తెలుసుకొంటే మరింత ఆశ్చర్యపోయేవారు.

ఇలాంటి వాళ్లను రోడ్డుమీద చూడొచ్చు. ఇంతకన్నా దయనీయమైన మనుషులు కూడా వుండొచ్చు. కాని ఒక ఆర్థిక స్తోమతు గల వ్యక్తులు - ముఖ్యంగా మనోరమ – ఆ పేరులోనే ఎన్ని జ్ఞాపకాలో అలాంటి మనోరమ యిలా రావటం!

ఏ మాత్రం పరిచయమున్నవాళ్లైనా అడిగారు. పరిచయం లేనివాళ్ళు ఆశ్చర్యపడ్డారు. ఆఫీసర్లు సలహాలిచ్చారు. సానుభూతి చూపించారు. బహుశా ఆ రోజు ఆమె పరిస్థితిని చూసి ఆశ్చర్య పడనివాడగా, జాలిపడనివాడగా ఎవరైనా వుంటే అతడు బాలూ ఒక్కడే. ఇంట్లో తాను చూచినప్పుడు ఆమె యింత బలహీనంగా కనిపించలేదు కాని యిక్కడ బాగా నీరసంగా కనిపిస్తోంది. ఇష్టం లేకపోయినా సాయింత్రం ఆమెను స్కూటర్‌మీద డ్రాప్ చేశాడు. ఒక్కరోజుకే మనోరమ తల్లి విసుక్కుంది.

"అమ్మాయి ఇద్దరు పిల్లల్నీ నామీద ఒదిలేసిపోతే ఎలాగ? ఏదో వండిపెట్టమంటే వండిపెడతానుగాని – ఈ కుర్రాడి గోల చిన్నదాని ఏడుపు – అన్నీ నేనెక్కడ చూసుకోగలనమ్మా?" అంది

"అక్కడిలాగ, ఇక్కడా ఓ పనిమనిషిని పెట్టుకుందా" అంది మనోరమ.

"పోనీ, వాణ్ణి ఏ డే కేర్ సెంటర్‌లోనో వేసేద్దాం. అప్పుడు పిల్ల నొక్కదాన్నీ చూసుకోలేవా? పనిమనిషికి ఏ యాభయ్యో, అరవయ్యో యిచ్చి, అన్నం పెట్టి, కాఫీ యిచ్చేకన్న యిదైతే యిరవై, ముప్పై రూపాయల్తో పోతుంది" అన్నాడు బాలూ.

"ఏమో, నాకేమీ అర్థం కావటంలేదు. మరో నాలుగు రోజులుపోయాక 'ఈ పిల్లనుకూడా సంబాళించలేను' అంటుం వేమో! అప్పుడెలాగ?" అంది మనోరమ

5

పిల్లల గురించి ఏమేమి ఏర్పాట్లు చెయ్యాలో ఒక వారం రోజులు క్షుణ్ణంగా ఆలోచించి బాలూ ఒక నిర్ణయానికి వచ్చాడు.

"నువ్వు యిక్కడ వుండటం వల్ల ఏం లాభం జరుగు యున్నది చెప్పు? జీతం డబ్బులు వాళ్ళకిచ్చేయ్యాలి. మళ్ళీ కుర్రాడికి వేరే ఏర్పాట్లు చెయ్యాలి. పైగా నాకు వచ్చి పోయ్యేటందుకు పెట్రోలు దండగ ప్రైంవేస్టు. ఇంతా చేస్తే వాళ్ళు ఏదో మెహర్బానీ చేస్తున్నట్టుగా మొహం పెడతారు. నేను అక్కడ ఓ పనిమనిషిని చూశాను. నూటయిరవై రూపాయలు నావంట నెలకు. భోజనం అవీ ఎక్స్‌ట్రా. ఐతేనేం, పిల్లల్తో సహా ఇల్లంతా ఆవిడే చూసుకుంటుంది. ఈ ఖర్చులన్నీ మనకు మిగుల్తాయి. వచ్చేది వర్షాకాలం. అదీగాక, హోమియోపతి డాక్టరు దగ్గరకు వెళ్ళాలన్నా, యిక్కడి నుంచి వెళ్ళటం కన్నా అక్కడి నుంచి వెళ్ళటం దగ్గర" అంటూ లెక్కలువేసి చూపించి మనోరమను బయల్దేర తీశాడు బాలూ.

ఇంట్లో రాజమ్మ అనే నలభై యేళ్ళావిడ పనిమనిషి. బాలూ చెప్పింది కరెక్టే. వంట, గుడ్డలు, పిల్లల పని అంతా ఆవిడే చూస్తుంది.

ఆ రాత్రి మనోరమ వచ్చేసరికే డబుల్‌బెడ్‌గా వసివేసిన మంచాలు కాస్తా వేరైనాయి. ఈమె మంచం ఓ మూలకుంది. పక్కనే కింద పక్కవేసి పిల్లను పడుకోబెట్టారు. బాలూ మంచం పక్కన మరో చిన్న మంచం వుంది. అక్కడ కొడుకు పడు కుంటాడు. ఆ తర్వాతి రెండు రోజుల్లోనూ మనోరమ తెలుసు కుంది. డబ్బులు పెట్టే అల్మైరా తాళం చెవులు బాలూ దగ్గరే తనకు దూరంగా వుంటాయి. బైట ఎక్కడ ఏ విలువైన వస్తువులూ వుండవు.

'పని మనిషి గదా! జాగర్తగా వుండాలి' అన్నాడు బాలూ. ఓసారి డబ్బులు కావలసివచ్చి అడిగింది. 'ఆగు తెచ్చిస్తాను' అంటూ ఎక్కడనించో తాళం చెవులు తెచ్చి డబ్బులు తీసిచ్చాడు.

అప్పుడే గదిలో కొచ్చింది మనోరమ. ఆమెనుచూసి హడావిడిగా అల్మైరా తలుపు మూసెయ్యటంలో — ఆ సందడిలో మడుపు పెడదామని తీసుకున్న నగలలోని ఒక గాజు కిందపడింది.

బాలూ వెంటనే విషయం మార్చుతూ,

"చూడు మనూ, మనం చాల పొదుపుగా గడపాలి. ఎంత ఎక్కువ ఖర్చు అవుతున్నదో చూడు. ఇంతాపోగా మనకు ఏదైనా మిగలాలి. లేకపోతే నువ్వు వుద్యోగం చెయ్యటం దండగ" అని హెచ్చరించాడు. బుక్‌షెల్ఫ్‌లో పుస్తకాల మధ్యనవుండే జాయింట్ అకౌంట్ చెక్‌బుక్ కూడా మాయమైనట్టుగా ఆమె కప్పుడే జ్ఞాపకం వచ్చింది.

బాలూ వైఖరి ఆమెకు తలకొట్టేసినట్టుగా వుంది. అవమానంగా, భరింప శక్యం గాకుండా వుంది. ఈ యింట్లో తను దొంగ. పేయింగ్ గెస్టు. పనిమనిషి బాలూ చెబితేనే వింటుంది. పిల్ల ఏడిస్తే, తను వెంటనే తీసుకుని బైటి గదిలో కొచ్చెయ్యాలి. అతని నిద్ర చెడగొట్టగూడదు. ఊరికే పలకరించి డిస్టర్బు చెయ్యకూడదు.

చాలాసార్లు విసుక్కుంటాడు.

'నీకు వుద్యోగమంటే ఓ షోకు. డబ్బులు సంపాదించేది కలిసి వుండటానికి కాదు. నలుగుర్లో కబుర్లు చెప్పటానికీ, ఒళ్ళు చూపించుకు తిరగటానికి నువ్వుద్యోగంలో చేరావు. నేనేమిటి? రోజూ నిన్ను ఆఫీసుకు తీసుకెళ్ళి తీసుకొచ్చే డ్రైవర్ననుకున్నావా? అన్ని ఖర్చులు పోను, నీ వుద్యోగం మూలంగా నాకు వంద గూడా మిగలటం లేదు. జాగ్రత్త. మరోసారి ఆలోచించుకో. నలుగురు చూడటానికేమో నా బపంతం పెద వుద్యోగాని కొస్తున్నట్టుగా పోజు పెడతావు. అబద్ధాలకోర్, నీవల్ల నాకెప్పుడూ అపనిందలూ, అవమానాలూ. నావల్ల యిన్నాళ్ళు సుఖపడ్డావు, షికార్లు తిరిగావు, సినిమాలు చూశావు, జల్సాలు చేశావు. ఒకనాడు నాకు సహాయ పడలేదు. ఇప్పుడు నీ మూలాన నాకిన్ని యిబ్బందులు. ఆహా, అజంతా సుందరి లాంటి నీ శరీరాన్నిచూస్తూ గడపాలి యిక నేను. ఛీ. ఛీ. నువ్వున్న గదిలో పడుకుంటే నిద్రకూడాపట్టదు. ఏమైంది నీ కులుకు, ఆ పొగరు, ఆ వగలు? మానించవేం?..."

ఇలా ఎన్నో సాధింపులు సాగుతూనే వుంటాయి. మనోరమ మౌనం అతణ్ణి మరింత రెచ్చగొడుతుంది.

4

ఇట్లా క్షణికమైనకోపాన్ని ప్రదర్శించగలదే గాని లోపల అసంతృప్తి ఎలా పోతుంది? ఎక్కడికిపోతుంది? తన జీవితమంతా వృథా ఐపోతున్నది. సుఖమయ సంసార జీవితం గడపాలనుకున్న తనకు అసంతృప్తి మరీ ఎక్కువైపోతున్నది. అప్పటి నుంచి, అప్పుడే మధ్య వయసు వచ్చేసింది. కొడుకు ఒక్కడే. ఈ పిల్ల మామూలుమనిషి అవుతుందనే నమ్మకం తనకులేదు. ఇక్కడుంటే కొడుకు గూడా

పాడైపోతాడు. వాడికి మంచి ఎడ్యుకేషన్ యివ్వాలి. మనోరమ ఎందుకూ పనికి రాకుండా తయారైంది. ఆమె యిక్కడికి వచ్చిం తర్వాత రెండు:మూడు సార్లు కక్కుర్తిపడ్డాడు గాని ఆ తర్వాత తనకే అసహ్యం వేసింది. ఎలాగ? తనేం చెయ్యాలి? ఈమె ఆరోగ్యం ఎప్పుడు బాగవుతుందో, ఎలా బాగవుతుందో గూడా తెలియదు. అసలు మనోరమకు అలంకరణలో, శరీరాన్ని అందంగా, శుభ్రంగా వుంచుకోవటంలో శ్రద్ధేలేదు. ఏ ఆకర్షణ లేని ఆమెను, ఏ ఆహ్వానమూ ఆమె నుండి రానప్పుడు తనేం చేస్తాడు? ఆమెకు వుత్సాహం లేదు. ఎంతసేపూ పిల్ల! ఆఫీసుకు బయల్దేరేదాకాపిల్ల, ఆఫీసునుండి రాగానే పిల్ల. మెడకు గుదిబండలాగ తయారైన మనుషులతో కాపరం చెయ్యటం కష్టం. తన ప్లాన్లు అన్నీ మంట గలిశాయి. తన అభివృద్ధికి స్ప్రింగ్‌బోర్డులాగా వుండాల్సిన మనోరమ తనకిప్పుడు అడ్డంకిగా తయారైంది. ఆమె డబ్బు లామెకే సరి పోవటంలేదు.

డబ్బులడక్క తప్పని మనోరమ చాలాసార్లు డబ్బులడిగింది. బాలూ లేవన్నాడు. ఇవ్వటానికి వీలుపడదన్నాడు. ఆమె దీనంగా, జాలిగా, ప్రాధేయపడుతూ అడిగినప్పుడు ఆమె తనను కీలుబొమ్మ చేసి ఆడించిన రోజులు జ్ఞాపకం వచ్చేవి. తనను దగ్గిరకు రానివ్వటానికి ఆమె చేసిన బెట్టు మదిలో మెదిలేది. తనను తృణీకరించిన రోజులు, ఏడ్పించిన రోజులు, తనలోని కోరికను, ఆతృతను అపహసించి, తన కోరికకు ఖరీదుకట్టి, షరతులుపెట్టి మరీ ఏడ్పించిన రోజులు, తనను ధిక్కరించిన ఆమె శరీరం, తనను చులకనచేసిన ఆ క్షణాలు, పంటచెయ్యటానికి బద్ధకించిన ఆమె వైఖరి — తన శరీర పోషణలో, శృంగార పోషణలో తనను, తన వునికినే లెక్కచెయ్యని ఆమె యిప్పుడిలా అడుగుతుంటే, ప్రాధేయ పడుతుంటే, ఒకప్పుడు జనాన్ని తనముట్టూ తిప్పుకున్న ఆ కళ్లు యిప్పుడు నిస్సహాయంగా చూస్తుంటే, తనను పరిహసించి, అపహసించిన ఆ శరీరం యిప్పుడు పాదాక్రాంతమై వేడుకుంటుంటే తనను పెళ్లాడటమే తనమీది జాలితో అన్నట్టుగా వ్యవహరించిన ఆమె పొగరణిగి, "నన్నేమైనా చెయ్యి, కొట్టు, తిట్టు, కాని పాల డబ్బాలకూ, డాక్టరు ఫీజులకూ, మందులకూ, రిక్షా ఖర్చులకూ మాత్రం డబ్బివ్వు. నాకోసం కాదు. ఈ చిట్టిపిల్ల కోసం" అంటుంటే అతడి కోపం పెల్లుబికి, అసహ్యం యినుమడించి, అప్పటి అవమానాలకు ప్రతీకారంగా, అణిగిమణిగి ఆమె కోర్కెలు తీర్చిన ఆనాటి జ్ఞాపకాలకు, ఇన్నాళ్లా సీసాలో బందిగావున్న భూతం — ఇప్పుడు ఈ కన్నీళ్లు, ప్రార్థనలు, పాదాక్రాంతాలు బిరడా తియ్యగా తన విరాట్ స్వరూపంతో ఆమె మీదికి విజృంభించేది. తనలోని కసిని, కోపాన్ని, తృణీకారాన్ని, పగను వ్యక్తపరచటానికి అతడికి మాటలు దొరికాయా? కొట్టటానికి అతడికి సత్తువుందా? ఆమెను యింకా ఏం చేస్తే తన కసి, అవమానం తీరుతుందో అతనికి తెలియలేదు. తన తిట్లకు ఎదురు చెప్పక, తను కొడితే ఏడవక, 'నా కూతురి కోసం —' అంటున్న ఆమె మీద అతని కోపం పెరిగింది, రెట్టింపయింది. ఆమెను తిట్టవలసిన కొత్త తిట్లు, ఆమెను హింసించవలసిన కొత్త చోట్లు అతనికి క్షణ క్షణమూ జ్ఞాపకం వచ్చేవి, రెచ్చగొట్టేవి.

3

ఆ తర్వాత మూడు నెల్లోనూ మనోరమ ఓ నెల రోజులు మాత్రమే ఆఫీసుకు వెళ్లగలిగింది. మందు తప్పుగా యిచ్చారో, డయాగ్నసిస్ తప్పు జరిగిందో ఏమిటో గాని పిల్లకు వంటి మీద నిరటి వాతలు వచ్చాయి. దానికి తోడు జ్వరం. పిల్లను వదిలి వెళ్లాలంటే ఆమెకు మనస్కరించలేదు.

"ఏం చేస్తావు? నువ్వు అలా చూస్తూ కూర్చుంటే ఆరోగ్యం బాగవుతుందా?" అన్నాడు బాలూ.

"నీ యిష్టం. నువ్వేమన్నా అనుకో. కాని యిలా దీన్ని యింట్లో వదిలి ఆఫీసుకు రాలేను" అంది మనోరమ.

ఈమె యింట్లో వుండటం చూసి — కాబోలు — రాజమ్మ రావటం మానేసింది. "ఏదో యింత వండిపెయ్యాలని," అన్నాడు బాలూ. బాలూ మాన్పి వాడో, లేక ఆమే మానిందో గాని రాజమ్మ మళ్లీ రాలేదు. రోజంతా ఒంటరిగ వుండాలంటే ఆమెకు భయమేసింది. ఇక్కడకన్నా, పుట్టిల్లే మెరుగనిపించి ప్రయాణమైంది మనోరమ. అప్పటికే చాలాసార్లు ఆఫీసు ఎగ్గొట్టేసింది. ఏటికీ మాటికీ సెలవులు పెట్టటం ఆమెకు మామూలే. రెండు మెమోల తర్వాత ఆఫీసు వాళ్లు ఒక ఛార్జి షీటిచ్చారు. ఇంత తరచుగా సెలవు పెడుతుంది గనకా, అందుకు ఆఫీసు పని పాడవు తున్నదిగా, ఆమెకు వుద్యోగంలో యిష్టంలేదని ఎందుకనుకో కూడదు? అదీ దాని సారాంశం.

"ఏదో మీ భర్తగారి పొజిషన్ చూసి యిన్నాళ్లాగేరు లేకపోతే ఇది ఎప్పుడో రావాల్సింది" అన్నారు కొందరు.

"మీరు వెళ్లి ఆర్. ఎం. గారితో మాట్లాడి రిక్వెస్టు చెయ్యండి" అనికూడా సలహాయిచ్చారు.

బాలూని తీసుకుని ఆర్. ఎం. ను చూడ్డాని కెళ్లింది మనోరమ.

ఆర్. ఎం. సానుభూతిగా మాట్లాడేడు. పరిస్థితులు యిలా మారటం దారుణమన్నాడు. బాలూని ఈమె పర్సనల్ ఫైల్ తీసుకురమ్మన్నాడు. గత సంవత్సరంలో ఇరవై ఐదు సార్లు సెలవు పెట్టావన్నాడు.

'జీతం వస్తుందా లేదా అన్నది ముఖ్యం కాదు. వితౌట్ పే కూడా లీవు పెట్టగూడదు. మీకు తెలియకపోతే స్టాఫ్ రెగ్యులేషన్స్ ఏమిటో మీ భర్తను అడిగి తెలుసుకోండి. మీకు తెలుసు గదా, పరిస్థితులు చాలా మారాయి ఎక్కడ విన్నా ఉత్పత్తిని పెంచాలనే నినాదం వినిపిస్తోంది. కార్మికుల్లో, సంస్థల్లో కూడా కొత్త డిసిప్లిన్ వచ్చింది. మరి యిలాంటి ముఖ్యమైన సమయంలో

మీరు ఇలా తరచుగా సెలవు పెడుతున్నారు ఓ సెంటర్లో మీలాగే సెలవులు పెట్టేవాళ్లు మరో యిద్దరు ముగ్గురున్నారు. వాళ్లకూడా యిలాగే ఛార్జి షీట్లిచ్చాం. మరి మీ ఒక్కరి ఛార్జిషీటు విత్‌డ్రా చేస్తే డిస్క్రిమినేషన్ అవుతుంది. మీరు చేసిన పనుకు క్షమాపణ చెప్పుకొని, ఇక ముందు జాగ్రత్తగా, రెగ్యులర్‌గా ఆఫీసుకు వస్తామని రాసివ్వండి. ఈసారికేమీ ప్రమాదం జరక్కుండా చూసేస్తాను'' అన్నాడు ఆర్. ఎం.

ఈ మూడు నెలల్లోనే బాలూ ఓ సారి సెలక్షన్ గ్రేడ్ స్కేల్ కోసం బొంబాయిలో యింటర్వ్యూకు వెళ్లి వచ్చాడు. ఇంటర్వ్యూ బాగానే జరిగింది. బై ది గ్రేస్ ఆఫ్ ది లార్డ్ ఆఫ్ సెవెన్ హిల్స్ ప్రమోషన్ రావచ్చు.

2

బాలూ బొంబాయినుంచి రాగానే శ్రీపురం వచ్చేస్తానంది మనోరమ.

''అయ్యో అప్పుడే ఎలా, రాజమ్మ రానేలేదు. పోనీ ఆవిడ బదులు మరెవరైనా కుదుర్చాలిగదా!'' అన్నాడు బాలూ.

''ఎన్నాళ్లు వుండనిక్కడ? ఎలాగైనా సరే, వచ్చేస్తాను.'' అంది మనోరమ.

''చూద్దాం, చూద్దాం. మరికొన్నాళ్లు యిక్కడే వుండు. ఏదో, మొన్ననేకదా వచ్చాను, ఇంట్లో సామాన్లన్నీ వున్నాయో లేదో చూసి తీసుకు రావాలి మొదట'' అన్నాడు బాలూ.

ఆమె అతణ్ణి రోజూ అడుగుతూనే వుంది. అతను రోజూ నాన్చుతూనే వున్నాడు.

''ఏదీ. ఆఫీసులో కాస్త హడావుడిగా వుంది. ఇంటికెళ్లేసరికి ఆలస్యమైపోతోంది. నేను హోటల్లో భోం చేస్తున్నాను. పనిమనిషి కావాలి. పాలవాడికి చెప్పా.''

ఆ తర్వాత కొద్దిరోజులకు ఓనాడు మనోరమను సాయంత్రం ఆఫీసైం తర్వాత వెనక కూర్చోబెట్టుకొని తాను మొదట వెళ్లినట్లాంటి ఓ పోష్ రెస్టారెంట్‌కు తీసికెళ్లాడు.

చాల మర్యాదగా, ఫార్మల్‌గా వున్నాడు.

''మనూ, ఆరోగ్యం ఎలావుంది?'' అన్నాడు.

మనోరమ మాట్లాడలేదు. కాని ఆ ప్రశ్నకు ఒళ్లు ప్రయత్నం మీద కన్నీళ్లాపుకుంది.

''పెద్దవాడెలా వున్నాడు?''

''వాడికేం, వాడు రాజా. ఇబ్బందంతా చిన్నదానితోనే'' అంది మనోరమ

ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాసిన పీఠికలో అమ్మకానికి సిద్ధంగావుంది. వెల రు. 15-00 (పోస్టేజి అదనం)

బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టతో కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో సహస్రపూర్ణ ఏడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికలో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల రు. 7-50 (పోస్టేజి అదనం)

భగవద్గీత

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానముతో బైండువేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల రు. 7-50 (పోస్టేజి అదనం)

ఆంధ్రపత్రిక ఏజెంట్లద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

..............................ప్రతులకు..............................

మేనేజరు,

ఆంధ్రపత్రిక, గాంధీనగర్, విజయవాడ-3

''ప్చ్. నాకు చాలా సంతోషంగానూ, విచారంగానూవుంది మనూ. ఒకవేళ నేను బొంబాయి వెళ్లాల్సివస్తే నువ్వూ వెంట వస్తావా ?'' అన్నాడు

మనోరమ ఆశ్చర్యంగా చూసింది.

''ఎలా ? నాకు ట్రాన్స్‌ఫర్ అవుతుందా ?'' అంది.

''కాదనుకుంటాను. మీ పోస్టులు ట్రాన్స్‌ఫరెబుల్ కావు'' అన్నాడు బాలూ.

''మరెలా ? ఉద్యోగం మానేసిరానా ?'' అంది.

''ఏమో, ఆలోచించి చెప్పు''

''ఇక్కడ దానికి ట్రీట్‌మెంట్ తీసుకొంటున్నాం.''

''అక్కడ డాక్టర్లుండరా?''

అదికాదు. ఇక్కడే ఇద్దరికి గడవటం యిబ్బందిగావుంది. అక్కడ యిల్లు దొరకటమే కష్టం. నాకుద్యోగం కూడా వుండదు. అప్పుడింకెంత కష్టంగా వుంటుంది !

తను నిజంగా వెడితే అతడు తననూ, తన కూతుర్ని ఏం చేస్తాడోనని భయంగా వుంది. కాని ఆమాట చెప్పలేకపోతోంది.

''నేను అందికే చెప్పాను. ఇలాంటి అవిటి పిల్లలు త్వరగా చచ్చిపోతే మంచిదని. ఇప్పుడు మనకు భారం . పెరిగిన తర్వాత కూడా వాళ్ల యితర్లకూ, సంఘానికీ కూడా భారం. నాకు దాని మీద ప్రేమ లేదని కాదు. కాని డాక్టర్లు హోప్‌లెస్ కేసని చెప్పిం తర్వాత కూడా నువ్వింకా దాన్ని పట్టుకుని పాకులాడుతున్నావు.''

''డాక్టర్లు హోప్‌లెస్ అనలేదు.''

''సరే. హోప్‌లెస్ కాదు. కాని ఎప్పుడు బాగవుతుందో కూడా ఎవరికీ తెలియదు. ఇలాంటివాళ్లను ఆ స్కూల్ ఫర్ మెంటల్లీ రిటార్డెడ్ లాంటి దాంట్లో ఎక్కడన్నా వేస్తే మిగతా విషయాలు వాళ్లే చూసుకుంటారు. మనం చెయ్యగలిగింది అంతే. అంతకన్నా ఎక్కువ ఏం లేదు.''

''నెమ్మదిగా బాగవుతుంది...పదేళ్లు...''

''పదేళ్లు, ఇరయ్యేళ్లు, ముప్పైయ్యేళ్లు.''

''నా కడుపున పుట్టిన పిల్ల ఎలాంటిదైనా దాన్ని చూసుకునే బాధ్యత నాదే. నీకు అంతా లెక్కలమయమే కావచ్చు గాని'' అంది మనోరమ.

బాలూ నవ్వేడు.

1

''ఓకే. ఓకే. నువ్వు బొంబాయి రావాలంటే వుద్యోగం మానెయ్యాలి. అది తప్పదు. అక్కడ నీకు మరోవుద్యోగం దొరుకుతుందా లేదా అనేది వేరే సంగతి. తర్వాత, నువ్వక్కడికొస్తే ట్రీట్‌మెంట్ ఈ డాక్టరు వెయ్యడు. అది పాయింట్ నంబర్‌టూ. మరి ఈ పరిస్థితుల్లో నువ్వు బొంబాయి వస్తావా, రావా ?'' అన్నాడు.

''అదేమిటి, నిజంగానే పోతున్నావా ?''

''యస్, డార్లింగ్. అందికే చెప్పాను. నాకు ప్రమోషన్ వచ్చినందుకు సంతోషంగా వుంది. నిన్ను వదిలి పోతున్నందుకు విచారంగా వుంది.''

''ఎప్పుడు ?''

నెక్స్ట్‌మంత్. సరే, అబ్బాయి సంగతి. పబ్లిక్ స్కూల్స్‌కి ట్రై చేస్తున్నాను. ఇక్కడో, అక్కడో వాణ్ణి ఈ సంవత్సరం స్కూల్లో వెయ్యటం మాత్రం ఖాయం. వాడి గురించి నీకేమీ యిబ్బంది వుండదు. ఇంక అమ్మాయి గురించి యాష్టరాల్, వుద్యోగం చేసేదానివి, ఒక్క కూతుర్ని పోషించుకోలేవూ !

''చనా నేను నిన్ను వొదిలేసిపోతున్నాననుకోకు. నువ్వెప్పుడైనా అక్కడికి రావచ్చు. యు ఆర్ ఆల్వేస్ వెల్కం. ఇంక, అంత ఫ్లాట్ నువ్వేం చేసుకొంటావు? ఎట్లాగూ నువ్వొక్కదానివీ అక్కడుండలేవు. అందుకని అది అద్దెకిచ్చేస్తున్నాను. స్కూటర్ అమ్మేస్తాను. నీకు అవసరమైన సామాన్లు ఏమైనావుంటే ఓనాడు వచ్చి తీసుకో. అంతే. మరోసారి చెబుతున్నాను. అయాం సారీ, నిన్నొదిలి పెట్టటం నా వుద్దేశంకాదు. నీకు డబ్బులవసరమైనప్పుడు రాయి. ఎంతంటే పంపిస్తాను. మనం చాలా హాపీగా గడపలేదు. కాని ఎందుకో యిలాగైపోయింది. బహుశా మనం కొన్నాళ్లు వేర్వేరుగా బతికితే జీవితంలో ఏమైనా కొత్త ఆశ కలగొచ్చు.''

మనోరమ ఏడుపు ఆపుకోలేకపోయింది.

''నో. నో. ఏడవకు. ప్లీజ్. నాకూ బాధగానే వుంది ఇక్కడి ఆర్. ఎం. మంచివాడు. నా భార్యగా నువ్వంటే అతనికి ప్రత్యేక గౌరవముంది. నీ ఆరోగ్యం బాగుచేసుకో మళ్లీ సరదాగా వుందాం...ఇక్కడవుండే ఈ కాసిని రోజులూ మనం మళ్లీ వెనకటిలాగా తిరుగుదాం, రా'' అన్నాడు బాలూ.

మనోరమ పల్లకాదండి. వెళ్లి సామాన్లు తెచ్చుకోవటాని కూడా నిరాకరించింది. ఆమె తల్లిదండ్రులు కూడా ఆమెను బాలూవెంట వెళ్లమన్నారు. కాని ఆమె వీలుపడదంది. బాలూయే ఒకనాడు ఆమె సూట్‌కేస్, ట్రంకుపెట్టె, చీరలు, అవీ తెచ్చాడు.

అతడికి ప్రమోషన్‌వచ్చి బొంబాయి పోతున్న సందర్భంగా అతడి మిత్రబృందం అతడికో మంచిపార్టీ యిచ్చారు. అక్కడికి ఆర్. ఎం. కూడా వచ్చాడు. అతడికింకా చాలా చాలా ప్రమోషన్లు రావాలని ఆశీర్వదించాడు. మనోరమ ఆ పార్టీకి కూడా పోలేదు.

బొంబాయి వెళ్లే క్రితంరోజు బాలూ మామగారింట్లోనే గడిపాడు. కొడుకు నెత్తుకొని ముద్దులాడాడు. కాని మనోరమ అతడితో మాట్లాడలేదు. అబార్షన్‌లతో, ఆపరేషన్‌తో, పిల్లలతో, పిప్పిగా మారిన ఆమె అతణ్ణి దగ్గరకు రానివ్వలేదు. తరువాత చిరిగ్గా ఏడవ్వచ్చుననుకొందేమో—ఏడవను కూడాలేదు.

ఆ తెల్లారి ఫ్లైట్‌లో బాలూ బొంబాయి కెగిరిపోయాడు. అంతేనండి.

ప్రస్తుతానికంతే కథ. *[అయిపోయింది]*

శ్రీ ఉ. అ. నరసింహమూర్తి

కవిత్వము - అపూర్వత

"యాగాది జన్యః స్వర్గాది జనకః కశ్చన గుణ విశేషః
తం గుణ విశేషం అపూర్వ మితి మీమాంసకా వదన్తి"
— న్యాయకోశము.

యాగ నిర్వహణ వలన అంతకుముందు లేని ఒక శక్తి ఆవిర్భవిస్తుంది. దానిని అపూర్వమని మీమాంసకులు చెప్తారు. ఈ అపూర్వత యాగ నిర్వాహకుని యందు మరణ పర్యంతం వుండి అతనికి స్వర్గప్రాప్తి కలిగిస్తుంది — అని పై శ్లోకం చెప్తుంది. దీనిని బట్టి మోక్ష సాధనకు అనువైన మార్గం అపూర్వత అని దానిని సాధించడానికి యాగం చెయ్యాలని మీమాంసకుల మాట. కవులు ఋషులని, ఋషికానివాడు కవి కాడని, కావ్యానందము బ్రహ్మానంద సబ్రహ్మచారి అని, ప్రతిభావంతుడే కవి కాగలడని, 'అపూర్వ' వస్తు నిర్మాణక్షమత్వమే ప్రతిభ అని పూర్వాలంకారికులు చెప్పిన మాటలన్నీ ఇక్కడ అనుసంధించుకుంటే కవిత్వంలో అపూర్వతకు గల స్థానం విశదమౌతుంది.

కావ్య నిర్వచనాలలో "రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్" అనేది ఒకటి. ఇందులోని ఇతరాంశాలపట్ల ఏ విధమైన వివాదం వున్నా రమణీయతను గూర్చి మాత్రం వివాదమేమీ లేదు. రమణీయత అంటే ఏమిటి అనే ప్రశ్నకు "క్షణే క్షణే యన్నవతా ముపైతి తదేవ రూపం రమణీయతాయాః" అన్న సమాధానం లభిస్తుంది. క్షణ క్షణానికి కొత్తదనాన్ని పొందేదేదైతే వుందో అదే రమణీయత యొక్క రూపమని అర్థం. కాబట్టి కవిత్వం యొక్క ప్రధాన లక్షణం కొత్తదనాన్ని కలిగివుండడం. ఆసక్తిజనకంగా వుండడం దానివలన సిద్ధించే సత్వర ప్రయోజనం. ఆనందసిద్ధి దానియొక్క పార్యంతిక ఫలం. "కొత్తొక వింతా పాతొక రోతా" అనే సర్వజన సాధారణమైన అభిప్రాయం ఈ భావనను దృఢ పరుస్తుంది.

కొత్తదనాన్ని సాధించడ మెలాగ? అనే ప్రశ్న కవియైన ప్రతివాడికి ఎదురవుతుంది. అతిప్రాచీనులకు, మధ్యయుగాలవారికి కూడా ఈ ప్రశ్న ఎదురయింది. "Our Poets left nothing untried" అన్నాడు హోరేసు. "హృదయగతిం బురాతన కవీశ్వరు లేగని వీధి లేదు" అన్నాడు సంకుసాల నృసింహ కవి. అయితే అప్పుడు గాని, ఇప్పుడుగాని కవిత్వం ఆగిపోలేదు. కొత్తదనం లేక పోలేదు.

"సంతే ఘటతేఽవధిః నచతే దృశ్యంతే కథమపి పునరుక్తాః యే విభ్రమాః ప్రియాణాం అర్థావా సుకవి వాణీనామ్" - అన్న అభినవ గుప్తపాదుని సూక్తి నేటికీ నిలిచింది. స్త్రీల విలాసాలకు, కవుల మాటలకు హద్దుగాని, పునరుక్తిగాని లేదట! "న కావ్యార్థ విరామోఽస్తి యది స్యాత్ప్రతిభా గుణా" అనే ఆనందవర్ధనుని మాట నిరవధికమైన ఈ అపూర్వతకు ప్రతిభా గుణమే కారణమని చెప్తుంది.

ఐతే అపూర్వత ఎంతటి హృద్యము — ఆకర్షకమైనదైనా, గతాను గతికమైన లోకంలో, ప్రయోగ దశలో కొంత అవరోధాన్ని ఎదుర్కోవలసి వచ్చేది. ప్రాచీన పాశ్చాత్య విమర్శకులలో పరమ ప్రామాణికుడైన లాంగినసు నవ్యతను గూర్చి చెప్పిన మాట లివి:

"Now all these glaring improprieties of language may be treated to one common root - the pursuit of novelty in thought" — On the Subline, V.

నూతన భావాన్వేషణమే భాషా విషయకమైన సమస్త అనౌచిత్యాలకు మూలమని లాంగినసు అభిప్రాయం. అతనికి ముందు కూడా కవులలో, విమర్శకులలో సంప్రదాయవాదులు, పురాతనులకు గల గౌరవం ఆధునికులకు లేనట్లు హోరేసు వ్రాతలవల్ల తెలుస్తుంది. హోరేసు ఆగస్టసుకు వ్రాసిన లేఖలో ఒక రచన నిరాదరణకు గురికావడంలో శైవదారిద్ర్యం కాని, సౌందర్య రాహిత్యం కాని కారణంకాక అది ఆధునికమైనదే కారణం కావడం తనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పేర్కొన్నాడు. ఆ లెక్కన ఒక ఆధునిక కవి పురాతనుడు కావాలంటే ఎంతకాలంపాటు మరణించి వుండాలని ప్రశ్నిస్తూ తన క్రోధాన్ని వెళ్లడిచేసేడు. ఈ స్థితి భారత దేశంలోకూడా ఒకనాడు రాజ్యమేలిందనడానికి కాళిదాస, భవభూతుల మాటలే సాక్ష్యం.

"పురాణ మిత్యేవ న సాధు సర్వం న చాపి కావ్యం నవ మిత్య వద్యం
సంతః పరీక్ష్యాన్యతర ద్భజంతే మూఢః పరప్రత్యయ నేయ బుద్ధిః"

అని కాళిదాసు తన అపూర్వ రచనా దక్షతను సంరక్షించుకొనవలసి వచ్చింది. "ఉత్పత్స్యతే మమతుకోఽపి సమాన ధర్మా కాలోహ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ" అని భవభూతి అపూర్వత నాదరించే సహృదయునికోసం నిరీక్షించవలసి వచ్చింది. ఐతే కాలం ఎప్పుడూ ఒక్కలా లేదు. నేడొక అపూర్వ ప్రయోగం లభిస్తే ఆకాశానికెత్తే రోజులు నడుస్తున్నాయి.

ఈ అపూర్వత అంటే ఎలాంటిది? అంతకు ముందు లేని దంటే సృష్టిలో లేనిదా ? అలాకాని పక్షంలో కొత్తదనం ఎలా సిద్ధిస్తుంది? అనే ప్రశ్నలున్నాయి. అపూర్వమైనదంటే సృష్టిలో లేనిదని అర్థంకాదని చెప్పేరు. ''వర్ణ్యమాన స్వరూపాః పదార్థాః నకవిభిరభూతాః క్రియన్తే కేవలం సత్తా మాత్రేణ పరిస్ఫురతాం తేషాపి అతిశయః పునరాధీయతే. సహృదయ హృదయ హారిణీ రమణీయతా భవతి'' — అని కుంతకు డీ విషయాన్ని వివరించడం జరిగింది. సహజము — ఆహార్యము అయిన కవి కౌశలముచే నైన నిర్మితి వర్ణ్యమాన వస్తువును నూతన మార్గంలో వర్ణించడం వలన అది లోకాతిక్రాంతంగా గోచరిస్తుంది. అంటే సహజవస్తువు కంటె రమణీయంగా భాసిస్తుంది. అంటే కవిసృష్టి అభూత సృష్టి కాదు. కేవలం సత్తామాత్రంచేత స్ఫురించే పదార్థాలకు కవులు అతిశయత్వాన్ని ఆపాదిస్తారు. అప్పుడు సహృదయులమనస్సు నాహరించే రమణీయతా గుణం సిద్ధిస్తుంది. అపూర్వ వస్తు నిర్మాణక్షమమైన ఈ కౌశలం చేతనే కవులు బ్రహ్మకల్పులు కాగల రని కుంతకుని అభిప్రాయం. ''నహి వాచస్పతి నాపి అక్షరాణి పదాని వా కాని చి దపూర్వాణి సంఘటయితుం శక్యతే'' అంటాడు ఆనందవర్ధనుడు. దీనినిబట్టి అపూర్వత కేవలం అక్షరాలకు, పదాలకు సంబంధించినది కాదని తెలుస్తుంది. ఈనాడు కొత్తదనంకోసం అక్షరాల్ని గజిబిజిగా, అడ్డంగా, తల్లక్రిందుగా ముద్రించే ప్రయత్నాలు కన్పిస్తాయి. అక్షరమే పాతదైనప్పుడు దానిని ముద్రించడంలో మార్పు తెచ్చి, నూతనత్వాన్ని సాధించదలచుకోవడం ప్రతిభావంతుల మార్గంకాదు అ నే క మం ది కవులచేత ప్రయోగించబడిన పదాలే, అర్థ విన్యాసాలే కొత్త కవుల ప్రయోగాల్లో నూతనత్వాన్ని పొందుతాయి. అంతేకాదు.

''దృష్టపూర్వా అపి హ్యర్థాః కావ్యే రసపరి గ్రహాత్
సర్వేనవా ఇవాభాంతి మధుమాస ఇవద్రుమాః''

అని చెప్తుంది ధ్వన్యాలోకం. అంతవరకు వున్న చెట్లే వసంతకాలం వచ్చేసరికి కొత్తగా కన్పించినట్లు ప్రకృతిలో నిత్యం చూసిన విషయాలో రసదృష్టికి కొత్తవిగా భాసిస్తాయని అర్థం. ఈ రస భావాదులు మాత్రం ఎప్పటికప్పుడు కొత్తగా ఉద్భవిస్తాయా? అనే ప్రశ్న ఒకటుంది.

''సంబంధములగు రసభా
వంబులు మునుకంటె నభినవంబులు గలవే?
అంబుధినె గాక బహుర
త్నంబులు వర్తకుల కేమి తాం బండినవే?'' — అంటాడు కొఱవి గోపరాజు. కాబట్టి ఈ సాహిత్యబేహారు లందరూ తమ కావ్యరత్నాలను ప్రకృతి సముద్రంనుండే గ్రహిస్తారని తెలుస్తుంది. రసభావాదులు లౌకిక జగత్తునకు సంబంధించినవైనా కావ్య జగత్తులో వాటికి నూతనోజ్జీవనం కల్పించేది కవికౌశలమే. రసభావాది సమన్వితమైన సాహిత్య విద్యమాత్రమే గాక అన్ని విద్యలూ సనాతనమైనవే అంటాడు హేమచంద్రుడు.

'అనాదయ ఏవైతే విద్యాః సంక్షేప విస్తరతయా నవనవీ భవంతి తత్ కర్తృకాశ్చోచ్యన్తే కింనాశ్రౌషీః, నచకదాచి దనీదృశం జగత్'
ప్రమాణ మీమాంస.

ఈ విద్యలన్నీ అనాది విద్యలే. సంక్షేప — విస్తరములవలన ఆ విద్యలే పునర్నవాన్ని పొందుతున్నాయని హేమచంద్రుని విశ్వాసం. అందుకతడు చూపిన ఉపపత్తి గమనించదగినది. దృశ్యమాన జగత్తు ఎప్పుడూ ఇంతకంటె భిన్నమైనది కాదు కాబట్టి దాని నాశ్రయించిన విద్యలు కూడా పరిపూర్ణ నూతనత్వాన్ని పొందలేవని అతని అభిప్రాయం. దీనివలన రెండు అంశాలు తెలుస్తున్నాయి. (1) లోకంలో మార్పులేనిదే ఏ ఒక్కడూ పరిపూర్ణమైన అపూర్వతను సాధించలేడు (2) నిర్వహణమాత్రంచేతనే కవులు అపూర్వతను సాధించగలరు. ఈ నిర్వహణనే కవికౌశలమని వ్యవహరించవచ్చును. లోకం ఎప్పుడూ మారదనే హేమచంద్రుని అభిప్రాయాన్ని ఆలోచించడానికి ముందుగా నిర్వహణవలన సిద్ధించే అపూర్వతను గూర్చి ఆలోచిద్దాం.

సర్వసామాన్యమైన ఒక అంశం నిర్వహణమాత్రంచేత అపూర్వంగా ఎలా అపూర్వంగా భాసిస్తుంది? అనే ప్రశ్నకు ఏకకథాశ్రితాలైన భిన్నకావ్యాలు తగిన సమాధానమిస్తాయి. రామాయణాన్ని తిరిగి తిరిగి ఎందుకు వ్రాయాలన్న ప్రశ్నకు తిక్కన, రామభద్రుడు, మొల్ల, పాపరాజు, విశ్వనాథ మొదలైన కవులు సమాధానమిచ్చి వున్నారు. వీరంతా సంప్రదాయవాదులే. అయినా నిర్వహణలోవున్న భేదంచేత ఒకే తత్వాన్ని ప్రతిపాదించే వీరి గ్రంథాలు అపూర్వతకు ఆకారాలయ్యాయి దే రామాయణాన్ని వస్తువుగా గ్రహించిన కాటూరి, ముద్దుకృష్ణ, రంగనాయకమ్మ మొదలైన మరొకరీతి సమాధానమిచ్చి వున్నారు. ఆధునికులైన వీరి నిర్వహణలో సిద్ధాంత పరమైన భేదంకూడా తోడయి అపూర్వతా సంపాదనకు దోహదం చేసినట్లు గుర్తించవచ్చును. ఈవిధమైన రచనలను దృష్టిలో వుంచుకుని ఆలోచిస్తే వస్తున్నవ్యతకంటె నిర్వహణరీతికే అపూర్వతా సంపాదనలో అధికాదరమున్నట్లు గోచరిస్తుంది.

''నిరంతర రసోద్గార గర్భ సందర్భ నిర్భరాః
గిరః కవీనాం జీవంతి న కథామాత్ర మాశ్రితాః''

అన్న కుంతకుని మాట ఈ అంశాన్ని స్థాపిస్తుంది. కవులవాక్కులు నిరంతర రసోద్గార గర్భములైన కథా సందర్భాలలో నిర్భరములై జీవిస్తాయి. కేవల కథామాత్రాశ్రయంచేత అవి సజీవములు కావని కుంతకుని అభిప్రాయం. వస్తువు విషయంలో ఈ అభిప్రాయం ప్రాచీనులందరి ఆమోదాన్ని పొందిందని భావించవచ్చును.

''స్కందపురాణ నీరనిధి కౌస్తుభమై ప్రభవించుదేవకీ
నందను సత్కథోదయము నవ్య కవిత్వ కళాకలాపమన్
కుందనముం ఘటించి కడు క్రొత్తగు సొమ్మొనరించి,
విష్ణుసే
వందిలకించు సత్పరమవైష్ణవకోటి నలంకరింపుమా''.

"నవ్యాతినవ్యం" అనే మాటను ప్రయోగించి రామకృష్ణుడు నవ్యత విషయంలో కథను మినహాయించడం గుర్తించవలసిన అంశం. కుంతకుడు, రామకృష్ణుడు, విశ్వనాథ ప్రాచీన — మధ్య—ఆధునిక యుగాల కవుల ఆలోచనలకు ప్రతినిధులుగా అంగీకరింపబడితే నవ్యత విషయంలో వస్తువు ప్రధానం కాదని, నిర్వహణమే ప్రధానమని కవిజన సాధారణమైన అభిప్రాయంగా గ్రహించవచ్చును. 'కేవల కల్పనా కథలు కృతులు కావు' అన్నమాట ఈ అభిప్రాయాన్ని స్పష్టం చేస్తుంది. కథావిషయంలో ఇంతటి ఉదాసీన్యాన్ని ప్రదర్శించిన కవులు కావ్యాలను అపూర్వంగా తీర్చిదిద్దడంలో మాత్రం అహమహమికలో ప్రవర్తించేరు. తనకౌశలం చేత ఒకడు మోళ్లను చిగురింపజేస్తే వేరొకడు రాళ్లను కరిగించడం ప్రారంభించేడు. ప్రాచీనులు క్షుణ్ణమైన కవితాపథంలో అపూర్వ గమనాలు కొనసాగించిన తీరు ఆలంకారికులు వివరించారు. ధ్వనికారుడు ధ్వనిప్రభేదాలన్నీ అపూర్వతా సంధాయకాలేనని కంఠోక్తిగా చెప్పేడు. వక్రోక్తికారుడు వక్రతాభేదాల్ని విచిత్రచ్ఛాయా మనోహరమైన అనేకాకార కాంతిరమణీయతను సంధానించేవేనని చెప్పడం జరిగింది. ఉపమాలంకారమే చిత్రమైన భూమికలను ధరించి కావ్యరంగంలో అపూర్వతను సాధించిందని వామనుడన్నాడు. ఈ విధమైన ఆలంకారిక ప్రతిపాదనలన్నీ కవుల అపూర్వ నిర్మాణకుశలత్వాన్ని సోదాహరణంగా వివరించాయి. ఇది నిర్వహణకు సంబంధించిన విషయం.

ఈనాడు కవిత్వాన్ని పాతదనీ కొత్తదనీ వేరుచేసే స్పష్టమైన విభాజ్యరేఖ ఆధునికత అనేది. ప్రతికవి అపూర్వతకోసం అహరహం కృషిచేసిన కొన్ని శతాబ్దాల సాహిత్యచరిత్రలో ఈ విభాజ్యరేఖ విశేషంగా ఆవిర్భవించిందన్న ప్రశ్నకు సమాధానం కావాలి. ఆ సమాధానం తేలికగానే లభిస్తుంది "[illegible]" అన్న హేమచంద్రుని కల కరిగిపోవడమే అందుకు కారణం. హేమచంద్రుడు కలలో ఊహించని రీతిగా లోకం మారిపోయింది. సూర్యుడు, చంద్రుడు, పర్వతాలు, అడవులు, సముద్రాలు, ఋతువులు మొదలైనవే లోకమనుకుంటే ఆ లోకం మారలేదు. ఆహార, నిద్రా, భయాలు, సుఖ సంతోష ఈర్ష్యా ద్వేషాలు మూలంగా కల మానవ ప్రకృతే లోకమనుకుంటే ఆ లోకం మారలేదు. అయినా హేమచంద్రుని ఊహించని మార్పు ఈ లోకంలో త్రివిక్రమ స్వరూపాన్ని దాల్చింది. ఒక మాటలో చెప్పాలంటే మానవుని జీవన విధానమే మారిపోయింది. రాజ్యాంగం మారింది. సంస్కృతి మారింది. విజ్ఞానసరణి మారింది. ఆదర్శాలు, అవగాహనలు, లక్ష్యాలు మారేయి. అందువలన లోకంయొక్క బహిరంతర ప్రకృతిలో మార్పు స్పష్టపడినట్లుగా కన్పిస్తుంది. అయితే మారని సాంప్రదాయిక ప్రకృతి, మార్పు పొందిన సామాజిక ప్రకృతి ఈ రెండింటిమధ్య ఏర్పడిన సంఘర్షణ వలన, కుదిరిన ఒద్దికవలన కూడా కవుల ప్రపంచాలు అపూర్వంగా విస్తరించాయి. సంప్రదాయాన్ని తృణీకరించాలనే ఊహ, సంప్రదాయాన్ని వారసత్వంగా శిరసావహించాలన్న ఊహ, సంప్రదాయాన్ని సామాజిక వాస్తవికతతో అనుసంధించాలన్న ఊహ — సాహిత్య చరిత్రలో అపూర్వతయొక్క పరిధిని విస్తరింపజేసేయి. అందుకే ఒక మహాకవి తన కవితా రథచక్రాలు మహా అపూర్వ ప్రపంచ సీమలకు పరుగెత్తించేడు. ఒక మహాకవి రేచుక్కల కొక్కిరింపులను లెక్కచేయక నాటరానాటి కథలను త్రవ్వి పోసేడు. ఒక మహాకవి కొత్తపాతల మేలుకలయికలో కొత్త మెరుగులు కుమ్మరించేడు. వేరొకడు ఆధునికుల అపూర్వతను "నైక నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు"గా సమన్వయించేడు. ఇదంతా అపూర్వతను గూర్చి కవులు, ఆలంకారికులు భావించిన తీరును స్పష్టం చేసే విషయం. ఇక అపూర్వతను గూర్చి, దాని తత్వాన్ని గూర్చి మనోవైజ్ఞానికుల భావనలు, సిద్ధాంతాలు ఎలా వున్నాయో పరిశీలిద్దాం.

అపూర్వతను గూర్చి gerard, Home, Berlyne, Lauz, Peckham, Martindale, Canners Kartin, Parlun, woudnt మొదలైన మనోవైజ్ఞానికులు అనేకమైన ప్రయోగాలు జరిపి వున్నారు. వారి పరిశోధనల ఫలితంగా అపూర్వతను గూర్చిన శాస్త్రీయమైన నిరూపణలు కొన్ని లభించేయి.

శాస్త్రీయమైన చర్చలో అపూర్వత (Novelty), ఆశ్చర్య జనకత (Surprisingness), సంకీర్ణత (Complexity) మొదలైన పదాల నిర్వచనము, వాని అవధులను గూర్చిన సమస్య ఉత్పన్నమౌతాయి. పైనుదహరించిన వాఙ్మయ వ్యవహారంలో ఈ విధమైన పదాలు ఒక దానిలో ఒకటి వ్యాప్తి చెందే అర్థాలను కలిగి వుంటాయి. అయితే అందులో కొన్నిటి వర్ణన స్పష్టమైనది కాకుండా వుండడం కూడా జరగవచ్చును. సర్వసమ్మతమైన నియమాలను, సాంప్రదాయిక విధానాలను సాహసోపేతంగా అతిక్రమించడం వలన అపూర్వత, ఆశ్చర్యజనకత సిద్ధిస్తాయి. అందువల్ల ఊహించని, విచిత్రమైన రీతులు, అసామాన్యమైనవి అపూర్వంగాను గుర్తించబడతాయి. అనూహ్యత ఆశ్చర్యజనకతకు కారణం కాగా అద్భుతత్వంతో కూడిన అనూహ్యత అపూర్వతకు కారణమౌతుంది.

"నా విన్నవి కన్నవి విస్మృతంగా
మాటలకై వెదుకబోతే —
అవి
పుంఖాను పుంఖంగా
శ్మశానాల వంటి నిఘంటువుల దాటి,
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి,
ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి —
వడిగా, వడి వడిగా
వెలువడినవై, పరుగిడినవై, నా యెద కదులాడునవై".

ఇక్కడ కవి కవిత్వానికి సంబంధించిన సర్వసమ్మతమైన నియమాలను, సాంప్రదాయిక విధానాలను సాహసోపేతంగా అతిక్రమించిన వైనం విదితమౌతుంది. ఇది నిజంగా అనూహ్యమైనది,

అద్భుతావహమైనది. అందుచేతనే అపూర్వంగా భాసించింది. "పునర్యోనీ ప్రవేశం" అనే శీర్షిక అనూహ్యమైనది మాత్రమే కాబట్టి కేవలం ఆశ్చర్యాన్ని మాత్రమే కలిగిస్తుంది.

అపూర్వ విషయాలు తమలో తాము సమభావాన్ని కలిగి వున్నప్పుడు, వానిని గూర్చి ఊహించడానికి అవసరమైన ప్రయత్నాలు ఆలోచనకు ఉత్సాహాన్ని, ఔన్నత్యాన్ని కలిగిస్తాయి. వాని నుండి ఒక గాఢమైన అనుభూతిని పొందేలా చేస్తాయి. అందుచేతనే అంగీకారయోగ్యమైన రీతిలో అర్థవ్యక్తిని పొందుతాయని gerard అభిప్రాయం

"Of all the particulars that raise motions, not excepting beauty, or even greatness, novelty has the most powerful influence"— Home.

సౌందర్యము, ఔన్నత్యము మొదలైన ఆలోచనలను రేకిత్తించగలిగే ప్రత్యేకాంశాలన్నింటిలోను అపూర్వత బలమైన శక్తిని కలిగివుందని Home అభిప్రాయం.

ఈ అపూర్వత అనే పదం అనేకమైన, విభిన్నమైనదశలతో కూడిన వ్యవహారాన్ని కలిగివుంటుంది. వ్యక్తిగతానుభవానికి లోనైన అంశమే ఒకదశలో ఉత్తేజకమై నిరపేక్షమైనఅపూర్వత(Absolute Novelty) గా పరిగణింపబడవచ్చును. శిశువుకు లోకంలో అన్నీ అపూర్వంగానే భాసిస్తాయి. అంధత్వాన్ని అప్పుడే పోగొట్టుకున్న వ్యక్తికి దృష్టివలన సిద్ధించేశక్తి అపూర్వమైనదిగా కనబడుతుంది. అలా కాని పక్షంలో ఉత్తేజకమార్గాలు సాపేక్ష అపూర్వత (Relative Novelty) ను మాత్రమే పొందగలవు. అంటే ఉత్తేజక విధానాలు, అనుభూతపూర్వములైన అంశాలు నూతన రీతులలో సంగమించడం వలన అపూర్వతను పొందగలవు. ఒక కొత్తరంగునుగాని, సుగంధాన్నిగాని వేరుగా గుర్తించడం సాధ్యమే. పరిచితాలైన ఇతర రంగులలో, ఇతర సుగంధ ద్రవ్యాలలో కలసి వున్నా అపరిచితమైన రంగునుగాని, సుగంధాన్నిగాని తప్పనిసరిగా గుర్తుపట్టగలము గదా !

"మీకోసం కలం పట్టి,
ఆకాశపు దారులంట
అడావుడిగ వెళిపోయే
జగన్నాథుని రథచక్రాల్,
రథచక్ర ప్రళయ ఘోష
భూమార్గం పట్టిస్తాను !
భూకంపం పుట్టిస్తాను !" –

అనే చరణాల్లో మరో ప్రపంచాన్ని నిర్మించే విషయంలో కవి నిరపేక్షమైన నిబద్ధతను ప్రకటించడం మనం గుర్తిస్తాం. ఇక్కడ సిద్ధించిన అపూర్వతకు ఆ భావన ఒక్కటే ఆలంబనం కాబట్టి ఇది నిరపేక్షమైన అపూర్వత (Absolute Novelty) కాగలదు.

"కావున భారతామృతము గర్ణపుటంబుల నారఁగ్రోలి యాంధ్రావలి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీవిభ వాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదంగృతుల్,

ఈ పద్యం నిరవధికమైన అపూర్వతను పొందడానికి గల కారణాలు ఇందులోని "ఆంధ్రావలి మోదముంబొరయు", "మహాకవిత్వ దీక్షా విధినొంది" అనే ప్రయోగాలు. ఇందులోని ఇతరాంశాల నన్నింటినీ విడచి సహృదయుడు పై ప్రయోగాలను గుర్తిస్తాడు. ఇది సాపేక్షాపూర్వత (Relative Novelty) అనిపించుకుంటుంది. పైన ఉదాహరించిన రెండు భావాలు కవికి సమాజ వికాసం పట్ల గల నిబద్ధతను నిర్ద్వంద్వంగా వ్యక్తంచేసే ఒకే రకమైన అభిప్రాయాలైన, కాలమాన పరిస్థితుల ననుసరించి అపూర్వత సహృదయులపై ఏ విధమైన ముద్రను వేస్తుందో అవి తెలియజేయగలవు.

అపూర్వతను స్వల్పకాలికము (Short – term Novelty). దీర్ఘకాలికము (Long-term Novelty) అని రెండు విధాలుగా వర్గీకరించవచ్చును. ఒక ఉత్తేజక శక్తి (Stimulus) గడచిన కొద్ది నిమిషముల క్రిందట రూపొందిన అంశం కంటె భిన్నమైనదిగా వుండవచ్చును. లేదా ఒక దినములోగాని, అంతకుమించిన సమయంలో గాని జరిగిన దానితో పోలికలేనిదిగా వుండవచ్చును. ఇవి రెండూ తప్పనిసరిగా వేరుగా గుర్తించదగినవి దీర్ఘకాలికాపూర్వతకు సంబంధించిన ఏ ఫలితమైనా అవశ్యజ్ఞేయతను గర్భీకరించుకొని వుంటుంది. ఒక ఉత్తేజక శక్తి ఒక దినం కంటె ముందుగా జరిగిన దానికంటె భిన్నమైన ప్రవృత్తిని ఉత్పాదిస్తే, అంతకు ముందు రూపొందిన అంశం నిశ్చలమైన గుర్తింపును నిలుపుకోడానికి తగిన శక్తి కలదిగా వుండాలి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక అపూర్వతలు రెండూ ఆసక్తిని, ప్రేరణాధిక్యమును కలిగించేవే అయినా వానిలో స్వల్పకాలిక అపూర్వత వలన సిద్ధించే ఫలితాలు ఆకర్షకమైనవిగా వుంటాయి సౌందర్య శాస్త్రంలో స్వల్పకాలిక అపూర్వత తప్పనిసరిగా పోలికనుగాని, భేదాన్నిగాని తెలియజేసేదిగా వుంటుంది. రచన దీర్ఘకాలిక అపూర్వతతో కూడినదిగా వుండడం ముఖ్యం.

"రమ్యాణివీక్ష్య మధురాంశ్చనిశమ్య శబ్దాన్
పరుత్సుకో భవతి యత్సుఖితోఽపి జంతుః
యచ్చేతసాస్మరతి నూనమబోధ పూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని" –

అన్నశ్లోకం ఒక గొప్ప తత్వాన్ని ఆవిష్కరిస్తుంది. అబోధపూర్వమైన జననాంతర సౌహృద బలంవలన పర్యుత్సుకత్వాన్ని పొందడం ఈ శ్లోకం పుట్టకముందు వున్నదే. నేటికి వున్నదే. అయినా ఆ విధమైన అనుభూతిని అక్షరబద్ధమొనరించి, దానిని స్మరించినంతకాలం, ఆ రకమైన అనుభూతికి అవకాశమున్నంతకాలం నవనవంగా భాసిస్తుందీ రచన. ఒక ప్రగాఢము, శాశ్వతికము ఐన

సత్యాన్ని ఆధారంగా చేసుకుని వెలువడిన సుందరమైన కల్పన ఈ విధమైన దీర్ఘకాలికాపూర్వతను నిలుపుకుంటుంది. స్వల్పకాలికాపూర్వత సాధారణంగా కవిసమయాలు, అలంకారాల ఆధారంగా రూపొందుతుంది.

"ఓ ప్రత్యూష పవనలోల సుందర లతాంతమా!
నేను ప్రదోషవేళా తమాల శాఖాగ్రఘూకాన్ని
అటు–ఆనంద సుధర్మవైపు నువ్వు వెళ్ళి నక్షత్రధూళిని
చల్లుతూ
ఇటు–కలల బూడిద రాసులమీద కూలబడదా కన్నీళ్ళు
చిమ్ముతూ".

ఇక్కడ 'ఆనంద సుధర్మ', 'నక్షత్రధూళి', 'కలల బూడిద రాసులు' మొదలైన పదబంధాలు ఆ క్షణానికి అపూర్వంగా భాసించడానికి అలంకారకల్పన కారణం. అయితే ఇది స్వల్పకాలికమైన అపూర్వతే అవుతుంది. కవిత్వంలో ఈ ప్రకరణాలకు ముందు వెనుకలను గుర్తు చేసుకొనేటప్పటికి ఈ అపూర్వత ఇంకిపోతుంది, అలా కాకుండా స్వల్పకాలిక అపూర్వతలోనే ఫలవంతమైన ప్రయోగాలుంటాయి. అవి ఆ క్షణంలో ఆకర్షకంగా వుండటమేగాక, వాటి సమాహార స్వరూపం ఒక సంప్రదాయంగా, ఒక ఉద్యమంగా తలయెత్తే అవకాశం వుంటుంది.

ఆంతరమైన అపూర్వత (Subjective Novelty) ను నుత్తించే నిర్ణాయక విధానాలను గురించి (Berlyne, Parham) అనే శాస్త్రజ్ఞులు ఈ విధంగాచెప్పేరు:

1. ఒక ఉత్తేజకశక్తి నిరంతరాయంగా పునరావృత్తి చేయబడినట్లైతే క్రమక్రమంగా అపూర్వత క్షీణిస్తుంది.

2. గడచిన కొద్ది నిముషాల్లోకింద గ్రహించబడిన అంశంతో పొందుకలిగిన ఉత్తేజశక్తి అలాంటి పోలిక లేనిదానికంటె తక్కువ అపూర్వతను కలిగివుంటుంది.

3 అప్పుడే అనుభవంలోకి వచ్చిన అంశంతో అధికమైన భేదాన్ని కలిగిన ఉత్తేజకశక్తి అధికమైన అపూర్వతను కలిగి వుంటుంది.

మితమైన అపూర్వత (Moderate Novelty) అధికమైన పరిశీలనకు ఆకర్షణ నిచ్చేదిగాను, అమితమైన అపూర్వత (Extreme Novelty) తక్కువ ఆకర్షణ కలదిగాను వుంటాయని Conners అభిప్రాయం. ఆధునికయుగంలో భావకవిత్వోద్యమం, అభ్యుదయ కవిత్వోద్యమం ఇందులో మొదటి వర్గానికి, అధివాస్తవిక కవిత, నైరూప్య కవిత, దిగంబర కవిత మొదలైనవి రెండవ వర్గానికి చెందగలవు.

అపూర్వమైన ఉత్తేజకశక్తి వేరొక అపూర్వమైన ఉత్తేజక శక్తిద్వారా స్థానభ్రంశాన్ని పొందిన తర్వాత తనలోని చోదక శక్తులను కోల్పోతుంది. ఈ అంశం ఆధునిక కవిత్వంలో చక్కగా నిరూపిత మయింది. అభ్యుదయ కవిత దిగంబర కవితద్వారా, దిగంబర

7 జులై 1978 న

పద్మావతి గ్రూపు

ముగించబడుతుంది

ఆలశిస్తే మీరు సభ్యత్వాన్ని కోల్పోతారు.

త్వరపడండి!!!



పరిమితంగానే సభ్యత్వాలు భర్తీకావలసియున్నవి. అధిక వివరాలకు, ఉచిత దరకాస్తు ఫారం, లిటరేచరుకు సంప్రదించండి / వ్రాయండి. మీకు సమీపంలోని బ్రాంచి లేదా ఏజెంటు లేదా

గుజరాత్ సేవింగ్స్

* 5–1–751. బ్యాంక్ వీధి, కోఠి న్యూ తాజ్‌మహల్ హోటల్ ఎదుట, హైదరాబాద్, ఫోన్ : 57406.

* కోటవారి బిల్డింగ్, గాంధీనగర్, సిమెంటు రోడ్, విజయవాడ, ఫోన్ : 72152.

ఆంధ్రప్రదేశ్‌లో 29 బ్రాంచీలు
భారతదేశ మంతటా బ్రాంచీలు

కవిత విప్లవ కవితద్వారా తమ తమ చోదక శక్తులను కోల్పోవడం జరిగింది. అందుచేతనే ఆయా ఉద్యమాలు ఎంత ప్రయత్నించినా పునరుత్తేజాన్ని పొందలేక తమ అస్తిత్వాన్ని కోల్పోయాయి. ప్రాచీన కవిత్వంతో పోల్చుకుంటే కూడా అవి కోల్పోయినదిహెచ్చు. పై నిర్ణయాల వలన అపూర్వత — ఆనందసిద్ధి ఒకానొక సమయంలో సూక్ష్మైన సంబంధాన్ని కలిగివుంటే ఒకానొక సమయంలో ఆ సంబంధాలు తల్లక్రిందులవడం కూడా వున్నదని తెలుస్తుంది.

అపూర్వత విషయంలో Woudut curve ఆసక్తికరమైన ఫలితాలను రూపొందించింది. "ఒక ఉత్తేజకశక్తి అత్యంతమైన అపూర్వతను కలిగివుంటుంది. అందుచేతనే ఉత్యంతమైన ప్రేరణ శక్తిని కలిగివుంటుంది. పునపునరను సంధానంతో ఆ అపూర్వత క్షీణిస్తుంది. అందుచేతనే మనం ఇలా కూడా ఊహించవచ్చును పరిపూర్ణమైన అపూర్వతను కలిగిన ఉత్తేజక శక్తి అసహ్యకరమైనదిగా కనిపిస్తుంది. పునః పునరను సంధానం వలన అందులోని అసహ్యత క్రమక్రమంగా తగ్గుతుంది. చిట్ట చివరకు అది మరీ మరీ ఆనందకరమైనదిగా రూపొందుతుంది. ఆనంద శిఖరాలను చేరుకున్న తరువాత ఉత్సాహరహితమైనదిగా నిలుస్తుంది" — అని Woudut curve నిరూపిస్తుంది. ఈ సిద్ధాంతం హఠాత్తుగా వింటే విడ్డూరంగా కనబడవచ్చును. కాని సాహిత్య చరిత్రను పరిశీలిస్తే ఇందులోని యథార్థం వెల్లడికాగలదు. లాంగినస్ అపూర్వతను సాధించడానికి చేసే ప్రయత్నాలన్నిటినీ నిరసించడం, హొరేసు నవ్యతను గుర్తించని వారిని తప్పుపట్టడం, కాళిదాస — భవభూతులు తమ అపూర్వ రచనా దక్షతను కాపాడుకోవలసి రావడం, కళాపూర్ణోదయం కేవల కల్పనా కథ అని తృణీకరించబడడం మనకు తెలిసిన విషయమే కదా! ప్రారంభదశలో అసహ్యతకు గురైన పై రచనలన్నీ క్రమక్రమంగా రమపట్ల సుముఖతను పెంపొందించుకొని క్రమంగా తమ మార్గంలో అనేక రచనలకు గతి కల్పించడం, అది ఒక ప్రత్యేక ప్రక్రియగా రూపొంది స్వర్ణాధ్యాయాలను సృష్టించడం చివరకు ఆ ప్రక్రియ పర్విత చర్వణమై ఉపేక్షకు గురికావడం సాహిత్యప్రియులకు విదితమే. ఇది అపూర్వతా గుణంలోని పరమరహస్యం. దీనిని గుర్తించడం కవులకెంతైనా అవసరం.

కళాత్మకమైన అనుభూతి సహృదయుని సంసిద్ధతకు భిన్నమైన ఒకానొక ఉత్తేజకశక్తితో కూడినదిగా వుండాలి. రచయిత కొత్తకొత్త మార్గాలను చేపట్టాలి. తాను చేపట్టిన ప్రక్రియలో పూర్వులకు, తనకు విచ్ఛేదపూర్వకమైన సంబంధముండేలాగున రచయిత తన రచనను కొనసాగించాలి. తనకంటె ముందు నడిచిన వారికంటె కొట్టవచ్చినంతగా భేదాన్ని కల్పించలేని ఏ కవీ గొప్ప కవిగా పేరుపొందలేదు.

> శాశ్వత నవ్యస్ఫురణల నశ్వరలావణ్యమైయెసయు కన్యకళా
> విశ్వము నందానంద రసైశ్వర్యములేలు కవిత కంజ
> యిత్తున్.
>
> — రా. పా.

ఉపయుక్త గ్రంథాలు

1. న్యాయకోశము
2. శిశుపాల వధ — మాఘుడు
3. ధ్వన్యాలోకము — ఆనందవర్ధనుడు (అభినవగుప్తుని లోచన వ్యాఖ్యతో)
4. వక్రోక్తి జీవితము — కుంతకుడు
5. అభిజ్ఞాన శాకుంతలము — కాళిదాసు
6. ఉత్తర రామచరితము — భవభూతి
7. పాండురంగ మాహాత్మ్యము — తెనాలి రామకృష్ణకవి
8. సింహాసనద్వాత్రింశిక — కొఱవి గోపరాజు
9. సాహిత్యప్రమాణ మీమాంస — హేమచంద్రుడు
10. మహాప్రస్థానము — శ్రీ శ్రీ
11. అమృతం కురిసిన రాత్రి — తిలక్
12. సారస్వత నవనీతం — దేవులపల్లి రామానుజరావు
13. Art of Poetry — Horace
14. On the Sublime — Longinus
15. Aestuetics and Psychobiology — D. E. Berlyne

శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

ప్రాముఖ్యత సంప్రదాయమా?

'కావ్య భాష! ప్రాముఖ్యతా సంప్రదాయం' అనెడు పేరున 'మే' నెలలో శ్రీ వెన్నెలకంటి ప్రకాశం గారిచే నొక వ్యాసము ప్రకటింపబడినది. 'ప్రముఖత'పు (ప్రాముఖ్యత అనరాదు. ధర్మ వాచకముపై భావార్థ ప్రత్యయము నిలువదు) సంప్రదాయత్వము సిద్ధించునా? అన్నది ప్రశ్న. సంప్రదాయమనగా నేమి? పూర్వ పూర్వ సిద్ధాంతములను ఖండించుచు నూత్న సిద్ధాంతమును స్థాపించుట లేక పూర్వ పరిశోధనలకు పల్లవ ఫలమై నూత్న విషయ ప్రతిపాదకమగు సిద్ధాంతము కూర్పుట సంప్రదాయము కావచ్చును. ధ్వని సంప్రదాయము పూర్వ సిద్ధాంతములను ఖండించినది. ఉత్తరములైన అనుమానాది సంప్రదాయములు ధ్వని కన్న భిన్నతను నిరూపించుటకు ప్రయత్నించినవి. కాని అవి ధ్వని సిద్ధాంతమును మీరలేకపోయినవి. అవి నూత్నముగ చెప్పినది ఆభాసమగుటయే వాని తాదృశ స్థితికి కారణము.

ప్రకాశం గారి వ్యాసము కావ్య నిర్వచన పరామర్శతో ఆరబ్ధమై, ధ్వన్యాది వివిధ సంప్రదాయములను పరామర్శించినది. ఆ తరువాత 'ప్రాముఖ్యతా' ప్రస్తావన చేయబడినది. పై క్రమము ననుసరించియు, వ్యాసనామకరణము ననుసరించియు 'ప్రాముఖ్యత' నొక సంప్రదాయముగా వారు నిరూపింప తలపెట్టిరని భావింప వచ్చును.

"పైన పూర్వులు చెప్పిన అభిప్రాయాలను పొందు పరుస్తూ కావ్య భాషను పరిశీలించడానికి తగిన శైలీ సంప్రదాయాన్ని ఏర్పరుచుకోవటానికి ప్రయత్నిద్దాం" — అని వారు ఉపక్రమించుటం బట్టి పూర్వుల కన్న నూత్న విషయము చెప్ప బడుచున్నదని ప్రతిపాదింపబడినది.

ప్రకాశం గారిచే ప్రతిపాదింపబడుచున్న ప్రాముఖ్యతా సంప్రదాయము కావ్యభాషా పరిశీలనార్థమట. ఇట 'కావ్యభాష' యనుట తర్కసహము కాదు. ఏలన రసము, ధ్వని, అలంకారములు, రీతులు, గుణములు, వక్రోక్తులు ఇట్టి సంప్రదాయములు కేవలము కావ్యభాషయందే గూడుకట్టుకొని కూర్చొని యుండ లేదు. నిత్యము మన వ్యవహారమున ఎన్ని అలంకారములు వక్రోక్తులు వాడబడుటలేదు.

ఉదా :— వాడు వట్టి కోతి

వాడు మనిషా ? — ఇట్టివి ఎన్నో ?

బాలిశుని చూచి 'వారు మహాత్ములు' అన్నపుడు వ్యతిరేక లక్షణ వ్యవహారములో లేదా ?- ఇవన్నియు కావ్య భాషకు పరిమిత ములు కావు కదా !. సాధారణ భాషా పరిశీలనమునకదా లాక్షణికులు ఏదో సంప్రదాయమని పేరుపెట్టుకొనునది. అట్లే మున్ముందు వారు చెప్పబోవు లక్షణము ననుసరించి 'ప్రాముఖ్యత' కావ్యభాషకే పరిమితమని వారు భావించుట ఆ లక్షణమునకు అవ్యాప్తి దోషమాపాదించుట.

ప్రాముఖ్యతా స్వరూపమును దర్శింతము.

"మనం ఇక్కడ ప్రధానంగా మూడు కావ్యనిర్మాణ నియమా లను పరిశీలిస్తున్నాం. ప్రాముఖ్యత, సంయోగత, లయ. ప్రాముఖ్య తకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నందువలన మనం దీనిని ప్రాముఖ్యతా సంప్రదాయం అందాం. పై మూడు నియమాలూ కావ్యగతమైన అర్థానికీ, శబ్దానికీ కూడ వర్తిస్తాయి" — ఇది వారు చూపిన ప్రాముఖ్యతా సంప్రదాయ సూత్రాల స్వరూపము. వారు పేర్కొన్న మూడును కావ్యగత శబ్దార్థములందు వర్తించు నన్నారు. వీనిలో 'లయ' అర్థమునందెట్లు వర్తించునో తెలియ కున్నది. ఉదాహరణకు -

ఒకచాయ । నసపాయ । పికగేయ । సముదాయ ।

మొకసీమ । నానామ । యూరసీమ —

(వసుచరిత్ర)

అన్న పద్యమున పంచమాత్రాకమై, అనుప్రాసభాసురమైన లయ యున్నది. పాఠకుని దృష్టి ఆ లయనుపాదించు శబ్దములపై నించి అర్థము నపేక్షింపక నానామ । యూర నినద అన్న రీతిని విభజింపబడుచుండ లయ అర్థగతమగుట ఎట్లు ? అట్లే

ఎగిరించకు లోహ విహంగాలను

కదిలించకు సుప్త భుజంగాలను (మహాప్రస్థానం)

అన్నచోట నాలుగు మాత్రల విఱుపు కొఱకు అర్థము పొంతపొక అపచ్ఛేదము చేయించునది 'లయ' కాదా ?

ఒకానొక రస స్ఫురణార్థము యొకానొక లయ అవసరము కావచ్చును కాని లయ అర్థమును ఆశ్రయించుకొనుట ఎట్లు? లయ సంగీత సంబంధి, ఒక తూగు, ఉద్దేశము సంపాదించుటకు శబ్దాశ్రయమై అది వర్తించును.

ఉదా : తకిట తకఝుణు

తకిట తకఝుణు—అన్నప్పుడు

3 + 4 మాత్రల లయ యున్నది. దానికి అర్థముతో పని యేమి?

లయకేవలము శబ్దగతముకానిఅర్థగతముకాదు. దుర్వారోద్యమ బాహువిక్రమ రసోత్సాహ ప్రతాపస్ఫురత్ గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్......... (భారతం)

అన్న పద్యములోని వీరరస తాత్పర్యమును వచనములో వ్రాసి నను లేక వేరొక మందాక్రాంత వంటి వృత్తములలో వ్రాసినను దాని జీవితము చేదపురుగుల పాలేకదా!

లయ అర్థస్ఫూర్తికి తోడ్పడవచ్చును కాని అర్థాశ్రితము కాదు. కనుక శబ్దార్థ పరిధినుండి మూడింటిలో 'లయ'ను తొల గింపవలెను.

ప్రాముఖ్యత

"సాధారణంగా మనం మాట్లాడే విధానానికి భిన్నంగా నడుస్తుంది కావ్యభాష. ఈ ప్రత్యేకత భాషలోని కొన్ని అంశాలకు ప్రాముఖ్యతనిస్తూ తద్వారా భావప్రాముఖ్యత నిస్తుంది" — ఇదు రెండవ వాక్యము వారు పేర్కొనుచున్న ప్రాముఖ్యతకు లక్షణముగా భావింపవచ్చునేమో?

ఇందు చిత్రమేమనగా మొదటి వాక్యములో వారు 'సాధార ణంగా మనం మాట్లాడే విధానానికి భిన్నంగా నడుస్తుంది కావ్య భాష' అని పేర్కొని అట్టి కావ్యభాషలో ప్రాముఖ్యతను స్థాపింప తలచినారు. కాని అందు బహూదాహరణములు లౌకికములు కావ న్నను వానిని వ్యవహారములో సులభముగా చూపవచ్చును. అట్టిచో అది కావ్యభాషకు పరిమితమెట్లగును? లోకములో వారి ప్రాము ఖ్యలా సంప్రదాయము అనంతముగానున్నది.

ఇక ప్రాముఖ్యత. ఇదియొక నూత్నవిషయము కాదనిపించు చున్నది. కారణము వారు చూపిన ప్రాముఖ్యతోదాహరణములన్నియు అత్యంత తిరస్కృతాది ధ్వనులయందో, రాజానక కుంతకుని, వక్రో క్తుల యందో పర్యవసించును.

వక్రోక్తిని పరిశీలింతము. దండి వాఙ్మయమునంతయు స్వభావోక్తి, వక్రోక్తి అని రెండు విభాగములు చేసెను. "భిన్నం ద్విధాస్వభావోక్తిర్వక్రోక్తిశ్చేతి వాఙ్మయమ్."

పై నిర్వచనము ననుసరించి స్వభావోక్తి భిన్నమైనది వక్రోక్తియే అగును. స్వభావ మనగా వస్తుతద్ధర్మము. లేక లోక ధర్మము. దానికి భేదించిన నది వక్రోక్తియే యగుననుట స్పష్టము. దీని ననుసరించి ప్రకాశంగారి ఉదాహరణములు—

(i) వాడు నా మొగుడు

(ii) నాకో మగాడు కావాలి అంది
ఆమె పొట్ట చూపిస్తూ

పైరెండుచోట్ల స్వభావ భిన్నత వక్రత.
ఇట్టివే వక్రోక్తులుగా పేర్కొనబడినవి.

(iii) మావాడు దారి చూపిస్తాడులెండి
మీవాడు ?
ఏం మావాడు చూపించలేడా?

పై సంవాదమున కాకువుచే వక్రోక్తి సాధింపబడినదనుట సర్వవిదితము.

(iv) ఎటుల సైతును నేను
చలిల విరహాగ్నులను
ఎటుల ఈదుదు నేను
హేమంత రాత్రులను—

అన్న నారాయణరెడ్డి గేయమున 'ఈదుదు' అన్న క్రియ 'అనుభవ ప్రమేయాభిహిత ప్రాముఖ్యత' వహించుచున్నదని ప్రకాశం గారి అభిప్రాయము. కాని ఈ ఉదాహృతి పరికింపుడు.

ఉన్మీల కమలం సరసీనాం
కైరవంచ నిమీల ముహూర్తాత్
(కావ్యాలంకార సూత్రవృత్తి)

కమలము, కైరవము కనులు తెఱచెను, కనులు మూసెను అన్న చోట 'వికసించుట' అన్నది అభిహితము. 'కనులు తెఱచుట' అన్నది పొసగదు. ఇదియే వక్రోక్తియని వామనుని అభిప్రాయము. హేమంతరాత్రులను 'ఈదుట' అన్నచోట ఇంతకన్న భిన్నస్థితి ఏమున్నది? ఇక 'ఈదు' అను క్రియకు ఒనేకార్థము లూహించుట భావుకుని శక్తి. కాని ఆ శబ్దముపై ఆతని దృష్టిని ప్రముఖముగా కేంద్రీకరించు పని వక్రోక్తియే చేయుచున్నది. ఈ వ్యాపారమే ప్రకాశంగారిచే 'ప్రాముఖ్యత'గా చెప్పబడినదనుకొందును.

'రాజమకుటం' సినిమాలోని 'ఉన్నాడా?' అన్న పుంలింగ ప్రత్యయవిధి 'ప్రత్యయ వక్రత'లోనికి రాదా?

"ఈ అభిహితం అన్నది మనవాళ్ళు చర్చించిన 'వక్రోక్తి'కి సన్నిహితం అని వేరే చెప్పనక్కరలేదు"— అని ప్రకాశంగారు చెప్పి యున్నారు. కాని ప్రాముఖ్యత వక్రోక్తికి సన్నిహితముకాదు వక్రోక్తియే.

"వాక్యాలమధ్య ఉండే సమన్వయం (Cohesion) గూడ ప్రాముఖ్యత సాధిస్తుంది. అంతేకాక కావ్యంలో 'సంయోగిత' (Unity) పెంపొందిస్తుంది. పర్యాయపదాలు వాడి కాని, సర్వ నామాలు వాడికాని ఒకేభావాన్ని పలుమార్లు ప్రతిపాదించాం అనుకోండి. దానికి ప్రాముఖ్యత ఇచ్చినట్లే"—ఇచట నొక పరిశీల నాంశము కలదు. పర్యాయపద ప్రభృతి సహాయమున ఒకే భావ మును పలుమార్లు ప్రతిపాదించుటను 'దండి' దోష ప్రకరణముగా 'ఏకార్థము' అను దోషముగా పేర్కొని అట్టి ఆవృత్తి వలన ఏదేని ప్రయోజనము సిద్ధించుచున్నచో నది గుణమే యగునవి తెల్పినాడు. ఆతని నిర్వచనము ననుసరించి ప్రయోజనావసరమున

ఒకే భావము పలుమార్లు ప్రతిపాదింపబడుట వక్రోక్తియగును. దానినే 'ప్రాముఖ్యత'యని ప్రకాశంగారు పేర్కొనినారు

ఆ తరువాతి వాక్యములలో 'ప్రధాన పదములు' సంగ్రహ పదములు కావ్యవస్తువును దొరకించుకొనుటకు ఉపయోగించునని చెప్పబడినది. ఇవి 'ప్రాధాన్యత' ననుసరించి తెలిసికొనవచ్చును. ప్రధాన పదములనగా ప్రాముఖ్యత ననుసరించి భాసించునవే కదా! అవియే వక్రోక్తులు.

(V.) బియ్యంతో వియ్యమందే పలుగురాళ్ళు
పాలతో తాదాత్మ్యం చెందే పంపునీళ్ళు.

అన్నచోట సైతము అభిహితములైన 'వియ్యమందు' 'తాదాత్మ్యంచెందు' అన్నవి వక్రోక్తి, ధ్వనిసమ్మేళనమున విశేషార్థ స్ఫోరకము లగుచున్నవి.

ఇక సమత.

సమత (పొందిక) కావ్యసంయోగతకు దారితీయుననుట సత్యముగా భాసించును. కాని ఆలోచింపగా ఒక భావమును చెప్పు సమయమున కొన్ని పాదముల మధ్యనున్న 'సమత' సౌందర్య కారకము. కాని కావ్యమునందంతటను ఈ సమత యుండునా? ఉండవలయునా? ఉదాహరణకు - కౌశికుడను బ్రాహ్మణుడు మఱ్ఱిచెట్టు క్రింద కూర్చొనువఱకు భక్తిభావము వర్ణింపబడినది. అచట శబ్దవిన్యాసమున సమతయుండును. వెంటనే కొంగపై క్రోధము చూపినాడు. ఏదో అనినాడు. అచట ఈ వాక్య నిర్మాణ ముండదు. క్రోధరసస్ఫూర్తి, కఠిన శబ్దములు, దీర్ఘసమాసములు, వికృత పద్య నిర్మాణము జరుగును. మరల ఊరిలో పతివ్రతాశక్తికి ఆశ్చర్యపడి భక్తిభావము నందినాడు. అంట మొదటివలె రచన సాగినది. ఇట్టి స్థితిలో కావ్యసంయోగత లభించునా? లేదా? మొదటి భక్తిభావము తరువాత అన్యభావము పిదప భక్తిభావము— ఇచట రచనలో విషమత్వము వచ్చినది. అప్పుడు కావ్య సంయోగత లేదనవలెనా? కనుక 'సమత' అను గుణము విస్తృత పరిధి కలిగినది కాదు. ఉట్లుండవలెనని బహుజనులు భావింతురు. విశ్వనాథవారి రచనలో ఇట్టి రచనలున్నవి. కనుకనే క్రొత్తగానుండి 'తృతీయఃపంథా'గా స్ఫురించుట. సారాంశము ప్రకాశంగారు పేర్కొనిన 'సమత' ప్రయోజనకారియే కాని వారూహించినంత విస్తృతముగా కాదు

ఇక సమతా భేదములు

ఇందు బహుభేదములు శబ్దార్థాలంకారములకు పర్యాయములు. అసలు దండి సమతకు ఇచ్చిన నిర్వచనము వేరు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

/ స్థాపితం 1908 /

గాంధీనగరం, విజయవాడ-3

ఇంట్లో అందరికీ ఆనందాన్ని ఇచ్చే శీర్షికలు! కథలు!! బొమ్మలు!!!

★ సాహిత్య విలువలున్న సీరియల్ కథలు

★ వైవిధ్యం వున్న కథానికలు

★ అన్ని తరాలవారినీ అలరించే "ప్రశ్నావళి" "ధర్మపథం" కార్టూన్‌లు మొదలైన వాటితో ఏవారానికి ఆ వారమే కొత్తదనాన్ని పుణికిపుచ్చుకుని మీకు అందుతుంది!

విడి ప్రతి వెల 75 పైసలు	ఆరు మాసాలకు రు. 20-80 పై
సంవత్సర చందా (పోస్టుద్వారా) రు. 41-60 పై.	మీ స్థానిక ఏజంటుద్వారా తెప్పించుకుంటే ప్రతీవారం తెల్లారేసరికల్లా మీముందు వుంటుంది

రచనలు పంపే చిరునామా!

ఎడిటర్, ఆంధ్ర సచిత్ర వారపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

చందాలు పంపే చిరునామా:

మేనేజరు, ఆంధ్రపత్రిక
గాంధీనగరం, విజయవాడ 3.

బంధములయందు విషమమౌ వాక్యముల స
మత్వమొప్పు మృదుస్ఫుట మధ్యమములు.
(ఆంధ్ర కావ్యాదర్శము)

అనగా నిర్మితియందు ఎచ్చుతగ్గులు లేని యొక సమభావము సమతయగును. అది మృదువైన మృదువు. స్ఫుటమైన స్ఫుటము. మధ్యమమైన మధ్యమము. లాలిత్య పారుష్య సంబంధిగా 'సమత' లాక్షణికులచే చెప్పబడినది. ప్రకాశంగారి నిర్వచనము.

'పదాలమధ్యగాని పదబంధాల మధ్యగాని వాక్యాల మధ్యగాని ఏర్పడే అనురూపత సమత'—

దీనిననుసరించియు బంధముల అనురూపతయే సమత యగునుకాని వారు చూపిన భేదములు వివిధ శబ్దార్థాలంకారము లలో అంతర్భవించును. అప్పుడీ విభాగమువలన నూత్న నిర్వచనము వలన వానికి సమత యని పేరుపెట్టుట వలన ఏమి ప్రయోజనము ? చూడుడు.

'పద సమత' యమకమే కదా !

'వర్ణ సమత' అనుప్రాసమగునుగా !

'స్వరసమత' 'పాదాలను పాదభాగాలను ఒకే రకంగా ఉచ్చరిస్తే ఏర్పడుతుంది' అన్న నిర్వచనము అస్పష్టముగా నున్నది. 'ఒకేరకంగా' అనెడు దానికి సమానముగా అను నర్థము స్వీకరించిన ఛందస్సాహిత్యము, మాత్రాకవిత్వము అంతయు స్వరసమతయే అగును. ఛందస్సమత, స్వరసమతల మధ్య గల భేదమేమి ? 'స్థాన సమత'కు నిర్వచన మీయలేదు. తాల్వాదిస్థాన సమతయైనచో నది దండి పేర్కొన్న 'శ్రుత్యనుప్రాస' మగును.

భావ పునరావృతికి సంబంధించిన అర్థాలంకారములు పెక్కులు కలవు.

ఈ రీతిగా ఇతః పూర్వము. అస్తిత్వము కలవానికి నూత్న నామకరణము జరిగినది వారు భావించిన నిర్వచనము ననుసరించి ఇవియన్నియు సమతాభేదము లగుటలో విప్రతిపత్తి లేదు. కాని ఆ నిర్వచనము ప్రాచీనుల సమతా నిర్వచనమునకు భిన్నము. వీరి సమత యమకాది రూపములతో కావ్యములందు నిలిచియే యున్నది. ఆ విషయము వారే 'లయ' విభాగమున పేర్కొనియున్నారు.

లయ సంయోగతకు దోహదకారి యనుట సత్యమే. కాని ఆ రెండు కలిసి ప్రాముఖ్యతకు దోహదము చేయవలసిన అవసర మేమి ? దానియంతట నది ప్రాముఖ్యత (వక్రోక్తి) సాధింపబడ వచ్చును. వారు చూపిన ప్రాముఖ్యతోదాహరణములలో 'లయ' లేదు కదా !

ఛందస్సులోని ముఖ్య లక్షణములు, గణ విభజనకు పద రూపములకు ఉన్న సంబంధములు చక్కగా నిర్వచింపబడినవి. 'ఛందోబద్ధ కవిత్వమైనా కాకపోయినా కాస్తో కూస్తో లయబద్ధం కాకపోతే కవిత్వం మనకు రుచించదు.' అన్నమాట సత్యమే కాని సంపూర్ణసత్యముగా సర్వులచే నంగీకరింపబడదు. అది ప్రత్యేక చర్చ.

సారాంశమేమనగా —

'ప్రాముఖ్యత' అన్నది వక్రోక్తికి, ధ్వనికి రూపాంతరముగా తోచుచున్నది

ప్రాముఖ్యత, లయలు కావ్యభాషకు మాత్రమే పరిమితములు కావు. ఆ రెండు పరస్పరాశ్రితములు కావు.

కావ్య నిర్మాణ నియమము ప్రముఖముగా 'సంయోగత'యే అనవచ్చును. ప్రాముఖ్యత, లయ నిత్యవ్యవహారములో నుండ వచ్చును. అట్టి వాని మధ్యగల సంయోగము, ప్రకృష్టమైన బంధము కావ్య నిర్మితికి తోడ్పడును.

లయ శబ్దాశ్రితమనుట యొప్పు.

నా వ్యాసము శ్రీ ప్రకాశం గారి వ్యాసము ననుసరించి పరువెత్తినది. ముఖ్యముగ నేను తెలిసికొనదలచినది 'ప్రాముఖ్యత సంప్రదాయమగునా ?' అను విషయము. పైని చూపిన ఉప పత్తుల ననుసరించి ప్రాముఖ్యత ప్రత్యేక సంప్రదాయము కానవసరము లేదనియు పూర్వ సంప్రదాయములయందే ముఖ్యముగా వక్రోక్తి సంప్రదాయమునందే అంతర్భవించుననియు నా భావనము అట్లే సమతాది విషయములును నూత్నములుగా భాసించినను పూర్వ లక్షణములను స్పష్టీకరించునవిగా తోచుచున్నవి.

ఇందు సమాధేయములున్నచో ఆగ్రహ రహితముగ ప్రత్యుత్తరింప విద్వల్లోకమును వేడికొనుచున్నాను.

ఉపయుక్త గ్రంథావళి :

తెలుగు కావ్యాదర్శము : అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి

కావ్యాలంకార సూత్రవృత్తి : వామనుడు.

కావ్యదర్శ : దండి.

ఇంకా మహాభారత, మహాప్రస్థాన, నూత్న సంగీత రత్నాకరాదులు.

శ్రీ జ్వాలాముఖి

"సోషలిస్టు వాస్తవికత కూడా వర్గపోరాటమే"

'సాహిత్యంలో వాస్తవికత' ('భారతి' – నవంబరు 1977) అనే నా వ్యాసానికి సమాధానంగా శ్రీపిరాట్ల (వేంకటేశ్వర్లు) "సోషలిస్టు వాస్తవికత" ('భారతి' – జనవరి 1978) అనే వ్యాసాన్ని పరమ రాజకీయంగాను, ధర్మ సందేహాల సంపుటిగాను రాశారు. దానికి నా సమాధానం విశదంగా వివరణగా అవసరమైంది.

"సాహిత్యంలో సోషలిస్టు వాస్తవికత కావాలన్నప్పుడు, నిర్వహించేటప్పుడు మరి రాజకీయాలు రాక తప్పుతాయా ?" అని శ్రీ పిరాట్ల రాజకీయాలనే ప్రధానంగా నాకు ఆపాదించి ప్రశ్నించారు. కాని సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అని అంగీకరించినప్పుడు రాజకీయాలకు కూడా ప్రతిబింబమని తేలిపోతుంది కదా! అలాంటప్పుడు సోషలిస్టు వాస్తవికత వుంటేనే రాజకీయాలు వస్తాయని చెప్పడం అశాస్త్రీయం. మన సాహిత్య లక్షణ గ్రంథాలన్నీ రాజకీయంగానే నిర్వచింపబడ్డాయి. ధీరోదాత్తుడు, ధీరలలితుడు, ధీరోద్ధతుడు, ధీరశాంతుడు మున్నగు కావ్య నాయకుల నిర్వచనాలు రాజకీయ వర్గ ప్రయోజనాల్నే తెలియజేస్తున్నాయి. అప్పకవి బ్రాహ్మణేతరుడు కవిత్వమే రాయొద్దన్నాడు. మొల్ల రామాయణాన్ని సాహిత్యకంగా ఖాతరు చేసినవారు ఇప్పటిదాకా లేరు "ప్రబంధ" నియమాల్లో "పురవర్ణన" ఒక నియమంగా వుందుకు వచ్చినా ఎక్కడా రైతు, వివిధ వృత్తుల (చాకలి, మంగలి, కుమ్మరి) శ్రమజీవుల ప్రస్తావన లేదు. ప్రతిచోట పుష్పలావికలు, విటులు, వీధి విరాట్టులు రాజుల సంభోగ శృంగారాల కీటకాలుగా దర్శనమిస్తారు. 'వాత్స్యాయనుడి కామ సూత్రాలు' నాటి పైవాళ్ళ శృంగార విలాసాన్నే లేశామాత్రం విరసా లేకుండా సూత్రీకరించాయి. చివరకు దేవాలయాల విగ్రహాలు, బొమ్మలు మన ఆధ్యాత్మిక చింతనలోని రంగుల్ని బయటపెట్టాయి. ఇవన్నీ రాజకీయాలే. ఏ ప్రాచీన కావ్యంలో కూడా సామాన్యుడు కావ్యనాయకుడు కాలేదు. క్షత్రియుడో, లేక బ్రాహ్మణుడో, మరీతే వైశ్యుడో కావ్యనాయకుడు. ఈ విషయాలన్నీ వర్గప్రయోజనాల్ని తెలియజేస్తాయి.

"ప్రతి సమాజం కూడా తన ఆర్థిక ప్రయోజనాల మేరకు తగిన తాత్విక చింతనను, సాహిత్యాం, లలితకళల్ని నిర్వచించి అభివృద్ధి చేస్తాయి" అని మార్క్స్ ఏనాడో నిజాన్ని బయటపెట్టాడు. ఇది శ్రీ పిరాట్ల వారికి తెలియకపోయినా వారు ప్రస్తావనకు తెచ్చిన 'చారిత్రక వాస్తవికత'లో తేలే నిజం.

చారిత్రక వాస్తవికత :

రాజకీయాతీతమైన అంశం ఏదీ ప్రపంచంలో లేదు. ఉండాలనడం అమాయకత్వం. ఉంటుందనుకోవడం అజ్ఞానం. "చారిత్రక వాస్తవాల మధ్య సోషలిస్టు వాస్తవికత అంటే కొంచెం అనూహ్యం–నే ఉంది" అని శ్రీ పిరాట్ల చరిత్రను వక్రీకరించారు.

శ్రీ పిరాట్ల దృష్టిలో చారిత్రక వాస్తవికతలంటే "లక్ష్యంలోని ఏకరూపకత" గాను, "ఆచరణలోని భేదం"గాను ఉంది. మార్క్సిస్టులకు సంబంధించినంతవరకు లక్ష్యంలో అవకతవకలేవి వుండవు. వారు విప్లవం ద్వారానే ప్రజలకు రాజ్యాధికారం చెందుతుందని భావిస్తారు. తదనుగుణంగా వ్యూహాన్ని ఎత్తుగడల్ని నిర్ణయించుకొని వర్గపోరాటాన్ని నడుపుతారు. ఇక ఆచరణలోని "భేదం" అనేది వర్గదృష్టిని బట్టి తేలేదే. విప్లవాన్ని భారతదేశంలో విజయవంతం చేయడానికి, భారతదేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించడానికి "ఎత్తుగడలు" (తాత్కాలికమైనవి) ఎన్నో మార్పులు వస్తుంటాయి. ప్రతాపస్థం నహించని వారికి ఈ మార్పులు "భేదం"గా వారి వర్గదృష్టి కనులకుగనే కనిపిస్తాయి. కార్యాచరణలోని ఒడుదొడుకుల్ని, వైఫల్యాల్ని అధిగమించడం కూడా వర్గపోరాటంలోని అంతర్భాగమే.

విరుద్ధశక్తులమధ్య సంఘర్షణే వర్గపోరాటం. మార్పును కోరే శక్తులు, మార్పువల్ల నష్టపోయే దోపిడీ శక్తులు నిరంతరం సంఘర్షించుకుంటాయి. ఈ వర్గపోరాటం అనుసరించాల్సిన "పంథా" విషయంలో కూడా "ప్రజలపార్టీ" (కమ్యూనిస్టుపార్టీ)లో కూడా భిన్నాభిప్రాయాలుంటాయి. ప్రతి విషయాన్ని వర్గపోరాటం (సైద్ధాంతిక పృష్ఠం) ద్వారా తేల్చుకోవాలనే లక్ష్యంలో విశ్వాసమున్న కమ్యూనిస్టులు "సరైన పంథా" కోసం పోరాటం సల్పుతారు. ఈ దృష్ట్యానే భారతదేశంలో "విప్లవపంథా" గురించి కమ్యూనిస్టు ఉద్యమం చీలింది. ఇవి అవకతవకలు కావు. సర్వాన్వేషణా భీషణ పోరాటాలు.

వర్గ పోరాటం ద్వారానే అన్ని అంశాలు నిర్ణయింపబడాలనే సూత్రానికి కట్టుబడిన వారికి కార్యాచరణలో వచ్చేఒడుదొడుకులకు స్వేయమానసిక ధోరణిలో బెంబేలు పడరు. విప్లవాన్ని వ్యతిరేకించే వారే అవకతవకల పేరిట కుశంకల్ని లేవదీస్తారు.

''ఇంతవరకూ గల చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్ర'' అని మార్క్సు సూత్రీకరించాడు చారిత్రక గమనానికి వర్గ పోరాటమే గతి సూత్రంగా వుంది. పోరాటమన్నప్పుడు ఒడుదొడుకులు సహజం. పరిస్థితుల్ని అంచనా వేయడంలో కూడా కొన్నాళ్ళు పోరాడాల్సి వస్తుంది. స్వార్థపరులు జొరబడి విప్లవ గమనాన్ని పక్కదారి పట్టిస్తారు. లక్ష్యంకోసం దాన్ని సాధించే లక్షణం కోసం కూడా వర్గపోరాటం తప్పనిసరవుతుంది. దీన్నే మార్క్సిస్టు పరిభాషలో ''వర్గపోరాటం'' శత్రువుకు సంబంధించిన లక్ష్యమైతే, ''పంథా పోరాటం'' (Line – struggle) వర్గపోరాటాన్ని అమలు పరచడానికి సంబంధించిన లక్షణయుద్ధమవుతుంది. విరుద్ధశక్తుల సంఘర్షణే వికాసం అనేది తెల్చుకున్నాక అన్నీ బోధపడగలవు.

బానిస - బానిస యజమానుల సమాజం, భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ సమాజం, సమసమాజం, కమ్యూనిష్టు వ్యవస్థ అని మార్క్సు సామాజిక వర్గ పోరాటాల పర్యవసానాన్ని సూత్రీకరించాడు. ఇది యాదృచ్ఛిక వికాసం కాదు. వర్గపోరాటాల నిర్ణయాత్మక గతి. అభివృద్ధి చెందుతూన్నవర్గం సమాజ స్వరూపాన్ని తన ప్రయోజనాల కోసం మార్చి వేస్తుంది. సంస్కరణన్ని ప్రవేశపెడుతుంది. వీటిలో ఉత్పత్తి సాధనాలు (పొలాలు – ఫ్యాక్టరీలు) ఉత్పత్తి సంబంధాలు (యాజమాన్యం – శ్రామిక వర్గం) సామాజిక వ్యవస్థను నిర్ణయిస్తాయి.

నేటి భారత సమాజం అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశం. సామ్రాజ్యవాదుల పెట్టుబడులు మన దేశ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక మార్గాన్ని నిర్ణయిస్తున్నాయి. మునుపటిలాగా (ఇంగ్లీషువాడు, ఫ్రెంచివాడు, పోర్చుగీసువాడు) విదేశీపాలకులు మన గడ్డమీద నేరుగా పరిపాలన చేయకపోయినప్పటికీ, వారి పెట్టుబళ్ళు (అమెరికా, ఇంగ్లండు, జపాన్, రష్యా, ఫ్రాన్సు, పశ్చిమజర్మనీ) మన ఆర్థిక విధానాన్ని నిర్ణయిస్తున్నాయి. తద్వారా మన రాజకీయ విధానం అమలు జరుగుతూంది. ఇటీవల కార్టరు ప్రభుత్వం (U S A) వారి అంతర్జాతీయ అణువిధానానికి అనుగుణంగా భారత దేశ అణు విధానం వుండాలని (జనవరి 1978) భారతదేశ ప్రభుత్వాన్ని కోరింది. అప్పుడే భారతదేశానికికావలసిన, ''యురేనియం'', ''క్షార జలాలు'' (Heavy Water) ఈయడం సాధ్యపడగలదని అమెరికా హెచ్చరించింది దాన్ని బహిరంగంగా కాదన్నా అమెరికా వారి సహకారం (కొలాబరేషన్)తో నడిచే అణుశక్తి కేంద్రం అమెరికా వారి నియంత్రణలు పాటించబడగలవని భారతప్రభుత్వం హామీ ఈయడానికి ముందుకు వచ్చింది. శ్రీమతి ఇందిరాగాంధి హయాంలో అంతర్జాతీయ శాంతి సంఘం పర్యవేక్షస్థానంలోవుండి కూడా భారత ప్రభుత్వం వియత్నాం విషయంలో అమెరికాను నిర్ద్వంద్వంగా ఖండించలేకపోయింది.

ఇప్పుడు జార్జిఫెర్నాండేజుగారు పశ్చిమ జర్మనీ పెట్టుబడులను ఆహ్వానిస్తూవుంటే, చరణ్‌సింగ్ (B L D) వాజపేయి (J S) గార్లు జపాన్ పెట్టుబళ్లను ఆహ్వానిస్తున్నారు. మొరార్జీ, హెచ్. ఎం. పటేల్ (స్వతంత్ర) గార్లు అమెరికా పెట్టుబళ్ళను కోరుతున్నారు. అన్నిదేశాల ''బహుళ జాతి సంస్థలు'' (మల్టీ నేషనల్సు) చేపయిపట్టేవాళ్ళలా మనదేశంలో దిగుతున్నాయి. బహుళజాతి సంస్థల ప్రమేయంలేని పారిశ్రామిక రంగమే లేదు. ఈ సంస్థలు మన ఆర్థిక జీవితాన్ని, సాంఘిక వికాసాన్ని నిర్ణయిస్తాయి మన స్వాతంత్ర్యం ''నియంత్రణ''కు లోబడిన బహిరంగ సత్యమవుతుంది. 'పెట్టుబళ్ళు' పెట్టేవారు ''ప్రైవేటు రంగా'' (Private sector) నికే మొగ్గు చూపుతున్నారు. జనతావారి గ్రామీణాభివృద్ధిపథకాల్లోకి (Rural sector) బహుళజాతి సంస్థలు ఏ రూపంలో ప్రవేశిస్తాయోచూడాల్సివుంది. ఈ ఆర్థిక దోపిడిని ''అభివృద్ధి'' పేరిట భూస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించే ''అధికార పార్టీలు' పెట్టుబడిదార్ల తైనాతీలు సమర్థింపు స్వాగతం చెబుతున్నారు.

ఈ శ్రమ దోపిడీని ప్రతిఘటించడానికి, ఇంటా బయటా సర్వస్వతంత్రమైన ఆర్థిక విధానాన్ని చేబట్టడానికి శ్రామికవర్గ పక్షపాతులైన కమ్యూనిష్టు విప్లవకారులు ప్రత్యామ్నాయ సమసమాజ ఆర్థికవ్యవస్థకోసంపోరాడుతున్నారు. భూసంస్కరణల్ని అమలుచేయమంటున్నారు. ఆస్తిమీద కంట్రోలు విధించమంటున్నారు. శ్రమదోపిడిని నిర్మూలించమంటున్నారు. అలా చేయగలిగే శక్తి ప్రజారాజ్యానికే వుందిగాని, డబ్బుల ఎన్నికల విధానానికి లేదని విప్లవకారులు విమోచన యుద్ధానికి సమాయత్తమవుతున్నారు. మన భూస్వామ్య విధానం క్రమంగా పెట్టుబడిదారీ విధానంలోకి మారుతూంది. ఆర్థిక దోపిడి దినదినం క్రూరమవుతూంది. ఇటీవలి కాన్పూర్ స్వదేశీ కాటన్ మిల్స్‌లో జరిగిన కాల్పులు అందుకో ఉదాహరణ (డిసెంబర్ 6,1977) ఇది జనతాకాలంలో జరిగిన మరో జలియన్‌వాలాబాగ్ కిరాతకం

చారిత్రక వాస్తవికత అంటే వర్గ పోరాటాల వాస్తవికత. భూమికోసం భుక్తికోసం విముక్తికోసం జరిగే ప్రజాపోరాటాల చరిత్రే ఇందులో కనిపిస్తుంది. పీడితులు సంఘటిత పడేంతవరకు 'నిర్మాణ విషయం'' వర్గపోరాట దృక్పథం లోపించడంవల్ల 'అవకతవకలు'గాను చెడుగాను తోస్తాయి. వర్గ పోరాటం అంగీకరిస్తే అన్నీ గాంధమేఘల్లా విడిపోతాయి.

సాహితీవేత్త - రాజకీయవేత్త :-

సమాజాన్ని అలాగే వుంచి అనగా శ్రమదోపిడీ విధానాన్ని అలాగే కొనసాగనిచ్చి కొన్ని సంస్కరణలు చేబడితే సరిపోతుందనే వారుంటారు. అలాంటి సంస్కరణవాదానికి కాలం చెల్లిపోయిందని విజ్ఞులు గ్రహించారు. సమాజంలో సమూలమైన మార్పు అనివార్యం అంటున్నారు పీడిత పక్షం వహించేవారు. శ్రీ జయప్రకాశ్ నారాయణ్ 'సమగ్ర విప్లవం' నినాద ఆంతర్యం ''యుగధర్మాన్ని''

సృష్టించడమే. అయితే అది "వర్గ పోరాటా" వ్యకత లేని సైజంగా అభివృద్ధి చెందాలని "సంస్కరణ వాదాన్ని" వారు ప్రవేశపెడుతున్నారు తిరిగి "లేనివాళ్ళు" "ఉన్నవాళ్ళు" ఉన్నంత కాలం వర్గపోరాటం తప్పనిసరి అంటున్నారు. (జనతా పార్టీ సంవత్సరీక సందర్భంలో) — డా. రాంమనోహర్ లోహియాకి సమాజం విషయంలో ఒక నిర్దుష్టమైన దృక్పథం వుంది. శ్రీ జయప్రకాశ్‌కు అది మొదట్నించీ లేదు. సోషలిజం నుండి సర్వోదయం వైపు పయనిస్తూ ఆయనచింతన మార్గం తెల్చుకోలేక కొట్టుమిట్టాడుతూంది. కాల గర్భంలో కలిసిపోయిన గాంధీగారి "ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని" తిరిగి ప్రతిపాదిస్తున్నది. "సమగ్ర విప్లవ" శబ్దమే గిట్టదంటున్నారు జె. బి. కృపలానిగారు. (అమృతోత్సవ సందర్భం)

అందరూ సమాజ సంక్షోభాన్ని గుర్తించారు. కాని మౌలికమైన మార్పును అంగీకరించలేక (ఏనుగు ముందు గుడ్డి వాళ్ళలా) కొట్టుమిట్టాడుతున్నారు. విప్లవం అనివార్యం. దాన్ని తప్పించే యత్నాలే ఇప్పుడు కనిపిస్తున్నవి. ఆ క్రమంలోనే జనతా పార్టీ పుట్టింది. దేశ వ్యాప్తంగా జరగాల్సిన వర్గ విభజన' (Polarisation) మరోసారి వాయిదా పడింది

రాజకీయ విప్లవానికి పూర్వ రంగాన్ని చైతన్య వంతులైన రచయితలు, కవులు, కళాకారులు సృష్టిస్తారు. ఇదే భావ విప్లవం. వారు సమాజం మారాలనే విషయాన్ని తమ శక్తి యుక్తుల ద్వారా ప్రజల ముందుకు తెస్తారు. తద్వారా ప్రజల మనోభావాలను విప్లవం వైపు "తిప్పుతారు". నాయకత్వం మాత్రం రాజకీయవేత్తలదే. ఫ్రెంచి విప్లవావశ్యకతను చాటిన వారు వోల్టేర్, రూసోలు. అలానే రష్యా విప్లవానికి టాల్‌స్టాయ్, గోర్కీ, చెహోవ్‌లు దోహద పడ్డారు. స్వాతంత్ర్యోద్యమానికి, రవీంద్రుడు, శరల్‌బాబు, ప్రేమచంద్, ఉన్నవలక్ష్మీనారాయణపంతులు (మాలపల్లి), చిలకమర్తి (భరతదేశంబు చక్కని పాడియావు), రాయప్రోలు (చావలేదు చావలేదు ఆంధ్రుల మహోజ్వల చరిత్ర—పొగడరా నీ తల్లి భూమి భారతిని), గురజాడ (దేశమంటే మట్టి కాదోయ్—దేశమంటె మనుషులోయ్) ప్రభృతులు దోహదపడ్డారు కవిక్రాంతదర్శి. అతడు మార్పు ఆవశ్యకతను గుర్తించి చాటుతాడు. కవి, కళాకారుడు మొదటే మేల్కొన్న మేధావి కనుక మిగతావారిని మేల్కొల్పడానికి వైతాళికుడవుతాడు. అతడే ఉద్యమకారుడు కాక పోయినా, ఉద్యమానికి పుష్టినిస్తాడు. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాల్సినదశ ఒకటి సమాజంలో నచ్చిపడుతుంది. దాన్ని కవి పూరిస్తాడు. రాజకీయవేత్త ఉద్యమ నిర్మాణం చేబడతాడు

విప్లవానికి రెండు రంగాలుంటాయి. ఒకటి పోరాటరంగం. దీనికి రాజకీయవేత్త (పార్టీ) నాయకుడు. రెండవది సాంస్కృతిక రంగం—ఇది పోరాటరంగానికి దోహదకారిగానేవుంటుంది. దీనికి సాహితీ వేత్తలగ్రగామిగావుంటారు. లెనిన్‌కు గోర్కీ ఆవిధంగానే సాయపడ్డాడు, మావోకు లూసన్ దోహదపడ్డాడు. అలాగే అశయాలు వేరైనా నేతాజీ సుభాసుబాబుకు నజ్రుల్ ఇస్లాం విప్లవకవి ప్రేరణనిచ్చాడు (విద్రోహిగీతం). భగత్‌సింగ్‌కు యశ్‌పాల్ సహాధ్యాయి అయ్యాడు. మతోన్మాదుల ద్విజాతి సిద్ధాంతం, హిందూ ఆదిక్యాలాభావం ఏవిధంగా దేశవిభజనకు దారితీయించిందో యశ్‌పాల్ "ఝూట్—సచ్" (అబద్ధపునిజం) అనే నవలను రాశాడు. 'విముక్తి'ని గుర్తుచేస్తూ "పింజిరేకి ఉడాన్" (పంజరం ఎగిరిపోవడం) అనే నవల రాశాడు. శరత్‌బాబునాటి పరిస్థితుల్ని విప్లవకారుల పాత్రని కీర్తిస్తూ "పథేర్ ధాభీ" (భారతి) అనే నవల రాశాడు. వీరెవరూ విప్లవ నిర్మాణం, ఉద్యమ నిర్వహణ కొనసాగించలేదు ఉద్యమాలకు దోహదపడ్డారు. విప్లవ పరిస్థితినిబట్టి, పోరాట విస్తృతినిబట్టి రచయిత, కవి తీరంలో మాత్రమేవుండి పోరాట విజాల్ని అక్షరీకరించలేరు. శ్రీకాకుళ గిరిజనోద్యమంలో "ఎరుపంటే కొందరికి భయం, పసిపిల్లలే వారికన్న నయం" అన్న సుబ్బారావుపాణిగ్రాహి జముకల కథల కావ్యవేత్తగా వేలాది గిరిజనుల్ని 'ఎవ్వాళ్ళ కావురాలు?" అని సమీకరించగలిగాడు. "కష్టజీవులం కమ్యూనిస్టులం అవుతున్నా కాదన్నా అదే యిష్టులం" అని సాయుధంగా సాగిన పాణిగ్రాహిని వెంగళరావు పోలీసు బలగం కాల్చి చంపింది.

నిజమైన సాహితీవేత్త విప్లవ పోరాటాల "మంచి"కి రూప మిస్తాడు. "వాళ్ళ మంచి పొగిడి, భుజంతట్టి, వాళ్ళ "చెడు"పట్ల కళ్ళుమూసుకొని" కూచుంటాడని శ్రీ పిరాట్ల విప్లవ రచయితని నిందించారు. విప్లవంవైపు విలువని దాన్ని అభివృద్ధి చేయాలనే ఉత్కంఠతో ఆచరణలో జరిగే పొరపాట్లను ఎత్తిచూపడం వేరు. మొత్తంగా విప్లవాన్నే కాదనే రీతిలో విప్లవ కార్యాచరణను విమర్శించడం వేరు. శ్రీ పిరాట్ల కోరేదేమంటే విప్లవ కార్యాచరణలో అవకతవకలున్నాయి కాబట్టి దాన్ని కాదని కొట్టివేస్తూ రచన చేయాలని. రైలొకమారు పట్టాలు తప్పింది కాబట్టి రైలు ప్రయాణం పనికిరాదనే వారి వాదనా సారాంశం. అంతేగాక "మార్క్సియన్ సోషలిజం పేరిట సోషలిస్టు వాస్తవికత పేరుతో జరిగినదిదే" అని నిర్ధారించారు. కాని వాస్తవం అదికాదు వ్యక్తిగత హింసావాదాన్ని విప్లవ పోరాటంగా చిత్రించే అంశాన్ని చారు మజుందార్ "ఖతం" కార్యక్రమాన్ని సమర్థించే విప్లవ రచయితల సంఘం వైఖరితో విభేదించి 1974 లో మేము కొందరం రాజీనామా చేశాం అయినా విప్లవమే పరిష్కారమార్గం అంటున్నాం. విప్లవం పక్షాన నిలచి, విప్లవంకోసం "వంథా పోరాటం" విషయంలో రాజీపడడం లేదు. శ్రీ పిరాట్ల భావించినట్లు "కళ్ళు మూసుకో లేదు". మార్క్సిజం తర్కబద్ధమైన జ్ఞానచక్షువు నిస్తుంది. అది ప్రతిదాన్ని పరిస్థితులకు కన్వయించి పోరాడి నైజాన్ని తెలుస్తుంది. మార్క్సిస్టు లేనా జయ రాజీలేని పోరాటాన్ని సాగిస్తాడు.

మార్క్సిజం బ్రహ్మపదార్థం కాదు:-

శ్రీ పిరాట్ల తెలిసో తెలియకో "మార్క్సిజం నేడొక బ్రహ్మ పదార్థం లాంటిది" అని జాతీయ అంతర్జాతీయ, కమ్యూనిష్టు ఉద్యమ వివాదాల్ని ప్రస్తావించారు. "గజం మిథ్య పలాయనం

మిధ్య'' అని అన్నది భావవాదులైన శంకరాచార్యులు. మార్క్సిజం అవ్పమైన ''గతి తార్కిక భౌతికవాదం''; అది ఆచరణ ఆలోచనల సమన్వయం.

మార్క్సిజాన్ని ఆయాదేశాల నిర్దిష్టపరిస్థితుల కన్వయించడంలో ఆయా దేశాల కమ్యూనిష్టుపార్టీలు నిరంతరం వర్గపోరాటం చేస్తూనేవున్నాయి. మార్క్సిజం శాస్త్రాన్ని శస్త్రంగా మార్చడంలో లెనిన్ రష్యాలో అనుసరించిన పోరాట పద్ధతి "Insurrection" (వర్గ పోరాటాల నిర్మాణం ద్వారా ఒక్కుమ్మడిగా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునే యుద్ధపంథా – ''ఉపప్లవం''), జనచైనాలో మావో ''దీర్ఘకాలిక విముక్తి యుద్ధాన్ని'' చేబట్టి విజయము సాధించారు. మార్క్సిజమంటే ''తుది తీర్పు''ని కూడా కాదు. అది నిరంతర వర్గపోరాటసాధన–(Process but not end) ఇది వర్గపోరాటాలద్వారానే సాధ్యపడే శాస్త్రము. శస్త్రము. శ్రీ పిరాట్లను బాధించిన మరో విషయం ''అంతర్జాతీయరంగంలో రష్యన్ మార్క్సిజం, మావో మార్క్సిజం ప్రచ్ఛన్నంగా, బహిరంగంగా యుద్ధం చేసుకుంటుంటే:– మనదేశంలో సి. పి. ఐ., సి. పి యం., సి. పి. ఐ. (యం. యల్) ఇంకా అనేకానేక వర్గాలు అంతా మార్క్సిజంకోసమే తంటాలు పడుతున్నారు. ఇది కేవలం శాస్త్ర చర్చకే పరిమితమైతే ఫరవా లేదు. శస్త్రంగా వాడదలచుకున్నప్పుడే వస్తుంది ఇబ్బంది అంతా. వీటన్నిటికి వాస్తవికవాది కళ్ళు మూసుకోలేడుగదా!''. శ్రీ పిరాట్ల మార్క్సిజాన్ని శాస్త్రంగా మాత్రమే అంగీకరించడానికి సిద్ధంగా వున్నారు. వారి సౌజన్యతలోని విజ్ఞత చారిత్రక వాస్తవికతలోని వర్గ పోరాటాల విజయ పరంపరను పరిగణనలోకి తీసుకోదలచుకోలేదు. మార్క్సిజం ధ్యేయం ''దోపిడీ వర్గాన్ని రాజ్యాధికారంనుండి కూలదోసి శ్రామికవర్గాన్ని అధికారంలోకి తేవడం''–దోపిడీరాజ్యం కూలుతుంది కాబట్టే శ్రీ పిరాట్ల ఇబ్బంది పడదలచుకుం– అది వారి వర్గస్వభావాన్ని బట్టబయలు చేస్తుంది. డా॥ సుబ్రహ్మణ్యస్వామి ఆ దృష్ట్యానే ఈ దేశానికి కమ్యూనిజం, మార్క్సిజం వర్తించదన్నారు. ఆ వరసలోనే శ్రీ పిరాట్ల నిలుచున్నారు. భారతదేశంలో దోపిడీవర్గం వుంది. వారిచేత పీడింపబడే పీడిత ప్రజానీకం వుంది. వీరిమధ్య వర్గపోరాటం అనివార్యం. అంటే మార్క్సిష్టు మూల సూత్రాలే వర్గపోరాటానికి దశను దిశను అందిస్తాయి. దానికి కమ్యూనిష్టుపార్టీ నాయకత్వం వహిస్తుంది. వహిస్తున్నది కూడా. డా॥ సుబ్రహ్మణ్యస్వామి ఔనన్నా కాదన్నా కనిపించే సత్యాన్ని కాదని కళ్ళు మూసుకోదలిస్తే వేరేసంగతి. లవి శంకరుడి మాయావాద సారాంశమే అవుతుంది.

అంతర్జాతీయంగా రష్యా, చైనాలకు కమ్యూనిష్టు ఉద్యమ నిర్మాణం గురించి విభేదాలున్నాయి. రష్యా సోషలిస్టు విప్లవానంతరం వర్గపోరాటాల విప్లవాభివృద్ధిక్రమం అవసరం లేదనుకుంది. కమ్యూనిస్టు సమాజంవైపు ప్రయాణాన్ని విరమించింది. ''వ్యక్తి ఆస్తి''ని పునరుద్ధరించింది. అంతర్జాతీయంగా బడుగుదేశాల్లో రాజ్యాధికారం ప్రజలకు చేజిక్కడానికి ''శాంతియుత పరివర్తన'' అవసరం అంటున్నది. సామ్రాజ్యవాద దేశాలతో ''శాంతియుత సహజీవనం'' తప్పనిసరని భావిస్తున్నది.

ఈ రాజీధోరణి విప్లవాభివృద్ధిక్రమాన్ని దేశీయంగాను, అంతర్జాతీయంగాను వమ్ముచేయగలదని చైనా భావించింది. అమెరికా రీతిలోనే సోషలిజం పేరిట ''దోపిడీ''కి పూనుకొని ప్రపంచాధిపత్యంకోసం (Hegemony) అమెరికాతో కుమ్మక్కయి ప్రపంచాన్ని పలుకుబడి కేంద్రాలుగా పంచుకోవడం క్రమంగా ప్రపంచ యుద్ధానికి దారితీయించగలదని ఆయుధపోటీ ప్రపంచ శాంతిని విచ్ఛిన్నం చేయగలదని జనచైనా అవగాహన. అమెరికా సామ్రాజ్యవాదం, రష్యా సోషల్ సామ్రాజ్యవాదం ఇవి రెండూ ప్రపంచశాంతి భగ్న కారణాలు కాబట్టి వీటిని ''మొదటి ప్రపంచం''గాను, ఆ వరసలో ఆ స్థాయిలోకి రావాలని భావించే ఇంగ్లండు, పశ్చిమ జర్మనీ, జపాన్, ఫ్రాంసు మున్నగు దోపిడీ దేశాలు ''రెండవ ప్రపంచం''గాను, ఈ ఉభయ ప్రపంచాల పెట్టుబళ్ళ అదుపులో నలిగిపోతూన్న ఆసియా ఆఫ్రికా అరబ్‌దేశాలు. ''మూడవ ప్రపంచం''గాను జనచైనా సూత్రీకరించి, రెండవ, మూడవ ప్రపంచాలు కలసి ''మొదటి ప్రపంచం'' (రష్యా, అమెరికాల) దోపిడీ దుర్మార్గాన్ని ఓడించాలని జనచైనా శాంతి ప్రయత్నంచేస్తూ అగ్రరాజ్యాల కుట్రన్ని భగ్నం చేస్తూవుంది. వియత్నాం, ఇండోచైనాలో దాని అంచనాలు నిజమని తేలాయి. ఆఫ్రికా అరబ్ దేశాల్లో నిజమవుతున్నాయి. మూడవ ప్రపంచంలో అజేయశక్తిగా రూపొందిన జనచైనాను చుట్టివేసే వ్యూహంలోనే ''బంగ్లాదేశ్'' ఆవిర్భావం జరిగింది. ఏ దేశ ప్రజలు ఆ దేశ భవితవ్యాన్ని నిర్ణయించుకోవాలి కాని పరాయి దేశాల ప్రమేయం ఉండరాదని జనచైనా నాదు ఎలుగెత్తి చాటింది.

1969లో శ్రీమతి ఇందిరాగాంధి నాయకత్వం సంక్షోభంలో పడింది. రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలేర్పడ్డాయి. కాంగ్రెసు చీలింది. రూపాయి విలువ తగ్గింది. ఆర్థిక సంక్షోభం పెరిగింది. ప్రజాఉద్యమాలు విజృంభించాయి. తాను నిలదొక్కుకోవడానికి పాకిస్తాన్ సంక్షోభాన్ని వాడుకోజూచింది శ్రీమతి ఇందిరాగాంధి..రష్యాతో ఒడంబడిక చేసుకుంది. 'బంగ్లాదేశ్' ఏర్పడింది. జనచైనా పలుకుబడిని దెబ్బతీయడానికి రష్యా జలాంతర్గాములు హిందూ మహాసముద్రంలో ప్రవేశించాయి. దీన్ని కారణంగా చూపి అమెరికా ''డీగోగార్షియా'' స్థావరాన్ని వశం చేసుకుంది సైనికంగా. హిందూ మహాసముద్ర ప్రాంతం ''శాశ్వత సంక్షోభ'' ప్రాంతంగా మారిపోయి "Free zone'' (శాంతి మండలం) ఉద్రిక్త స్థావరంగా నిలిచిపోయింది. ఇప్పుడెవరు నష్టపడ్డట్లు? తీరా గెలిచిన ''బంగ్లాదేశ్'' అమెరికా పలుకుబడి స్థావరమై కూచుంది. C. I. A. పాచికలు మొదట్నుంచీ పనిచేస్తున్నాయి. ''ఇండోచైనాలో మా విదేశాంగ విధానం దెబ్బతిన్నా ఆసియాలో మాత్రం దెబ్బతినదని'' అమెరికా (నాటి) విదేశాంగ మంత్రి కీసింజర్ ప్రకటించాడు. ఆ తర్వాతే పాకిస్తాన్, సిలన్, బంగ్లాదేశ్, ఇండియాలలో ప్రభుత్వాలు మారాయి. బంగ్లాదేశ్‌లోని జియా

ఉల్‌హక్ ప్రభుత్వం మనతో వైముఖ్యాన్నే ప్రదర్శిస్తున్నది "సిక్కిం"ను కలుపుకున్నాక అందరూ అనుమానిస్తున్నారు భారత దేశంలోని పెట్టుబడిదార్లకు మార్కెట్లు కావాలి. ఆ క్రమంలోనే బంగ్లాదేశ్. సిక్కిం ఉపయోగపడ్డాయి. దాన్ని గ్రహించిన అక్కడి వారు భీష్మించి కూచున్నారు. ఈ పరిణామాల్ని అంచనా వేయకుండా శ్రీమతి ఇందిరా గాంధీని నాడు వాజ్‌పేయిగారే "రణచండి" అన్నారు. విశ్వనాథవారు "ఇందిరా భద్రకాళి" అన్నారు. నారాయణ రెడ్డిగారు "ప్రియదర్శిని" కావ్యమే రాశారు. దాశరథిగారు "ఓటు" వేయమన్నారు. శ్రీ జయప్రకాశ్ "కిడ్నీ" వ్యవహారంలో జె. పి. కి వ్యతిరేకంగా ఆంధ్ర కవుల తరఫున దాశరథిగారు సంతకమే పెట్టారు.

బంగ్లాదేశ్ ఉగ్రరాజ్యాల నాలుగు స్తంభాలాటలో 'మనం' దొంగలం వేయబడ్డాం. యాహ్యా దురంతాలన్నీ ఖండించడం వేరు. ఆ కోపంతో వళ్లు కొరుక్కోవడం వేరు. అస్తమానం పాకిస్తాన్ విద్వేషంతో ఆలోచిస్తే మిగిలేది చచ్చిన పాపుకాయే (బంగ్లాదేశ్).

జనచైనా అంతర్జాతీయంగా విప్లవం తర్వాత కూడా విప్లవాల క్రమాన్ని కొనసాగిస్తూ "నూతన ప్రజాస్వామ్యాన్ని" ఆవిష్కరింప జేస్తున్నది. 'సిద్ధాంతం' ప్రజల దాకా వెళ్లాలని. దేశాభివృద్ధికోసం విప్లవ వారసత్వం తాకట్టు పెట్టరాదని అక్కడ వర్గపోరాటం విభిన్న శక్తులమధ్య కొనసాగుతూ వుంది. అది విప్లవ కేంద్రం.

దేశీయ కమ్యూనిష్టు ఉద్యమం :-

శాంతియుత పరివర్తన' సాధ్యమని అక్షరాలా విశ్వసించిన C. P. I. వర్గపోరాటాలకు దూరమైంది. జాతీయ బూర్జువాను కలుపుకునే ధోరణిలో ఫాసిస్టు పోకడల శ్రీమతి ఇందిరాగాంధీతో తాదాత్మ్యం చెందింది. C. P. M., శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వాన్ని Grand Alliance (B.L D, J. S., CONG(O), S P.) నెపంతో వి. వి. గిరి ఎన్నికల సందర్భంలో సమర్థించింది. చేతులు కాలాక ఆకులుపట్టుకోబోయి ఇప్పుడు "జనతాపార్టీ" ని C. P. I. కాంగ్రెసును సమర్థించినట్లుగానే సమర్థిస్తున్నది. ఎన్నికల ఊబిలో కూరుకుపోతున్నది.

కమ్యూనిష్టుపార్టీకి ప్రాణం ప్రజాపోరాటాలు. తద్వారానే ప్రజలకు రాజ్యాధికారం రావాలి. "విరి" సంఘటనలు మరోసారి విప్లవావశ్యకతను వర్గపోరాటాల క్రమాన్ని రుజువుచేశాయి. సాయుధ పోరాటం ద్వారానే ప్రజలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని విప్లవకారులు విశ్వసించారు. ఆ మార్గంలోనే "విప్లవకారుల కేంద్రం" (A I C C C R) ఒకటి మొదట్లో ఏర్పడింది. తద్వారా విప్లవ

ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.

తాజా వార్తలు. పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !

★ సినిమాలు ★ డాక్టరు జవాబులు ★ హైస్కూల్ కార్టూన్
★ వారఫలాలు ★ మా ఊరి సమస్య ★ షూజా
★ ఇది నారీదృక్పథం ★ అయోధ్యాకాండ ★ నిండు యదార్థం

★ ఇంకా — దేవీభాగవతం, వ్యాసాలు, గేయాలు, కార్టూన్లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము !

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి ! మేనేజరు, ఆంధ్రపత్రిక

పార్టీ ఏర్పడాలనే ప్రయత్నం జరుగుతూండగా, మహోదుందుడుకుగా చారుమజుందార్ విప్లవాభివృద్ధిక్రమాన్నే గల్లంతు చేశాడు. మార్క్సిస్టు లెనినిష్టుపార్టీని ఏర్పరచాడు. సాయుధ పోరాటం (Armed struggle) అంటే "సాయుధ సంఘర్షణలు" (Armed clashes) గా చిత్రించి కుట్రపద్ధతుల్లో "ఖతం" కార్యక్రమాన్ని సిద్ధాంతీకరించాడు. "భూస్వామి" దోపిడీ రాజ్యానికి కన్ను చెవి లాంటివాడు అతణ్ణి 'ఖతం' చేస్తే గ్రామం విముక్తం అవుతుందని సూ తీకరించాడు. కాని ఆ తర్వాత ప్రజలమీద విరుచుకపడే "నిర్బంధ కాండ" ను ప్రతిఘటించడానికి చేసే ప్రయత్నమే కనిపించలేదు. "వర్గ శత్రునిర్మూలనా యుద్ధం (ఖతం) వ్యవసాయ విప్లవాన్ని వమ్ముచేసింది" అని కానూసాన్యాల్, తదితర్లు ప్రకటించారు. ఆయన "చైనా చైర్మెన్ మనచైర్మన్" సూత్రం సరైందికాదని అందరూ అంగీకరించారు. 'సాంస్కృతిక విప్లవం' పేరిట జరిగిన 'లైబ్రరీ దహనకాండ'ను అందరూ సమర్ధించలేదు. చారుమజుందార్ ఒంటెత్తు పోకడతో మొదట్నుంచీ పోరాడుతూ "తెలంగాణా" (1946–51) పద్ధతిలో వ్యవసాయ విప్లవాన్ని చేపట్టాలని తరిమల నాగిరెడ్డి, దేవులపల్లి వేంకటేశ్వరరావుగార్లు నిర్విరామంగా పోరాడి ఒక "జనశక్తి" గా నిలిచారు. వారే "విప్లవకారుల సమైక్యతా కేంద్రం" (U. C C. R. I. M L.) నడుపుతున్నారు.

సత్యనారాయణ్‌సింగ్ తదితర్లు చారుమజుందార్‌తో విభేదించినా తిరిగి వారు ఎన్నికలరంగంలో ప్రవేశిస్తున్నారు. ఇది విప్లవవాదులకు ఆశాభంగంగా వుంది. ఎన్నికల్లో పాల్గొనడం ఎత్తుగడ అయినా అది విప్లవోద్యమానికి దోహదపడేలా లేనప్పుడు విప్లవకారులు తమశక్తిసామర్థ్యాల్ని వృధాచేయడం విచారకరం. తప్పుడు మార్గాన్ని కాదనడమేగాక సరైన మార్గాన్ని చేపట్టడంలోనే "విప్లవ పంథా" రూపొందుతుంది. అందుకు "ప్రజాయుద్ధపంథా" ఒక్కటే శరణ్యం.

'కంటికి కన్ను పంటికి పన్ను' అని జపించిన మరో నక్సలైట్‌వర్గం కొండపల్లి సీతారామయ్యగారిది. వారు కూడా సాయుధ పోరాటాన్ని వాయిదావేశారు. తుపాకి బరువైతే భుజం మార్చుకోమన్నవారు తుపాకి కిందపెట్టమంటున్నారు. ఇంతకూ ఇన్నాళ్ళు వీరు చేపట్టినది చారు మజుందార్ పంథాల్లోని వ్యక్తిగత హింసావాదమే. దళచర్యలు, సాయుధ ఘర్షణలు, భూమి సమస్యను ముందుకుతెచ్చే వ్యవసాయ విప్లవాలుకావు. ఈ విషయంలో రవూఫ్ వర్గం, ఇంకా రమణారెడ్డివర్గం ఇంకా చారుమజుందార్‌ని మార్పులు లేకుండా పాటించాలంటున్నారు. ఇవి పంథా పోరాటాలు.

1946–51దాకా సాగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని, శ్రీకాకుళ గిరిజనోద్యమాన్ని నక్సల్‌బరీ తిరుగుబాటు సరిగా అంచనా వేసుకున్నాకే, దేశపరిస్థితుల్ని, పాలకుల దళారీ స్వభావాన్ని, సామ్రాజ్యవాదాల వైరుధ్యాన్ని, ఐక్యసంఘటనా వ్యూహాన్ని ఆలోచించగలిగినప్పుడే ఒక పార్టీ ఒక కార్యాచరణ ఏర్పడగలదు. అంతవరదాకా ఈ "పంథాపోరాటం" (Line Struggle) కొనసాగవలసిందే. ఇది శ్రీపిరాట్లవారికి అర్ధంకాని ఆల్జీబ్రా

జనవిప్లవానుభవాల్ని పరిగణనలోకి తీసుకోవడం సరైనదే. అలాగే ప్రపంచ విప్లవ కేంద్రాన్ని రక్షించడమంటే ప్రపంచపీడిత మానవాళిని విప్లవ సమాయత్తం చేయడమే 'అమెరికా న్యూక్లియర్ గొడుగు"ను కోరేవారికి చైనా నానలు గుర్తొస్తాయి. భారతదేశంలో దోపిడీ వడగళ్ళవానపడ్డా రక్షణ వద్దంటారు. అమెరికాను ఆశ్రయించమంటారు. శ్రీ పిరాట్లవారు భూస్వామ్య వ్యామోహాన్ని దేశభక్తిగా చిత్రిస్తూ దేశ ప్రజల్ని, వారి స్థితిగతుల్ని విస్మరించే "ఎల్లలభక్తి"ని అమెరికా సామ్రాజ్యవాదం క్రింద పెంచి దరిస్తే విప్లవకారులు ఈ కుట్రల్ని భగ్నంచేస్తూ విప్లవాభివృద్ధి క్రమాన్ని కార్యాచరణలో చూపెడతారు.

ఈ దేశంలోని పాలకవర్గంవారు మొదట్నుంచీ ఒక మోసం చేస్తున్నారు. ప్రభుత్వ నీతిని, పాలకవర్గాన్ని కాదనడమంటే దేశాన్ని కాదన్నట్లుగా చిత్రించి, దేశభక్తి "గుత్తసొమ్ము"గా సొమ్ముజేసుకుంటున్నారు. వీరే ఆజాద్ కాశ్మీరును వదులుకున్నారు. రాన్ ఆఫ్ కచ్‌లో గెలిచిన భాగాన్ని వదులుకున్నారు. (అంతర్జాతీయ కోర్టు తీర్పు) కాశ్మీరు ఎల్లల్ని సర్దుకోచూస్తున్నారు. బంగ్లాదేశ్‌ను తృప్తిపరచడానికి బెంగాల్ ప్రజల నోళ్ళుగొట్టి ఫరక్కా బ్యారేజి నీళ్ళువదలడానికి ఒప్పందం చేసుకుంటున్నారు. కాబట్టి "దేశభక్తి" కూడా వర్గప్రయోజనానికి లోబడిన వర్గ దోపిడీయే.

సోషలిస్టు వాస్తవికత:-

అధిక సంఖ్యాకుల శ్రమశక్తి ప్రతినిత్యం దోపిడీ చేయబడుతున్నది. ముప్పై ఏళ్ళు గడచినా రాజకీయ స్వాతంత్ర్యం దేశాన్ని ఉన్నవారికే కట్టబెట్టింది. లేనివాళ్ళు ఎంత కష్టపడినా బిచ్చగాళ్ళుగా, వళ్ళమ్ముకునే వేశ్యలుగా (దీనికి సంస్కృతి ఒక ముసుగు కూడా కేటాయించింది) బతకాల్సిన దుర్గతి దాపురించింది. ఈ పరిస్థితి ఇక మారాల్సిందే. సమూలమైన మార్పుకావాలి.

ఉత్పత్తి సాధనాలైన పంటపొలాలు భూస్వాముల చేతుల్లోగాక ప్రజల చేతుల్లోకి రావాలి. అలాగే వస్తువుల్ని తయారుచేసే ఫ్యాక్టరీలు పెట్టుబడిదారుల చేతుల్లోగాక ప్రజల చేతుల్లోకి రావలసిందే, వాటి ఉత్పత్తి పంపిణీ ప్రజాపరం కావలసిందే. అందుకోసం విప్లవం. అన్నీ సమాజపరం కావడానికి సోషలిస్టు సమాజం కావాలి. ఆచరణలోని లోపాలు ఆచరణద్వారానే పోవాలి. సోషలిజం పక్షాన నిలిచి సోషలిజం అమలును విమర్శించవచ్చుకాని, సోషలిజాన్ని వ్యతిరేకించే ధోరణిలో విమర్శించే వారితో రాజీలేదు. వారే తమ ఉనికిని ప్రజాశత్రువుల్లో భద్రపరచుకున్నారు.

సమసమాజంలో శక్తికొద్ది పని, పనికొద్ది ఫలితం అనేది సామాజిక సూత్రం. దాచుకోవడానికి దోచుకోవడానికి వీలుండదు. శ్రమశక్తి, శారీరకమని (కులాలు) బౌద్ధికమని (అగ్రవర్ణాలు) విభజింపబడవు. వ్యత్యాసాలు నిర్మూలింపబడతాయి. "శ్రమ

దోపిడీ" నిర్మూలించబడుతుంది. బాల్యానికి వికాసం, యౌవనానికి సామాజిక శ్రమశిక్షణ, వృద్ధాప్యానికి చింతలేని విరామం సమ సమాజం ఇస్తుంది. దేశనిర్మాణంలో అందరూ పాల్గొంటారు.

ఎవ్వరికీ రేపటి భయం, నేటి చింత వుండదు. అందరి ఆనందంలోనే అందరు తమ ఆనందాన్ని చూస్తారు. ఈ పరిణామ క్రమంలో వర్గసమాజంలో అమలులోవున్న కిందివాళ్ళు త్యాగం చేయాలనే పైవాళ్ళ సూత్రం పోతుంది. నిజమైన మానవతాను బంధాలు వెల్లివిరుస్తాయి. ఆస్తులకోసం కుటుంబ తగాదాలు, దావాలు ఉండవు. 'సహజీవనం—సహకారం' శ్రమదోపిడి లేని కొత్త అర్థాల్ని పుంజుకుంటాయి. పై వాడికి కిందివాడు సేవచేయడం కాక, ఒకరి కొకరు 'సహకారం' అందీయడం మానవ గుణంగా అలరారుతుంది. అయితే ఇక సమస్యలే ఉండవా? ఎందుకుండవు. స్వార్థపరులు అమానుషంగా పోరుకవా, వారి వాదనలు, అలవాట్లు, విశ్వాసాలు, అభిమానాలు కొత్తరూపాల్లో తలెత్తుతాయి. వాటిని సైద్ధాంతిక పోరాటాలద్వారానే మార్చడం జరుగుతుంటుంది.

స్త్రీ ఈ సమాజంలోవలే పురుషాధిక్యతాభావం కింది దాసార్థంగా చెలామణిగాదు అలాగే స్త్రీ ఆధిక్యతా భావానికి ఆస్కారం ఉండదు. ఉభయులూ సామాజిక వికాస కార్యక్రమంలో సహజీవనం కొనసాగిస్తారు. "శ్రమదోపిడి" కుటుంబ జీవనంలో కూడా నశించి పోతుంది కాబట్టే "స్నేహం, ఔదార్యం, త్యాగం, శీలం మున్నగు మానవతాగుణాలు కొత్త కోణంనుండి చూడబడి (శ్రమదోపిడికి ఆస్కారంలేని) సోషలిస్టు వాస్తవికతాసంధంలా అభివృద్ధిచెంది అర్థాలు మారిపోతాయి." "పెద్ద—చిన్న" అనేవి శ్రమదోపిడికి సంబంధించిన విశ్లేషణలుండవు అందువల్లే ఉన్నతమైన సైన్యంలో ర్యాంకులుపోయాయి. ఈవిధంగా "నూత్నమానవులు"గా తయారవడం వర్గప్రయోజనాలరీత్యానే శ్రీ పిరాట్ల 'ఆచరణ లోపాలు' పేరిట ప్రతిఘటిస్తున్నారు ఆచరణ లోపాల్ని సరిదిద్దే కర్తవ్యం వర్గపోరాటానికి వుంది.

జీవన వాస్తవికతలో వర్గపోరాటంవుంది. అది జీవన విధానానికి సంబంధించిన విరుద్ధ శక్తుల పోరాటం. అది సమాజ పోరాట రూపానికి ప్రతిబింబం. దాని ఉన్నతరూపమే సోషలిస్టు వాస్తవికత. ఇది అసామాన్యంకాదు. వర్గపోరాటాల ఎరువుతనం. దీనికి రాజకీయ నేత నాయకత్వం వహిస్తే సాహితీవేత్త ప్రజల్ని విప్లవాభిముఖుల్ని చేయడానికి దోహదపడరాదు రాజకీయంగా సోషలిజాన్ని వ్యతిరేకించే వారే సాంస్కృతికంగా "సోషలిస్టు వాస్తవికత"ను వ్యతిరేకిస్తారు. 'చారిత్రక వాస్తవికత' చాటి చెబుతోందని శ్రీ పిరాట్లవారు సెలవిచ్చారు.

శ్రీ పిరాట్లవారు మొదటే నిర్ణయించుకున్న అభిప్రాయం ప్రకారం సోషలిస్టు వాస్తవికతను కాదంటున్నారు. అందుకు వారి ప్రేరణ "వైదిక వ్యవస్థ" లో వుంది. ఆ చాతుర్వర్ణ్య వ్యవస్థను ఆధునికం చేసి "భారతీయ సంస్కృతి"ని పునరుజ్జీవింపజేయాలని మతోన్మాదుల భావన. కాని భారతీయ సంస్కృతి వికాసానికి, బౌద్ధులు, చార్వాకులు, హేతువాదాన్ని, వేదాల ప్రామాణికతా తిరస్కారాన్ని ప్రవేశపెట్టి ఎంతగానో దోహదపడ్డారు. వారి భౌతిక దృక్పథానికి తావులేని "భారతీయసంస్కృతి" అవిటిది. "భారతీయ సంస్కృతి" అంటే ఔత్తరాహ సంస్కృతి అనేనా? చారిత్రకంగా ఆర్యులు మనదేశంవారు కారే!. మధ్య ఆసియా నుండి వచ్చారు. అదంతా భారతదేశం అంటే, దక్షిణదేశం ద్రావిడసంస్కృతి మూలకంగా వేరే అవుతుంది మరి! మధ్య ఆసియావారి వేదాలు ఎలా ప్రామాణికాలు?. అలాగే "మనుస్మృతి" లాంటి "స్మృతి" గ్రంథాలు గర్హనీయాలు. ఛండాలురని మొదటిసారిగా శ్రమజీవుల్ని కించపరచింది 'మనుస్మృతి'. కాబట్టే అంబేద్కర్ బహిరంగంగా కాల్చివేశాడు. రామాయణ భారతాలు ఆర్య సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. అది మాత్రమే భారతీయ భావన కాజాలదు. అందునా "వారసత్వ తగాదా"నే నిర్ణయాత్మకం. బౌద్ధం చార్వాకం చెప్పిన భౌతిక హేతువాదాల ప్రసక్తి మతోన్మాదులు తేరు. వారు బౌద్ధ వారాన్ని ప్రతిఘటించారు. శంకరాచార్యుల తర్వాత చెప్పబడేదే "భారతీయ సంస్కృతి" అంటే అందరూ పునరాలోచించవలసిన వర్గ నైజమై కూచుంటుంది.

శ్రీ పిరాట్లవారికి శ్రీ మాధవ సదాశివరావు,గల్వాల్కర్ చెప్పిన "సామాన్య ప్రజానీకాన్ని సామ్యవాదం యొక్క నీచ ప్రభావాన్నుండి బయటపడవేయాలి" నే సాంప్రదాయ్య (232 వ పేజి) వాక్యం ప్రేరణ వుంటుంది. కాని స్వామి వివేకానందులవారు దేశంలో దుర్భర దారిద్ర్యాన్నిచూసి సామ్యవాదాన్ని ఒక పరిష్కారమార్గంగా అంగీకరించారు.

"నేను సామ్యవాదిని అగుటకు కారణము అసలే లభింపకుండుట కన్న కొంతయైన లభించుట మేలుగనుక. ఇతర విధానము లన్నియు పరీక్షింప లోపయుక్తములని నిర్ధారింపబడినవి. కష్ట సుఖములెల్లప్పుడును ఒకరికే కలుగుచుండుటకన్న అవి అందరికిని పంచిపెట్టబడుట మేలుగదా! ఈ దుఃఖయుత ప్రపంచమునందు ప్రతివానికి అదృష్ట కాలమొకటి లభించుగాక" (6వ సంపుటము — మతము సంస్కృతి — సామ్యవాదం - రామకృష్ణ మఠం ప్రచురణ).

స్వామిజీ పరదుఃఖదుఃఖాన్ని పరదుఃఖ అసహిష్ణుత్వాన్ని, వైష్ణవ భావనలో స్వీకరించాడు కాబట్టి "ప్రతివానికి అదృష్టకాలమొకటి" రావాలని సామ్యవాదాన్ని కోరుకొన్నాడు. కాని దాన్ని గోల్వాల్కర్‌లా "నీచప్రభావం"గా భావించలేదు.

కోట్లాది చెట్లకింది బతుకుల బాగుకోసం శ్రీ పిరాట్లవారు సామ్యవాదాన్ని అంగీకరించి ఆచరణలోని పొరపాట్లను పొరాడిగెలిస్తే మంచిది. దాన్ని తిరస్కరించడానికే 'నీచప్రభావం' లోకి పోదలిస్తే అది వారి ఇష్టారాజ్యం.

కలగూరగంప

తెలుగు చిన్నకథకు ఆద్యుడు-ఆచంట వెంకటరాయ సాంఖ్యాయన శర్మ

శ్రీ ఆచంట వెంకటరాయ సాంఖ్యాయనశర్మ గారు (1864–1933) ఆంధ్ర జాతిని మేల్కొలిపిన ప్రముఖులలో ఒకరు. శర్మగారు అటు ప్రాచీన,ఇటు నవీన సంప్రదాయాలను ఆకళించుకొన్న మనీషి. వాక్చమత్కారమున ఆంధ్రులలో ఈయన కొక విశిష్ట స్థానం ఉంది. జీవతత్వశాస్త్రము, ఖనిజశాస్త్రము, క్రిమికీటకశాస్త్రము మొదలగు విజ్ఞాన శాస్త్ర విషయములను 1894లో 'రహస్య దర్పణము' అను చక్కని గ్రంథరూపమున వీరు సర్వజన సుబోధకముగా వ్రాసారు. వీరు అనేక నాటక సమాజములను నిర్మించారు. నాటకాలను ఆడించారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు సంస్థాపకులలో వీరొకరు.

కవిగాను, నాటక కర్తగాను, నవలా రచయితగాను, సంపాదకుడిగాను, అనువాదకుడిగాను, హాస్యచతురుడిగాను మాత్రమే గాక చిన్న కథా రచయితగాకూడా ఈయన సిద్ధహస్తుడు.

తెలుగులో చిన్నకథ (Short Story) 20 వ శతాబ్దారంభంలోనే మొదలైంది. నిజానికి భారతీయ భాషలన్నింటిలోనూ ఇంచుమించు ఇంతే. మొన్న మొన్నటిదాకా తెలుగులో చిన్నకథ గురజాడవారితోనే ఆరంభమైనదని పలువురు నమ్ముతూ వచ్చారు. కాని అది సరికాదు. గురజాడ వారి చిన్నకథ 1910 లో వచ్చింది. అంతకుముందే దాదాపు ఏడేళ్ల క్రితం ఆచంట వారి చిన్నకథలు వెలుగులోకి వచ్చాయి.

ఆచంట వారు 1903 లోనే 'కల్పలత' అనే మాస పత్రికను విశాఖపట్నం నుండి వెలువరించారు. అందులోని రచనలన్నీ ఆయనే చేసేవారు. తరువాత అందులోని రచనలు విడివిడిగా పుస్తకాల రూపంలో ఆయన పేరనే ప్రచురించారు 1903 నవంబరులో ఆయన చిన్నకథ 'లత' ప్రచురితమైంది ('కల్పలత' – సంపుటము 1, సంచిక 3. పుటలు 9–14:/ఇది ఈ మధ్యనే 'ఆంధ్రజ్యోతి'లో అచ్చయింది/.) అదే సంవత్సరం డిశంబరులో 'అపూర్వోపన్యాసం', 'సారసిక' ('కల్పలత' - సంపుటము 1, సంచిక 4, 'అపూర్వోపన్యాసం' –పుటలు 3–6; 'సారసిక' – పుటలు 9–14) అని శర్మ గారి మరిరెండు చిన్న కథలు వెలువడ్డాయి. 1904 అక్టోబరు/నవంబరు 'కల్పలత' లలో వారి 'విశాఖ' చిన్నకథ కూడా రెండు భాగాలుగా (సంపుటము 2, సంచిక 1, మొదటి భాగం – పుటలు 9–15; సంపుటము 2, సంచిక 2, రెండవ భాగం – పుటలు 9–14) వచ్చింది. ఈ చిన్న కథలు శ్రీ శర్మగారు 1917 లో 'నవలికలు' అని పుస్తకంగా ప్రచురించారు. అందులో 'బొంగు మల్లె', 'అప్సరస' అని రెండు గీత పద్య – కథలు కూడా చేర్చారు. వీరేశలింగం గారి కాలంలో నవలలను 'గద్య ప్రబంధములు' అన్నట్లే శర్మ గారు చిన్న కథలను 'నవలికలు' అన్నారు. పైన చెప్పిన నాలుగు కథలే కాక 'పద్మిని' అను మరొక చిన్నకథ – నవలిక కూడా శర్మ గారు వ్రాసినట్లు వారి సోదర కుమారులు ఆచంట బాపిరాజు గారు పేర్కొన్నారు (చూ. సాంఖ్యాయన శర్మ గారి శతవార్షిక సంచిక, పు. 62)

శర్మ గారు తమ చిన్న కథలు 'కల్పలత' ప్రచురణకు ముందే పందొమ్మిదవ శతాబ్దం చివరి దశాబ్దంలోనే వ్రాసినట్లు చెప్పవచ్చు.

'లత' ఆచంటవారి తొలి చిన్నకథ. ఇదే తెలుగులో చిన్న కథకు కూడ నాంది కథానాయిక పేరునిబట్టి కథకు పేరు పెట్టటం జరిగింది. ఇందులో ముఖ్యంగా వచ్చే పాత్రలు మూడే – బాలాంబ, లలిత, చంద్రవర్మ. బాలాంబ ముప్పైయేండ్ల పడుచు. ధనవంతురాలు అయిన ఆమె కొన్ని కారణములవల్ల పెళ్లి మానుకొంది. దాని పురుషుల మధ్య సరదాగా కాలం గడిపేది. లలిత పదహారేళ్ల చక్కని చిన్నె. లావణ్యవతి, విద్యావతి, పేదరాలు. ఆమె వయస్సు చూచి బాలాంబ తన యవ్వనం తలుచుకొనేది. ఇదే కారణంగా వారిమధ్య స్నేహం కుదిరింది. బాలాంబతో ఇతర యువకులు సల్లాపాలాడటం లలితచూచేది. కానీ అవేవీ ఆమెకు అర్థమయేవి కావు. ప్రేమ వ్యాపారంలో అక్షరాభ్యాసమే లేనివారి మనసు ఇట్లా ఉంటుంది–అని రచయిత వ్యాఖ్యానిస్తాడు కూడాను.

ఒకరోజు బాలాంబ జయపురంలోని చంద్రవర్మ అనే తన మేనల్లుడికి ఇలా ఉత్తరం వ్రాసి పిలిపిస్తుంది – ''అల్లుడా! చంద్రవర్మా! వసంతకాలము సమీపించుచున్నది... నీవు వచ్చి చూచి సంతసింతువని కన్యారూపమును దాల్చియున్న పెరుగును, బాలును, వెన్నయు, జున్నును, మీగడయును, జెక్కెరయును, దేనెయును సమకూర్చి యున్నదానను. గాని యాకలికిపయి నీతలంపున వలపెన్నడయినను బొడమనిచ్చిన నొట్టుసుమీ! ఆ నెలంత చిన్న వయసు వన్నెలాడి, కడు ముద్దరాలు, నాగరికురాలుగాకున్నను బదిదినములా ముద్దుగుమ్మలోని గసిమెలిసి చెలిమిచేసితివేని... దాని మీద నాకు గడుప్రేమ...'' ఈ విధంగా ధ్వనిపూర్ణమైన శైలిలో ఉన్న ఈ ఉత్తరం రచయిత ప్రతిభాశక్తికి మచ్చుతునక మాత్రమే. చంద్రవర్మ వస్తాడు. లలిత రూపలావణ్యాలు చూసి ఆసక్తుడవుతాడు. ఇక్కడ రచయిత అతని మనస్సులో ఒక సంఘర్షణ చిత్రించాడు – ''ఇది ముద్దరాలా? నాగరికురాలుగాదా? ఈ ముద్దుగుమ్మపై నాతలంపున వలపుగలగనీయరాదా? అని వితర్కించి

ఏమి లాభము ? నాకీ బాలికతోఁ బనియేమి ? నా యోగ్యత నేనెఱుఁగనా ? సరిక్రొత్త జవ్వనము గల ముద్దరాలినేల వంచన సేయవలె ?'' — ఈ విధమైన మానసిక సంఘర్షణ చిత్రించడం చిన్నకథకు ఎంతైనా అవసరమే. చంద్రవర్మ, లలిత చూపులు పరిచయానికి, పరిచయం ప్రేమకు, ప్రేమ పరిణయానికి దారి తీయడం ఈ కథలో అత్యంత సహజంగా చిత్రీకరించబడింది. లలితకు ప్రేమ పాఠాలు నేర్పిన చంద్రవర్మ, ఆమెను పెళ్ళాడా లనుకునే ముందు తన యోగ్యతను తానే శంకించుకొని తన చరిత్ర హీనతను లలితముందు వ్యక్తం చేసి బాధపడుతాడు. ''సుందరీ ! నిన్ను వలపించితిని గానీ మీతండ్రి యంగీకరించి నిన్నిచ్చి పెండ్లి సేయుటకు మాత్రము నేను దగినవాఁడనుగాను. నా ప్రవర్తన మంచిది గాదు. నిన్ను మఱి దుఃఖపెట్టక చిన్నఁగా యింటికిఁ బోయెదను. మఱి ఇటు తిరిగిచూడను... పెండ్లియాడుమని నిన్ను గోరుటయును నా దుష్ప్రవర్తన మిట్టిదని దెలుపుటయును నాకసాధ్యకార్యములు''. ఈ మాటలు విని లలిత తన మనోహరుడిపై సర్వాధికారములు కల్గియున్నదానివలె బదులు చెప్తుంది - 'నీ మునుపటి దుష్ప్రవర్తనయుతో నాకుఁ బనిలేదు. నేనెన్నఁడును దానిని దెలియనొల్లను. నన్ను వలచితివంటివి గాన మఱి మాటాడక నన్ను మన్నించి యూరికిఁ బోయిరమ్ము''. తర్వాత చంద్రవర్మ — ''సుందరీ ! నా దుష్ప్రవర్తనమెట్టిదో నీవెఱుఁగుదువా ?' అని ప్రశ్నింపగా, లలిత ''నేనేమియు నెఱుఁగను. నీవు నేర్పిన ''వలపు' అను మాటను మాత్రము చక్కఁగా నెఱుఁగుదును. మఱి దాని నెన్నటికిని మరువను'' అని సమాధానము ఇవ్వడంతోనే ఈ కథ ముఖ్యోద్దేశ్యము వ్యక్తమయింది. ఆదర్శమయిన ప్రేమప్రాశస్త్యం చిత్రించడమే రచయితయొక్క ఏకైక లక్ష్యం. ఇదే చిన్నకథకు కావలసింది కూడాను.

ఇక కథలోని వర్ణనలు, సమకాలీన సమాజానికి, జీవనానికి, కథ జరిగిన స్థలానికి అనుగుణంగా ఉన్నాయి. అనవసరమైన వర్ణనలు లేవు. ఇందులో వర్ణనాత్మక శైలిని అధికంగాను, సంభాషణ శైలిని తక్కువగాను ప్రయోగించాడు రచయిత ఇక భాషను తీసుకొంటే ఏ రచయిత అయినా సమకాలీన సాహిత్య భాషనే ఎన్నుకోవడం జరుగుతుంది. ఇరవయ్యో శతాబ్ది రెండు మూడు దశాబ్దాల వరకూ కథారచనలు గ్రాంధికంలోనూ వెలువడుతూ వచ్చాయి.

ఈ విధంగా వస్తుదృష్ట్యాయే కాకుండా శిల్పాన్నిబట్టి చూచినా ఇప్పటికి లభించిన ఆధారాలనుబట్టి, రచనాకాలాన్నిబట్టి తెలుగున తొట్టతొలుత రచింపబడిన చిన్నకథ 'లలిత'. తొలి కథకులుగా ఆచంటవారికి తెలుగు కథానికా వాఙ్మయంలో స్థానం లభింపజేయడం ఎంతో అవసరం అని మన దృష్టిమళ్లించినవారు డా॥ పురిపండా అప్పలస్వామిగారు

ఆచంటవారి తరువాతి రెండు కథలు—'అపూర్వోపన్యాసము'', 'సారసిక' 'అపూర్వోపన్యాసము' ఎక్కువ భాగం నాటక ఫక్కీలో జరిగిన హాస్యరసప్రధానమైన చిన్నకథ. ఆచంటవారు సమకాలీన సమాజంలోని స్థితిగతులపట్ల తమ దృష్టిని నిలిపే రచనలు చేశారన్నదానికి నిదర్శనం ఈ కథ. హిందూ వితంతువులు పునర్వివాహం చేసుకోవచ్చునన్న 1856 చట్టాన్ని ప్రోత్సహిస్తూ సంఘసంస్కరణ సమాజాలు ఆ విధంగా వివాహం చేసుకొన్నవారిని అభినందించి, సన్మానిస్తూవచ్చాయి. ఈలాంటి అభినందన సమావేశాలను గుర్తుచేసే చిన్నకథే 'అపూర్వోపన్యాసము'.

'సారసిక' ఒక ప్రేమ కథ. దినకరవర్మ, చంద్రగిరిరాజు కొడుకు. సారసిక; ఉదయగిరిరాజు కూతురు. వీరిద్దరి పరిచయం ప్రేమగా పరిణమిస్తుంది. అది ఒక విషమ స్థితిలో పరిణయానికి దారితీస్తుంది. ముందు సారసిక తన అన్న వల్ల, తండ్రి వల్ల దినకరవర్మ సుగుణాలు విని, అతనిమీద అనురక్తురాలవుతుంది. అనంతరం సింహాచలంలో ఇద్దరి పరస్పర పరిచయం అనురాగంగా రూపొందుతుంది. ఒక పున్నమినాడు అనుకోకుండా చిలక సముద్రంలో ఒక దీవిలో సారసిక, దినకరవర్మ కలుస్తారు. తిరిగి పడవలో వచ్చేటప్పుడు తుపానులో చిక్కుకుంటారు. చావు తప్పదనిపిస్తుంది. కన్నెగా చావడం ఇష్టంలేని సారసికను, దినకరవర్మ గాంధర్వ వివాహం చేసుకొంటాడు. మృత్యుముఖంలో పడుతున్నామని పరస్పరం గాఢాలింగనంలో ఉన్న సమయాన పడవ ఒడ్డు చేరుతుంది. ఇందులో ఆదర్శప్రేమను ప్రతిపాదించడమే కథకుడి ప్రధాన లక్ష్యం.

ఆచంట వారి నాలుగో చిన్నకథ 'విశాఖ'. ఇది రెండు భాగాలుగా 'కల్పలత' లోని రెండు సంచికలలో వరుసగా ప్రచురితమైంది. ఈ కథలో రచయిత ప్రేమ, ప్రేమకంటే త్యాగాన్ని గొప్పగా చిత్రించాడు.

ఈ కథలో కూడా ముఖ్యంగా ముగ్గురే పాత్రలు కనిపిస్తారు కళానిధి, విశాఖ, సరళ పై కథల్లాగే కథానాయిక పేరే కథకు పెట్టడం జరిగింది ప్రేమను వస్తువుగా తీసుకొని అందులోని ఆదర్శాన్ని, త్యాగానికున్న విలువను స్పష్టం చేయడమే కథకుని ప్రధాన లక్ష్యం. ప్రేమ స్వార్థం కోరుతుంది. కళానిధి, విశాఖల అన్యోన్యానురాగాలను ఆదర్శప్రేమబంధాన్ని గ్రహించి, సరళ తను ప్రేమిస్తున్న కళానిధిని పెళ్లిచేసుకొనే వీలున్నా విశాఖ కోసం అతన్ని త్యాగం చెయ్యడం, ఇందులో గొప్ప విషయం. సంభాషణలు భావపూర్ణంగానూ పాత్రానుకూలంగానూ ఉన్నాయి. ప్రకృతి వర్ణనలపట్ల కథకుడి అత్యంత సూక్ష్మదృష్టి వ్యక్తమవుతుంది. భాష సరళగ్రాంథికం. ఇదికూడా ఆధునిక చిన్నకథా లక్షణాలను కలిగి వస్తు-శిల్పం దృష్ట్యా కథానికా వాఙ్మయంలో సముచితస్థానం పొందవలసిన కథ.

— శ్రీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

గూడూరు శాసనములోని విశేషాంశములు

కాకతీయుల తొలివెలుగులు వెలుగుచూపే భాగ్యం లేకపోయినా, వారి శాసనములు, వారిని ఆశ్రయించినవారు వేయించిన శాసనముల

వలన కొంత చరిత్ర తెలుస్తున్నది. వారి శాసనములలో గూడూరు శాసనము, మాటేరు శాసనము, యింకా కొన్నిటిని ఆధారముగా చేసుకుని మనకు తెలియని కాకతి మొదటి బేతరాజు అజ్ఞాత చరిత్ర చెప్పటమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యము.

కాకతీయుల మొట్టమొదటి శాసనము కాకర్త్య గుండన తన చక్రవర్తి రాష్ట్రకూట చక్రవర్తి మూడవ కృష్ణునిచే దొమ్మన అను బ్రాహ్మణునకు దానము యిప్పించిన శాసనము మొదటిది.

గుండన రాష్ట్రకూటుల సేనాధిపతి, పైపెచ్చు [1] మనము కొన్ని కాకతీయ శాసనముల ద్వారా గ్రహించ గలుగుచున్నాము [2] క్రీ. శ. 956 లో రాష్ట్రకూట చక్రవర్తి మూడవ కృష్ణుడు తన సేనాధిపతి కాకర్త్య గుండనను దానార్ణవునకు సహాయముగా పంపి అమ్మరాజును పరాజితుని చేసినాడు. విసురునాడు, కొఱవి మండలము, ముదిగొండ చాళుక్యుల అధీనములో వున్నవి. కొఱవి మండలమును చక్రవర్తి మూడవ కృష్ణుని అండదండలతో గుండన ముదిగొండ చాళుక్యుల నుండి తన స్వాధీనము చేసుకున్నాడు దానితో ముదిగొండ చాళుక్యులు పరాభూతులై నిగూఢ ప్రాంతమునకు చేరుకున్నారు

మూడవకృష్ణ చక్రవర్తి మరణించిన తరువాత అతడనుసరించిన దమన నీతివల్ల రాజులెల్లరు ద్వేష భావముతో వుండిరి. అతడు మరణించిన తరువాత అతని అదుపాజ్ఞలలో వున్నవారినందరిని క్రమక్రమముగా పదచ్యుతులను చేసియో లేక యుద్ధములో ఓడించియో తమ తమ స్థానములను స్థిరపరచుకొనిరి అతని శత్రువులు. తైలప చక్రవర్తి (కళ్యాణి చాళుక్యులు) ముదిగొండ చాళుక్యులతో స్నేహము చేసుకుని కాకర్త్య గుండనపై దండెత్తిరి. బహుశః అతనితో జరిగిన యుద్ధములో గుండన మరణించి యుండును.

ఒకే పేరుతో ముగ్గురు నలుగురు మనుష్యులు వున్నప్పుడు వారి వారికి వున్న విలక్షణములను దృష్టిలో పెట్టుకుని ఎఱ్ఱ సుబ్బడు, నల్ల సుబ్బడు, పొట్టసుబ్బడు యిత్యాది పేర్లమీద కొన్ని బండ గుర్తులు పెట్టుకుంటాము అటులనే కాకతి బేతరాజును గరుడాంక బేతడు, బొట్ట బేతడు, లేక బొట్టు బేతడని కూడా వ్యవహరించుచుండిరి. [4]

బొట్టు అంటె తిలకము, భస్మధారణమని అర్థమున్నట్లు దేవి భాగవత ప్రయోగమువల్ల తెలియుచున్నది. అప్పటికే శైవ ప్రాబల్యము ఎక్కువగా వున్నందువల్ల బేతడు భస్మధారణము, తిలక ధారణము చేయుచుండుటవల్ల బొట్టు బేతరాజుగా వ్యవహరించి యుండవచ్చును. బొట్టబేతడు, గరుడాంక బేతడన్నప్పుడు శ్రీపి.వి పరబ్రహ్మశాస్త్రిగారు ఈ వాదముతో ఏకీభవించవచ్చును బొట్ట అంటె చిన్న వయస్సు వాడని కూడ భావించవచ్చును. అదొక మాండలికము.

[5] విరియాల ఎఱ్ఱన కాకతీయ వంశమును నిలబెట్టినట్లు గూడూరు శాసనము తెలియచెప్పుతున్నది. [6] దీనిని ఖండవల్లి లక్ష్మీ రంజనంగారు తమ 'సిద్దేశ్వర చరిత్ర పీఠిక'లో సమర్థించినారు గూడూరు శాసనము పునర్విమర్శించి దాని పూర్వాపరములు తెలియజేయుదును.

గూడూరు శాసనములో మొదటి రెండు పద్యములలో విరియాల వంశము వారి శౌర్య ప్రతాపములను శాసనకర్త వేనోళ్ల స్తుతించినాడు. మూడవ పద్యమున విరియాల వంశములో జన్మించిన ఎఱ్ఱన అను నాతడు ''బొట్టు వసుధాధిపు చేకొని వాని వైరి నుగ్రతరమున జంపి యా కొఱవి దేశమునందు ప్రతిష్ఠ చేసి తత్తనయు సమేతు డోడగ...యము బిట్టర గద్యనం బెన ప్రతిమంగ దాని మొగుడు పక్షియు పండగు నెఱడావుడై'' అన్న పద్యములోని [7] బొట్టి పదమును [8] బొట్టు దిద్దిరి. దానికి ఆధారమేమి దొరికినదో తెలియదు. బొట్టిబేతరాజు, గరుడాంక బేతరాజు ఒక్కరే అయినప్పుడు బొట్టు బేతరాజెవ్వరు? దీని తర్వాత పద్యమును చూచిన ఆ పద్యములో ''అరుదగునట్టి ఎఱ్ఱనృపునంగన కామసాని యాక మేల్గరదః బేర భూవిభునిగా కతివల్లభుజేసి వాని రాబరగ చేతబట్టి ఘను పల్లవరాయని యాగిజొచ్చి భాస్కర విభు చక్రవర్తి గని కాకతి నిల్పుట కోటి సేయుదే.''

విరియాల వంశజులు మొదటి నుండి కాకతీయ రాజుల కోసమై పోరాడి వీరమరణము పొందుటో, విజయులౌటో సంభవించు చున్నది అదే విధముగా కాకతి గుండన యుద్ధములో మరణించగా అతని పుత్రుడైన [9] గరుడాంక బేతరాజు చిన్నవాడైన కారణముగా వాని పక్షమున విరియాల వంశజులైన ఎఱ్ఱన అతని పుత్రుడు సూరన బేతని శత్రువైన ముదిగొండ చాళుక్యులతో పోరి వారిని మడించి కాకతి బేతరాజును కొఱవి మండలాధీశుని చేసిరి. దీనితో ముదిగొండ చాళుక్యుల వంశము నిర్వంశమైనదని భావించవలయును. అంతేకాని బొట్టు బేతరాజు బొట్ట బేతరాజు వేరని భావించరాదు. దీని కంతటికి మూలకారణము బొట్ట బేతరాజును బొట్టు బేతరాజుగా దిద్ది అసలు శాసనము నెంతగా త్రసు అర్థము కాకుండాచేసి వదలివేసిరి. ఆయన భావించినట్లు భావించినను ఈ వ్యాసములోనే యింతకు ముందు చెప్పినట్లు బొట్టు అన్న పదమునకు అర్థ సమన్వయముచేసి అయినా అర్థము చెప్పుకొనవచ్చును.

నా వాదమునకు మరింత బలము చేకూరునట్లుగా [10] మాటేరు శాసనములోని రెండు పద్యములను యిక్కడ చూపుదును: ''అమలగుణాఢ్యులై బరుగు నందరిలో జడిసన్న బేత భూపతి నిజరాజవర్ధనుడు బాహుబలంబున జేసి భూమి సంతతమును గప్పములు గొని బుధప్రియుడై జయశాలి రేవండార్జితుడై వేమబోల కులశేఖరుడాతడు దాని దండియై''.

''శ్రీరమణీయుండు దారుండు దారిద్ర్యవైరి యను పేర నెగడి కాకతిరాజులచేకొని దాయల నిర్జించి రాజ్యంబు నిలిపి వారిచే ప్రతిపత్తుల తాంబ్రశాసనములు నూఱ్లుబెట్లును నొప్పబడసె కడు రూఢిమంతుడై''.

ఈ మాటేరు శాసనమున వర్ణింపబడిన సన్న బేతరాజు; గూడూరు శాసనములో వర్ణింపబడిన బొట్టబేతరాజు ఒక్కరే

అని గ్రహింపవచ్చును. బొట్టు బేతరాజు, సన్న బేతరాజూ, బిన్న అన్న విశేషణములన్ని కాకతి బేతరాజునకు సంబంధించినవే. 'బొట్టు, సిన్న, సన' అన్న పదములన్ని ఒకే అర్థమును తెలుపుతాయి. అదే చిన్నవాడని అర్థము. బొట్టు బేతరాజు కాకతి సింహాసన మధిష్ఠింప వేయు సమయమున జరిగిన యుద్ధములో మరణించియుండును. ఈ యుద్ధములో ఎఱ్ఱన సూరయలకు దీటుగా [11]వేములొండేవయ కూడ సహాయపడినట్లు మాటేడు శాసనములో అభివర్ణింపబడినది. వీరిలో కొందరిని పాల్కురికి సోమనాథుడు తన బసవ పురాణములో కామమసాని (కుందవ్వ)ను, వేములొండేవయను సుప్రసిద్ధ శివభక్తులుగా వర్ణించినాడు.

ఆ తర్వాతి పద్యములో "కారణకాలుడై నడనెగాడయు నాయకుని జంపి సూరడవ్వేలుపు గొండన రవ్వ నృపువేలుపు గొండన ఎఱ్ఱ వానిచే మేలుగ మూడ మొప్పయిని మేలునసేరెడు బోడిపాడునుం మేలుగ టేకు మాపిడ్లు మేలుగ రెండెయరాజ సంగడై" అన్న పద్యములో కాడెయ నాయకుని చంపి చిన్న రాజైన కాకతి బేతరాజును వేలుపుగొండలో సింహాసన మెక్కించి, అతనిచేత నేరేడుపాక, బోడిపాడు మొదలైన గ్రామములను బహుమానము బడసెను. టేకుమామిడి కూడ ఒక గ్రామనామమేమో ?

కామమసాని తన భర్త చనిపోయిన పిదప కాకతి బేతరాజును సింహాసనస్థునిచేసి దేశమును సురక్షితముగా పాలించుచున్నది. [12]కళ్యాణి చాళుక్య చక్రవర్తి తైలపుడు ముంజరాజును పరాజితుని చేయుటకున్నే కాకతి బేతరాజును తన సామంతునిగా చేసుకున్నట్లు రన్నమహాకవి తన ప్రభువైన సత్యాశ్రయ చక్రవర్తికి సమర్పించిన గదాయుద్ధములో క్రకచ అన్న శబ్దము, [13]భద్రకరీంద్రావణము అన్న పదము కనబడుటవల్ల ఇవి ఖాజీపేట ప్రోలుని శాసనములో భద్రాంగవిద్రావణ అన్న పదము ప్రయోగించినందువల్ల తైలప చక్రవర్తి కాకతీయులను జయించినట్లు కనబడుతున్నది. అప్పటికే ముదిగొండ చాళుక్యులు అంతరించినందున ఆ ప్రాంతము కాకతీయుల స్వాధీనములోనే వున్నది. ఈ అంశమును బట్టి చూడగా కాకతి బేతరాజు తైలపుని సామంతుడుగా వుండెనని తెలియుచున్నది. ఒక వేళ తైలపునకు బేతరాజుకు యుద్ధము జరిగియుండిన ఆ యుద్ధములో కామమసాని తన రాజకీయ చతురత నుపయోగించి బేతరాజునకు, తైలపునకు సంధి కుదిర్చియుండెను.

[14]కాకతి బేతరాజును రక్షిస్తున్న కామమసాని గుజరాష్ట్ర, మహారాష్ట్ర, ఘూర్జర, యవనులతో యుద్ధము చేసినట్లు సిద్ధేశ్వర చరిత్రలో తెలియజెప్పబడినది. కాకతి బేతరాజు పూర్తిగ కామమసాని రక్షణలో వున్నట్లు తెలియుచున్నది. ఇది అతిశయోక్తిగా భావించుటకు వీలులేదు. [15]ముంజరాజుపై తైలప చక్రవర్తితో దండెత్తినపుడు ఘూర్జరరాజు, మాళవరాజు, మాళవపతి కొంకణ మండలములను జయించినట్లు కనపడుచుంది. కోసలాది ప్రాంతము, కొంకణ ప్రాంతము నిత్యము రణరంగములైనవి. ఈ సమయములో కాకతి బేతరాజును కామమసాని సాయముతో తైలప చక్రవర్తి మహాసామంతునిగా చేసుకున్నాడు. నిత్యము జరిగే రణరంగములలో కాకతి బేతరాజు క్రమక్రమముగా గొప్ప యోధుడై కామమసాని అడుగుజాడలలో వున్నట్లు భావింపవలెను.

కాకతి బేతరాజు తన జీవిత కాలమంతయు వేలుపుకొండలో నుండి తన పరిపాలనము సాగించి యుండునని భావింపవలయును. [16]దీని కాధారము కాకతి మైలాంబ బయ్యారం శాసనములో కన్పట్టుచున్నది. దీని కుపబలముగా ఖాజీపేట శాసనములో కాకతి ప్రోలరాజు చక్రకూట, భద్రంగ పురాధీశ్వరుని, కొంకణ మండలమును జయించి, కొడవర్తి దుగ్గరాజు కొడుకుని చంపి, యీ ప్రాంతములన్ని కలిసివున్న అనుమకొండను కళ్యాణి చక్రవర్తి త్రైలోక్య మల్లుని నుండి శాసన పూర్వకముగా బడసెను.

ఇక గూడగారు శాసనములోని నాల్గవ పద్యములో బుద్ధికి పదును పెట్టించే విషయములన్ని గుదిగుచ్చి శాసనాన్వయము క్లిష్టతమ మొనర్చినదింతవరకు.

విరియాల ఎఱ్ఱన భార్య కామమసాని కాకతి విభుని వేసి పల్లవ చక్రవర్తితో యుద్ధము, యుద్ధము చేసి అని వున్నది. ఆ పల్లవరాజు (చక్రవర్తి) ఘనుడని వర్ణింపబడినది. అటులైన ఆ ఘన శబ్దమునకు గొప్పవాడను అర్థము చేసుకొనవచ్చును. లేదా గొప్ప ఖడ్గ యుద్ధ విశారదుడైన గాని భావింపవచ్చును.

ఇందు వర్ణింపబడిన భాస్కర విభుచక్రవర్తి ఎవరు ? ఆ పేరుతో గాని, ఆ పేరుతో సమానార్థము గల చక్రవర్తి ఎవరైనా వున్నారా ? ఉంటే వారెవ్వరని పాఠకులు, పరిశోధకులు, చారిత్రకులు పుంఖాను పుంఖముగా, ధనుర్విముక్తశర పరంపరలుగా ప్రశ్నలను నాపై నూపిరిసలపకుండా ప్రయోగింపగలరు. కొంతవరకు యీ వ్యాస పూర్వభాగము ద్వారా ఆ చక్రవర్తి పేరు పాఠకులు, పరిశోధకులు గ్రహించియేయుందురు. ఇంకను వారి మస్తిష్కములకు తోచకపోయినట్లైతే ఆ ప్రశ్నకు సమాధానము యిక్కడ చెప్పెదను.

భాస్కరవిభుచక్రవర్తి పశ్చిమ చాళుక్య ప్రభువైన తైలపుడు. ఈ తైలపుడు అన్న పదమునకు, భాస్కరుడు అన్న పదమునకు ఎక్కడ పొంతన లేదు కదా ! ఏ విధముగా సరిపోవునని ప్రశ్నింపవచ్చును. దైలపము అనగ దీపము అని అర్థము. దీని స్వరూపము తైలమును గ్రహించి ప్రకాశము కలుగజేయునది. తైలపుడు అనగా ప్రకాశవంతమైనవాడు అని అర్థము వచ్చుచున్నది కదా ! ప్రకాశవంతమైనవాడు సూర్యుడా ? చంద్రుడా అని ప్రశ్న వేసుకొనగా సూర్యుడనియే అర్థము చెప్పవలెను. స్వయంప్రకాశుడు సూర్యుడే కావలయునుగాని చంద్రుడు కాడు. ఏ విధముగా అని మనకు మనమే ప్రశ్న వేసికొనగా తైలము తీసుకుని దీపము ఏ విధముగా ప్రకాశిస్తున్నదో అదే విధముగా నీటిని తన కిరణములచేత గ్రహించి ప్రకాశించు స్వభావము కలిగినవాడు సూర్యుడేకాని చంద్రుడు కాడు కదా ! అందుకని గూడూరు శాసనములోని నాల్గవ పద్య మందభివర్ణింపబడిన భాస్కర విభు చక్రవర్తి తైలపుడే కావలయును

దీని కుప బలముగా తైలపుని పుత్రుడు సత్యాశ్రయునకు సమర్పణగా వ్రాసిన గదా యుద్ధములో తైలపుని యుద్ధవిజయము లను వర్ణించుచు క్రాకలిక శబ్దము పయోగించినాడు. క్రాకలిక లేఖకుని పొరపాటువలన కాకతికకు బదులుగా వ్రాసియుండవచ్చును. కాకతి బేతరాజుకు, తైలపునకు జరిగిన యుద్ధములో కాకతి బేత రాజును బంధించగా అతనిని రక్షిస్తున్న కామమసాని తైలప చక్ర వర్తి దగ్గరకు వెళ్లి, సంధి యత్నములు జరిపి, విడిపించి యుండ వచ్చును. ఇదే విషయము గూడూరు శాసనము చెప్పచున్నది.

17 తైలపుని పుత్రుడు సత్యాశ్రయుడు క్రీ. శ. 998 – 1007 వరకు రాజ్యపాలనము చేసినట్లు గలదు. క్రీ. శ. 957 నుండి 998 వరకు తైలపుడు రాజ్యముచేసినట్లు కనపడుతున్నది. 994 లో ముంజుడు మరణించినట్లు శాసనమున్నది. ఆదే సమ యములోనో లేక దానిముందో తైలపుడు కాకతీయులపై విజ యము సాధించినాడు.

ఈ పై విషయములన్నీ స్థూల దృష్టితో చూచినట్లైతే గూడూరు శాసనము పదవ శతాబ్దపు చివరి పది సంవత్సరములలో వేయించినదేయని రూఢిగా తెలియగలదు. ఇది దీర్ఘకాలము విమర్శించి వ్రాసినది.

అథోజ్ఞాపికలు

1 కాకతీయ సంచిక.

2 ప్రాచీన దక్షిణ భారత చరిత్ర, డా॥ రామకృష్ణమాచార్య.

3 క్రీ. శ. 973 నాటి ఆంధ్రదేశ రాజకీయ కల్లోలము – పి. వి. పరబ్రహ్మశాస్త్రి – పింగళనామ సంవత్సర ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక 1977–78.

4 దేవీ భాగవతము – ములుగు పాపయారాధ్యులు భస్మ మాహాత్మ్యము. 11–125.

పంకజ సంభవుండు నరు ఫాలము నడ్డముగా సృజించే నూ ర్ధ్వాంకము వర్తులాంకమును నొసటు లేటి జెయ్యడయ్యె న ప్పాంకము గాగ రేఖలును బుట్టగ జేసెను నల్ప యచ్చటన్ గొంకక యూర్ధ్వ వర్తులత గూర్తులు బొట్టు మర్త్యవ లేమొకో.

5 క్రీ. శ. 973 నాటి ఆంధ్ర దేశ రాజకీయ కల్లోలము. పి. వి పరబ్రహ్మశాస్త్రి. ఆంధ్ర పత్రిక పింగళనామ సంవత్స రాది సంచిక. 1977–78.

6 సిద్ధేశ్వర చరిత - కాసె సర్వప్ప పీఠిక. ఖండవల్లి లక్ష్మీ రంజనము.

7 గూడూరు శాసనము

8 'భారతి' సంపుటము 49–సంచిక 5–కాకతి మొదటి బేత రాజు శనిగారపు శాసనము. పి. వి. పరబ్రహ్మశాస్త్రి.

9 'భారతి' సంపుటము 39–సంచిక 11–కాకతీయులు వెల్మ కొండవారు కారా ? కె. హెచ్. వై. శర్మ

10 ,, ,,

11 ,, ,,

12 సామంత కాకతీయులు–కళ్యాణి చాళుక్యులు. వేదం వెంకట రాయశాస్త్రి, సాధారణ నామ సంవత్సరాది సంచిక, 1970 – 71.

13 ఖాజీపేట శాసనము – కాకతి సంచికలో 1వ శాసనము.

14 సిద్ధేశ్వర చరిత – కాసె సర్వప.

15 సామన్త కాకతీయులు-కళ్యాణ చాళుక్యులు. వేదం వేంకట రాయ శాస్త్రి, సాధారణ నామ సంవత్సరాది సంచిక.

16 కాకతి మైలాంబ బయ్యారం శాసనము, ఖాజీపేట శాసనము.

17 సామన్త కాకతీయులు–కళ్యాణి చాళుక్యులు. వేదం వేంకట రాయశాస్త్రి. సాధారణ నామ సంవత్సరాది సంచిక 1970–71.

శ్రీ ఐ వై. డి మల్లికార్జున.

బ్రౌన్

నా వ్యాసం పూర్తయగుసరికి ఈ క్రింది విషయములు దొరికి నవి. కావున ఇక్కడ అనుసంధించుచున్నాను : సుందరేశ్వరరావు

[శ్రీ సుందరేశ్వరరావు పంపిన ఈ రచనని జూన్ 'భారతి'లో వెయ్యటానికి వీలుకాకపోయింది : సం.]

సి. పి. బ్రౌన్ దొరవారు ఉత్తర ప్రత్యుత్తరములు

ఈ యాంధ్ర భా ద్ధారకుని చరిత్ర వ్రాయవలెనని నాకెంతో కోరిక కలదు. సాధనములు తగినన్ని సమకూడలేదు. ఫొటోగ్రాపు లభించలేదు. ఎన్నాళ్ళకు తీరునో నా కోరిక ! గొప్ప పండితులు బ్రౌన్ దొరగారికి వ్రాసినవి, దొరగారు పండితులకు వ్రాసిన యుత్తరములున్నవి. కొన్ని ఈ పత్రికలో ప్రచురించెదను.

ప్రభాకరశాస్త్రులవారు పై విధముగా 1914 'ఆంధ్ర పత్రిక' జూన్ మొదటి తేది సంచికలో వ్రాసి, వర్యం అద్వైత బ్రహ్మయ్య వ్రాసిన లేఖను ప్రచురించియున్నారు. దీనినిబట్టి బ్రౌను లేఖను తెలుగుదేశమున తొలుత ప్రకటించిన కీర్తి 'ఆంధ్ర పత్రిక' వారిదనియు, ప్రథమాంధ్ర బ్రౌన్ పరిశోధకుడు ప్రభాకర శాస్త్రి అనియు ఢవిణకొట్టి చెప్పవచ్చును. పై బ్రహ్మయశాస్త్రి లేఖ ఇటీవల తిరిగి ముద్రితమైనది. అందు ప్రస్తావనేలేదు. ఎట్లుండును?

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

"కులం కాదు"

'భారతి'–ఏప్రిల్ 78లో "బ్రౌన్ జాబుల్లో స్థానిక చరిత్ర కలాలు : కడపజాబుల సంకలనం" మీద కళాప్రపూర్ణ నిడుదవోలు వారు సమీక్ష రాశారు. అందులో ప్రస్తావనకు వచ్చిన ఒక చాటువును గురించి బంగోరె వాక్కుమాట :—

ఆ చాటువు పూర్తిగా ఇట్లా ఉన్నది—

రెడ్లమటంచు క్రొవ్వున చరించి నరుల గడంచి యూరకే
బుడ్లకొలంది నించి కడుపుల్ కడుబెంచి వివేకశూన్యులై
యెడ్లవలెన్ జరించు గుణహీనుల రెక్కడి కీర్తిలో దివి
ద్విడ్లయకాల గోళ్ల వినతిమ్మ లనూభవ రాతభూవరా.

దీనిమీద "ఇక్కడ 'Head farmer of Cuddapah' అని బ్రౌన్ వ్రాసుంటే వేటూరి దాన్ని బహువచనం చేసేసి రెడ్లకందరికీ అంటగట్టారు" అని బంగోరె రిమార్కు.

రెడ్లము, కడుపులు, శూన్యులు, ఎడ్లు, హీనులు, కీర్తులు— ఇవన్నీ వాక్యనిర్మాణంలో వచ్చిన బహువచన రూపాలు బ్రౌన్ రాసిన దాన్నిబట్టి, దానిపై బంగోరె రిమార్కునుబట్టి అసలు వీళ్లిద్దరికీ ఏకవచన, బహువచనాలు కూడా తెలియవనుకోవలసి వస్తున్నది! ఛందస్సు, ప్రాసలసంగతి ప్రస్తావించడం అనవసరం. ఎందుకంటే "రెడ్డి నటంచు"...అని యెత్తుగడ ఉన్నా, తర్వాతి పాదాలలో 'డ్ల' ప్రాస రావడం తప్పుకాదు. (అప్పకవీయం – III, 314 నుంచి-సంయుతా సంయుత ప్రాసం.) కాని, బహువచనం (వ్యాకరణ రీత్యా) అందుకు అంగీకరించదు.

అసలు కడప ప్రాంతంలో రెడ్లంటే కాపుకులస్థులనే కాదు; మునసబుగిరీ చేసే యెవరినైనా రెడ్లంటారు.

రెడ్డి అంటే బంగోరె ఒక కులమే లనుకోవడం తప్పు.

పద్యంలో బహువచనముంటే బ్రౌన్ ఏకవచనంగా చెప్పడం తప్పు.

వేటూరి బహువచనం చేశారనడం తప్పు.

పొరపాటును సూచించవచ్చు; సవరించవచ్చు. ఆ భాగ్యానికే వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని 'చోరుడు' అనడం నోటి కొవ్వు!

శ్రీ బండి నాగరాజు

శ్రీ చందు సుబ్బారావుగారి విమర్శ

సాహిత్యం శుద్ధాంతఃకాంత లనుకుంటే తప్పు, పార్టీ పంథాల గురించి 'భారతి' లాంటి "సాహిత్య పత్రిక"లో ప్రస్తావించడం ఎలా తప్పో నాకు తెలియదు. 'భారతి' 'శుద్ధ' సాహిత్య పత్రికే అయితే, ఆర్థిక, రాజకీయ విషయాలపై వ్యాసాలను ఎలా ముద్రించుకుంటూంది ? 'భారతి' సంపాదకులకు లేని చింత శ్రీ చందు సుబ్బారావుగారికి కలగటం ఆశ్చర్యమే. పైగా, తాము రాజకీయజ్ఞులమే నంటారు, లేదా అనుకుంటారు. రాజకీయ విషయాల గురించి తీర్పు చెబుతారు, మరి! నిజానికి, ప్రజా జీవితంలో అరలూ, గదులూ లేవు. సాహిత్యం, రాజకీయం, పరస్పర బాహ్యమైనవో, కులవైరం కలవో, కావు గదా ? సాహిత్యానికి స్వయం ప్రతిపత్తి (ఆటానమీ) వుందని వాదిస్తే, జీవిత వాస్తవమే ఆ వాదాన్ని నిరాకరిస్తుంది. శ్రీ సుబ్బారావుగారిలాంటి మేటి తీర్పరికి గూడా సాహిత్య, రాజకీయ అన్యోన్యత తప్పదాయె! మరేం వుపాయం ?

"కరపత్రాల దుమారం" అనే పుప శీర్షికగల ఒక గ్రంథాన్ని సమీక్షిస్తూ శ్రీ సోమసుందర్ లేవనెత్తిన వైయక్తిక – సంస్థా విషయాలకు సమాధానంగానే రాశాను గాని, నా అంతట నేనుగా ఈ చర్చను ప్రారంభించలేదు. కాబట్టి సుబ్బారావుగారన్నట్లు ఇది నేను "ప్రసాదించిన" సంప్రదాయం కాదు. ఇలాంటి విషయాల్లో పదిమందీ పాల్గొనవలసిందే. స్వేచ్ఛ తత్వంతెలిసినవాళ్లందరికీచెందిం దాన్నే స్వేచ్ఛలంటారు. ఒక్కడికేగల వసతి ప్రివిలెజ్ గాని, ప్రిరాగేటివ్ గాని అవుతుంది. అంచేత సుబ్బారావుగారికీ, అలాంటిఅందరికీ నాకెంత వుందో అంత స్వేచ్ఛ వుండాలి. ఇలా రాస్తే రమణారెడ్డి "సాత్విక వచనాలు" అని ఎద్దేవా చేస్తారేమో? మరోలా రాస్తే "అత్యుగ్ర" వచనాలని అనవచ్చు ఇంతకీ సోమసుందర్‌గారితోగానీ, చందు సుబ్బారావుగారితోగానీ వ్యక్తిపరంగా ఎవరికి ఎందుకు పేచీ ? 'సాత్విక వచనాలు' కావలసినవి "అత్యుగ్ర" వచనాలు ఎందుకైనాయి ?

మార్మిక కసిని ఎవరిలో ద్యోతకమైనా మంచిది కాదనే నా అభిప్రాయం. నాలోనే సదరు కవిత్వచ్ఛాయలు ఒకప్పుడు లేక

భారతి

చందా వివరములు

		ఏజంటుద్వారా	పోస్టులో
విడి ప్రతి	రు.	1-50	-
6మాసములచందా	రు	9-00	9-60
సంవత్సరచందా	రు.	18-00	19-20

ఒకేసారి ఆంధ్రపత్రిక ఆఫీసుకు
నేరుగా చెల్లిస్తే సంవత్సరచందా 12-00

మేనేజరు
భారతి

పోలేదు. అతీంద్రియ జ్ఞానానికీ, అనుభూతికీ సంబంధించిన కవిత్వం తాలూకు గుణ గుణాల గురించి తీరిగ్గా మరొకప్పుడు చర్చించుకుందాంగాని, జ్వాలాముఖిని తప్పెన్నే సందర్భంలో మన తప్పులు గురించి మరవగూడదనే నేనన్నది. జ్వాలాముఖిగారు నా ''సోదర శ్రీవైష్ణవు''లో కారో నాకు సంబంధించిన విషయం. ఈ కుల ప్రస్తావనలు యెత్తిపొడుపులుగా పనికిరాగలవని సుబ్బారావుగారు నిరూపించినందుకు వారికి ధన్యవాదాలు. సంస్కారానికి చాలా భేషైన గీటురాయి వారిది.

ఇంకొక్క విషయం. సోమసుందర్‌గారికీ నాకూ మధ్య ఎన్నో పోలికలు తెస్తూ రాశారు సుబ్బారావుగారు. సోమసుందర్ 'ఏదీ దాచిపెట్టుకోలేదు', ''ఏడాదికో మంత్రం జపించలేదు'', ''పార్టీలు మార్చలేదు'', వగైరా. అవన్నీ నేను చేశానని ధ్వని. అయితే, చాల మంచిపనే చేశానన్నమాట! ఎందుచేతనంటే, సిద్ధాంతానికీ, ఆచరణకూ తెగదెంపులైపోయిన ఒకానొక పార్టీ ''ఔత్సాహిక భాగస్వామ్యం''నుండి దూరం కావడమేగాక, సిద్ధాంతమూ, ఆచరణా ఒకటేనైన మరో పార్టీకి సమీపవర్తినయివుంటాను గదా! సుబ్బారావుగారి మాటల్లో, ''ఒక రాజకీయపార్టీకిగాని, ఒక కవితా తత్వానికిగాని (అభ్యుదయ కవిత్వానికే) చేదోడు వాదోడుగా'' సోమసుందర్‌గారు వున్నారనడం చాలా గొప్ప విశేషం. అంత నిబకడ నాకు లేకపోవడం నా దురదృష్టమని అనుకోనా? పాతివ్రత్యంగాక, 'స్వేచ్ఛాజీవనం'' పేరిటి స్వైరిణీ ధర్మం పట్టుబడడం అదృష్టం అనుకోనా? ఏమనుకోను? కమ్యూనిస్టు విప్లవ వుద్యమ తత్వం ఎక్కడ ఆచరణరీత్యాకూడా సజీవంగా వుందో, అలా వుందని నాకు అనుభవరీత్యా నమ్మకం కలిగిందో, అక్కడికి నా ఆలోచన నన్ను నడిపించింది. అనుభవాన్ని కాదని నేను స్థాణువులవుండలేదు,వుండలేనుకూడా. లోపల్ప్రాణసారంహరించుకుపోయి, డొల్లగా మారి పేర్లు మాత్రం నిలుపుకున్న రాజకీయ పార్టీల, సాహిత్య సంస్థల కట్టుగుంజలకు నేను కట్టుబడి వుండిపోలేదని ఒప్పుకుంటాను. ఇలా చెయ్యడంలో, విప్లవ వుద్యమానికి ద్రోహమే చేశానో, దోహదమే చేశానో నిర్ణయించవలసింది సుబ్బారావు గారొక్కరే అయితే, ద్రోహమే చేశానని అనగలరు. అంత గొప్ప వస్తుపరమైన దృష్టి వారిది. ''వీర వితండ వాదాన్నీ, (వితండ వాదమంటే యేమిటి? సుబ్బారావు గారు చెప్పాలి.) విప్లవ కార్యక్రమాన్నీ సమర్థిస్తూ నేను ''సమర్థించే'' (సమర్థించే?) నా ''వాదనపాఠం'' (అంటే?) ''ఇంకా'' (ఇంక?) ''చలామణీ కాదు'' అంటున్నారు. విప్లవ కార్యక్రమాన్ని సమర్థించక విప్లవ విద్రోహ కార్యక్రమాన్ని సమర్థించమంటారా యేమిటి చెప్మా?

''ఒకరు అతీత మానవ శక్తుల గురించీ'', (కుటుంబరావు గారిని గురించి అయితే, ఇది నిందే!), ''ఒకరు సాహిత్యంలో వాస్తవికత గురించీ'', (జ్వాలాముఖి వారి విషయమైతే, ఇది అపరాధ మేమీకాదే!), ''ఒకరు విషవృక్ష ఖండన — మండన వివాద విశేషాల గురించీ'', (ఎవరై వుంటారో? శ్రీశ్రీయా? ఆయనకు మాత్రం సుబ్బారావుగారు కోరుకునే ''స్వేచ్ఛ'' లేదా యేమిటి?), ''ఒకరు జనతా పార్టీతో పొత్తు గురించీ'' (వీరెవరో? వింటే జనతా పార్టీకే విస్మయం కలగగలదు!) మాట్లాడుతున్నారట, నేను మాత్రం ''ఇంకా పెనుగులాడు'' తున్నానట! సుబ్బారావుగారి వాదం ప్రకారమే అయితే నేనలా పెనుగులాడగూడదే? ప్లేటు ఫిరాయించేసి వుండాలి. ఏడాదికో మంత్రం పఠించి వుండాలి. అలా యెందుకు చేశాను కాదు? బాగుండే 'రాత' లేదు కదా నొష్ట? ఏ ఇందిరమ్మనో. వెంగళ్రావునో నమ్ముకుని, తాత్కాలిక రాజకీయ (ఎన్నికల) లాభం కోసం నా మనస్సును అమ్ముకుని, 'జాతీయ బూర్జువా వర్గం' పరిపాలించగల 'జాతీయ ప్రజాస్వామ్య' రాజకీయ సిద్ధాంతాన్ని ఆశ్రయించి, అక్రమంగా (అక్రమంగా నైతేనేం?) సుంభ తరణోపాయం కనుగొనివుంటే, సుబ్బారావుగారు నా మీద ఇంత కోప్పడి వుండరు గదా? వచ్చే యేడాదికి అలా కొత్త మంత్రం పఠిస్తాను, సరేనా? అలాంటి నాకు ''చిత్తశుద్ధినీ, నిస్వార్థ బుద్ధినీ'' అంట గట్టడం స్వవచో వ్యాఘాతం.

— శ్రీ కె. వి. రమణారెడ్డి

గొరిల్లాను గురించి

శ్రీ సర్వేశాయి తిరుమలరావు జూన్ నెల 'భారతి' లో వ్రాసిన లేఖ చూచాను. నేనూ జంతుశాస్త్రం ప్రధాన విషయంగా పట్టభద్రుడనయినవాడినే. అందువల్ల శేషేంద్ర కవిత ను విమర్శించేటప్పుడు గొరిల్లా లక్షణా లేమిటో నాకు తెలియక పోలేదు.

ధీ విశేషం గల మనిషికీ, అపరిపక్వ బుద్ధిగల జంతువులకూ సేతువులని చెప్పదగిన వాటిలో గొరిల్లా ఒకటి. మనిషి కంటె పెద్దదైన శరీరం, కండబలం గొరిల్లాలో ఉన్నాయి. గొరిల్లా కంటె ఎక్కువ ధీ శక్తి మనిషికి ఉంది. మనిషి తన క్రియాశక్తిని గొరిల్లా వంటి బృహదా కారంగా పెంపొందించుకోవాలన్నది కవి ఆశయం. మిగిలినవన్నీ ఆనుషంగికాలు. గొరిల్లా నిద్రపోతుందా లేదా, గొరిల్లాకు రోమాలు ఉంటాయా ఉండవా — ఇవన్నీ అప్రధానాలు. ఈ విధంగా ప్రతీకలకు, అసలు వస్తువుకు ఉండే అన్ని గుణాలూ ఉండాలనుకోవడం దురాశ. మురికిలో పొర్లాడుతూ, అసహ్యంగా తిరిగే పంది విష్ణువు అవతారాలలో ఒకటై భూమినే మోస్తున్నప్పుడు గొరిల్లా క్రియాశక్తికి సంకేతమయితే తప్పులేదు. కోతిని ఆంజనేయుడిగా చేసి సముద్రాలు దాటింపజేస్తే మెచ్చుకొనే రసికులు, గొరిల్లాను క్రియాశక్తికి ప్రతీకగా చేస్తే మెచ్చలేక పోవడం శోచనీయం. సహృదయత ఉంటే ఆధునిక కవితలో కూడా స్వారస్యం కనిపిస్తుంది. అది లేనినాడు కవితావిమర్శ వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలతో ముడిపడి ఉంటుంది.

- శ్రీ ర్యయస్. సుందరం

లేఖలు

"భారతి" (మే 1978) నా వ్యాసం మూడో సంపుటి "కళిఙ్గదేవ" సమీక్షకు కృతజ్ఞుడను. నేరాచిన పుస్తకాల కర్తల వివరాలు అట్టమీద ఉన్నాయి. బహుశా డా. రెడ్డిగారు చూడ లేదేమో. నేను పరిశోధకుడను కాననీ, వస్తుటుండే పత్రికేయుడి ననీ, మావూరు రిఫరెన్సు పుస్తకాలకు 'సహారా' అనీ, గ్రంథరచనా, ప్రచురణా నా వృత్తి, వ్యాపారం కాదనీ చెప్పుకుంటూనే ఉన్నాను.

"కళిఙ్గదేవ" వ్రాయడానికి నే శ్రమించలేదు. ముద్రణకు సిద్ధం చేసిన "మోక్షకుణ్డమ్" అప్పటికప్పుడు ప్రపంచ తెలుగు మహాసభలవారి దృష్టిని మరల్చడానికి వ్రాసాను. కాగా అందులో కొన్ని విషయాలు లోగడ "భారతి", తదితర పత్రికల ప్రచురించెను.

క్రీ. పూ. సెమిరామిస్ నాటినుండీ జరిగిన దండయాత్రలు, సుమేరియన్ సంస్కృతి వ్యాప్తి వగైరా బట్టీ సంస్కృతీవ్యాప్తి దండయాత్రలవలన గాక మత వాణిజ్యాలవారి రాకపోకలే దోహదం చేసాయని నా నమ్మకం.

ఇప్పటికి వేసిన "మైలారదేవ, గుడిసంపా, కళిఙ్గదేవ" మూడు సంపుటాల్లోనూ ప్రారంభించిన నాటిమాట అసమగ్రం. నా ఆలోచనలు పాఠకులముందు ఉంచాను సిద్ధహస్తులు సమగ్రం చేయాలి — అంటూనే ఉన్నాను.

నేనున్న "మోక్షకుణ్డమ్, పెటిసె" రెండు సంపుటాలు దీక్షతో పెద్దల సూచనలు జ్ఞప్తిలో ఉంచి పూర్తిచేయయత్నిస్తాను.

శి గ ... వర్మ

రచనా వ్యాసంగంలో కొంతమంది తమ పేర్లకు ముందు 'డాక్టర్' బిరుదాన్ని ఉపయోగిస్తున్నారు. విశ్వవిద్యాలయాలు ప్రదానంచేసే డాక్టరేట్ (పి. హెచ్. డి.) బిరుదు కలవారు మాత్రమే ఈ డాక్టర్ బిరుదాన్ని వాడడం లేదు.

వైద్యవృత్తి చేసే ఎం. బి. బి. యస్. లు మొదలుకొని ఆర్. ఎం. పి. ల వరకూ 'డాక్టర్' బిరుదాన్ని వాడుకుంటున్నారు వైద్యులుకూడా డాక్టర్ బిరుదాన్ని వాడుకొనవచ్చునా ?

ఒక విషయం మీద ప్రత్యేక పరిశోధన చేసినవారికి, మరియు కొంతమంది మేధావులకు గౌరవ డాక్టరేట్లను విశ్వవిద్యాలయాలూ, ప్రభుత్వాలూ ఇస్తున్నప్పుడు, అదే డాక్టర్ బిరుదాన్ని వైద్యులు కూడా వాడుకోవడంలో అర్థమేమిటి?

'డాక్టర్' అనే బిరుదాన్ని రెండు తెగల మేధావులు (మరలా వీరిలో ఉపతెగలు — సర్వరోగ నివారణ టానిక్కుల డాక్టర్లు) వాడుకోవడం ఎంత వరకు సబబు ?

ఈ విషయమై ప్రభుత్వం వారు (విద్యాశాఖ) ఏవీనా ఆలోచించడం లేదా ?

శ్రీ ఆత్మకూరి కామేశ్వరరావు,
కొరిమెర్ల, (నెల్లూరు)

'పద్యవిద్య'లో పొరపాట్లు

ఛందస్సు పొరపాట్లు లేకుండా పద్యకవితలను చూసి ప్రచు రించమని మిమ్మల్ని కోరుతూ నేను వ్రాసిన లేఖ ప్రచురింపబడిన "నై" సంచికలోనే మళ్ళీ ఛందస్సు పొరపాట్లు దొరలటం నాకు బాధగా వుందని మనవి చేస్తున్నాను.

(1) 'దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు'గారిని గూర్చి శ్రీ రాయప్రోలు సుబ్బారావు వ్రాసిన మొదటి కవితలోనే గమనిం చండి.

<u>మూడవపద్యం :</u> మొదటిపాదంలోను, నాల్గవపాదంలోను ఛందస్సు తప్పిపోయింది.

<u>నాల్గవ పద్యం :</u> తేటగీతిలో ప్రథమపాద మిలా వున్నది; "బోడపడదీ విరుద్ధ ధర్మాధికార". "బోధపడ"దని వుండుటకు బదులు "బోడపడ"దని పడినది (!) ఇందువలన ప్రాసయతి తప్పవుతున్నది. ఇట్టి అచ్చు తప్పులెందుకు దొర్లుతున్నాయో!

(2) "కాళిదాస విలాసను"— శ్రీ పోచిరాజు శేషగిరిరావు వ్రాసిన కవిత పరిశీలించండి. మొదటి పద్యమున నాల్గవ పాదమిట్లు న్నది : '...యెందున్ నీ కవితా కలాపములె? బ్రహ్మదత్త మేధా నిధీ!' ఇందులో యతినియమం భంగమైనదనుకుంటాను 'బ్రాహ్మీ దత్తమేధానిధీ!' అనుటకు బదులు "బ్రహ్మదత్త మేధానిధీ!" అని పడిన దేమో !

(3) కవితా కాళిదాసను — శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి వ్రాసిన కవిత పరిశోధించండి. నాల్గవ పద్యంలో నాల్గవ పాదమిలా వుంది : "పూర్ణప్రణయరేఖ, వారి కార్మొగిలులేఖ". "ర్ణ", "ప్ర" వలన గురువగుచున్నది. అంటే గణభంగం జరిగిందన్న మాట. భానుమూర్తిగారు ఇట్టి సందర్భంలో "ర్ణ"వంటి అక్షరా లను లఘువుగనే నిశ్చలంగా భావిస్తున్నారేమో అని మనం సందే హించటానికూడా వీల్లేదు. ఎందుకంటే వారే చివరి పద్యంలో (సీసపద్యం) "అర్ధనారీశ్వరమైన దివ్యప్రేమ" అని మూడవపాదం రచించారు. ఇక్కడ "ప్రే" వలన "వ్య"ను లఘువుగా గాక గురు వుగా సరిగానే భావించారు.

వచన కవితా యుగంలో ఛందస్సు వింత గట్టిగా ఎందుకు పట్టించుకోవాలని ప్రశ్నించేవారుండవచ్చు. 'పద్య విద్య' అన్నాక మరి దానికన్ని లక్షణాలూ సమగ్రంగా వుండాలికదా!

శ్రీ రావి రంగారావు

గ్రంథ విమర్శలు

ప్రపంచ రాజ్య సర్వస్వము

[ప్రపంచ రాజ్య సర్వస్వము; సంపాదక మండలి—శ్రీ దేవులపల్లి రామానుజరావు, శ్రీమతి శారదా హెచ్. రావు, డా సరోజినీ కె గాని, డా. ఆర్. వి. రావు, డా. యం. రాధాకృష్ణ శర్మ, డా. కె. విఠల్ రెడ్డి; సంకలన కర్త—శ్రీ చీమకుర్తి శేషగిరిరావు; ప్రచురణ—ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, హైదరాబాదు; వెల : రు. 60-00]

ఇది వెయ్యి పేజీలు పయిగా గల పుస్తకం. దీని "తొలి పలుకు"లో శ్రీ గడియారం రామకృష్ణశర్మ ప్రచురణకి దారితీసిన చరిత్రని టూకీగా చెప్పారు.

ఈ సర్వస్వంలో ఐక్యరాజ్య సమితి వివిధ ఖండాలు, భారతదేశం ఎనిమిది అధ్యాయాలలో వివరింపబడ్డాయి. ఐ. రా. స. నిర్మాణాన్ని వివరించే బొమ్మ, వివిధ దేశాల చిత్రపటాలు చదివేవాళ్లకి ఉపయోగకరంగా ఉంటాయి. ప్రపంచం అంతటికీ 890 పేజీలు వున్నట్లైతే భారతదేశానికి సుమారుగా 135 వున్నాయి.

ఒక్కొక్క దేశాన్ని గురించీ చెప్పే భాగంలో ముఖ్యనగరం, జెండా, జాతీయ గీతం, నాణెం, కాలగణనం, కొలతూకం, ఉనికి మొత్తం, శీతోష్ణస్థితి, జనసంఖ్య, సమాచారం, యానసౌకర్యాలు వగయిరాల వివరాలు వున్నాయి. చరిత్ర కూడా క్లుప్తంగా వుంది. పౌరుల ఉచ్చారణ అధికంగా ఇంగ్లీషు పుస్తకాలనే అనుసరించి వున్నట్లు తోస్తుంది. [కానీ, చీనా, చుర్కీ అని రాయటమే బాగాఉంది!]

భారతదేశానికి సంబంధించిన భాగంలో మచ్చుకి రాష్ట్రాల వివరాలని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ అధ్యాయంలో కనిపించే కొరత ఒక లక్షకన్నా తక్కువ జనాభాకల ఊళ్ల పేరులు లేకపోవటం. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు తమ స్వంతరాష్ట్రాన్ని వీలయినంత సమగ్రంగా వర్ణించే పుస్తకం ఒక దానిని వెంటనే వెలువరించగలరని ఆశించాలి. విశాలాంధ్రవారు ఆంధ్రప్రదేశ్‌ని గురించి ఎన్నో వివరాలు తెలిపే పుస్తకాన్ని ప్రచురించారు. విద్యార్థులకి, మామూలు పాఠకులకి ఉపయోగపడే పుస్తకాన్ని తక్కువ వెలకి ఆం. సా. ప. వారు త్వరలోనే బయటికి తీసుకువస్తే బాగా వుంటుంది. ప్రపంచరాజ్య సర్వస్వము మాత్రం ఎన్ని గ్రంథాలయాలలో ఉంటే అంత మంచిది.

... *ఒక సమీక్షకుడు*

వైజయంతి

[వరూధిని ప్రవరాఖ్యుల ప్రేమోదంతము. వై.సి. వి. రెడ్డి. క్రౌన్ 1/16.50 పేజీలు, వెల రు 3/- ప్రతులకు : గ్రంథకర్త, 2-76 ఎ, నాగరాజుపేట, కడప.]

అర్థగౌరవము భావపుష్టి భాషా సౌభాగ్యము కథకపొందిక మెరయ వరూధిని ప్రవరుల భగ్నప్రేమోదంతాన్ని, ఎత్తుగడసొంపుగల పాటలతో చెప్పిన నూతనపంథా కావ్యమిది.

ఈపొడి అక్షరాల పేరుగల రెడ్డి (ఇది కవిత్వంగదా, ఆల్జిబ్రా కాదే—సంకేతాక్షరాలేలనో!) తమగురువు—పుటపర్తి సరస్వతీపుత్రుల శివతాండవం దారితొక్కినట్లున్నది. ఈ రచనలో చివరి రెంగుబంతులు పాటకంతా ప్రాణం.

ఈ కవి ఆ వరూధినిపై సహానుభూతితో — "ప్రణయులబ్ధను ధూర్తులకు పట్టియిచ్చితివా" అని ఆ స్తోత్రియునిపై నిందారోపణం చేస్తున్నాడు. ఆ భూసురునితోనే అదిలించి మాట్లాడినట్లు, హిమాలయసానువుల సహజగంభీర రామణీయకతను "చెలువు లెగబోయ" ప్రౌఢఫక్కిలో, మధురభాషలో తెనుగు జాతీయాలలో వర్ణిస్తాడు. ఆ ప్రదేశాన్ని, "విడిచిపెట్టగనేలనో, ఇంటికని పరుగులెత్తపోయినో" అని అపహాస్యం చేస్తాడు. ఆ అమరసుఖాలు అనుభవించక ఇంటి "తలుపుతట్టిన" దానికి కవి నాపోతాడు.

తరువాత వరూధిని విరహబాధను చవులూర వర్ణిస్తాడు. ఇందు సరస్వతీదేవి వాపోతుంది; లక్ష్మి, తార కోరికను దీరిన తన తమ్ముడు—చంద్రుడే మేలంటుంది. అప్సరల వలపు తీపులనుభవించి ప్రాభవప్రతిష్ఠ చెడగొట్టుకొని ఋషులసంగతిజెప్పి, కవి పౌరుని "మేనసుఖములరోసి" నందులకు పరితాపపడుతాడు. తమ గూడెము వారికే అన్యాయం జరిగినదని ఊర్వశి తిట్టినది. "కామనలకొలిమిలో కరగిపోయినదామె" అని ఋషులచేతనే ప్రవరుని తిట్టించినాడు. వరూధిని తనతో మాటమాత్రమైనా చెప్పలేదని వియద్గంగ వెతలజెందినది.

వరూధిని విరహం మంచిపోకడలో బడినది. ఈ 'రసవత్తర ధోరణిలో' 'నసవిల్లు శాస్త్రసంగతులతో మూడుమూర్తుల సభలలో ముద్దులొలికించిన' వరూధినికి వకాలతు దీసుకొని "ఆడపిల్లలతో మాటపడవద్దు" అని వాదించినాడు—కవి. ఈ వాదాన్నంతా అందరికీ అర్థమయ్యే ఆంధ్రభాషలో ఆమెచెప్పినదనటం ఒకలబ్జు. తమిళ కంబుడు రామాయణంలో తమిళంలో మాట్లాడిస్తాడు.

దీనికి : "భూతదయలేనట్టి పుణ్యాత్మా, చదువేలరా నీకు ఛాందసా" అని కొండలన్నీ మార్మ్రోగినవి.

ఇక ప్రవరుడు "చిరుదగ్గుతో ఆయాసపడుతూ" ప్రత్యుత్తరమిస్తున్నాడు—"యజ్ఞయాగాది కర్మలతో" జన్మము బీడుగా చేసుకొన్నాము, పురాణాలు కల్పించి స్థలమాహాత్మ్యలు చెప్పి, ముక్తిమార్గమని, స్వర్గమని మంచిమాటలతో వంచించినాము" అని నేటి సంఘసంస్కర్త హేతువాదంతో పశ్చాత్తాపపడుతున్నాడు

ఇట్లా రచనమంతా మెత్తటి జాతీయాలతో తియ్యగా ఉన్నది వ్రాతలో, వాదంలో ఒడుపు వేగము ఉన్నవి. చక్కటి గేయ కావ్యము.

సరే! సంగీత తన్మయంలో కాబోలు కవి – ఇది ప్రవరుని సంగతని 9 వ పాటదాక, వరూధినిపేరు 32వ పాటదాక ఎత్తడు. పాఠకుడు అంతవరకు పాదల డొంకలలోపడి ఉంటాడు. ఈయన పాత్ర ప్రవేశ నైపుణ్యం తెలియనివాడుగా కనబడడే! కొంతసేర పాటను కొంచం

గ్రంథనామం వైజయంతి. అంటే టెక్కెమో, వెన్నుని ఎదపై పూచండోగదా; పుస్తకమంతా వెదకినా దాని పొలుకువే కన బడదే! బహుశాః తన కవితా వైజయంతియేమొ!

మరూడు పత్రికలు

1. సమాలోచన

[జాతీయ సాంస్కృతిక పక్ష పత్రిక. సంపుటం 1. సంచిక 2. డెమ్మీ 1/8. 25 పేజీలు. విడిపత్రిక అర్ధరూపాయ. ఏడాది చందా రు 10/. సంపాదకుడు – విద్వాన్ బులుసు సీతా రామశాస్త్రి; ఇన్నీసుపేట, రాజమహేంద్రవరము.]

ఈ సంచికలో సూర్యరాయాంధ్ర నిఘంటువు పునర్ముద్రణ మును గూర్చి మంచి సూచనలున్నవి (ఇప్పుడు ప్రభుత్వ సహాయంతో సాహిత్య అకాడమీ అచ్చువేయుచున్నది) వీటిని నూతన ముద్రాపకులు గ్రహించవలసి ఉన్నది. గ్రంథసమీక్షలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఆ యా పక్షంలో జరిగిన సాంస్కృతిక వార్తలు పేర్కొనబడు తున్నవి. ఇంకా విషయాలు ఎక్కువచేసి, సంచికను పెద్దదిగా చేస్తే బాగుంటుంది.

2. సమాలోచన 1-3 సంచిక

ముద్రణాది విషయాలు పై దాని మాదిరే. ఈ సంచికలో బాలక రామాయణాలను గురించి, మహారా పంతుల సత్యనారాయణ శాస్త్రి, వైదికమత దృష్ట్యా సాంప్రదాయిక వాదంతో మంచి వ్యాసం వ్రాసినారు. నవీనుల రుచులకు ఇది చాలా దూరం. అంతా పాతపాటే. అయితే ఏమి? వినదగు నెవ్వరు చెప్పినగదా. నాటకా లనుగూర్చి, నేటి నాటి ప్రయోగాలనుగూర్చి విమర్శాత్మక వ్యాస మున్నది. చాటుగ నాటకాల బాగోగులను వేషధారణలో విపరీతా లను గూర్చి నాడేపల్లి కుక్కుటేశ్వరరావుగారు బాగా విమర్శించి నారు. కొండవీటి వెంకటాదుల వంటి రాగాలాపనలను సహేతుకంగా దుయ్యబట్టినారు ఈ రెండు సంచికలలోను యుద్ధాలను (గొరిల్లా) గూర్చిన ప్రసక్తి ఇట్టి పత్రికకు ఏమి సంబంధమో తెలియకున్నది. సమీక్షలు, వార్తలు మొదటిదానిలోవలెనే ఉన్నవి.

3. దాడి - దాడి

(తిరుగుబాటు వేదాంతంగా గలిగిన విప్లవవాదుల మాస పత్రిక. సంచిక పావలా. ప్రచురణ కర్తలు: సాహితీ సైనికులు; 16–2–146/26/6. దయానందనగర కాలనీ; మలక్‌పేట; హైదరాబాదు–36.)

విప్లవవాదులు సాహిత్యంపై చేసిన యీ దాడిలో దెబ్బలు తగులకుండా పోతవా? ఇందు పత్రికలమీద మంచి దాడి. దిగజారి పోయి నీతి నియమం లేకుండా పుట్టగొడుగులవలె లేచిన వీటి విమర్శన ఉచితంగానే ఉన్నది. హీనమైన సెక్సు – సరిసు సినిమా మోజు ఆడవారి వ్రాతల కాధిక్యం – మగవారు ఆడపేరుతో వ్రాసే బయిసిమాలినతనం – మొదలైనవాటిని ఈ దాడి చితుక బాదిసినది. ఈ ఆడ్రెక్, సిగ్‌మండ్ ఫ్రాయిడ్ చెప్పిన మానసిక జాడ్యంగా ఉన్నట్లున్నది సినిమాలంపై దాడి అవసరమే. చిన్నా పెద్దం రుచులు చెడగొట్టినవి. దాశరథి, శేషేంద్రశర్మ, రంగ నాయకమ్మలపై విమర్శనలు పెద్దయెత్తు దాడి దాడి అనే పేరుకు తగినట్లే భాషలో ఫోర్సు ఉన్నదిగాని, డోస్ తగ్గిస్తే సభ్యత అనిపించుకోగలదు; శైలిని కాస్త మార్దవపరచడం మేలు. తిట్టులో కొంత ఒద్దికనం చూపితే ఫలం ఈనకపోదనుకొంటా (చచ్చిన దూడను ఈనడం)

ఇట్టి షక్‌ట్రీట్‌మెంటు, వివిధ రంగాలలో నేడు ఆంధ్రు లకు అవసరమేమో.

శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి

శివతత్త్వ సుధానిధి

[శ్రీ ములుగు మృత్యుంజయారాధ్య కవి కృతి. కళా ప్రపూర్ణ – ఆచార్య నిడుదవోలు వెంకటరావు (ఎం. ఏ) గారి విపుల వ్యాఖ్యానముతో. డెమ్మీ – 40+198 పుటలు. వెల 5 రూ. ప్రకాశకులు: శ్రీ ములుగు – పండితయ్య అయ్యవారు, 7008/12 కలాసిగుడ, సికింద్రాబాద్.]

125 సంవత్సరాలకు ముందే రచనమై, యింతకాలం వ్రాతలోనే ఉండి యిప్పుడు ముద్రణకెక్కిన శయిదాక్షాసాం శివతత్త్వ ప్రతిపాదక పద్య ప్రబంధం యిది. ఒకపుడు గ్రంథకర్త అయిన మృత్యుంజయ కవికి స్వప్నంలో సాక్షాత్కరించి స్కాంద పురాణంలో సనత్కుమార సంహితాంతర్గతమైన మంచయాదిల ఖండాన్ని తెలిగించి తనకు అంకితమివ్వాలని కోరగా, అతడు భగవదాజ్ఞను శిరసావహించి

"స్కాంద మెఱింగి వేదు ద్వాంఘు నాదు వి
ధాతకైన, యతని తాతకైన
పెద్దవారి వద్ద విన్నంత నా మదిం
దోచినంత పట్టు తొడరి వేతు"

అని తన శక్తి ననుసరించి రచింప బూనుకున్నాడు. శ్రీనాథాది మహాకవులు మలయాచల ఖండాన్ని ఆంధ్రీకరింపకుండా విడిచి పెట్టడం తన అదృష్టమని సంతోషించాడు.

ఇందలి అయిదాశ్వాసాలలోనూ మొదటి రెండాశ్వాసాలు పూర్వ భాగంగానూ, తర్వాతి మూడాశ్వాసాలు ఉత్తర భాగంగాను విభజించబడినవి. బ్రహ్మమానస పుత్రుడైన సనత్కుమారుడు మలయాచలానికి పోయి శివకుమారుడైన కుమారస్వామి వల్ల శివతత్వాన్నీ తెలుసుకొనుట, పంచకోశ వివేచన ప్రథమాశ్వాసంలో ఉన్నవి. జీవుడు పంచకోశదుర్గాలను దాటే మార్గం, జీవన్ముక్త లక్షణం, మహావాక్య ప్రకరణం, శివానందుని లక్షణం ద్వితీయాశ్వాసంలో ఉన్నవి. మూడవ ఆశ్వాసంలో బాల్యాద్యవస్థలు, శివుని నిత్యత్వం, అవ్యక్తుడను శివుడు సువ్యక్తుడగుట, పరశివధ్యాన యోగం, నిర్వికల్ప సవికల్ప ధ్యానయోగాలు, యోగానికి దేశికుని ఆవశ్యకత, శివ పంచాక్షరీ ప్రభావం వివరింపబడినవి. శివపూజావిధానం, భస్మ, రుద్రాక్ష బిల్వమాహాత్మ్యాలు, లింగపూజా మహిమ, దారుకావన వృత్తాంతం, శివుడు మునులకు ముక్తినిచ్చుట చతుర్థాశ్వాసంలోని విషయాలు. చివరి ఆశ్వాసంలో లింగోద్భవ, శివ నామస్మరణ మాహాత్మ్యాలు, అష్టాక్షర, ద్వాత్రింశదక్షర మంత్ర మహిమలు, శివలింగ దర్శనార్చనా ఫలాలు, సనత్కుమారుడు చేసిన షణ్ముఖస్తుతి, గ్రంథమాహాత్మ్యం తెల్పబడినవి.

ఈ గ్రంథం కథా ప్రధానమైనదికాదు. శివతత్వాన్నీ, ముక్తిమార్గాన్నీ తెలిపేది మాత్రమే! అందువల్ల కవితకంటె విషయానికే ఇందు ప్రాధాన్యం కానవస్తున్నది. పద్యరచన సులభపద్ధతిని సర్వజన సౌలభ్య దృష్ట్యాసాగినది. కవితా ప్రాగల్భ్య ప్రకాశనానికి అవకాశంలేదు. శివదీక్షాపరులైన రచయిత దీనిని రచించుట ఎంతో ఉచితమై ఉన్నది.

కళాప్రపూర్ణ శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు దీనికి విపుల వ్యాఖ్యానం వ్రాసినట్లు ముఖపత్రంలోను, ప్రకాశకుల విజ్ఞప్తిలోను ఉన్నది. కాని వ్యాఖ్య కానరాదు. వ్యాఖ్యకంటె ఎంతో విలువైన పీఠికయే వారు వ్రాసినది. అందులో కవిజీవితం. గ్రంథమూలం, స్కాందపురాణకర్తృత్వం, ఆంధ్రీకరణం, విషయ వివరణ, శివపారమ్యం, శివానందం, స్థూల సూక్ష్మ వివేచన, లింగధారణదీక్ష, గురూపదేశం, పంచాక్షరి, భస్మ–రుద్రాక్షధారణ, శివాద్వైతం, కవితా విమర్శ. ప్రయోగ విశేషాలు మున్నగు ఎన్నో విషయాలున్నవి. గ్రంథానికీపీఠిక బాగా మెరుగుపెట్టుతూ ఉన్నది. శివతత్వాన్ని సులభంగా తెలుసు గోరినవారికీ, పరిశోధకులకూ ఇది మిక్కిలి ఉపయోగకరమైనది. వాఙ్మయాభిమానులూ, శివతత్వజిజ్ఞాసువులూ దీనిని ఆదరించి, తగినప్రచారానికి తీసుకొని రాగలరని నా విశ్వాసం.

శ్రీ బులుసు వేంకటరమణయ్య

నీరై పారిపోయింది

(శ్రీ గుంటూరు – శేషేంద్రశర్మ కవిత. క్రౌను 2 + 74 పుటలు. వెల రూ 3 లు. ప్రకాశకులు – ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరమ్, గోషా మహల్, హైదరాబాద్–12. లభించుచోట్లు (1) ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికిందరాబాదు. (2) సి. యల్. ఎస్. నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాదు. (3) విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ.)

శేషేంద్ర శర్మగారు నవ్య కవుల్లో అగ్రశేణికి చెందినవారు. పాత పద్ధతి కవితలో కాకలు తీరిన వీరి దృష్టి యిప్పుడు నవ్య కవిత్వం మీదనే ప్రసరించినది. 'మండే సూర్యుడు' మున్నగు వీరి రచనలు ఎన్నో ప్రశంసలను పొందాయి. అట్టి రచనల్లో ఈ 'నీరై పారిపోయింది' ఒకటి. ఇందులో ఇరవై రెండు వచన పద్యాలు (రచయిత ఉద్దేశం ప్రకారం) ఉన్నవి. ఒక్కొక్కటీ కొన్ని పుటలు సాగుతుంది. ఈ రచనతోపాటు దీనికి ఎదటి పుటలో దీని ఆంగ్లానువాదం "Turned into water and fled away" అనే పేరుతో చేర్చబడి ఉన్నది.

ఇందులో ఉదాత్త భావవిహంగాలు ఊహా విహాయసంలో స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. సునిశితమైన అంతర్ దృష్టికే గాని అవి శుష్కచర్మచక్షువులకు గోచరించవు. సున్నితమైన హృదయం యొక్క ఆవేదన, అపూర్వాలైన ఆలోచనలు స్పందితమౌతూ ఉంటాయి. పొంగి పొరలుతున్న భావపరంపర నీరై పొంగి ప్రవహిస్తూ ఉంటుంది.

"వంకరటింకర్లుగా ఎగురుతున్న సీతాకోకచిలుక శూన్యంలో గీతలు గీచి నా జాగృతి లోకాలకు రంగురంగుల సరిహద్దులు నిర్మించింది" (పుట 21) అనే సున్నితమైన రచనకు అనువాదం మూలానికి తగినట్లే –

"The butterfly rumping about in the void drawing Zig Zag coloured lines, raised boundaries to the worlds of my wakefulness."

ఈ రచన రచయిత రచనా వైశిష్ట్యాన్ని వ్యక్తం చేస్తూ ఉన్నది.

"ఆంగీరస"

"శాస్త్రీయ కమ్యూనిజం"

[ఆధునిక వక్రభాష్యకారులు. రచయితపేరు లేదు. ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్–విజయవాడ–520004, పుటలు : 192, వెల : రు 6/–]

వర్గవిభేదాలున్న సమాజాన్ని వ్యాఖ్యానించడంతో సంతృప్తి చెందే ఒక రాజకీయ--ఆర్థిక తత్వశాస్త్రంలా కాకుండా ఆ అసమాన

సమాజాన్ని సమూలంగా మార్చివేసే శాస్త్రంగా — శస్త్రంగా మార్క్సిజం ఈనాడు రూపొందింది. ఇదే శాస్త్రీయ కమ్యూనిజంగా మార్క్స్‌నుంచి నేటిదాకా ఆచరణలో కనపడుతోంది. జర్మన్‌తత్వశాస్త్రం, ఇంగ్లీషు రాజకీయ ఆర్థిక వివేచన, ఫ్రెంచి సోషలిజమ్ మూలప్రేరణలుగా మానవుని అత్యున్నతమైన మానవతా వాదంగా చారిత్రక క్రమపరిణామంలో అంతర్జాతీయతత్వంగా నిలదొక్కుకుంది. ఈ శాస్త్రీయ కమ్యూనిజం గతితర్కంపై, చారిత్రక భౌతికవాదం ఆధారంగా. తిరుగులేని శాస్త్రంగా అనేక పరీక్షలకు తట్టుకుంది. మార్క్స్‌నుంచి లెనిన్—స్టాలిన్—మావో ఆలోచనా విధానందాకా ఒక వైజ్ఞానిక శాస్త్రీయ వివేచనాశక్తిగా, ఆయుధంగా మలచబడింది. కాని సోవియట్ యూనియన్‌లోని మార్క్సిస్టు తత్వవేత్తలుమాత్రం స్టాలిన్—మావోల ఆలోచనా ధోరణిని కమ్యూనిజంగా అంగీకరించడంలేదు.

''శాస్త్రీయ కమ్యూనిజాన్ని'' కొందరు ఆధునిక భాష్యకారులు వక్రంగా చిత్రించి మౌలిక సిద్ధాంతాలను తిరగదోడుతున్నారని సోవియట్ వ్యాఖ్యాతలు దృఢంగా నమ్ముతున్నారు. ఆ నమ్మకాన్ని సవివరంగా — సోదాహరణంగా వివరించడానికే ఈ గ్రంథ రచన జరిగింది రచయితపేరు — అనువాదకుడిపేరు ఎక్కడాలేకున్నా ఇది సోవియట్ మార్క్సిస్టువ్యాఖ్యాతలు రచించిన పుస్తకమని ముందుమాటతోనే తేలిపోతుంది.

శాస్త్రీయ కమ్యూనిజానికి ఆధునిక వక్రభాష్యాలను చేసిన కొందరు యూరోపియన్ 'సిద్ధాంతవేత్తలు' మార్క్సిస్టు సిద్ధాంత ప్రతిపాదనను తిరగదోడి, బహిరంగంగా విద్రోహపంథాను చేపట్టారని, 'శ్రామికవర్గ విప్లవ సిద్ధాంత మౌలిక సూత్రాలను వదిలివేసి వాటిస్థానే పెట్టీ బూర్జువా సూత్రాలను' ప్రచారం చేసారని సోవియట్ వ్యాఖ్యాతలు భావిస్తున్నారు.

''భావవాదంనుండి మార్క్సిజాన్ని, మతాన్నించినాస్తికత్వాన్ని ఆధునిక పెటీబూర్జువా ఊహాజనిత సోషలిజంనుంచి శాస్త్రీయ సోషలిజాన్ని విడదీసే విభజనరేఖలను చెరిపివేసే తత్వశాస్త్రంలో ఏకపక్ష అవలంబన సూత్రాన్ని వారు (ఆధునిక వక్రభాష్యకారులు) వదిలివేసారు'' అని ఈ వ్యాఖ్యాతలు విమర్శిస్తున్న ఆ ఆధునిక వక్రభాష్యకారులెవరు? గరాడి (రచనలు ''ఫ్రెంచి నమూనా సోషలిజం కోసం''. ''సోషలిజం మలుపు'', ''సంపూర్ణసత్యం'', ''చిగురించిన ఆశ'', ''ప్రత్యామ్నాయం'') జిలాస్ (రచనలు—''నూతనవర్గం'', ''కమ్యూనిస్టు వ్యవస్థ వివేచన'') పెట్కొవ్ (రచనలు—''జెకోస్లొవేకియా'', ''ఒక సమస్యగా సోషలిజం'', ''వెనిజులాకు సోషలిజమా?'')

ఎర్నెస్ట్‌ఫిషర్ (రచనలు — ''మార్క్స్ నిజంగా చెప్పిందేమిటి?'', ''స్మృతులు — స్వగతాలు'', ''విప్లవం దీనికంటే విభిన్నమైంది'') ఫిషర్, మారెక్‌లు రచించిన ''లెనిన్ నిజంగా చెప్పిందేమిటి?''— ఈ యూరోపియన్ ''రివిజనిస్టు'' తత్వవేత్తలు పై పుస్తకాలద్వారా పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలకు ఊడిగంచేసి విద్రోహులుగా రూపొందారని . సోవియట్ వ్యాఖ్యాతలు ఈ పుస్తకంలో సవిమర్శకంగా—వివరించి చెప్పారు.

అసలు ''రివిజనిజం'' స్వభావం ఏమిటి? లెనిన్ దీనికి ఒక స్పష్టమైన నిర్వచనం ఇచ్చాడు.

''రాజకీయరంగంలో మార్క్సిజానికి పునాదియైన వర్గపోరాట సిద్ధాంతాన్ని తిరగదోడడానికి రివిజనిజం గట్టిగా ప్రయత్నించింది. రాజకీయ స్వాతంత్ర్యము, ప్రజాస్వామ్యం, సార్వజనీన వోటింగు అధికారం వర్గపోరాట పునాదినే తొలగిస్తాయని వీరు చెప్తున్నారు...దేనికి దానికే తమ వ్యవహార సరళిని నిర్ణయించుకోవడం,ఆయానాటి ఘటనలకు అనుదినముమారే హీనరాజకీయాలకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం, శ్రామికవర్గ ప్రాథమిక ప్రయోజనాలను, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క మౌలిక లక్షణాలను, మొత్తం పెట్టుబడిదారీ పరిణామగతిని విస్మరించడం ఈ విధంగా మౌలిక ప్రయోజనాలను వాస్తవమైన లేక ఊహాజనితమైన క్షణిక లాభాలకోసం బలిపెట్టడమే రివిజనిజం మౌలిక విధానం'' (లెనిన్—కలెక్టెడ్ వర్క్స్—సంపుటి 15, పుటలు 36, 37, 38)

''రివిజనిజాన్ని'' విస్పష్టంగా నిర్వచించిన లెనిన్ విమర్శను గీటురాయిగా తీసుకున్నపుడు అనేక అంశాలలో గరాడీ, జిలాస్, పెట్కొవ్, ఫిషర్ మార్క్సిజం—లెనినిజం మూలసిద్ధాంతాల నుండి పశ్చిమయూరోప్ బూర్జువా తాత్విక ధోరణులకు దగ్గరగా వెళ్ళినట్టు తెలుస్తుంది. ప్రపంచ సామాజికాభివృద్ధి సోషలిజం ' పెట్టుబడిదారీ విధానాల మధ్య సాగే పోరాటం ద్వారాకాక, శాస్త్రీయ, సాంకేతిక విప్లవంద్వారా నిర్ణయించబడుతుందనే'' గరాడి అవాస్తవిక వైఖరి , అలాగే పరిణామక్రమంలో (ఈనాటి యూరోప్ ఆర్థిక వ్యవస్థలో) కార్మికవర్గం—మేధావివర్గం మధ్య విభజనరేఖ నశిస్తున్నదనడం, బూర్జువాస్వేచ్ఛకు సామ్యవాద వ్యవస్థలో శ్రామిక నియంతృత్వానికి సరిపోయేవిధంగా వుండే స్వేచ్ఛకు మధ్య సహజంగానే వుంటున్న వ్యత్యాసాన్ని గమనించకపోవడం రివిజనిజం వైపు వెళ్ళడమే అవుతుంది.

అయితే ఏ ' రివిజనిజాన్ని'' సోవియెట్ వ్యాఖ్యాతలు ఈ పుస్తకంలో ఎత్తిచూపుతున్నారో అలాంటి రివిజనిజమే తమదేశంలోనే ఈనాడు ఆచరణలో వుందంటే అంగీకరించరు. ''సోవియట్ యూనియన్ తదితర, సోషలిస్టు దేశాల్లో నూతన పాలకవర్గాలు అవతరించాయని యిందు 'సామాజికాధికారాన్ని' చేబూనిన పార్టీ, ప్రభుత్వ కార్యకర్తలు, మేధావుల గ్రూపులు చేరివున్నాయనే'' వాస్తవాన్ని మిలోవన్ జిలాస్ తన ''నూతనవర్గం'' అనే పుస్తకంలో ధైర్యంగా సిద్ధాంతీకరించాడు. అతని ఇతర వ్యాఖ్యానాలతో ఏకీభవించకపోయినా రష్యాలో ఈనాడు ఈ 'కొత్తపాలకవర్గం' రివిజనిజాన్ని ఆచరిస్తున్నదంటేమాత్రం జిలాస్‌తోబాటు మిగతా అందరిని ఈ వ్యాఖ్యాతలు 'విద్రోహులు'గా చిత్రించగలరు. అక్టోబర్ విప్లవం తరవాత చాలాకాలం ఆదర్శప్రాయంగావున్న రష్యా

క్రుశ్చేవ్ దిగజారుడు పంథాతో మొదలయి బ్రెజ్నేవ్ ముఠా పాలనను స్థిరీకరించిందని, సోషల్ సామ్రాజ్యవాదాన్ని చాలా తెలివిగా వెనుకబడిన దేశాలపై విజయవంతంగా అమలు చేయగలుగుతోందనే యథార్థాన్ని ఎత్తిచూపితే సహజంగానే ఈ వ్యాఖ్యాతలకు అది ప్రమాదకరమైన ''మావోయిజం''గా కనపడుతుంది. ఆ మావో ఆలోచనావిధానం ఒక 'ఇజం'గా వక్రభాష్యకారుల వరవడిలోకి చేరిపోతుంది.

అందువల్లనే ''మార్క్సిజం– లెనినిజంపట్ల కమ్యూనిస్టు ఉద్యమంపట్ల మావోయిస్టుల శత్రువైఖరికి ప్రధాన లక్షణాలు సామాజికాభివృద్ధి మూలసూత్రాలను పూర్తిగా నిరాకరించడం. జాతీయ వేర్పాటు ధోరణి, అంతర్జాతీయ కార్మిక, కమ్యూనిస్టు జాతీయ విముక్తి ఉద్యమాల్లో తన ఏకైక నాయకత్వ పాత్రకోసం ఆరాటం...''అని మావో ఆలోచనా విధానాన్ని వక్రీకరించి ఈ వ్యాఖ్యాతలు తామే స్వయంగా ఆధునిక వక్రభాష్యకారుల కోవలోకి చేరిపోయారు. ప్రధానంగా ఈ వ్యాఖ్యాతల విమర్శ గరాడి, జిలాస్, ఫిషర్‌లపై కేంద్రీకరించబడినా ముందుమాటలో ఆ తర్వాత ''సోషలిజంలో–సామాజిక సంబంధాలు'' అధ్యాయంలో చారిత్రక సోషలిస్టు దశలో కూడా వర్గవైరుధ్యాలు, వర్గపోరాటం అంతర్గతంగా కొనసాగగలవనే మావో అంచనాను ఈ వ్యాఖ్యాతలు రివిజనిస్టు వక్రీకరణలకిందే జమకట్టారు. ఈవిధంగా అసలు రివిజనాన్ని –మార్క్సిజంయొక్క సజీవ విధానమైన మావో ఆలోచనా సరళిని ఒకే గాటనగట్టి ఈ సోవియట్ వ్యాఖ్యాతలు తమ రివిజనిస్టు స్వరూపాన్ని బహిర్గతం చేసుకున్నారు.

''సోషలిస్టు ప్రజాస్వామ్యం'':

[రచన : హిరేన్ ముఖర్జీ (అనువాదకుడి పేరు లేదు) ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్– విజయవాడ–520004. పుటలు : 71, వెల : రు. 2.25.]

గత సంవత్సరం సోవియట్ యూనియన్ ఆమోదించిన కొత్త రాజ్యాంగ చట్టంలోని వివిధ అంశాలను లోతుగా పరిశీలించిన వారికి అనేక అనుమానాలు తలెత్తడం సహజమే! ఈ అనుమానాలకు – సందేహాలకు సమాధానంగా ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీగారు ఈ ''సోషలిస్టు ప్రజాస్వామ్యం'' అనే పుస్తకం వ్రాసారు. రష్యాను సాకల్యంగా మెచ్చుకొనేవారు–అక్కడి ప్రస్తుత వ్యవస్థ అత్యుత్తమ స్థాయికి ఎదిగిందని సహజంగానే అభివర్ణిస్తారు. భారతదేశంలోని మితవాద కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైన హిరేన్ ముఖర్జీ రష్యాకు వెళ్ళి 1977 నవంబరు 2 న క్రెమ్లిన్ మహాసభల ప్రాసాదంలో బ్రెజ్నేవ్ సమర్పించిన నివేదికను విని ముగ్ధులై, రష్యాలోని కొత్త రాజ్యాంగ చట్టాన్ని ఇలా అభివర్ణించారు – ''...ఇది పరిణత సోషలిజం యొక్క ప్రణాళిక; కమ్యూనిస్టు సమాజం వైపుగా చరిత్ర పురోగమిస్తున్న క్రమంలో, ఒక విధంగా ఆ చారిత్రక దశయొక్క సమాహారం......మానవ చరిత్ర పుటలను సూర్య కిరణంతో లిఖించిన శ్రామిక ప్రజలు భాగస్వాములైన ప్రజాస్వామ్యం సాధించిన జీవిత స్వరూపాన్ని గురించి, సోవియట్ వాస్తవాల పరిభాషలో చేసిన వివరణ''

1936 నాటి రాజ్యాంగ చట్టం కన్నా ఈ కొత్త రాజ్యాంగ చట్టం సోవియట్ పౌరుల రాజకీయ హక్కులను, స్వేచ్ఛలను మరింత సమగ్రంగా, నిర్దిష్టంగా సూత్రీకరించిందని, అక్కడి పౌరులు తమ వ్యక్తి భద్రత, ఆస్తి, వ్యక్తిస్వేచ్ఛ, ఆత్మగౌరవం – వీటి విషయంలో జరిగే అతిక్రమణల నుంచి చట్టరీత్యా రక్షణ పొందవచ్చుననే అంశాన్ని ముఖర్జీగారు మన దృష్టికి తీసుకవచ్చారు. అయితే కమ్యూనిజం మూల సూత్రాల్లో ఎంగెల్స్ విస్పష్టం చేసినట్టు – ''శ్రామిక వర్గం సమాజంలోని పోటీని, ప్రయివేటు ఆస్తిని, వర్గ విభేదాలను నిర్మూలించి నిజమైన స్వేచ్ఛను పొందుతుంది'' – అనే ఈ అంతిమ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఈనాటి రష్యా వుందని నమ్మినా, మరి అక్కడి పౌరులకు ఆస్తి హక్కు అనేది మరింత విస్తృతం అయ్యిందని కొత్త రాజ్యాంగ చట్టం ఒక కొత్త బూర్జువా సౌకర్యాన్ని అదనంగా కల్పిస్తే అసలు మార్క్సిస్టు – లెనినిస్టు మూల సూత్రానికి ఎసరు పెట్టినట్టు కాదా ? ఈ వైరుధ్యాన్ని ప్రొఫెసర్ గారు ఎక్కడా స్పృశించలేదు. పైగా ఇది సోషలిస్టు ప్రజాస్వామ్యంలోకి సుగమమైనదారి అని వక్కాణిస్తున్నారు.

55 వ పుటలో ''...జాతీయ విముక్తి, సామాజిక ప్రగతికై దేశదేశాలు సాగించే పోరాటానికి అండదండలిచ్చేందుకు, దురాక్రమణ యుద్ధాలను నివారించేందుకు, భిన్న సామాజిక వ్యవస్థలుగల రాజ్యాల శాంతియుత సహజీవన సూత్రాన్ని సుస్థాపితం చేసేందుకు పాటుపడుతుందనే కొత్త రాజ్యాంగ చట్టం ప్రకటిస్తోంది'' అని ముఖర్జీ గారు చెబుతున్నారు.

జాతీయ విముక్తి పోరాటాలకు అండదండలు ఇస్తూ, భిన్న సామాజిక వ్యవస్థలు గల రాజ్యాల శాంతియుత సహజీవనానికి పాటుపడడం ఎలా సాధ్యమవుతుందో ? ఇందులోని వైరుధ్యాన్ని కూడా ముఖర్జీ గారు గమనించడం లేదు. పైగా శాంతియుత సహజీవనం – శాంతియుత పరివర్తన అనేవి, ఒకవైపు సామ్రాజ్యవాదం వివిధ రూపాల్లో ప్రత్యక్షమవుతుండగా – సాధ్యమైన వ్యవహారమే అని వాదించడం సోవియట్ తరహా రివిజనిజానికే చెల్లుతుంది.

సోవియట్ రష్యాలోని ప్రజాస్వామ్యం, వోటింగ్ పద్ధతి, శ్రామిక నియంతృత్వం అమలు జరుగుతున్న తీరు, అక్కడ Dissenters (భిన్న వాదులు అని అనువదించారు) అనే అసమ్మతి వర్గంలోని అత్యల్ప వర్గం యొక్క స్థితి గురించి తెలుసుకోవాలంటే ముఖర్జీ గారి ఈ పుస్తకాన్ని చదవవలసిందే !

— యన్. యల్

ఆంధ్ర వాఙ్మయమున చారిత్రక కావ్యములు (17 వ శతాబ్దం వరకు)

[గ్రంథకర్త్రి- డా. బి. తరుణకుమారి, ఎం.ఏ.,పిహెచ్.డి. ప్రచురణ — డైరెక్టర్, ఆంధ్రా యూనివర్శిటి ప్రెస్, వాల్తేరు. 1978.]

ఈ గ్రంథములో ఆంధ్ర మహావిష్ణువు, చోళులు, కాకతీయులు, హైహయులు, కాటమరాజు కథ, శ్రీకృష్ణదేవరాయలు, ఆరవీటి రాజులు, తంజాపురాంధ్ర నాయక రాజులు, మతములు — మత ప్రవక్తలు, జీవిత చరిత్ర, సాంఘిక చరిత్ర అను పంద్రెండంశములపై పరిశోధన వ్యాసములు కూడియున్నవి. ఉపోద్ఘాత రూపమున చరిత్ర — చారిత్రక కావ్యము అనునొక విపుల వ్యాసము కలదు. పై జెప్పిన యంశములకు భట్లపెనుమర్తి కోదండరామకవి రచించిన నల్లభాభ్యుదయము; పోశెట్టి లింగన కవి రచించిన నవచోళ చరిత్ర; ఏకామ్రనాథుడు రచించిన ప్రతాప చరిత్ర, కాసె సర్వప్ప రచించిన శ్రీ సిద్ధేశ్వర చరిత్ర; శ్రీనాథుడు, మల్లయ్య. కొండయ్యలు రచించిన పలనాటి వీర చరిత్ర; గంగుల పిస ఎల్లయ్య వ్రాసిన కాటమరాజు కథ; విశ్వనాథ నాయకుని స్థానపతి రచించిన రాయ వాచకము; కుమార ధూర్జటి వ్రాసిన కృష్ణరాయ విజయము; కందుగుల వెంకయ్య రచించిన రామరాజీయము; విజయరాఘవ నాయకుడు రచించిన రఘునాథ నాయకాభ్యుదయము, రఘునాథాభ్యుదయము; పాల్కురికి సోమనాథుడు రచించిన బసవ పురాణము, పండితారాధ్య చరిత్రము; తాళ్లపాక చిన్నన్న రచించిన అన్నమాచార్య చరిత్ర; వల్లభరాయుడు రచించిన క్రీడాభిరామము మూల గ్రంథములుగ తీసుకొని రచయిత్రి యీ గ్రంథమును రచించెను. ఆయా గ్రంథ ప్రచురణములందున్న ఉపోద్ఘాతములను కూడా తమ సిద్ధాంతములలో నుపయోగించుకొనెను రాజకీయ చరిత్ర, వీరుల చరిత్ర, మహాపురుష చరిత్ర, మత చరిత్ర, రాజవంశ చరిత్ర, సాంఘిక చరిత్ర అను విషయ వైవిధ్యమును గూర్చి చర్చించు నుద్దేశముతో పై జెప్పిన గ్రంథములను తీసుకొనెను. ఆయా గ్రంథముల యందున్న విషయాన్ని చక్కగ ప్రతిపాదించటమే కాక రచయిత్రి తమ సిద్ధాంత రూపమగు విమర్శను కూడా తెలుపుచు ఆ గ్రంథముల వాస్తవికతను నిరూపించిరి

మూల గ్రంథముల గూర్చి రచయిత్రి తమ అభిప్రాయము ని విధముగ తెలిపెను, 'చరిత్రకు అత్యవసరమైనది ప్రామాణికత. ఉన్నదున్నట్లు చెప్పటయేగాని చరిత్ర యందు కల్పనకు తావులేదు. కావ్యమునకు కావలసినది కల్పన. దీనికి సత్యాసత్యములతో నిమిత్తము లేదు. హృద్యమైన కల్పనతో నిండిన చాలును' అని చరిత్రకు కావ్యమునకు గల వైరుద్ధ్యమును చక్కగా నిరూపించిరి. అంతేకాక తమ ఆముఖమునందు 'ఆంధ్ర వాఙ్మయమున గల చారిత్రక కావ్యములు ఇటు శాస్త్రీయముగ చరిత్రను తెలుపలేదు, అటు సంపూర్ణముగ కావ్యలక్షణములు కలిగియుండలేదు' అని తమ రచనా వస్తువు యొక్క వాస్తవికతను స్పష్టము చేసిరి. కనుక ఆయా గ్రంథకర్తలు తమ గ్రంథముల నేమని చెప్పుకొన్నను ప్రస్తుత రచయిత్రి వాటిని ఆంధ్ర వాఙ్మయమున చారిత్రక నవలలు, లేక నవలాత్మక కావ్యములను శీర్షికతో తమ గ్రంథమును రచించిన బాగుండెడిది తమ రచనా వస్తువునకు పై జెప్పిన దోషములు గణనీయములయ్యెడివి కాదు. పల్నాటి వీర చరిత్ర, రఘునాథ నాయకాభ్యుదయము, రామరాజీయము, కృష్ణరాయ విజయము, పండితారాధ్య చరిత్ర, బసవ పురాణము ఇవి కావ్య లక్షణములు గాని, చరిత్ర లక్షణములు గాని కలిగియున్నను లేకున్నను విద్వత్సమ్మతములైన రచనలుగా నెన్నబడుచున్నవి. మిగిలినవి సామాన్య జనామోదకములుగనే యున్నవి. కాటమరాజు కథను గూర్చిన విమర్శను ముపసంహరించుచు ఈ రచయిత్రి చెప్పిన మాటలు ఈ సందర్భమున గమనించదగియున్నది. 'రామాయణ భారతాది పురాణాలతో బాటు పలనాటి వీర చరిత్ర, కాటమరాజు కథలను నామమాత్ర పరిజ్ఞానమే కలిగియున్న ఒక పల్లెటూరి వ్యక్తి అజ్ఞానమును తెలియజేయుచున్న మూర్ఖ శతకములోని ఈ పద్యము కాటమరాజు కథకు గల ప్రాచుర్యమును తెలియజేయుచున్నది.

'రామాండ కతలంటె మేమెరుగనివా
కాటమరాజుకు కర్ణుడోడె,'
భారత కతలోన బాలరాజొక్కడు
కుంబకర్ణుని బట్టి గుద్ది జంపె'
..............................'

ఈ తెగకు చెందిన కొన్ని గ్రంథల్లో ఒక్కొక్కచోట కొంచెం చరిత్రాంశం, ఒక్కొకచోట కొంచెం కవిత ఉన్నట్లు ఆభాసమాత్రంగా స్ఫురిస్తుంది. దానిని సమన్వయ పరచుటకై విమర్శకులు పాటుబడవలసినదే కాని, పాపమా రచయితకు మాత్రం తన రచనను చరిత్రగానో కావ్యంగానో రూపొందించాలని యేమాత్రం లేదనే చెప్పాలి. కావున ప్రస్తుత రచయిత్రి వల్లభాభ్యుదయము; ప్రతాప చరిత్ర, సిద్ధేశ్వర చరిత్రలపై వ్రాసిన విమర్శాత్మక వ్యాసాలు చెప్పదగినంత ప్రయోజనకరములుకావు. మిగిలిన గ్రంథములపై వ్రాసిన వ్యాసములు పరిశోధకుల కుపయుక్తములగుననుటలో సందియములేదు.

ఆయురారోగ్యైశ్వర్యాభి వృద్ధికీ, ఋణ రోగ శత్రుబాధా నివృత్తికీ పఠింప వలసిన స్తోత్ర గ్రంథముల వివరములు పంపుటకు 25 పైసల స్టాంపులు పంపుడు.

ఆర్. వి. ఆర్. మూర్తి
25—7—18, ఆమంచివారివీధి
విజయనగరం-531202

వల భాభ్యుదయము రచించిన భట్లు పెనుమర్తి కోదండ రామ కవియొక్క కాలమును, నవచోళ చరిత్రను రచించిన పోశెట్టి లింగనకవి కాలమును సూచనప్రాయముగనైన తెలిపియుండిన బాగుండెడిది. శాస్త్రీయ విమర్శనలో తాము విమర్శించు గ్రంధ మేనాటిదో తెలుపుట అత్యవసరమైన అంశము. ఆంధ్రవిష్ణువు కాని, నవచోళులుకాని గతించిన యెంతకాలమునకీ రచనలు బయల్దేరినవో తెలిస్తే ఆ కథావస్తువుయొక్క యాథార్ధ్యమును ఊహించుటకు వీలగును. అట్లే పాల్కురికి సోమనాధుని కాలమును కూడ పలువురు విద్వాంసు లిదివరకే పూర్తిగా చర్చించి యుండిరని మాత్రము చెప్పి తామేకాలమును సూచనప్రాయముగా కూడ తెలుపలేదు. ఆ చరిత్ర యేనాటి సంఘమును గూర్చి వివరించుచున్నదో తెలియవలెను. అది యేనాటి మతమును గూర్చి చెప్పుచున్నదో తెలియవలెను. చర్వితచర్వణమైనా సోమనాధునియొక్క దేశ కాలములను గూర్చి చెప్పుట అవసరమే.

కాకతీయులను గూర్చి ప్రారంభించుచు 'వీరు మొదట చాళుక్య రాజుల కడ సామంతులుగానుండి కళ్యాణి చాళుక్యుల కాలమున స్వతంత్ర పరిపాలకులైరి' అని వ్రాసిరి. చాళుక్యులను చాళుక్యులుగా సరిదిద్దుకొన్నను వారెవరో స్పష్టముగాలేదు. వేంగీ చాళుక్యులని స్పష్టముగ వ్రాసియుండవలసింది. దానిని గూర్చి కూడ ఇటీవల వెలువడిన అభిప్రాయాంతరములను ఈ రచయిత్రి చూచినట్లగపడదు. 'క్రీ. శ. 1126లో విక్రమాదిత్య మహారాజు మరణించి భువనైకమల్ల సోమేశ్వరుడు రాజు కాగానే' అని 62వ పుటలో కలదు. విక్రమాదిత్యుని యనంతర మాతని కుమారుడు భూలోకమల్లసోమేశ్వరుడు రాజయ్యెను. భువనైక మల్లసోమేశ్వరుడు తనకు పూర్వము రాజ్యమేలెను. 71 వ పుటలో తూర్పు చాళుక్యులకు పల్లవులకు యుద్ధములు జరుగుచుండెననియు, ముఖ్యముగా చాళుక్య విజయాదిత్యునకును, త్రిలోచన పల్లవునకును యుద్ధము జరిగెనని చెప్పిరి. పల్లవులతో పోరినది బాదామి చాళుక్యులు గాని తూర్పుచాళుక్యులు కాదు. బాదామి చాళుక్యులలో మూలపురుషుడు విజయాదిత్యుడను రాజుండెనని వెంకట రమణయ్యగారు వ్రాసిరి. ఆనంద గోత్రికులతో సిద్దేశ్వర చరిత్రను ముడిపెట్టుటకై యీ రచయిత్రి చేసిన యత్నమంతా ప్రామాణికమైనది కాదు. కాకతి రుద్రుడు ఘలసాట పృధ్వీశ్వరుని జయించెనను విషయము అనుమకొండ శాసనమునందున్నట్లు 81వ పుటలో వ్రాసిరి. ఈ విషయమా శాసనములో లేదు. 79 వ పుటలో కాకతి ప్రోలుని విజయములు చెప్పుచు నూజివీడు తాలూకాను పరిపాలించుచున్న గుండ లేక మంతెన అను నాతనిని యుద్ధమున సంహరించెనని వ్రాసిరి. ఇచట గుండనకే మంతెనయను నామాంతర మున్నట్లును అతడు నూజివీడు తాలూకాను పాలించుచున్నట్లును వ్రాసిరి. ఇది తప్పు. గుండరాజు కరీంనగరు జిల్లాలోని మంథెనప్రాంతము నేలుచుండెను. మంతెన యనునది అతని నగరము పేరు. అది యిప్పుడుకూడ ఒక తాలూకా నగరము. కాని అతనికి నామాంతరము కాదు.

చిలుకూరి వీరభద్రరావు గారు 1912 లో రచించిన ఆంధ్రుల చరిత్రను, 1931 లో రచించిన అళియరామరాయలు అనే గ్రంథాన్ని, అట్లే హెన్రీ హిరాసు పండితుడు 1927 లో రచించిన **The Aravidu Dynasty** అనే గ్రంథాన్ని, మరికొన్ని పురాతన గ్రంథాన్ని తమ విమర్శన కృషి యందు రచయిత్రి యెక్కువగా నుపయోగించినట్లు గానవచ్చుచున్నది. ఈ యర్ధ శతాబ్దిలో అనేక శాసనములు, గ్రంథములు వెలువడియున్నవి. **Basaveswara and His Times** లను గ్రంథమును ప్రసిద్ధ పరిశోధకులు **Dr. P. B. Desai** గారు 1968 లో ప్రకటించిరి. బసవేశ్వరుడు, బిజ్జలుడు వీరిని గూర్చిన వివరము లందు సప్రమాణముగ నీయబడ్డవి. అట్లే **Medieval History of the Deccan** అను సంకలన గ్రంథమును **Prof H. K. Shervani** హైదరాబాదు నుండి 1975 లో ప్రకటించిరి అందు విజయనగరచరిత్ర నాటి వరకు లభించిన ప్రమాణములతో వ్రాయబడియున్నది. ఇవి గాక ఆంధ్రప్రదేశము నందలి శాసనము లనేకము ఈమధ్య ప్రకటమగుచున్నవి. కొన్ని 'భారతి' యందు కూడ వ్యాస రూపమున ప్రకటించబడుచున్నవి. వాటిని ఈ రచయిత్రి అంతగా ఉపయోగించుకొన్నట్లు తోచదు. నూతనముగ లభించు సాక్ష్యములతో చారిత్రక విమర్శలు చేయుట అవసరము. అట్లని పూర్వ చరిత్రకారులను త్రోసిపుచ్చుమని కాదు. ఆనాడున్న సాధన సంపత్తినే వారుపయోగించిరి. వారి రచనలతోబాటు నూతన రచనలు కూడ కొన్ని విశేషములను తెలుపుచుండును. కనుక నూతనాంశములను చేర్చిన కాని విమర్శ గ్రంథము ప్రమాణము కాజాలదు.

గ్రంధమునందు చూపబడిన అధోజ్ఞాపికల (**Foot Notes**) లో చాలచోట్ల పుట సంఖ్య లీయబడలేదు. కొన్ని సందర్భములలో తప్పొప్పుల పట్టిక అనివార్యమనిపించును. ఉదా॥

(1) 71 వ పుటలో వీరు (పల్లవులు) క్రీ శ. 975 ప్రాంతమున రాజ్యస్థాపన చేసినట్లు ... ...
ఇచట 975కు బదులు 275 ఉండవలెనని లక్ష్మీరంజనం గారి ప్రతాప చరిత్ర పీఠికనుబట్టి తెలియుచున్నది.

(2) 62 వ పుటలో భువనైకమల్ల సోమేశ్వరరాజుకి బదులు భూలోకమల్ల సోమేశ్వరరాజని దిద్దవలెనని లోగడ తెలిపితిని.

(3) 77 వ పుటలో 22 వ foot note 'శాసన సంపుటి' అని మాత్రమే కలదు. దాని సరియగు సంఖ్య, శాసన సంఖ్య తెలుపవలెను.

(4) 82 వ పుటలో 31 వ foot note లో పేర్కొనిన Corpus of Ins ... ... Part I అని మాత్రము తెలిపిరి. పుట సంఖ్య నొసగుట మంచిది.

(5) అదే పుటలో కొన్ని foot notes క్రిందివి పైకి, పైవి క్రిందికి జరిగినట్లున్నవి.

(6) 153వ పుటలో 33వ foot note లో వేణుగోపాలస్వామికి బదులు వేణుగోపాల చెట్టి అని సరిదిద్దవలెను
ఇట్టి వింకను అనేకము గలవు.

శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.

BCI

పరిశ్రమలకు, ఫ్యాక్టరీలకు ప్రత్యేక సూచన

ఫ్యాక్టరీల చట్టంలోని 61 - సి. నిబంధనను అనుసరించి
ఫ్యాక్టరీ ప్రాంతంలో విధిగా చెట్లను నాటాలి.

చెట్లు కాలుష్యాన్ని తగ్గించడంలోనూ,
వేడిని తగ్గించడంలోనూ తోడ్పడతాయి.

కార్మికులకు ఆహ్లాదాన్ని కల్పించడానికి ఈ ఋతువులోనే
మీ ఆవరణలను నందన వనాలుగా మార్చండి.

[జులై, ఆగష్టు, సెప్టెంబరు]

చెట్ల మొక్కలు, ఇతర సలహాలు ఉచితం సంపాదించండి

జంట నగరాలలో :

డివిజనల్ అటవీ శాఖాధికారి
విస్తరణ విభాగం,
హైదరాబాదు - 500 004
ఫోన్ నెం : 30531 [ఎక్స్ - 45]

జిల్లాల్లో:

డివిజనల్ అటవీ శాఖాధికారి
ఆయా జిల్లా హెడ్ క్వార్టర్స్.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.
11/78-79

అమృతాంజన్ లిమిటెడ్

75 సంవత్సరాల పైగా గృహౌషధములు తయారు-చేస్తున్నవారు!

- **అమృతాంజనం బాధానివారిణి**
  తలనొప్పి, ఒళ్ళునొప్పులు, బెణుకులు, జలుబు, దగ్గు, కండరాల నొప్పులకు.
- **అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్**
  పసిబిడ్డల అజీర్ణానికి, పళ్ళు వచ్చేటప్పుడు కలిగే బాధలకు.
- **అమృతాంజన్ డెర్మల్ అయింట్‌మెంట్**
  తామర, తీట, గజ్జి వగైరాలకు.
- **అమృతాంజన్ ఇన్‌హేలర్**
  జలుబు చేసి ముక్కుదిబ్బడ, తుమ్ములు వగైరాలకు.
- **అనోలియమ్-కోల్డ్ రబ్**
  దగ్గు జలుబులను పారద్రోలే అమోఘమైన ఒక కొత్త శక్తి.
- **శాలోఫెన్-బాధానివారిణి మాత్రలు**
  తలనొప్పి, ఫ్లూ, ఒళ్ళు నొప్పులకు.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు-4

...ఇండియాలోను,
ఇతర దేశాలలోను
పేరు పొందినవి.



FDS/AM.1759 TEL

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA104M139
పుస్తకం పేరు	భారతి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	85
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI, BCI,
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	navya
స్కాన్ చేసినది	thasin
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good